
# పేటెంట్లు

కట్టుకథలు - వాస్తవాలు



వందన శివ

వందన - పేటెంట్లు
4488
608
ంద - పేటెం
4488

ాశక్తి బుక్‌హౌస్

# పేటెంట్లు

## కట్టుకథలు - వాస్తవాలు

వందనశివ

ప్రజాశక్తి బుక్‌హౌస్
1-1-187/1/2, వివేక్‌నగర్, చిక్కడపల్లి,
హైదరాబాద్-20. ఫోన్: 7660013

608
C.10720

ACA 4488
500 044

English Tittle : **PATENTS**
Myths and Reality
Author : Vandana Siva

ప్రచురణ సంఖ్య : 735
ప్రచురణ కాలం : డిసెంబరు, 2002
ప్రతులు : 2,000

వెల : రు.40-00

అనువాదం : డి.పాపారావు

ముద్రణ : ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

ప్రతులకు

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

| | | |
|---|---|---|
| 27-19-14,<br>వి.ఎస్.ఆర్. కాంప్లెక్స్,<br>దుర్గయ్య వీధి,<br>**విజయవాడ-2.**<br>ఫోన్ :577533 | 1-8-52/2,<br>శ్రీరామాకాంప్లెక్స్,<br>చిక్కడపల్లి,<br>**హైదరాబాద్-20.**<br>ఫోన్ : 7608107 | షాప్ నెం.47,<br>ఆర్.టి.సి. కాంప్లెక్స్,<br>ద్వారకానగర్,<br>**విశాఖపట్నం** |

| | | | |
|---|---|---|---|
| సుందరయ్యభవన్,<br>బాలాజీనగర్<br>**ఖమ్మం-507001** | 140, ప్రకాశం రోడ్,<br>**తిరుపతి-517502**<br>ఫోన్ : 23017 | 6-2-250,<br>విజయటాకీస్‌రోడ్డు<br>**హన్మకొండ-506001** | సుందరయ్యభవన్<br>సుభాష్ విగ్రహం (ఎదుట),<br>**నల్గొండ** |

# విషయసూచిక


1. చరిత్రలో పేటెంట్ల పాత్ర ............ 9
2. పేపెంట్ల పుక్కిటి పురాణం ............ 16
3. జీవ వైవిధ్యానికి ముప్పులు ............ 30
4. జీవ చౌర్యం ............ 37
5. విత్తును సొత్తు చేసుకోవచ్చా? ............ 53
6. వ్యాధులపై లాభాలు ............ 67
7. ప్రజాస్వామ్యమా-నియంతృత్వమా? ............ 73
8. ముందున్న మార్గం ............ 89

ముగింపు ............ 104

# ముందుమాట

## పేటెంట్లు - ఒక నైతిక సంక్షోభం

"పేటెంట్లు" 1980వ దశకం వరకూ మన నిత్యజీవితంలోకి చొరవబడలేదు. అప్పట్లో ఈ వ్యవహారాన్ని నూతన విషయాలను కనుగొన్నవారుగాని, పేటెంట్లకి దరఖాస్తుదారు, పేటెంట్ల పరిశీలకులు, పేటెంట్ల న్యాయవాద ప్రవీణులు, తదితరులే పట్టించుకునేవారు. 1980లలో జరిగిన రెండు ఘటనలు ఈ పరిస్థితిని శాశ్వతంగా మార్చివేశాయి. "పేటెంట్ల"ను సామాన్య మానవుడి జీవితంలోకి చొరబడగల కీలక సమస్యగా మార్చివేశాయి. జీవాన్ని, ఒక ఆవిష్కరణగా పరిగణించి, జీవంపై పేటెంట్లను ఇచ్చేందుకు అమెరికా పేటెంట్ల కార్యాలయాన్ని అమెరికా అత్యున్నత న్యాయస్థానపు తీర్పు అనుమతించడం మొదటిదయితే, గాట్ (GATT) ఉరుగ్వే రౌండు సమావేశంలో పేటెంట్లు, మేధోపరమైన హక్కుల(INTELLECTUAL PROPERTY RIGHTS)ను అమెరికా ప్రవేశపెట్టడం, రెండవ ఘటన.

ఈ క్రింది అంశాలను పరిశీలించండి .

1988వ సంవత్సరం ఏప్రియల్ 12వ తేదీన అమెరికా పేటెంట్ల కార్యాలయం క్షీరదాలకు సంబంధించిన తొట్టతొలి పేటెంట్ హక్కును డ్యూపాంట్ కంపెనీకి ఇచ్చింది. ఈ హక్కు ఒక ప్రయోగశాలలోకి మూషికానికి సంబంధించి ఇచ్చారు. ఈ మూషికంలో కేన్సరు వ్యాధిని ప్రవేశపెట్టేందుకుగాను దాని జన్యువులలోనికి జబ్బుపడ్డ కోడికి, దానితోపాటుగా మానవులకు సంబంధించిన జన్యువులను ప్రవేశపెట్టారు. ఈ రకంగా "కేన్సరు పీడిత 'ఒంకో' మూషికం" తాలూకు ప్రయోగం ద్వారా డ్యూపాంట్ కంపెనీ కేన్సరుకు వైద్యం కనుగొనగలదనే భావించబడింది. అయితే వాస్తవానికి అలా జరగలేదు. హార్వర్డు విశ్వవిద్యాలయంలో ఈ ఒంకో మూషికంపై ప్రయోగం జరగడంవలన దీనిని వాస్తవానికి "హార్వార్డు మూషికం"గా పిలుస్తుంటారు. అయితే ఈ మూషికానికి సంబంధించిన పేటెంట్ డ్యూపాంట్ కంపెనీకి చెందడం వలన దానిని "డ్యూపాంట్ మూషికం"గానే పిలవడం మరింత సమస్యగా పరిణమించింది. డ్యూపాంట్ సంస్థకు ఇచ్చిన ఈ పేటెంట్‌కు విస్తృతమైన పరిధివుంది. ఈ పేటెంట్ ద్వారా ఆ సంస్థకు కేన్సరు కారక జన్యువులు ప్రవేశపెట్టిన చిట్టెలుకలు, ఎలుకలు, పిల్లులు, లేదా చింపాంజీలు మొదలైన జంతుజాలం అంతటిపైనా పేటెంట్ గుత్తాధిపత్యం లభించింది. బహుశా ఇంత విస్తృత పరిధిగల పేటెంట్ ఇదేనేమో! తద్వారా డ్యూపాంట్ సంస్థ ప్రపంచంలోనే తొలిసారిగా పేటెంట్ చేయబడిన జంతువును పొందింది. ఈ జంతువుకే ఆ సంస్థ కేన్సరు ఒంకో మూషికం అనే ట్రేడ్‌మార్క్ పెట్టుకొంది.

ట్రేసీ అని పిలవబడే గొర్రె ఫార్మాస్యూటికల్ ప్రొటీన్స్ లిమిటెడ్ (పిపిఎల్) అనే సంస్థ తాలూకు శాస్త్రవేత్తల "జీవన సాంకేతిక ఆవిష్కరణ." ఈ ట్రేసీ అనే గొర్రెను 'క్షీరద కణజాల జీవ రియాక్టర్" అని పిలవసాగారు. మానవ సంబంధిత జన్యువులను ఈ ట్రేసీ అనే గొర్రెలోకి ప్రవేశపెట్టడంద్వారా, దాని పొదుగులను ఔషధ పరిశ్రమకు అవసరమైన ఒక ప్రోటీన్‌ను ఉత్పత్తి చేసేందుకు అనువుగా మార్చారు. అప్పటి పిపిఎల్ సంస్థ డైరెక్టరు అయిన రాన్ జేమ్స్ ఈ ప్రయోగం గురించి "పాల పొదుగు చాలా మంచి ఫ్యాక్టరీ" అని వ్యాఖ్యానించాడు. అయితే మరిన్ని ట్రేసీలు కావాలంటే క్లోనింగ్ అనే ప్రక్రియ తప్పనిసరి. ఈ క్రమంలో భాగంగానే పిపిఎల్ సంస్థ, రోజ్‌లిన్ సంస్థలలోని శాస్త్రవేత్తలు క్లోనింగ్ ద్వారా డాలీ అనే మరో గొర్రెను సృష్టించారు. డాలీ, రోజ్‌లిన్ సంస్థ "ఆవిష్కరణ"గా పేటెంట్ పొందింది. అలాగే అది పిపిఎల్ సంస్థ ఆస్తిగా మారింది.

అమెరికాకు చెందిన బయోసైట్ అనే సంస్థకు అన్ని రకాల పిండాలు, అప్పుడే జన్మించిన వివిధ జీవజాలం తాలూకు బొడ్డు తాళ్ళపై (UMBILICAL CORD)పేటెంట్ లభించింది.

మిరియడ్ ఫార్మాస్యూటికల్స్ అనే మరో అమెరికా కంపెనీకి రొమ్ము కేన్సరుకు సంబంధించిన జన్యువుపై పేటెంట్ లభించింది. తద్వారా ఈ జన్యువు తాలూకు వైద్య సంబంధిత అంశాలు అన్నింటిపైనా ఆ సంస్థకు పెత్తనం లభించింది.

జన్యుపరమైన వైద్య సంబంధిత పద్ధతిపై బ్రిటన్‌కు చెందిన జాతీయ ఆరోగ్య సంస్థ (ఎన్ఐహెచ్) పరిశోధకులు పేటెంట్‌ను పొందారు. ఈ పేటెంట్‌ను ఆ పరిశోధకులు జెనెటిక్ థెరపీ సంస్థకి ఇచ్చారు. జెనిటిక్ థెరపీ సంస్థ దాన్ని శాండోజ్ సంస్థకు 39 కోట్ల 50 లక్షల డాలర్లకు అమ్మింది తదనంతరం శాండోజ్ సంస్థ సిబాగైగీ సంస్థతో విలీనమై, నొవార్టీస్ అనే నూతన సంస్థగా పేరు మార్చుకుంది. తద్వారా ప్రపంచంలోని ఒక మహా "జన్యు" సంస్థకు ప్రజా సంబంధిత రంగంలో అభివృద్ధి చేసిన వైద్య విధానంపై సంపూర్ణ "ఆస్తి" హక్కులు లభించాయి. 1994వ సంవత్సరంలో స్థూలకాయాన్ని తగ్గించే పద్ధతులు, మందులపై సాలీనా 3000 కోట్ల డాలర్లవరకూ వెచ్చిస్తున్నారు. కాబట్టి స్థూలకాయానికి సంబంధించిన ఈ జన్యువుపై పేటెంట్ కలిగి వున్న సంస్థకు ధనరాసులు కుప్పతెప్పలుగా వచ్చిపడడం ఖాయం. పారిశ్రామిక అహార వ్యవస్థ మొత్తం స్థూలకాయానికి దారితీసే విధంగా పనిచేస్తోన్న అమెరికా సమాజంలో ఇది మరింత నిజం.

పాపువా న్యూగినియాకు చెందిన హగాహాయ్ ప్రజల నుంచి సేకరించిన జీవకణ సముదాయంపై 1995వ సంవత్సరంలో అమెరికా ప్రభుత్వం తనకు తానే పేటెంట్ హక్కును ఇచ్చుకుంది.

మారుమూల ప్రాంతాలకు చెందిన గిరిజనుల జన్యు పదార్థాన్ని (డిఎన్ఎ) సేకరించుకునేందుకు, దానిపై పేటెంట్లను పొందేందుకుగాను, ఫ్రాన్స్‌కు చెందిన జెన్‌సెట్ సంస్థ- చైనా ప్రభుత్వంతో ఒప్పందానికి వచ్చింది

అంటే- నేడు పలు కంపెనీలు, వాణిజ్య పరిశోధనాలయాలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధకులు, ముఖ్యంగా ప్రభుత్వాలు 'అత్యంత లాభసాటైన' జన్యు ఖజానాలను "పేటెంట్" చేసుకునే వేటలో పడ్డాయి. ఈ సంస్థలు అన్నీ ఈ జన్యుఖజానాను వందలకోట్ల డాలర్లను ఆర్జించుకునేందుకు

మార్గంగా ఎంచుకున్నాయి. ఫలితంగా 20వ శతాబ్దం చివరిలో వివిధ దేశాల స్థానిక విజ్ఞానం పైనా, వృక్షజాతులపైనా, అంతేకాకుండా సూక్ష్మకణజీవాలు, జన్యువులు, జంతు జాతులతోపాటు మానవ శరీరంలోని కణాలు, ప్రోటీన్లపై సైతం పేటెంట్లు ఏర్పడ్డాయి.

అమెరికా తరహా పేటెంట్ చట్టాలను, గాట్/డబ్ల్యుటిఒ (GATT/WTO)లకు సంబంధించిన వ్యాపార సంబంధిత మేధో సంపద హక్కుల (ట్రిప్స్) ఒప్పందం విశ్వజనీనం చేసింది. దీనంతటి ప్రభావం మన మౌలిక అవసరాలు అయిన ఆహారం, మందులపైన తీవ్రంగా పడుతుంది. మించి ఈ ధోరణి ప్రజాస్వామ్యం, సార్వభౌమాధికారాలకు పెనుసవాలు కానున్నది. భిన్న జీవజాలాలతో సహా అన్ని రకాల వస్తుజాలాన్ని పేటెంట్ల అదుపులోకి తెచ్చే ప్రయత్నం జరుగుతోంది. ఫలితంగా మన అడవులు, పంటలు, వంటగదులు, మన పెరటిలోని ఔషధ మొక్కలపై కూడా మన కనీస హక్కులు చేజారిపోతున్నాయి. ప్రస్తుతం పేటెంట్ల జారీ కేవలం యంత్రాలకో లేదా నూతన ఆవిష్కరణలకో పరిమితమైలేదు. ఇది నేడు అన్ని జీవజాతులు, భిన్న జీవజాలాలు, మన బామ్మలనాటి చిట్కా వైద్యాలు, విధానాలను కూడా కబళిస్తోంది. భారతదేశంలో దైనందిన అవసరాలకు ఉపయోగించే వేప, పసుపు కొమ్ములు, నేరేడుపండ్లు, నేల ఉసిరి, కాకరకాయలు, నల్ల మిరపకాయలు మొదలైన వందలాది ఆహార, వైద్య సంబంధిత వృక్షజాతులు నేడు పాశ్చాత్య ప్రపంచపు వాణిజ్య లాభాల వేటలో, పేటెంట్ల బారిన పడబోతున్నాయి. ఇది జీవ సంబంధిత నిలువుదోపిడీయే. సాధారణ అభిప్రాయాలకు భిన్నంగా, పాశ్చాత్య తరహా మేథోసంపత్తి హక్కుల వ్యవస్థ (ఐపిఆర్ఎస్) మేధో హక్కులను కాపాడటం మాట అటుంచి, వాస్తవానికి ఆ హక్కులను హరించి వేస్తోంది. అమెరికా పేటెంట్ చట్టాల విషయంలో ఇది మరింత నిజం. ఈ పేటెంట్ హక్కులు కొన్నిమార్లు మానవ హక్కులను కూడా ఉల్లంఘిస్తున్నాయి.

కాగా, స్వేచ్ఛా మార్కెట్ వ్యవస్థలో అభివృద్ధికీ, ఉన్నత జీవన ప్రమాణాలకూ పేటెంట్‌లు అవసరమని పాశ్చాత్య పేటెంట్ల లాబీ మనలను నమ్మించచూస్తోంది. సాంకేతిక అభివృద్ధి ద్వారా ఇది సాధ్యమౌతుందనేది ఈ లాబీ వాదన. మేథోసంపద హక్కుల వలన పెట్టుబడులకు ప్రోత్సాహం లభిస్తుందనీ, ఇది ముఖ్యంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు (ఎఫ్‌డిఐ) వర్తిస్తుంది అనేది వారి తర్కం. భూగోళంపైన ఉన్న ఉత్తరాది (అభివృద్ధి చెందిన) దేశాల నుంచి దక్షిణార్ధ భాగ (వర్ధమాన) దేశాలకు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చేందుకూ, పరిశోధన, నూతన ఆవిష్కరణలకు ఇది దోహదం చేస్తుందని ఈ లాబీ ప్రవచిస్తోంది. పరిశోధన, అభివృద్ధి వ్యయాలను తిరిగి రాబట్టుకోగల అవకాశం కల్పించడంద్వారా పైన పేర్కొనవన్నీ జరుగుతాయనేది వారి ఉద్దేశ్యం. అంటే, పేటెంట్లు వాటి వెల్లడి తాలూకు లాభాలు, మార్కెట్‌లోని కృత్రిమ గుత్తాధిపత్యాలకు మించినవి అనేది దీనంతటి తాలూకు సారం.

అయితే వాస్తవ చిత్రం దీనికి పూర్తిగా భిన్నమైనది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలు, అందులోనూ ముఖ్యంగా అమెరికా, ఇతర దేశాలపై "రాజకీయ వత్తిడి"ని తెచ్చేందుకు వీలుగా మాత్రమే ఈ మేధోసంపత్తి హక్కుల వ్యవస్థ ఉపకరిస్తుంది. తమ దేశ ఆర్థిక వ్యవస్థకు, జపాన్ ఆర్థిక వ్యవస్థకు మధ్య తీవ్రమైన వ్యవస్థాగత సాంకేతిక అగాధం ఏర్పడుతోందని 1970 మరియు 1980ల చివరి కాలంలో అమెరికా ప్రభుత్వం గుర్తించనారంభించింది. అందుచేత, అమెరికా

పారిశ్రామిక రంగం ఇప్పటివరకూ కృత్రిమంగా సాగించుకుంటున్న ఆధిపత్యాన్ని తీవ్ర చర్యల ద్వారా కాపాడుకునేందుకు మేథోసంపత్తి హక్కుల విధానాన్ని విదేశాలకు కూడా విస్తరించే ముమ్మర ప్రయత్నం ఆరంభం అయ్యింది. 1984వ సంవత్సరంలో అమెరికాలో నిర్వహించిన ఒక సర్వే దీనిని రుజువు చేస్తుంది. పేటెంట్ విధానాన్ని, నూతన ఆవిష్కరణలకై కృషి చేసేందుకు కాక, కేవలం "సాంకేతిక రంగ విభాగాలలోనికి ప్రవేశాన్ని నిరోధించేందుకు" సాధనంగా వినియోగించుకోవడమే తమ ఉద్దేశ్యమని 80%పైగా కంపెనీలు వెల్లడించాయి. లైసెన్సుల లావాదేవీలకై చర్యలు జరిపేందుకు పేటెంట్లను వ్యవస్థ "ట్రంపుకార్డులు"గా వాడుకోవడమే అసలు ఉద్దేశ్యం. మరోమాటలో చెప్పాలంటే- పేటెంట్ల వ్యవస్థ, పోటీ పరిస్థితులను 'నియంత్రిస్తుంది కాబట్టి ఆ వ్యవస్థ నూతన సాంకేతిక పరిజ్ఞానపు ఆవిష్కరణకు ఎటువంటి ఊతాన్ని ఇవ్వదు. అంతకు మించి, ఈ వ్యవస్థ ద్వారా సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా అందుబాటులోకి రావడం అనేది ఉత్త భ్రమ మాత్రమే.

ఇక ముందర పేర్కొన్న వాదనలోని రెండవ భాగాన్ని చూద్దాం. దీని ప్రకారం, జాతీయ ఆర్థిక అభివృద్ధికీ, పెట్టుబడులకూ మేథోసంపత్తి హక్కుల వ్యవస్థ తప్పనిసరి అవసరం. కాగా, బయోటెక్నాలజీ కంపెనీల పరిశోధనా, అభివృద్ధి వ్యయం తీరులు, ఈ వాదనలోని పసలేనితనాన్ని రుజువు చేస్తున్నాయి. ఈ సంస్థలు సాలీనా 7 బిలియన్ల డాలర్లను పరిశోధన, అభివృద్ధిపై వెచ్చిస్తున్నాయి. ఒక్క 1995వ సంవత్సరం కాలంలోనే ఈ సంస్థలు పరిశోధన అభివృద్ధిపై 12 బిలియన్ల డాలర్లను వెచ్చించాయి. యూరోపియన్ యూనియన్‌తో సహా ప్రపంచంలోని పెక్కు అతి పెద్ద మార్కెట్లలో పేటెంట్ల రక్షణకు అతి బలహీనమైన, అసందిగ్ధ పరిస్థితి వున్నప్పటికీ ఆ కంపెనీలు ఈ పెట్టుబడులను పెట్టాయి. హైటెక్ మరియు అత్యంత ఎక్కువ గ్యారంటీలేని పరిశోధన, అభివృద్ధి రంగంలో కూడా మేథోసంపత్తి హక్కుల పరిరక్షణ లేకుండా కూడా లాభాపేక్ష బాగానే పని చేస్తుందనేది దీని సారాంశం. అంటే, మేథోహక్కుల పరిరక్షణకు, పెట్టుబడులకు మధ్య బలీయమైన సంబంధంలేదని ఇది రుజువు చేస్తోంది. అలాగే పరిశోధన, అభివృద్ధి రంగాలలో వ్యయానికి, ఆర్థిక అభివృద్ధికి మధ్య కూడా నిర్ధారించుకోదగిన సంబంధం లేదని రుజువు అవుతోంది.

అంతేగాక విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు కేవలం కొద్ది శాతం పెద్ద కంపెనీల చేతిలోనే వున్నాయని గుర్తించాలి. ఈ పెట్టుబడులు వివిధ దేశాలలోని ఈ కంపెనీల విభాగాలలోనే అంతర్గతంగా ప్రవహిస్తూ ఉంటాయి. భూగోళపు దక్షిణార్ధ భాగంలోకి వస్తోన్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులలో 8% వరకూ కేవలం 10 అభివృద్ధి చెందుతున్న దేశాలలోనికే వస్తున్నాయి. మేథోసంపత్తి హక్కుదారులైన విదేశీ సంస్థలకు, అభివృద్ధి చెందుతోన్న దేశాలు రాయల్టీ రూపంలో చెల్లిస్తోన్న అత్యంత విలువైన వనరులను ఈ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులతో సరిపోల్చి చూడాలి. ప్రపంచ వ్యాప్తంగా రాయల్టీలు, లైసెన్సు సుంకాల రూపంలో చెల్లించబడుతోన్న మొత్తం 70% వరకూ బహుళజాతి సంస్థల మాతృ సంస్థలకు, వాటి విదేశీ విభాగాలకు మధ్య జరుగుతోన్న లావాదేవీయే.

ఇక, నూతన ఆవిష్కరణలను పేటెంట్ చేయడానికి అనుమతించడం వలన, పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలపై వివిధ సంస్థలు పెట్టిన పెట్టుబడులను రాబట్టుకోవడం సాధ్యమౌతుంది అనేది కూడా పసలేని వాదన. అభివృద్ధి చెందిన దేశాలలోని పరిశ్రమలు పేటెంట్ల ద్వారా తమ

పరిశోధన, అభివృద్ధి వ్యయ మొత్తంలో కేవలం 15 నుంచి 20% వరకూ అదనంగా రాబట్టుకోగలవని గణాంక వివరాలు వెల్లడిస్తున్నాయి కాగా, భారతదేశం వంటి దేశంలో, స్వదేశీ పెట్టుబడిదారు, పేటెంట్ల వ్యవస్థ ద్వారా తన పరిశోధనా, అభివృద్ధి వ్యయంలో కేవలం 0.5 నుంచి 2% వరకూ మాత్రమే అదనంగా రాబట్టుకోగలడు.

అందుచేత మేధోసంపత్తి హక్కుల వ్యవస్థ అనేది మార్కెట్ పరిస్థితులను వక్రీకరించే ప్రభుత్వ ఆమోదముద్ర పొందిన గుత్తాధిపత్యం లేదా సబ్సిడీ మాత్రమే అనేది వాస్తవం. ఈ వ్యవస్థ సాంకేతిక పరిజ్ఞానపు వినియోగ పరిధులను కుదించివేస్తుంది తద్వారా కొద్దిపాటి వ్యాపార సంస్థలు అదనపు లాభాలను పొందగలవు. దీర్ఘకాలిక ప్రాతిపదికన బలమైన పేటెంట్ల వ్యవస్థ సరకులు, సేవల ధరలలో వివక్ష వంటి పలు మార్కెట్‌ను వక్రీకరించే పరిస్థితులకు మాత్రమే దారి తీయగలదు దీనివలన పేటెంట్లను పొందిన సంస్థలు పలు అక్రమాలకు పాల్పడగలవు. ఒక సరకును, లేదా సేవను కొనుగోలు చేస్తే దానితోపాటుగా మరొక సరకును, సేవనుతప్పనిసరిగా కొనుగోలు చేయవలసిరావడం ఇటువంటి ఒక వక్రీకరణ. అలాగే సంస్థలు ఒకదాని కొకటి లైసెన్సులను మార్పిడి చేసుకోగలవు అంతే కాకుండా పేటెంట్లను లైసెన్సు చేయడానికి కూడా తిరస్కరించగలవు.

అంటే, పేటెంట్ల వ్యవస్థ అంతర్గతంగా పరస్పర విరుద్ధ ధోరణులు కలది. వ్యక్తిగత సంకుచిత ప్రయోజనాలు, మొత్తం సామాజిక ప్రయోజనాల తాలూకు వైరుధ్యం దీనిలో వుంది. ప్రైవేటు యాజమాన్యం, గుత్త సంస్థలు ఏర్పడటం, సామాజిక ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యక్తిగత లాభాలు, శాస్త్ర, సాంకేతికరంగ ప్రయోజనాలు, వ్యక్తిగత లాభాలకు లోబడడం- ఇవన్నీ పేటెంట్ల వ్యవస్థలోని అంతర్గత వైరుధ్యాలు, కాబట్టి ప్రైవేటు సంకుచిత ప్రయోజనాలను కాపాడేందుకు బాగా వుపకరించే పేటెంట్లు, సామాజిక ప్రయోజనాలను కాపాడటంలో విఫలం అయ్యితీరుతాయి. అయితే స్థూల అర్థంలో "బలమైన" లేదా "బలహీనమైన" పేటెంట్ చట్టం అంటూ ఏమీ విడివిడిగా లేవు ఈ చట్టం రక్షించతలపెట్టిన ప్రయోజనాలనుబట్టి ఈ చట్టపు బలం లేదా బలహీనత సాపేక్షంగా ఆధారపడి వుంటాయి. గాట్‌లో జరిగే మేధోసంపత్తి హక్కుల చర్చలలో ప్రస్తావనకు వచ్చే."బలమైన వ్యవస్థల" తాలూకు పాక్షిక అంశాలు, కేవలం కార్పొరేట్ రంగ పరిశ్రమల హక్కులు మాత్రమే ముఖ్యమనే భావనకు లోబడి వున్నాయి.

జీవజాలంపై ఇచ్చే పేటెంట్లు మానవజాతిని నైతికంగానూ, పర్యావరణపరంగానూ, ఆర్థికంగానూ గుల్ల చేస్తాయి. అవి కొద్ది సంఖ్యలో వుండే వ్యాపార సంస్థలకు లాభాలను ఆర్జించిపెడతాయి. భిన్న పార్శ్వాలు గల మానవ సమాజం నైతికంగానూ, పర్యావరణపరంగానూ, ఆర్థికంగానూ పరిపుష్టం అయ్యేందుకు, పేటెంట్ల వ్యవస్థకు సరైన ప్రత్యామ్నాయం ఏర్పడాలి. పేటెంట్ల వ్యవస్థ దురహంకార పూరితమైనది అది శాస్త్రవేత్తలను జీవజాలన్ని "సృష్టించే" వారిగా మార్చివేస్తోంది అన్ని జీవజాలాలలోనూ సహజసిద్ధంగా వున్న పునరుత్పత్తి వ్యవస్థలు, సృజనాత్మకతల ఆధారంగానే ఈ రంగాలలోని ఆవిష్కరణల ప్రతిఫలం నిర్ణయించబడాలి.

పేటెంట్ల ద్వారా పేటెంట్‌ను పొందినవారికి తన ఆవిష్కరణపై సంపూర్ణ హక్కు లభిస్తుంది

దీనివలన ఆ ఆవిష్కర్త పేటెంట్ చేయబడిన వస్తువు లేదా పదార్థాన్ని తయారు చేసేందుకు, పెంచేందుకు, వినియోగించుకొనేందుకు. అమ్ముకునేందుకు లేదా పంపిణీ చేసుకునేందుకు హక్కు లభిస్తుంది అలాగే పేటెంట్ చేయబడిన వస్తువు లేదా పదార్థాన్ని ఉత్పత్తి చేసే పద్ధతి లేదా ప్రక్రియను వినియోగించుకునే లేదా దానిపై అజమాయిషీ చేసుకునే అవకాశం లభిస్తుంది. జీవంపై పేటెంట్ పొందినవారికి తద్వారా పేటెంట్ చేయబడిన విత్తనాలు, మొక్కలు, లేదా జంతువులు మొదలైనవాటిని ఇతరులు తయారు చేయకుండా లేదా ఉపయోగించుకోకుండా నివారించే హక్కు లభిస్తుంది. జీవవనరులు, జీవరీతులు తమను తాము "పునరుత్పత్తి" చేసుకుంటాయి. రైతులు తమ విత్తనాలను దాచుకునేవారు. పెంపుడు జంతువులను అట్టిపెట్టుకునేవారు. అందుచేతనే, పాశ్యాత్య తరహా పేటెంట్ చట్టాలు విత్తనాలను దాచుకోవడం, పరస్పరం మార్పిడి చేసుకోవటాలను "మేధోసంపత్తి దొంగతనం" చేయడంగా పరిగణిస్తున్నాయి.

పేటెంట్ల వ్యవస్థ పాశ్చాత్య నాగరికత దురహంకారాన్ని వెల్లడిస్తోంది. వేప చెట్టుపై పేటెంట్ ఇందుకు ఉదాహరణ. ప్రకృతిలో విరివిగా లభించే క్రిమి సంహారకంగా వేపచెట్టు తాలూకు లక్షణాలను భారతదేశంలో వందలాది సంవత్సరాల క్రితమే గుర్తించి వినియోగిస్తున్నాయి. ఇది వేపచెట్టు నుంచి క్రిమిసంహారకాలను తయారు చేసేందుకు పేటెంట్ పొందిన శాస్త్రవేత్తల క్రొత్త ఆవిష్కరణ ఏమాత్రం కాదు.

ఇటువంటి మేధోసంపత్తి హక్కులు, కేవలం మేధోసంపత్తి చౌర్యం హక్కులు మాత్రమే. ఇటువంటి దోపిడీని అరికట్టేందుకుగాను, మూడవ ప్రపంచ దేశాలలోని సమాజాల సమష్టి ఆవిష్కరణలను గుర్తించడం అత్యవసరం.

వలసవాద కాలంలోని చట్టాలు విదేశీ వ్యాపారులకు, విదేశీ పెట్టుబడిదారులకూ ఆయా వలసలలో మార్కెట్లను కాపాడుకునే రక్షణ కల్పించాయి. కాగా, 1970వ సంవత్సరపు భారతదేశ పేటెంట్ చట్టంలాగా మూడవ ప్రపంచ దేశాలలోని సార్వభౌమాధికార చట్టాలు పెట్టుబడిదారులు, వినియోగదారుల హక్కుల మధ్య సమతూకాన్ని సాధించేందుకు తలపెట్టబడ్డాయి. అలాగే, గుత్తాధిపత్య, అవాంఛనీయ వ్యాపారధోరణులు తమ శాస్త్ర, సాంకేతిక అభివృద్ధికి ఆటంకం కల్గించే పారిశ్రామిక అభివృద్ధిని ఆటంకపరిచే పరిస్థితి ఏర్పడకుండా నిలువరించేందుకు ఈ చట్టాలు ఉద్దేశించబడ్డాయి. మూడవ ప్రపంచ దేశాలు స్వయంగా పారిశ్రామిక పాటవాన్ని అభివృద్ధి చేసుకోవడాన్ని నిలువరించేందుకు, తమ ఉత్పత్తులకు మార్కెట్లుగా మాత్రమే వాటిని అట్టిపెట్టేందుకు అభివృద్ధి చెందిన దేశాలు పేటెంట్ విధానాన్ని ఉపయోగించేవి. ఆ వాస్తవాన్ని ఎదుర్కొనే విధంగా సర్వసత్తాక మూడవ ప్రపంచదేశాలలోని చట్టాలను తయారు చేసారు. అయితే, వ్యాపార సంబంధిత మేధోసంపత్తి హక్కుల వ్యవస్థ భారతదేశంపై బలవంతంగా రుద్దుతోన్న మార్పులు ఈ ప్రజాహిత రక్షణ కవచాన్ని దెబ్బతీస్తున్నాయి. తద్వారా ఆ వ్యవస్థ నూతన ఘర్షణలకు కారణం అవుతున్నది. పై మార్పుల వలన, భారతదేశ ప్రజల ప్రాథమిక హక్కులు, మౌలిక అవసరాలు మూడు రకాలుగా దెబ్బతింటున్నాయి. మొదటిది– పేటెంట్ల గుత్తాధిపత్యం వలన మందుల వంటి సరకుల ధరలు నింగినంటుతాయి. రెండవది– స్వదేశీ విజ్ఞానాన్ని పేటెంట్లు కబళించడం వలన, విత్తనాలు, మందుల వంటివి పేదలకు అందుబాటులో లేకుండా పోతాయి

ఫలితంగా వారి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుంది. (జీవ సంబంధిత దోపిడీ అధ్యాయాన్ని చూడండి) మూడవది– జీవ రూపాలు, భిన్నత్వంగల జీవజాలంపై పేటెంట్లు ఇవ్వడంవలన మూడవ ప్రపంచ దేశాలలోని వనరులపై, ఆ దేశాలకు వున్న హక్కులు అడుగంటుతాయి. అలాగే, జీవాన్ని పేటెంట్ చేయడం తాలూకు నైతిక సమస్యలు కూడా తల ఎత్తుతాయి. ('జీవజాల వైవిధ్యానికి ముప్పు" అనే అధ్యాయాన్ని చూడండి.) ప్రజా ప్రయోజనాలపై ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాలలో పడే ప్రభావానికి సంబంధించిన ఆచరణాత్మక ఆధారాల దృష్ట్యా, విశ్వవ్యాప్తంగా ఒకే పేటెంట్ వ్యవస్థ ఏర్పాటుకై ఒత్తిడి తేవడం సమర్ధనీయంకాదు.

జీవాన్ని పేటెంట్ చేయడంలో ఇమిడివున్న నైతిక అంశాలను ఇప్పటికే పలువురు ప్రశ్నిస్తున్నారు. జంతుజాలాన్ని పేటెంట్ చేయడాన్ని వ్యతిరేకిస్తోన్న అమెరికా పార్లమెంట్ (కాంగ్రెస్) సభ్యుడు మార్క్‌వార్డ్‌డేల్ దీనిపై ఇలా వ్యాఖ్యానించాడు. "జంతువులను పేటెంట్ చేసే విషయం జీవంపట్ల గౌరవ భావం తాలూకు ప్రధాన నైతిక సమస్యను రేకెత్తిస్తోంది. ఈ పేటెంట్ విధానపు నైతికతను భవిష్యత్ తరాలు అనుసరిస్తాయా అనేది, అలాగే, భావితరాలు జీవాన్ని కేవలం రసాయన ఉత్పత్తిగా భావిస్తాయా, జీవాన్ని పారిశ్రామిక ఉత్పత్తులకంటే ఎక్కువ విలువ, అర్థంలేని ఉత్పత్తిగా భావిస్తాయా? కానిపక్షంలో జీవంపట్ల గౌరవానిది పై చేయి అయ్యి, దైవసృష్టి అయిన జీవాన్ని వ్యాపార వస్తువుగా దిగజార్చే దుస్థితి తాలూకు బలహీనత వెనుకతట్టు పడుతుందా? అనేది నేడు మనముందున్న సమస్య

అయితే, పేటెంట్ల వ్యవహారం అనేది కేవలం జంతుజాలానికి మాత్రమే పరిమితం కాకపోవడాన్ని మనం గమనించవచ్చు. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ ఆసుపత్రిలో పిత్తాశయ కాన్సరుకు చికిత్స పొందుతోన్న జాన్ మూర్ ఉదాహరణనే చూడవచ్చు. ఈ రోగి అనుమతి లేకుండానే అతని వైద్యుడు 1984వ సంవత్సరంలో అతని కణజాలంపై పేటెంటు తీసుకున్నాడు. తరువాత "మోకణజాలంగా" పిలవబడే ఈ కాన్సరు కణాలను ఆ వైద్యుడు ఔషధ ఉత్పత్తి సంస్థ అయిన శాండోజ్‌కు అమ్ముకున్నాడు. ఈ కణజాలపు అంతిమవిలువ 300 కోట్ల డాలర్లని అంచనా అయితే, విషయం తెలుసుకున్న మూర్ కోర్టు వెళ్లాడు. కాగా, కాలిఫోర్నియా అప్పీలు కోర్టులో మూర్‌కు వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. అంటే, తన శరీరంలోని కణజాలంపై మూర్‌కు హక్కులేని పరిస్థితి ఏర్పడింది. మూర్ శరీరం నుంచి తీసిన కాన్సరు కణజాలంపై తాము పేటెంట్ హక్కును పొందడాన్ని అటు కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంగానీ ఇటు శాండోజ్ కంపెనీగానీ విపరీత విషయంగా భావించలేదు. పేటెంట్ నంబరు 4,438,032గా తన కణజాలం గుర్తించబడడంలో వేదనను జాన్‌మూర్ వివరించాడు. "నాకు తెలియకుండా లేదా అనుమతి లేకుండానే, నా ప్రత్యేక జన్యువులపై నాకున్న హక్కును కోల్పోయాను–నన్ను అదుపు చేసారు. మోసం చేసారు. నాకు అబద్ధాలు చెప్పారు, తుదకు నమ్మశక్యంకాని దురహంకారంతో, నా మానవ గౌరవాన్ని కాలరాచేవిధంగా ప్రవర్తించారు."

హగాహాయ్ ప్రజల జన్యువులపై అమెరికా ప్రభుత్వం పేటెంట్‌ను పొందింది. అయితే ప్రపంచ వ్యాప్తంగా దుమారం ఫలితంగా ఈ పేటెంట్‌ను అమెరికా ప్రభుత్వం వదులుకుంది. యూరోప్‌కు చెందిన వైద్యులు, ఆందోళనకారులు ఈ పేటెంట్‌ను సవాలు చేసారు. ఫలితంగా 1999వ సంవత్సరంలో

ఈ పేటెంట్ రద్దయ్యింది. ఈ పేటెంటు "అనైతికం, విలువల రాహిత్యం" అని వైద్యులు పేర్కొన్నారు. ఇటువంటి పేటెంట్లు శృతిమించి రాగాన పడుతున్నాయని వారు వివరించారు

1994–99 సంవత్సరాల మధ్య, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్లుటిఒ)కు సంబంధించిన చట్టాలను భారత ప్రభుత్వం ప్రవేశపెట్టినపుడల్లా పేటెంట్లపై చర్చ భారతదేశ పార్లమెంట్ అతి ప్రధాన చర్చనీయాంశం అయ్యింది. వ్యాపార సంబంధిత మేధోసంపత్తి హక్కుల వ్యవస్థను అమలు జరిపేందుకు 2000 సంవత్సరం జనవరి 1వ తేదీ అంతిమ గడువు. ముగిసిన పేటెంట్లను గురించిన వివాదం ఇంకా కొనసాగుతూనే ఉంది. కొత్త సహస్రాబ్దిలోనూ కొనసాగుతుంది. పేటెంట్లు, మేధోసంపత్తి హక్కుల వ్యవస్థకు సంబంధించిన అంశాలపై నేను పని చేయడం 1980వ దశకపు మధ్యకాలంలో ఆరంభం అయ్యింది నూతన బయోటెక్నాలజీలు, జీవరీతులపై పేటెంట్లు మొదలైనవాటి ఆవిర్భావపు నేపథ్యంలో ఇది జరిగింది. అలాగే ఉరుగ్వే రౌండు గాట్ చర్చలలో మేధోసంపత్తి హక్కుల వ్యవస్థను ప్రవేశపెట్టేందుకు దారితీసింది. పర్యావరణం, సమానత్వాలకు సంబంధించిన నా ఆందోళన, నిబద్ధతలు పేటెంట్ చట్టాల దిశగా నా దృష్టి మళ్ళటానికి పునాది అయ్యాయి. జీవజాలపు వైవిధ్యాన్ని కాపాడే కృషికి అంకితమయిన పర్యావరణ వేత్తగానూ, జీవంపట్ల అచంచల గౌరవం కల వ్యక్తిగానూ నేను పేటెంట్లు తీవ్రమైన నైతిక సమస్యలకు కారణం అవుతాయని భావిస్తున్నాను. ఈ సమస్యల వలన మానవజాతికి, ఇతర జీవజాతులకు సంబంధించి ఊహకు అందని పరిణామాలు ఉంటాయని భావిస్తున్నాను.

నేటి ప్రపంచంలో పేటెంట్లు మన దైనందిన జీవితాన్ని ప్రభావితం చెయ్యగలవు. అది పేటెంట్లవల్ల ముప్పుకు గురి అవుతున్న, విత్తనాలపై రైతుకు ఉన్న హక్కు కావచ్చు లేదా పేటెంట్ల గుత్తాధిపత్యంవలన, వినియోగదారులుగా, ఆహారం, మందులపై మనకున్న హక్కులు తుడిచిపెట్టుకుపోవడం కావచ్చు. అలాగే, పరిశోధకులుగా విజ్ఞానాన్ని పరస్పరం పంచుకునే స్వేచ్ఛను కూడా పేటెంట్ల వ్యవస్థ మన నుంచి దూరం చేయవచ్చు పేటెంట్లు మన నిత్య జీవితం తాలూకూ ప్రతి పార్శ్వాన్ని ప్రభావితం చేయగలవు అందుచేత మన సమాజాన్ని నిర్దేశించే పేటెంట్ల చట్టాలను నిర్ణయించడంలో మనం చురుకైన పాత్ర వహించాలి. తొలి వలసవాద యుగంలో, మూలజనుల భూమి వారి నుండి దోచుకోబడింది. ఇక యిప్పుడు మేధోసంపద హక్కులు, పేటెంట్ల ద్వారా మూలజనుల మెదళ్ళను, శరీరాలను కూడా దోచుకునే ప్రయత్నం జరుగుతోంది. అంటే, ప్రస్తుతం మనజీవితాలే వలసవాద కోరల్లో చిక్కుకుంటున్నాయి. కాబట్టి ఇక ఇప్పుడు మనం పేటెంట్ల సమస్యను కేవలం పేటెంట్ల లాయర్లకు, మేధోహక్కుల నిపుణులకు మాత్రమే వదలివేసి చేతులు ముడుచుకుని కూర్చోరాదు. నేను పేటెంట్ల న్యాయవాదిని కాదు. అయితే శాస్త్రవేత్తగా, పర్యావరణ ఆందోళనకారురాలిగా, స్త్రీవాదిగా, అలాగే, బాధ్యతాయుత పౌరురాలిగా నేను గత దశాబ్దకాలంగా పేటెంట్లకు సంబంధించిన చర్చలలో చురుకుగా పాల్గొంటున్నాను. ఈ నా పుస్తకం పేటెంట్ల చట్టాల తాలూకు నిగూఢతను ఛేదించగలదనేది నా ఆశాభావం. అంతేకాకుండా ప్రపంచీకరించబడిన పేటెంట్ల వ్యవస్థ తాలూకు నైతిక, పర్యావరణ, ఆర్థిక ప్రభావాలను ఈ పుస్తకం ఎలుగెత్తి చాటాలనేది నా ఆకాంక్ష. ఈ పుస్తకం చదవడం పూర్తి అయ్యేసరికి. ఈ సమస్యపట్ల నా ఆందోళనలో మీరు కూడా భాగస్వాములు కాగలరనేది నా ఆశ.

# 1. చరిత్రలో పేటెంట్ల పాత్ర

పేటెంట్లు సృజనాత్మకతతో ఆవిష్కరణలతో ముడిపడి వున్నాయి పేటెంటు చేసిన వస్తువును తయారు చేయటం, ఉత్పత్తి చేయటం, పంపిణీ చేయటం, అమ్ముకోవటంపై ఆవిష్కర్తలకు సంపూర్ణ హక్కు లభించేవి. అయితే, చరిత్రలో పేటెంట్లకు ఇతరేతర లక్షణాలు కూడా ఉన్నాయి

చారిత్రకంగా, పేటెంట్లకు మూడు భిన్న ఉపయోగాలు ఉండేవి – 'సాధించిన విజయాలకు పేటెంట్లు' 'నూతన ఆవిష్కరణలకు పేటెంట్లు', 'దిగుమతులకు పేటెంట్లు' – వీటన్నింటికి పేటెంట్లు ఉండేవి. అయితే, పేటెంట్ల వేర్వేరు విధులను చట్టంలో స్పష్టంగా వేరు చేయలేదు పేటెంట్ల తాలూకు భిన్న విధుల గందరగోళపు కిచిడీలుగా చట్టాలు వుండేవి. ఎందుచేతనంటే "పేటెంట్ల వ్యవస్థలు" చారిత్రకంగా లభించిన అంశాల పైననే ఆధారపడి వుండేవి. ఈ రకమైన పేటెంట్ల వ్యవస్థ గణనీయంగా మారినప్పటికీ, ఈ మార్పులు వేర్వేరు సామాజిక ఆర్థిక సందర్భాలకు, భిన్న చారిత్రక దశలకు, భిన్న వస్తుగత అంశాలకు ప్రాతినిధ్యం వహించగలిగేంతగా మారలేదు. వలసవాద కాలంలో రూపుదిద్దుకున్న పాత చట్ట సంబంధిత అంశాలు, కొద్దిపాటి మార్పులతో నూతన దశలకు, అంశాలకు అన్వయించబడ్డాయి.

## సాధించిన విజయాలకు పనిముట్లుగా పేటెంట్లు

నూతన ఆవిష్కరణలను, నూతన సృజనలను ప్రోత్సహించి, లాభదాయకంగా చేసే సమర్థవంతమైన సాధనాలు పేటెంట్లు అనేది ఇప్పుడున్న భావన. ఇవి గతంలో లేవు ఆదిలో, పేటెంట్లు దస్తావేజుల రూపంలో ఉండేవి. "పేటెంటు అంటే బహిరంగత" అని అర్థం వుండేది. "పేటెంట్ల దస్తావేజు" అంటే అవి అధికారిక పత్రాలుగా ఉండేవి. వీటి ద్వారా నూతన ఆవిష్కరణలపై హక్కులు, గుర్తింపు ముద్రలుఏర్పడేవి. వీటిని సార్వభౌమాధికార పరిపాలకులు ఇచ్చేవారు. అవి "బహిరంగమైనవి." ఎందుచేతనంటే, అవి బహిరంగంగా ప్రకటించబడేవి. అలాగే వాటిపై రాచముద్ర వేయబడేది. అయితే, ప్రస్తుతం మనం భావిస్తున్న తీరులో "బహిరంగత" అంటే నూతన ఆవిష్కరణను బయటపెట్టడంగా మాత్రం ఉండేది కాదు.

దస్తావేజులు పేటెంట్లు, యూరోప్‌లో మొదటిసారిగా ఆరవ శతాబ్దకాలంలో జారీ అయ్యాయి. విదేశీ భూభాగాలను తమ తరపున కనుగొన్నందుకు, జయించినందుకు యూరోప్‌కు చెందిన రాజులు ఈ లేఖలను ఇచ్చేవారు ఇవి వలస వాదానికి, దిగుమతుల గుత్తాధిపత్యాన్ని స్థాపించటానికి ఉపయోగపడేవి. క్రిస్టఫర్ కొలంబస్‌కు లభించిన రాచముద్ర దీనికి తార్కాణం. ఈ రాచముద్ర దస్తావేజులలో రెండు మాటలు ప్రధానంగా ఉండేవి. అవి "కనుగొనటం", "జయించటం." అన్ని

"ద్వీపాలు, భూఖండాలను" వాటిని కనుగొనకముందే, వాటిపై హక్కులను ఏర్పరుచుకున్నందుకుగాను, ముందు పేర్కొన్న రెండు మాటలను నాడు జారీ అయిన పేటంట్లలో ఏడుసార్లు ఉపయోగించారు. వాస్తవానికి కొలంబస్ భారతదేశాన్ని కనుగొనేందుకు సముద్ర ప్రయాణం కట్టాడు కాగా, పొరపాటున అమెరికా భూభాగంలోకి అడుగుపెట్టాడు. అయితే, అతనికి భారతదేశాన్ని సొంతం చేసుకునేందుకు అధికారాలు దక్కాయి. కాగా, ఈ అధికారాలను ఇండియన్లుగా పిలువబడే అమెరికా మూలవాసుల భూభాగాలను జయించేందుకు, సొంతం చేసుకొనేందుకు ఉపయోగించుకోవటం జరిగింది

ఈ విధంగా చారిత్రకంగా పేటెంట్లు అనేవి వలసవాదంతో ముడిపడి వున్నాయి. వలసవాద దశ ఆరంభంలో, యూరప్ పాలకులు, ప్రపంచంలోని ఇతర భూభాగాలను ఆక్రమించుకొనేందుకు ఈ తరహా పేటెంట్లను వినియోగించుకొన్నారు. ఇక ఇప్పుడు పేటెంట్లు ఆర్థిక వ్యవస్థలను జయించే సాధనాలుగా మారాయి. నూతన భూభాగాలను కనుగొని, జయించేందుకు పేటెంట్లను పనిముట్లుగా వాడటం, నేడు గాట్/డబ్లుటిఒలు పేటెంట్లు ఇస్తున్న తీరులో, ఘర్షణలకు నేపథ్యంగా మారింది. మూడవ ప్రపంచదేశాలను తిరిగి వలసలుగా మార్చుకునేందుకు పేటెంట్లు సాధనంగా వున్నాయనేది పలువురి అభిప్రాయం కాగా, పాశ్చాత్య దేశాల దృష్టిలో పేటెంట్లు, వలసవాద యుగంలోని ఆక్రమణలలాగానే "సహజ" హక్కు. అయితే, గత కాలపు వలసవాదానికి, నేటి వలసవాద పునరుద్ధరణకు మధ్య తేడాలు వున్నాయి. నేటి ఆక్రమణలకు మతం అనేది అంతిమ సమర్థనకాదు. నూతన వలసవాదం "లౌకిక" ప్రణాళిక. అయితే నేటి నూతన మతం మార్కెట్లు. నేటి ఆక్రమణలకు భూభాగాలు, బంగారం లేదా ముడిసరుకులు లక్ష్యంకాదు. నేడు అదుపు చేయవలసినవి మార్కెట్లు లేదా ఆర్థిక వ్యవస్థలు, వలసవాద యుగంలో భూమిని ఆక్రమించుకోవడానికి ప్రాధాన్యత ఉండేది. నేడు, విజ్ఞానం ఆస్తిగా మారింది. అందుచేతనే నేటి పేటెంట్లు "మేధోసంపత్తి" లేదా "మేధస్సు సృష్టించిన" ఆస్తులపై అధికారం అనే విస్తృత నిర్వచనాన్ని పొందాయి. గతంలో, కొత్తగా "కనుగొన్న" భూభాగాలను "నరసంచారంలేని" ప్రదేశాలుగా భావించేవారు. ఎందుచేతనంటే, ఆ ప్రాంతాలలో శ్వేతజాతీయ యూరోపియన్లు లేరు కాబట్టి. అంటే, ఆయా భూభాగంలో వేలాది సంవత్సరాలుగా జీవిస్తున్న స్థానికుల అస్తిత్వం విస్మరించబడింది. అలాగే, ప్రస్తుతం "ఆవిష్కరిస్తున్న", "పేటెంటు చేస్తున్న" విజ్ఞానం చాలా వరకు అప్పటికే వివిధ జాతుల ప్రజల స్థానిక విజ్ఞాన వ్యవస్థ నుండే ఆవిర్భవించిందై ఉంటుంది. దీన్నే "మేధోసంపత్తి"గా ముద్రవేసుకుంటున్నారు. వలస వాదులంతా పరిశోధనల పేర పేటెంటు ఇచ్చినట్లు ఇప్పుడు కూడా ఆవిష్కరణ చేసుకుంటూ విశ్వవ్యాపిత పేటెంట్ వ్యవస్థ ద్వారా మార్కెట్ వ్యవస్థలనూ ఆర్థిక వ్యవస్థలను స్వాధీనం చేసుకోవడం జరుగుతోంది. నూతన ఆవిష్కరణలకు బహుమతి నిచ్చే ముసుగులో ప్రపంచ ఆర్థిక విజ్ఞాన వ్యవస్థలపై జరుగుతున్న లౌకిక ఆక్రమణ. అలాగే ఈ క్రమంలో వివిధ ఆర్థిక వ్యవస్థలను కూడా లోబర్చుకొనే ప్రయత్నం జరుగుతోంది. పేటెంట్ల వ్యవస్థకు సంబంధించి నేడు చెలరేగుతున్న తీవ్ర ఘర్షణలు, వివాదాలకు ఈ ఆక్రమణ కేంద్ర బిందువు.

## ఆవిష్కరణలకు బహుమతులుగా పేటెంట్లు

'మేధోసంపత్తి'గా పేటెంట్లను గుర్తించటం పునరుజ్జీవన కాలపు ఇటలీలో ఆరంభమైంది. ఇది యూరప్‌లోని ఇతర ప్రాంతాలకు, తరువాత ఇంగ్లాండుకు వ్యాపించింది. తొలిదశలో స్థానికంగా

తెలియని పరికరాలను, ప్రక్రియలను వెలికితెచ్చినందుకు ఈ ప్రతిఫలం లభించేది. నూతనమైన, నికార్సయిన సొంత ఆవిష్కరణలకు ఇది వర్తించేది కాదు

వెనిస్ సెనెట్ తొలిసారిగా రెండు రకాల పేటెంట్ల మధ్య తేడాను గుర్తించింది. సంపూర్ణమైన గుడ్డ హద్దులు కత్తిరించింది ఆవిష్కర్త అనుమతి లేకుండా ఒక పరికరాన్ని వినియోగించుకోరాదని చట్టం చేసింది. అలాగే, "తగిన మొత్తంలో" ఇతరులు ప్రతిఫలం చెల్లించినపుడు, ఆ పరికరంపై వారికి లైసెన్స్ ఇచ్చే బాధ్యతను పేటెంటుదారుపై ఉంచింది. 1474 మార్చి నెలలో వెనిస్ సెనెట్ మొట్టమొదటి సాధారణ పేటెంటు చట్టాన్ని చేసింది. ఈ చట్టం నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు చారిత్రకంగా బాట వేసింది. వెనిస్ పేటెంటు చట్టం ముందుమాటలలో ఇలా పేర్కొన్నారు: "మన మధ్య, మనము ఇప్పటివరకు కనీవినీ ఎరుగని పరికరాలను ఆవిష్కరించగల, కనుగొనగల గొప్ప మేధావులున్నారు .. వారి ఆవిష్కరణలపై వారికే హక్కు కల్పించే నిబంధనలను ఏర్పరచగల్గితే, మరింతమంది వ్యక్తులు నూతన ఆవిష్కరణలకై తమ మేధస్సును వినియోగిస్తారు తద్వారా మన సమష్టి సంపద పెరుగుతుంది." ఇక్కడ కొత్త ఆవిష్కరణలంటే, అంతకు మునుపు వెనిస్ ప్రాంతంలో తయారు చేయబడని "నూతన, క్రొంగొత్త" పరికరాలు అని నిర్వచించబడింది తద్వారా, అటు దిగుమతులు, ఇటు నూతన ఆవిష్కరణలు పేటెంటు చట్టం పరిధిలోకి వచ్చాయి. ఈ రకంగా పేటెంటు చేసిన పరికరాలను, వాటి ఆవిష్కరణలు మినహా మరి ఏ ప్రైవేటు వ్యక్తులు పది ఏండ్ల కాలంపాటు తయారు చేయటానికి వీలులేదు. కాగా, "ఆవిష్కరణలకు ఇచ్చే పేటెంట్లు", "దిగుమతులపై పేటెంట్లు" మధ్య వ్యత్యాసాన్ని ఇంగ్లాండులో 17వ శతాబ్దంలో మాత్రమే ఆమోదించారు. రాజు ఆమోద ముద్ర పొందిన గుత్త హక్కుల దుర్వినియోగం నుంచి ఆర్థిక వ్యవస్థకు స్వేచ్ఛను కల్పించేందుకే ఆవిష్కరణలపై పేటెంట్లను కల్పించారు.

### సాంకేతిక పరిజ్ఞానం మార్పిడి, సమకాలీన సాంకేతిక అభివృద్ధి స్థాయిని అందుకోగల్గటం, దిగుమతుల గుత్తాధిపత్యపు సాధనాలుగా పేటెంట్లు

తదనంతరం, గత ఐదు శతాబ్దాలకాలంలో, ఉనికిలో వున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సాంకేతికంగా అభివృద్ధి చెందిన దేశాల నుంచి ఇతర దేశాలకు బదలాయించేందుకు పేటెంట్లను వినియోగించారు. చారిత్రకంగా చూస్తే, సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి పోటీలో వెనుకబడిన దేశాలు, సాంకేతికంగా అభివృద్ధి చెందిన దేశాల "స్థాయిని అందుకో గలిగేందుకు" పేటెంట్లను వినియోగించుకొన్నాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని నిర్దిష్టకాలపరిమితికి లోబడి "అరువు తెచ్చుకున్నాయి." ఆవిష్కరణను ప్రవేశపెట్టిన వ్యక్తికి ఆవిష్కరణపై గుత్తాధిపత్యం లేదా సర్వసంపూర్ణ హక్కు పేటెంట్ల ద్వారా లభించింది తద్వారా ఆ వ్యక్తికి తగిన స్థాయిలో లాభం, రక్షణ లభించాయి. అయితే, నేటి పరిస్థితులలో పేటెంట్లు సాంకేతిక పరిజ్ఞానపు బదలాయింపును నిరోధించే సాధనాలుగా ఉపయోగపడుతున్నాయి. విజ్ఞానపు బదలాయింపు "దొంగతనంగా" భావించబడుతోంది.

ఉదాహరణకు, తదనంతరం పారిశ్రామిక విప్లవానికి పుట్టిల్లు అయిన ఇంగ్లాండ్-14వ శతాబ్దం నాటికి ఇతర యూరోపిన్ దేశాలతో పోల్చితే సాంకేతికంగా వెనుకబాటుతనంలో ఉంది ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఇంగ్లాండు, సాంకేతికంగా నిపుణులు అయిన చేతిపనివారిని ఇతర

దేశాల నుంచి తమ దేశంలోకి వలస వచ్చేందుకు ప్రోత్సహించింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇలా అరువు తెచ్చుకోవటానికి అవకాశం కల్పించే విధంగా, ఈ విదేశీ వృత్తి పనివారలకు వారి సాంకేతిక పరిజ్ఞానంపై పేటెంట్లు ఇచ్చారు. కాగా, ఈ వృత్తి పనివారు ఇంగ్లాండుకు చెందిన అప్రెంటీసులకు తమ వృత్తుల తాలూకు "రహస్యాలను నేర్పారు " ఉదాహరణకు, 1331లో ఫ్లెమిష్ దేశానికి చెందిన నేతగాడు అయిన జాన్ కేంప్‌కు ఇంగ్లాండు రాజు ఎడ్వర్ట్-2 పేటెంటును ఇచ్చాడు అలాగే, 1336లో యార్క్ ప్రాంతంలో స్థిరపడేందుకుగాను ఇద్దరు బ్రాబేంట్ నేతగాళ్ళను ప్రోత్సహించారు. 1338లో డెల్ఫ్ట్ ప్రాంతానికి చెందిన ముగ్గురు గడియారాల తయారీదారులకు ఇంగ్లాండులో పేటెంటు దస్తావేజులను ఇచ్చారు. అలాగే, వెనీస్ ప్రాంతంలో ముద్రణరంగ నిపుణుడైన జోహన్ వాన్‌స్పేయర్ అనే జర్మన్ వ్యక్తికి పేటెంట్లను జారీ చేశారు.

సమకాలీన పేటెంటు వ్యవస్థలోని పలు అంశాలు ఈ తొలి మూలాల నుంచి ఆవిర్భవించినవే. అయితే నేటి పేటెంటు వ్యవస్థ చేసే పనులు, అందుకు వినిపించే సమర్ధనలు నాటి గౌరవ స్థాయిని మించిపోయాయి. ఆధునిక చట్టాల క్రింద జారీ చేయబడుతున్న పేటెంట్ల కాల వ్యవధి అలాటివాటిలో ఒకటి. నిపుణులైన వృత్తిపనివారు తమ అప్రెంటీసులకు శిక్షణను ఇవ్వాలిగనుక, వారు అనివార్యంగా తమ వృత్తితాలూకు "రహస్యాలను" బయటపెట్టేతీరాలి. ఆధునిక పేటెంటు వ్యవస్థలలో ఇది 'వెల్లడి" నిబంధన రూపం తీసుకుంది. వృత్తులతో నిమిత్తం లేకుండా, ఏ పనిలోనైనా నైపుణ్యం సంపాదించేందుకు సాధారణంగా ఏడు సంవత్సరాల సమయం పెట్టేది. కాబట్టి, ఏడు లేదా పద్నాల్గు సంవత్సరముల వరకు రక్షణ పేటెంట్, తద్వారా ఒకటి లేదా రెండు తరాల అప్రెంటీసులు సాంకేతిక శిక్షణ పొందటం సాధ్యమయ్యేది. శిక్షణా కాలంలో వృత్తిపై గుత్తాధిపత్యాన్ని ఇవ్వటం ద్వారా పేటెంట్లు, వృత్తి నిపుణులకు వారి అప్రెంటీసుల నుంచి పోటీ రాకుండా రక్షణనిచ్చేవి. పేటెంట్ పరిరక్షణాకాలం ముగిసిపోయిన తర్వాత, శిక్షణ పొందిన అప్రెంటీసులు స్వయంగా తాము నేర్చుకున్న వృత్తితాలూకు "రహస్యాలను" ఆచరణలో పెట్టవచ్చు. ఏడు లేదా పద్నాల్గు సంవత్సరాలపాటు పేటెంట్లకు రక్షణ కల్పించే విధానం, పేటెంట్లను ఇతరులకు శిక్షణన్ను ఇచ్చేందుకు ప్రోత్సాహకాలుగా ఉపయోగించే విధానంతో ముడిపెట్టబడింది.

"పరిపూర్ణ కొత్తదనం" అనే మాటను ప్రవేశపెట్టే దేశం పరిధుల వరకే వర్తింపచేసేవారు తప్ప ప్రపంచ వ్యాపితంగా కొత్తదనికాదు. పేటెంట్లను జారీ చేయటం మరొక అంశం. ఉదాహరణకు, పారిశ్రామిక విప్లవకాలంలో పలు నూతన ఆవిష్కరణలు యూరప్‌లోనే జరిగాయి. అయితే, ఈ నూతన ప్రక్రియలు లేదా ఆవిష్కరణలు ఇంగ్లాండులో కొత్తవిగనుక, వాటికి ఆ దేశంలో పేటెంటు ఇవ్వటం జరిగింది. పడవను ఎప్పుడు తయారు చేయని జేమ్స్ రమ్‌సేకు "ఆవిష్కర్త"గా ఇంగ్లాండులో పేటెంటును ఇచ్చారు. తద్వారా వివిధ నదులలో ప్రయాణాలపై అతనికి గుత్తాధిపత్యం లభించింది. అలాగే 1787వ సంవత్సరం మార్చి 28వ తేదీన అమెరికాలోని పెన్సిల్‌వేనియా నగరంలో జాన్ ఫిడ్జ్‌కి పేటెంటును జారీ చేశారు. దీని ప్రకారంగా అతనికి అన్ని రకాల లేదా తరహాల పడవలు, జలమార్గ ప్రయాణ సాధనాలు నిర్మించే, తయారు చేసే, వినియోగించే, నియంత్రించే హక్కులు లభించాయి. ఈ హక్కులు అన్ని రకాలకయ్యలు, నదులు, జలప్రవాహాలు మొదలైనవాటిపై అతనికి హక్కునిచ్చాయి. (పెన్సిల్‌వేనియా రాష్ట్రంలోని) ఈ హక్కులు అతనికి 14 సంవత్సరాల కాలానికిగాను

సంక్రమించాయి. (ఫ్రైడ్ వార్‌ష్ స్కీ పేటెంటు యుద్ధాలు. 1994.) కాబట్టి ఆవిరితో నడిచే యంత్రాన్ని జేమ్స్ వాట్ 1772వ సం లో స్కాట్‌లాండ్‌లో కనుగొన్నప్పటికి, అన్ని రకాల ఆవిరి పడవలపై అమెరికాలో వేరొకరికి పేటెంట్లు జారీ అయ్యాయి

ఈ రకంగా సాంకేతిక పరిజ్ఞానం బదిలీకి, వాణిజ్యీకరణకు పేటెంటు చట్టాలు రూపొందించబడ్డాయి ఈ రకంగా పేటెంటు చట్టాలను చేసిన తొలి ఆధునిక రాజ్యం – అమెరికా. ఈ చట్టాలు తొలుత రాష్ట్రాల (లేదా అప్పుడు పిలవబడ్డ రీతిలో, వలసల) స్థాయిలో, స్వాతంత్ర్యం అనంతరం మొత్తం అమెరికా దేశ స్థాయిలో అమలయ్యాయి. ఇంగ్లాండులో లాగానే, అమెరికాలో కూడా సాంకేతిక పరిజ్ఞానం బదిలీని ప్రోత్సహించేందుకు పేటెంట్లు జారీ చేయబడ్డాయి. అవి సాంకేతిక పరిజ్ఞానపు బదిలీకి ఆటంకాలు కాలేదు యూరోపియన్ చట్టాల లాగానే, తొలిదశలో అమెరికా పేటెంటు చట్టాలు, అంతకుముందు అయితే విదేశాలలో కనుగొనబడినా అమెరికాలో లేని నూతన పద్ధతులను ప్రవేశపెట్టినందుకు జారీ అయ్యాయి. అంటే, ఈ చట్టాలకు నిజమైన ఆవిష్కరణలతో నిమిత్తం లేదు. ఆయా పద్ధతులు గనుక, అంతకు మునుపు అమెరికాలో లేనివైతే, వాటిని 'కొత్తగా కనుగొన్నవాటిగా" భావించారు ప్రస్తుతం అమెరికాలోని రాష్ట్రాలు, గుత్తాధిపత్యాన్ని కాపాడుకునేందుకు చట్టాలను చేయనారంభించాయి ఈ చట్టాలు, తరచుగా దిగుమతి చేసుకున్న సాంకేతిక పరిజ్ఞానం, అలాగే ఉత్పాదక విధానాలపై పేటెంట్లు ఇస్తున్నాయి. వలస దేశాలలో మొట్టమొదటగా జారీ అయిన పేటెంట్లు ఉప్పుకు సంబంధించినవి. ఉదాహరణకు, 1641వ సంవత్సరంలో శామ్యూల్ విన్‌స్లోకు ఉప్పుతయారీపై సర్వసంపూర్ణ హక్కు జారీ చేయబడింది.

అంటే, నూతన ఆవిష్కరణలకు ప్రతిఫలాన్ని ఇచ్చేందుకు కాక, ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు పేటెంట్లు జారీ అయ్యాయి. కాబట్టి, తన స్వంత పారిశ్రామిక పాటవ అభివృద్ధికి అమెరికాదేశం అరువు తెచ్చుకున్న విజ్ఞానంపై ఆధారపడింది. కాగా, యేరు దాటగానే తెప్పతగలేసినట్లుగా, వంద సంవత్సరాల తర్వాత ఇప్పుడు తాను లబ్ధి పొందిన తరహా విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞాన బదిలీని నిరోధించేందుకు ఆదేశం ప్రయత్నిస్తోంది

అమెరికా పేటెంట్ల చట్టాన్ని, తద్వారా మొత్తం ప్రపంచపు చట్టాలను రూపొందించటంలో రెండు అంశాలది కీలక పాత్ర వీటిలో మొదటిది "కనుగొనటం" గురించిన కల్పన. ఇది అమెరికాను కొలంబస్ "కనుగొన్నాడు" అని ఆమోదించిన పేటెంటు దస్తావేజుల తొలి నిర్వచనం తరహాలో ఉంటుంది. ఇక రెండవది, "ఒక విషయం గురించి అజ్ఞానాన్ని ఆవిష్కరణగా భావించటం" తాలూకు భ్రమ. ఉదాహరణకు యూరప్‌లో ఒక వ్యక్తి ఒక రకమైన యంత్రాన్ని కనుగొన్నాడనుకొందాం. తర్వాత, యూరప్‌లో కనుగొన్న యంత్రం గురించి నిజంగా తెలియకుండానే అమెరికాలో మరొక వ్యక్తి ఆ యంత్రాన్ని కనుగొన్నాడనుకొందాం ఈ పరిస్థితిలో అతనికి అమెరికా పేటెంట్ల చట్టం ప్రకారంగా తన నూతన ఆవిష్కరణపై పేటెంటు లభిస్తుంది అమెరికా చట్టాల ప్రకారం, యూరప్‌లో జరిగిన ఆవిష్కరణను ముందుగా జరిగినదానిగా పరిగణించరు. అమెరికాలోని కనెక్టికట్ రాష్ట్రంలోని చట్టంలో ఈ విషయాన్ని నిర్ద్వంద్వంగా ప్రకటించారు ఆ చట్టం ప్రకారంగా, ఆవిష్కరణ అంటే "తమ దేశంలో అప్పటికి వినియోగంలో లేని విదేశీ సరుకులు, విడిభాగాలను తయారు చేయటం లేదా సరఫరా చేయటం "

వాస్తవానికి, అమెరికా జాతీయ చట్టాలు, ఆ దేశంలోని వివిధ రాష్ట్రాల చట్టాల తాలూకు అతుకుల బొంతగా ఉన్నాయి. అంటే, ఒక ఆవిష్కర్త గనుక అమెరికాలోని ఒక రాష్ట్రంలో పేటెంటు పొందితే, దానిపై ఆ వ్యక్తికి ఆ దేశంలోని ఇతర రాష్ట్రాలలో రక్షణ లభించదు. 1787వ సంవత్సరంలో జాతీయ చట్టాలను వ్యవస్థీకరించారు. 1952వ సంవత్సరపు అమెరికా పేటెంట్ల చట్టంలో "ఒక విషయం గురించి సమాచారం లేకపోవటాన్ని ఆవిష్కరణగా భావించటం" అనే సూత్రాన్ని పొందుపరచారు. ఈ పేటెంట్ల చట్టంలోని 102 సెక్షన్ ప్రకారంగా అమెరికాలో తొట్టతొలుత ఉపయోగించబడటాన్ని ప్రధాన అంశంగా నిర్వచించారు. విదేశాలలో అదే వస్తువు అంతకుముందే వుపయోగించబడి వుండటం నిమిత్తం లేని విషయం ఈ విధంగా అమెరికా పేటెంట్ల చట్టం, అమెరికాను స్వతంత్ర పారిశ్రామిక శక్తిగా రూపొందించేందుకు ఉద్దేశించినది విదేశాలలో ముందే కనుగొనబడం లేదా ముందే వుపయోగించబడాలను, పేటెంట్లను ఇవ్వడం విషయంలో, అమెరికా ఉద్దేశ్యపూర్వకంగానే ప్రక్కన పెట్టింది. దీని ఫలితంగా విదేశాలలో అంతకుముందే ఆచరణలో వున్న విజ్ఞానంపై అమెరికా పేటెంట్‌దారులకు అదుపు లభిస్తుంది. తద్వారా విదేశీ విజ్ఞానపు పునాదులను తిరస్కరించడం లేదా గుర్తించకపోవడం జరుగుతోంది. ఇది జీవ సంబంధిత దోపిడీకి పునాది అంటే "మేధోసంపత్తి" దోపిడీని "నివారించేందుకు" ఉద్దేశించిన చట్టం, వాస్తవానికి ఆ దోపిడీకి చట్టబద్ధతను కల్పిస్తోంది.

## పేటెంట్లు-ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై అదుపు

నేడు జాతుల సంపదగా భూమి, బంగారాలకు బదులు విజ్ఞానం ఆ స్థానాన్ని సంపాదించుకుంది. ఫ్యాక్టరీలు, ఖనిజాలు, నివేశన భూములు, బంగారాల రూపంలోని ఆస్తులను మేధోసంబంధిత ఉత్పత్తులు లేదా "మేధోసంపద" వెనుకను నెట్టివేశాయి. విజ్ఞానాన్ని "ఆస్తిగా" పేర్కొనే పేటెంట్లు నేటి వలస వాదానికి పనిముట్లు. గత కాలంలో భూభాగాలకై వలసవాద యుద్ధాలు జరిగాయి నేడు మేధో సంపదకై జరిగే యుద్ధాలపై వలసవాదం ఆధారపడుతోంది. పేటెంట్లు లేదా "మేధో సంపద", ఆర్థిక వ్యవస్థల పునర్నిర్మాణానికి కేంద్ర బిందువుగా ఆవిర్భవించడంలో రెండు అంశాలు కీలక పాత్ర వహించాయి. పేటెంట్లు, పేటెంట్ చట్టాల అర్థం, ప్రభావాలు, పరిధిలో జరిగిన ఈ మార్పులు, వివిధ దేశాలు, ఆయా దేశాల ప్రభుత్వాలు - ప్రజలు, కార్పొరేట్ సంస్థ - పౌరుల మధ్య ఘర్షణలకు కారణం అయ్యాయి.

మొదటగా, ఆర్థికాభివృద్ధి, పెట్టుబడి సమీకరణ తప్పనిసరికావడంతో పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలు ప్రపంచంలో మార్కెట్ల వేటలో పడ్డాయి. అందుచేత, ఆ దేశాలు గాట్ ఉరుగ్వే రౌండు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వంటి ద్వారా (ప్రస్తుతం డబ్ల్యుటిఒ నిబంధనలలో పొందుపరచిన) ప్రపంచంలోని వివిధ దేశాల మార్కెట్‌లలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించసాగాయి. ఇక రెండవది, ఇతర దేశాలు ముందంజ వేయడం వలన, అమెరికా వంటి పారిశ్రామిక దేశాల పారిశ్రామిక ఉత్పత్తి కుంటుపడసాగింది. 1980లలో అమెరికా వాణిజ్యలోటు 15000 కోట్ల డాలర్లుగా వుంది. అమెరికా ఆధిపత్యానికి జపాన్ నుంచి, ఇతర నూతనంగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోన్న దేశాల నుంచి సవాళ్ళు ఎదురయ్యాయి ఈ పరిస్థితి నుంచి గట్టెక్కి, తన ఆధిపత్యాన్ని కాపాడుకునేందుకు

అమెరికా మేధో సంపత్తిని, పేటెంట్ల వ్యవస్థను ప్రధాన సాధనాలుగా చేసుకోచూస్తోంది. తద్వారా తన దేశ ఆర్థిక అభివృద్ధికి, ప్రపంచ వాణిజ్యంపై అదుపుకు, అంతర్జాతీయ మార్కెట్లను కొల్లగొట్టేందుకు ప్రయత్నాలు ఆరంభించింది

అమెరికా సంపదలో పేటెంట్లది ప్రధాన పాత్ర అయ్యింది. దాని ఎగుమతులలో పేటెంట్ల వాటా పెరిగింది. 1947వ సంవత్సరంలో, అమెరికా దేశపు ఎగుమతులలో పేటెంట్ల వాటా కేవలం 10% మాత్రమే. 1986లో ఈ వాటా 37%నికి పెరిగింది. 1994 నాటికి ఇది 50%నికి పైగా వుంది.

అయితే, ప్రపంచంలోని అన్ని దేశాలు మేధోసంపత్తికి గుర్తింపును ఇచ్చి, తమ తమ దేశాలలోని చట్టాలను అమెరికా చట్టాలకు అనుగుణంగా రూపొందిస్తే మాత్రమే విజ్ఞానాన్ని వ్యాపార సరుకుగా మార్చేందుకు వీలు అవుతుంది. ఇతర దేశాలలోని చట్టాలు, అమెరికా చట్టాలకు అనుగుణంగా మారితే అమెరికాకు ఏ మేరకు మార్కెట్లు పెరుగుతాయో అంచనా వేయవలసిందిగా, 1987వ సంవత్సరంలో అమెరికాకు చెందిన సాఫ్ట్‌వేర్, మందుల తయారీ కంపెనీల దళారులు రీగన్ ప్రభుత్వపు పరిపాలనా యంత్రాంగాన్ని కోరారు

ఆయా ఇతర దేశాలలో, అమెరికా పేటెంట్ చట్టాలకు భిన్నమైన చట్టాలు వుండడం వలన, తగిన మేరకు మార్కెట్లు లభించక, అమెరికా ఆర్థిక వ్యవస్థ నష్టపోతోంది అనేది వారి అభిప్రాయం. ఈ నష్టం సాలీనా 43-61 బిలియన్ల డాలర్లుగా వుంటుందని, అమెరికా అంతర్జాతీయ వ్యాపార సంఘం అంచనా వేసింది. ప్రపంచంలోని ప్రతీ దేశమూ, అమెరికా తరహా పేటెంట్ చట్టాలకు తల ఒగ్గేలా వత్తిడి తెగలిగితే, అమెరికా వ్యాపారలోటును బాగా తగ్గించుకోవచ్చు.

ఈ రకంగా మేధోసంపత్తిని గాట్ చర్చల ముందుకు తెచ్చారు. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) తాలూకు వ్యాపార సంబంధిత మేధో సంపత్తి వ్యవస్థ (టిఆర్ఐపిఎస్), ప్రపంచ వ్యాపితంగా పేటెంట్ చట్టాలకు చట్రం అయ్యింది పేటెంట్లు, మేధోసంపత్తికి సంబంధించిన అమెరికా చట్టాలను, అంతర్జాతీయ స్థాయిలో అమలు పర్చడం, పాశ్చాత్య దేశాల ప్రధాన అజెండా అయ్యింది. సాంకేతికపరంగా జరుగుతోన్న మార్పులతో కూడా ఈ అజెండా ముడిపెట్టబడింది. యంత్రాలు, రసాయనాల స్థానంలో, సాంకేతిక, ఆర్థిక పురోగతికి చోదక శక్తులైన నూతన ఆవిష్కరణలుగా సమాచార సాంకేతిక పరిజ్ఞానం, జీవ సాంకేతిక పరిజ్ఞానం ముందుకు వచ్చాయి.

యంత్రాలు, రసాయనాలపై పేటెంట్లు, వ్యాపార సంస్థల హక్కులకు, సమాజం హక్కులకు మధ్య ఘర్షణకు కారణం అయ్యాయి. కాగా, జీవ సాంకేతిక రంగ పునాదిపై అమలు జరుగుతోన్న జీవరీతులపై పేటెంట్లు నూతన తరహా ఘర్షణలకు తావునిస్తున్నాయి. ఈ ఘర్షణలు నైతిక అంశాలు, పర్యావరణ, ఆర్థిక ప్రభావాలకు సంబంధించినవి. జీవవనరులు, జీవుల నుంచి తీసుకొన్న ఉత్పత్తులు, ప్రక్రియలను పేటెంటు చేయడం- ఎవరు దోపిడీదారు, అలాగే ఎవరు నిజమైన ఆవిష్కర్త అనే ప్రశ్నలను రేకెత్తిస్తాయి. స్థానిక ప్రజల విజ్ఞానం, సాంప్రదాయక ఆవిష్కరణలు పేటెంట్ల బారిన పడడం దీనికి ప్రధాన కారణం. మించి, నేడు భూగర్భ ఇంధన వనరుల శకం ముగిసిపోతోంది. వీటి స్థానంలో జీవపదార్థంపై పేటెంట్లు మూడవ ప్రపంచ దేశాల మార్కెట్లనూ, ముడిసరుకులను అదుపు చేసే సాధనంగా మారుతున్నాయి

# 2. పేటెంట్ల పుక్కిటి పురాణం

## సృజనాత్మకతను ప్రోత్సహించటం ఒక భ్రమ

పేటెంట్లు సృజనాత్మకతకు, నూతన అవిష్కరణకు ప్రోత్సాహకాలు కాగలవనేది కేవలం భ్రమమాత్రమే. విజ్ఞానాన్ని, ఆవిష్కరణలను, కాలమాన పరిస్థితులనుంచి, అలాగే సామాజిక జీవితంనుంచి, గతం తాలూకు పునాదుల నుంచి వేరుచేసి చూడటం వలననే ఇటువంటి భ్రమలు ఏర్పడుతున్నాయి. ఈ భ్రమల కారణంగా విజ్ఞానాన్ని పెట్టుబడిగా, సరుకుగా, అలాగే మార్కెట్‌ను ఆదుపు చేసేందుకు ఏకైక మార్గంగా చూస్తున్నారు. పెట్టుబడిగా, పేటెంట్లు, దాని యజమానికి పోటీ మార్కెట్లో పైచేయి నిస్తాయి సరుకురూపంలో, పేటెంటు చేయబడిన సమాచారం పలు తలకు మించిన షరతులతో అమ్మకానికి వస్తుంది. మార్కెట్‌ను అదుపు చేసే విధంగా పేటెంట్లు, మార్కెట్‌లో గుత్తాధిపత్యానికి దారితీస్తున్నాయి. ఇన్ని రకాలుగా పేటెంట్లు ఆధిపత్యాన్ని, పోటీలేని అదుపును కొనితెస్తున్నాయి.

దాని సహజస్వభావం దృష్ట్యా విజ్ఞానం సమిష్టి, సమీకృత స్వభావం కలది. అది ఒక సమాజంలో మారకం ప్రాతిపదిక మీద ఆధారపడినది. అంతే కాకుండా విజ్ఞానం మానవుడి సృజనాత్మక (వ్యక్తిగత, సమిష్టి) వ్యక్తీకరణ. సృజనాత్మకత భిన్నరూపాలలో వ్యక్తీకృతమౌతుంది. శాస్త్రవిజ్ఞానం బహుముఖ కృషిఫలితం. అంటే, శాస్త్రవిజ్ఞానం అనేది "విజ్ఞానాన్ని సంపాదించటం తాలూకు భిన్నమార్గాల" వ్యక్తీకరణ. "శాస్త్రవిజ్ఞానం" అనేది కేవలం ఆధునిక పాశ్చాత్య శాస్త్రవిజ్ఞానం మాత్రమే కాదు. అది చరిత్రలోని భిన్న స్వరాలకు సంబంధించిన భిన్న సంస్కృతుల విజ్ఞాన వ్యవస్థల కలయిక ఫలితం. అయితే పేటెంట్లు మాత్రం ప్రైవేటు మేధోసంపత్తిగా గుర్తించబడుతున్నాయి. అంటే, పేటెంట్లు నూతన ఆవిష్కరణలను కేవలం వ్యక్తిగత కృషి గానే గుర్తిస్తున్నాయి. దీనర్థం, సమిష్టి విజ్ఞానంపై వ్యక్తిగత పేటెంట్లను ఇవ్వటం అంతర్గతంగా వైరుధ్యభరితం.

శాస్త్రవేత్తలు గాలినుంచి ఊడిపడిన శాస్త్రీయపద్ధతి ప్రకారం కాక; ప్రత్యక్ష, తులనాత్మక పరిశీలన ప్రాతిపదికగానే తమ సిద్ధాంతాలను ప్రతిపాదించారని శాస్త్ర సంబంధిత చరిత్ర, తత్వశాస్త్రం, సామాజిక శాస్త్రాల సమకాలీన కృషి రుజువు చేస్తోంది. ఆధునిక పాశ్చాత్య శాస్త్ర విజ్ఞానం చేస్తున్న ప్రతిపాదనలను పాశ్చాత్యేయేతర స్థానిక శాస్త్ర విజ్ఞానాల నుంచి వేరుచేసి చూడటానికి ఎటువంటి కొలబద్దలను ఆధునిక శాస్త్ర విజ్ఞానం మనకు ఇవ్వలేదు మేధోసంపత్తి పరిసరాలతో సంబంధం లేకుండానే విజ్ఞానాన్ని సృష్టించగలదనే కార్టేజియన్ కృత్రిమ భావనకు వందేళ్ల క్రితమే కాలం చెల్లింది. అయితే నేటి పేటెంట్ల వ్యవస్థ ఈ బూజు పట్టిన భావం పైనే ఆధారపడి పనిచేస్తోంది.

సృజనాత్మకత తాలూకు భిన్నవారసత్వాలను గుర్తించటం, భిన్న విజ్ఞాన వ్యవస్థలను సజీవంగా వుంచడానికి తప్పనిసరి పర్యావరణానికి సంబంధించిన విజ్ఞానం అవగాహనల తాలూకు అతిచిన్న విజ్ఞాన కణిక సైతం మానవజాతి భవిష్యత్తుకు కీలకం కాగల నేటి అవధులు లేని పర్యావరణ విధ్వంసకాలంలో కృషి మరింత ముఖ్యం. మూల విజ్ఞాన వ్యవస్థలు స్థూలంగా పర్యావరణాన్ని గౌరవిస్తూ వచ్చాయి. కాగా నేటి ప్రధాన స్రవంతి శాస్త్ర విజ్ఞానం ప్రకృతిలోని అంతర్‌సంబంధాల తాలూకు సంక్లిష్టతను నిర్లక్ష్యం చేస్తూ వచ్చింది. ఆధునిక శాస్త్ర విజ్ఞానం తాలూకు ఈ బలహీనత జీవశాస్త్ర రంగంలో కొట్టవచ్చినట్లు కనబడుతుంది. జీవశాస్త్ర రంగంలో సృజనాత్మకత ఈ క్రింది మూడుస్థాయిలను కలిగి వుండాలి :

1. జీవ జాలంలో నిక్షిప్తంగా వున్న సృజనాత్మకత. అంటే అవి పరిస్థితులకనుగుణంగా ఎదగడానికి, పునరుత్పత్తికి, అలాగే తమను తాము నిరంతరంగా పునరుజ్జీవింపచేసుకోవటానికి ఈ సృజనాత్మకత తప్పనిసరి.

2. స్థానిక మానవసమూహాల తాలూకు విజ్ఞాన వ్యవస్థలలోని సృజనాత్మకత–తద్వారా ఈ మానవసమూహాలు మన భూగోళం పైన ఉన్న వైవిధ్యభరితమైన జీవజాలాన్ని ఒక పక్క వినియోగించుకుంటూనే, మరో పక్క కాపాడుకోగలిగాయి.

3. విశ్వవిద్యాలయాలు లేదా కార్పొరేట్ సంస్థల పరిశోధనాలయంలోని ఆధునిక శాస్త్రవేత్తల సృజనాత్మకత – వీరు జీవజాలాన్ని లాభాల సృష్టికి వినియోగించుకొనే మార్గాలను అన్వేషిస్తున్నారు.

ఈ విభిన్న సృజనాత్మకతలకు గుర్తింపునివ్వటం వైవిధ్యభరితమైన జీవనరీతులను, అలాగే మేథో వైవిధ్యాన్ని – విభిన్న సంస్కృతులలో, అలాగే ప్రైవేటు ప్రభుత్వ పరిశోధన రంగాలలో కాపాడుకొనేందుకు తప్పనిసరి.

అమెరికాలో పేటెంట్లు పొందుతున్న పలు అంశాలు, మూడో ప్రపంచదేశాల జీవవైవిధ్యం, అలాగే మూడో ప్రపంచదేశాల విజ్ఞానంపై ఆధారపడినవి. కానీ మేథోసంపత్తి హక్కులకు రక్షణ లేకుంటే సృజనాత్మకత దెబ్బతింటుందనే తప్పుడువాదన ముందుకు తేబడుతోంది. మానవ సృజనాత్మకతను పాశ్చాత్య దేశాలు విస్తారమైన జాతీయవనరుగా భావిస్తున్నాయి. అంటే, భూమిలోని ఖనిజాల మాదిరిగా దానిని సరిగా తవ్వి తీయకుంటే ఆ వనరు నిక్షిప్తంగానే ఉండిపోతుందనేది ఆ దేశాల అభిప్రాయం. మేధోసంపత్తి పరిరక్షణ అనేది ఈ వనరును వెలికి తెస్తుందనేది వారి వాదన.

మేధోసంపత్తి హక్కుల పరిరక్షణ వుంటేనే సృజనాత్మకత పెల్లుబుకుతుందనే వాదన ప్రకృతిలోని సృజనాత్మకతకు, అలాగే పారిశ్రామిక, పారిశ్రామికేతర సమాజాలలో లాభాపేక్ష లేకుండా జనించే సృజనాత్మకతను కూడా ఇది మరుగుపరుస్తోంది. అంటే, మేథోసంపత్తి పరిరక్షణ సంస్థ సృజనాత్మకత పునాదులను వక్రీకరిస్తోంది. తద్వారా అసమానతలు, పేదరికపు చరిత్రను కూడా అది మసిపూసి మారేడుకాయ చేస్తోంది.

ధనిక పారిశ్రామిక దేశాలు, పేద మూడవ ప్రపంచదేశాల మధ్య ఆర్థిక అసమానతలకు కారణం ఐదువందల సంవత్సరాల చరిత్రగల వలసవాదం. అలాగే, మూడవ ప్రపంచ దేశాలనుంచి సంపదను కొల్లగొట్టేందుకు నిర్మించిన వ్యవస్థల కొనసాగింపు కూడా ఈ అసమానతలకు కారణం.

ఐక్యరాజ్యసమితి అభివృద్ధి - కార్యక్రమాల సంస్థ అంచనాల ప్రకారంగా భూగోళపు ఉత్తరప్రాంత దేశాలనుంచి దక్షిణ ప్రాంత దేశాలకు సహాయం రూపంలో సాలీన 5 వేల కోట్ల డాలర్లు వస్తున్నాయి. కాగా, అప్పులపై వడ్డీల చెల్లింపు, అసమాన వ్యాపార ఒప్పందాల వలన గిట్టుబాటు ధర లేకపోవటం వలన దక్షిణాదిదేశాలు సాలీనా 50 వేల కోట్ల డాలర్లను కోల్పోతున్నాయి అంటే మూడో ప్రపంచ దేశాల పేదరికానికి కారణం అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ తాలూకు వ్యవస్థాగత అసమానతలు. కాగా, మేధోసంపత్తి హక్కుల పరిరక్షణ లేకపోవటం వలన కొరవడుతున్న సృజనాత్మకతే పేదరికానికి కారణమని ధనిక దేశాలు వాదిస్తున్నాయి. తద్వారా పేదదేశాల నుంచి ధనిక దేశాలకు, దక్షిణాదిదేశాలనుంచి ఉత్తరాది దేశాలకు మరింతగా సంపదను దోచిపెట్టే వ్యవస్థలను అవి ప్రోత్సహిస్తున్నాయి.

ఉదాహరణకు "మేధోసంపత్తి, ఆర్థిక అభివృద్ధి" అనే తన పుస్తకంలో రాబర్ట్‌షేక్‌వుడ్ రెండు కథలను చెప్పాడు. వీటిలో ఒకటి నిజంగా జరిగింది. రెండవది ఊహాజనితమైనది. మేధోసంపత్తిపై హక్కులు లేని దేశాలలోని సాధారణ ప్రజల ఆలోచనల తీరును, అటు వంటి హక్కులు వున్న దేశాలలోని ప్రజల ఆలోచనతీరుతో, ఈ కథల ద్వారా పోల్చి చూపే ప్రయత్నం జరిగింది.

అమెరికాలోని ఒక పంపుల తయారీ సంస్థకు సేల్స్‌మెన్‌గా పనిచేసే ఒక వ్యక్తి న్యూయార్క్ నగరంలోని రాబర్ట్‌షేర్‌ఉడ్ ఇంటికి సమీపంలో ఉండేవాడు. కస్టమర్ల వద్దకు తరచూ వెళుతూవుండే క్రమంలో ఆ సేల్స్‌మన్ ఒక తరహా ప్రెషర్ వాల్వు పంపులకు బాగా పనికి వస్తుందని గుర్తించాడు అతని భార్య ఈ విషయంలో ఆసక్తి చూపకున్నా అతడు పట్టువిడువకుండా ఈ కొత్తతరహా వాల్వును డిజైన్ చేసే పనిలో రాత్రిళ్లూ, వారంతాలు అవిశ్రాంతంగా పనిచేశాడు. తుదకు, అటువంటి వాల్వును తయారు చేసి తన డిజైన్‌కు పేటెంటును సంపాదించాడు. వాల్వును ఉత్పత్తి చేసే కంపనీని స్థాపించేందుకు తన ఇంటిని తాకట్టు పెట్టాడు. ఇక తదనంతరం బ్యాంకు లోనును పొందాడు. ఇదంతా అతని పేటెంటు తాలూకు బలం వల్లనే జరిగింది. ఎలాగైతేనేం డజను మంది కార్మికులతో ఒక వాల్వుల తయారీ పరిశ్రమను స్థాపించాడు. దీని ప్రభావం ఇంతింతై వటుడింతై అన్నట్లు నూతన వాల్వుల తయారీపై పడింది. మొత్తం ఇరవై సంవత్సరాల తర్వాత ఇతర కొత్తతరహా వాల్వులు పైన పేర్కొన్న సేల్స్‌మెన్ తయారు చేసిన వాల్వును అధిగమించగలిగాయి. ఆ సేల్స్‌మెన్ మేధోసంపత్తి గురించి ఎక్కువ ఆలోచించలేదు. అతనికి తెలిసిందల్లా తన ఆవిష్కరణపై పేటెంటును సంపాదించటం మాత్రమే. అలాగే, ఆ పేటెంటు ఆధారంగా వ్యాపారాన్ని ఆరంభించుకోవటమే.

పెరూ దేశంలోని లిమా ప్రాంతంలో కార్లోస్ (అభివృద్ధి చెందుతున్న దేశాలలోని వ్యక్తులకు మచ్చుతునక) అనే వ్యక్తి కార్లు ట్రక్కుల క్రింద మఫ్లర్లను అమర్చి వెల్డింగ్ చేసే పని చేస్తుండేవాడు. దానిపై అతనికి వచ్చే నామమాత్రపు ఆదాయంతో, జీవితాన్ని వెళ్లబుచ్చాడు. ఈక్రమంలో మఫ్లర్లను అమర్చే పనిని సరళీకరించేందుకుగానూ ఒక తరహా కొక్కెం గురించి అతనికి ఆలోచన వచ్చింది. ఈ విషయంలో అతని భార్య నిర్లిప్తంగా ఉండిపోయింది. మరి ఇక అప్పుడు ఈ రకం కొక్కాన్ని తయారు చేసేందుకు అతడు రాత్రింబవళ్లు శ్రమించాలా? వేరొక వ్యక్తి సహాయం అవసరం దీనికై అతను తన మిత్రుడైన ఒక లోహకార్మికుని సహాయం తీసుకోగలడా? ఈ కొక్కాన్ని తయారు చేసేందుకు అవసరమైన

లోహానికి, పరికరాలకు అతనికి డబ్బు అవసరం. దీనికై అతడు తన కాయకష్టంతో కుండలో దాచిన డబ్బు వాడగలడా? లేదా తన చెల్లెలి భర్తనుంచి డబ్బు అరువు తెచ్చుకొనేందుకు బస్సులో ఎక్కి వెళ్లగలడా? ఈ ప్రశ్నలన్నీ ప్రతికూలంగానే జవాబు వచ్చేవిధంగా నియంత్రించబడ్డాయి దీనికి కారణం బలహీనమైన మేధోసంపత్తి పరిరక్షణ అనే విధంగా రచయిత ముందుకు తెచ్చాడు. కార్లోస్ ఆలోచనను ఇతరులు కాపీ కొట్టే అవకాశం ఉందని పై వాదనలో కనపడుతుంది. అంటే కార్లోస్ నూతన ఆలోచనకు రక్షణ కరువయింది. కాబట్టి, ఈ కథ ప్రకారం తన ఆలోచనకు రక్షణ లేకపోవటం వలన, ప్రతి నిర్ణయాత్మక దశలోను, కార్లోస్ తన ఆలోచనను పక్కనబెట్టిందే ఎక్కువ.

కార్లోస్ తరహా ఆలోచనలను గనక మొత్తం దేశంలోని నూతన ఆవిష్కరణలను పక్కన పెడుతూ పోతే జరిగే నష్టం వినాశకరం. కాబట్టి తగిన రక్షణలను కల్పించబడితే, నూతన ఆవిష్కర్తలలో ఆత్మవిశ్వాసం పెరుగుతంది. అప్పుడు, మేధోహక్కుల రక్షణ వ్యవస్థకు కేంద్రబిందువుగా వున్న ఆవిష్కరణల సృజనాత్మక మేధోవిధానం ప్రజానీకంలో వ్యాపిస్తుంది.

ప్రజలు లాభాపేక్షతోనే సృజనాత్మకంగా వ్యవహరించగలరని, అటువంటి లాభాలకు మేధోసంపత్తి హక్కుల వ్యవస్థ రక్షణను ఇవ్వగలదనేది పై అపభ్రంశపు వాదన తాలూకు సిద్ధాంతం. ఈ వాదన విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ పరిశోధన సంస్థలలో, ఇటువంటి లాభాపేక్ష లేకుండానే పనిచేస్తున్న పెక్కుమంది శాస్త్రవేత్తల సృజనాత్మకతల తాలూకు ప్రేరణలను విస్మరిస్తోంది. అలాగే, ఈ వాదన సాంప్రదాయక సమాజాలలోని సృజనాత్మకతను కూడా గుడ్డిగా తిరస్కరిస్తూంది. స్వేచ్ఛగా నూతన ఆలోచనలను మార్పిడి చేసుకోగల్గటమే సృజనాత్మకతకు ప్రాతిపదికగా వున్న (విరుద్ధంగా కాక) ఆధునిక శాస్త్రవేత్తల బృందాలను కూడా పై విదన నిర్లక్ష్యం చేస్తోంది. వాస్తవానికి ఎగుమతుల గుత్తాధిపత్యాన్ని ఏర్పరుచుకునేందుకు కల్పించబడ్డ ఆదిలోని పేటెంటు వ్యవస్థలతో నేటి ప్రపంచ వ్యాపిత పేటెంటు వ్యవస్థలు దగ్గరసంబంధాన్ని కల్గి వున్నాయి. కాగా, పేటెంటు వ్యవస్థ అనేది 'సృజనాత్మకతకు బహుమతి" అనే వాదన దిగుమతుల గుత్తాధిపత్యానికి మేలిముసుగు మాత్రమే.

### సాంకేతిక పరిజ్ఞానం మార్పిడి, నూతన ఆవిష్కరణలు, పరిశోధన - అభివృద్ధుల తాలూకు పుక్కిటిపురాణం

అభివృద్ధి చెందుతున్న దేశాలలో పెట్టుబడులను, పరిశోధనను, సాంకేతిక పరిజ్ఞానం మార్పిడిని ప్రోత్సహించేందుకు, ప్రపంచవ్యాపితంగా ఒకేరకంగా వర్తించే మేధోసంపత్తి హక్కుల వ్యవస్థ అవసరమనేది తరచుగా ముందుకు వస్తున్న భావన. మధ్యయుగాలకు సంబంధించిన ఆవిష్కరణలకు ప్రోత్సాహకాలైన "తమకళ తాలూకు రహస్యాలను వెల్లడి చేసే" పద్ధతిని నేటి పేటెంటు చట్టాలలోని "బహిర్గత పరచటం ' తాలూకు నిబంధనలతో ముడిపెడుతున్నారు. ఇటువంటి నిబంధనలు విజ్ఞానాన్ని సమాజంలోకి బదలాయించేందుకు తప్పనిసరివని చెబుతున్నారు. అయితే, వాస్తవం దీనికి విరుద్ధమైనది. పేటెంట్ల ద్వారా సంక్రమించిన దిగుమతుల గుత్తాధిపత్యం ద్వారా సరుకులను దిగుమతి చేసే కంపెనీలు, స్థానికంగా ఉత్పత్తి పరిశ్రమలను స్థాపించేందుకు ఎటువంటి ఉత్సాహం చూపవు అలాగే స్థానికంగా పరిశోధన, అభివృద్ధి లేదా స్థానిక ఉత్పత్తికి సాంకేతిక పరిజ్ఞానం బదిలీని ఆ సంస్థలు ఆమోదించలేవు.

పేటెంట్లకు రక్షణ బలంగా ఉన్నంత మాత్రాన అది దానంతటకదే ఎక్కువ ఆవిష్కరణలకు

లేదా పరిశోధన, అభివృద్ధులలో మరింత పెట్టుబడులకు దారితీయదు అంతేకాకుండా పరిశ్రమలలోని అన్ని విభాగాలలోను ఆవిష్కరణలు పేటెంట్ల రక్షణతో ముడిపడిలేవు.

అమెరికాలో పన్నెండు పారిశ్రామిక రంగాలకు చెందిన 100 సంస్థలనుంచి, ఎడ్విన్ మ్యాన్స్‌ఫీల్డ్(1990) ఒక సాంపుల్ సర్వేను నిర్వహించారు. కాగా, కేవలం రెండే రెండు పారిశ్రామిక రంగాలలో - ఔషధ ఉత్పత్తి, రసాయన పరిశ్రమలలో మాత్రమే 50% లేదా అంతకు మించి ఆవిష్కరణలను అభివృద్ధి చేసేందుకు లేదా మార్కెట్‌లో ప్రవేశపెట్టేందుకు పేటెంట్ల రక్షణ అవసరమని నిర్ధారణ అయ్యింది. మరో మూడు పారిశ్రామిక రంగాలలో (పెట్రోలియం, యంత్రరంగం ఫ్యాబ్రికేట్ చేసిన లోహ ఉత్పత్తులు), 10-20 శాతం నూతన ఆవిష్కరణలు పేటెంట్ల పరిరక్షణపై ఆధారపడి ఉన్నాయి. ఇక, ఇతర పారిశ్రామిక రంగాలలో ఆవిష్కరణలపై పేటెంట్ల రక్షణ తాలూకు ఎటువంటి ప్రభావమూ లేదు.

1998-99 సంవత్సరంలో ప్రపంచబ్యాంకుకు చెందిన "ప్రపంచ అభివృద్ధి నివేదిక' (World Development Report) 80 దేశాలకు పైగా అనుభవాన్ని పరిశీలించింది. దీని ప్రకారంగా, హైటెక్ వస్తువుల వ్యాపార లావాదేవీలలో మేథోసంపత్తి హక్కుల ప్రభావం నామమాత్రమే. అలాగే, 1999వ సంవత్సరపు యుఎన్‌డిపికి చెందిన "మానవ అభివృద్ధి ప్రణాళికా నివేదిక" (The Human Development Project Report) ప్రకారం కూడా, కఠినమైన మేథోసంపత్తి హక్కులు, బహుళజాతి సంస్థలను దేశీయ పరిశోధనా, అభివృద్ధి కొనసాగించేలా ప్రోత్సహించలేవు. వాస్తవానికి మేథోసంపత్తి హక్కుల రక్షణ వ్యవస్థ ప్రభుత్వరంగం నుంచి ప్రైవేటు రంగానికి, అలాగే, భూగోళపు దక్షిణార్ధ భాగ దేశాలనుంచి ఉత్తరార్ధ భాగ దేశాలకు మొగ్గును కల్పిస్తున్నాయి. భూగోళపు దక్షిణార్ధభాగ దేశాలలో 1980వ దశకపు మధ్యకాలంలో 6 శాతంగా వున్న పరిశోధనా, అభివృద్ధి 1990వ దశకం మధ్యనాటికి 4 శాతానికి తగ్గిపోయింది. ఇక, జీవ సాంకేతిక రంగంలో గుత్తాధిపత్యపు లైసెన్సుల ద్వారా ప్రభుత్వరంగం నుంచి ప్రయివేటు రంగానికి అమ్మబడిన పేటెంట్ల సంఖ్య 1981వ సంవత్సరంలో కేవలం 6 శాతంగా మాత్రమే ఉండగా, ఇది1990వ సంవత్సరం నాటికల్లా 40 శాతానికి పెరిగింది.

పరిశోధనా ప్రక్రియను ప్రైవేటీకరించడం వలన మార్కెట్‌లో పోటీ పెరగకపోగా, అది గుత్తాధిపత్యానికి దారి తీసింది. ఔషధాలు, ఆహారం, రసాయనాలు, అలంకరణ సామగ్రి, ఇంధనం, విత్తనాల పరిశ్రమలు ఆయా రంగాలలో ఒకదానితో ఒకటి కలిసిపోయి అతిపెద్ద జీవశాస్త్రరంగ కార్పొరేషన్లుగా తయారవుతున్నాయి. 1998వ సంవత్సరంలో, పైన పేర్కొన్న రంగాలలోని, అతిపెద్ద పది పరిశ్రమల వాటా ఇలా వుంది : 23 బిలియన్ల డాలర్ల విత్తనాల పరిశ్రమలో 32 శాతం, 297 బిలియన్ల డాలర్ల ఔషధరంగ పరిశ్రమలలో 35 శాతం, 17 బిలియన్ల డాలర్ల జంతుసంబంధిత ఔషధాల పారిశ్రామిక రంగంలో 60 శాతం, ఇక 31 బిలియన్ల డాలర్ల క్రిమిసంహారక మందుల పరిశ్రమలో 85 శాతంగా ఈ వాటాలు వున్నాయి.

ఈ కేంద్రీకరణ అనేది కేవలం వివిధ పారిశ్రామిక సంస్థలకు మాత్రమే పరిమితమైలేదు. ఇది వివిధ దేశాల స్థాయిలో కూడా వుంది. నేడు, ప్రపంచవ్యాపితంగా వున్న పేటెంట్లలో 97 శాతం పారిశ్రామిక దేశాల చేతిలోనే ఉన్నాయి. ఒక్క 1995వ సంవత్సరంలోనే ప్రపంచవ్యాపితంగా పేటంట్లపై

వసూలు అయిన రాయల్టీ ఫీజులలో సగభాగం మేరకు అమెరికాకే దక్కింది. అమెరికా జారీ చేసే పేటెంట్లలో 95 శాతం వాటా కేవలం 10 దేశాల చేతిలోనే వుంది. ఈ దేశాలు తమ సరిహద్దులకు ఆవల లభించే రాయల్టీలు, లైసెన్సు ఫీజులలో 90 శాతం వాటాను పొందుతున్నాయి ఇక, చెల్లింపులకు సంబంధించిన ప్రపంచవ్యాప్త రాయల్టీలు, లైసెన్సు ఫీజుల లావాదేవీలలో 70 శాతం మేరకు బహుళజాతి సంస్థలకు చెందిన మాతృసంస్థలు - వాటి శాఖల మధ్యే జరుగుతున్నాయి. అమెరికాలోని అతిపెద్ద 50 కార్పొరేషన్లు మొత్తం పేటెంట్లలో 4వ వంతు భాగాన్ని కలిగివున్నాయి. అమెరికా మరియు జర్మనీ దేశాలలో, పరిశోధనా, అభివృద్ధికి సంబంధించిన వ్యయంలో 12 శాతం కంపెనీలనుంచి వస్తోంది. ఇక యూరోప్‌లో చూస్తే స్విట్జర్‌లాండ్‌లో జరిగే పరిశోధనా, అభివృద్ధి వ్యయంలో 81శాతం మేరకు, డచ్ దేశంలో 69 శాతం మేరకు కేవలం 4 సంస్థలనుంచి వస్తోంది

1985వ సంవత్సరంలో నిర్వహించిన "అభివృద్ధి చెందిన దేశాలలో అంతర్జాతీయ సాంకేతిక మార్పిడి తీరు తెన్నుల" 100 కార్పొరేషన్లకు సంబంధించిన అధ్యయనం ప్రకారం పేటెంట్లకు సంబంధించినంతవరకు, నూతన ఆవిష్కరణలు వివిధ రంగాలకు సంబంధించి నిర్దిష్టంగా వున్నాయి. అలాగే, అవి వివిధ దేశాలలో వివిధ తీరులలో వున్నాయి. కాబట్టి మేధోసంపత్తి హక్కుల వ్యవస్థకు, నూతన ఆవిష్కరణలకు మధ్య ఒకేరకమైన తీరులేదు. మేధోసంపత్తి హక్కుల పాత్ర విభాగాలలో కూడా అవి కొన్ని అనారోగ్యకరమైన ప్రభావాలకు దారితీస్తున్నాయి మైకేల్ క్రేయర్ చేసిన అధ్యయనం ప్రకారం (1996), ఔషధరంగ పరిశ్రమకు పేటెంట్ల వ్యవస్థకు మధ్య తీవ్రంగా ప్రక్కదారి పట్టిన సంబంధం ఉందని నిర్ధారణ అవుతోంది. దీని ప్రకారం మేధోసంపత్తి హక్కుల ప్రోత్సాహకం వలన ఔషధాల ధరలు పెరిగి, వినియోగం తగ్గుతోంది.

కార్పొరేట్ సంస్థలు పరిశోధనా, అభివృద్ధిపై పెట్టిన పెట్టుబడులను తిరిగి రాబట్టుకొనేందుకు పేటెంట్లు అనేవి న్యాయబద్ధమైన వ్యవస్థ అనే వాదన తరచుగా ముందుకు వస్తోంది. అయితే, సాధారణంగా కార్పొరేట్ సంస్థలు చిన్నస్థాయి ఆవిష్కర్తలనుంచి లేదా ప్రభుత్వరంగ సంస్థలనుంచి పేటెంట్లను కొనుగోలు చేయటమో, లేదా, జీవచౌర్య పేటెంట్ల విషయంలో సాంప్రదాయక సమాజాలనుంచి పొందడమో చేస్తున్నాయి. ఉదాహరణకు 1955-1992 సంవత్సరాల మధ్య కనుగొన్న క్యాన్సర్ ఔషధాలలో 92 శాతం అమెరికా ప్రభుత్వపు నిధులతో అభివృద్ధి చేశారు. కాగా, ఈ ఔషధాలపై యాజమాన్యం బహుళజాతి సంస్థలకు దక్కింది. పైగా పేటెంట్ల గుత్తాధిపత్యాన్ని అన్ని సందర్భాలలోనూ ఎటువంటి ఆసరా లేని ఆవిష్కర్త పేరిట రాబట్టుకొన్నారు. ఈ విధంగా ఆ ఆవిష్కర్తల సృజనాత్మకతను అత్యంత శక్తిమంతమైన సంస్థలు సొంతం చేసుకోవటం లేదా చౌకగా కొనుగోలు చేయటం జరుగుతూ వస్తోంది.

1996వ సంవత్సరంలో రాయల్టీలు, లైసెన్సులపై అమెరికా 3000 కోట్ల డాలర్లను సముపార్జించింది. మరోపక్క 1995వ సంవత్సరంలో ప్రపంచంలోని దక్షిణార్థభాగ దేశాలు పేటెంటు చేయబడిన సాంకేతిక పరిజ్ఞానాన్ని కొనుగోలు చేసేందుకుగాను 1800 కోట్ల డాలర్ల మొత్తాన్ని వెచ్చించాయి కాగా, సాంకేతిక పరిజ్ఞానంపై తమ గుత్తాధిపత్యాన్ని చేజార్చుకోవటం ఇష్టం లేని సందర్భాలలో కంపెనీలు ఆ పరిజ్ఞానాన్ని అమ్మడం లేదు. మాంట్రియల్ ఒప్పందం ప్రకారంగా ఓజోన్ పొర విచ్ఛిన్నానికి కారణమౌతున్న, నిషేధించిన ఫ్లోరో కార్బన్‌లకు ప్రత్యామ్నాయాల విషయంలో



4488

భారతదేశానికి ఇలాంటి ఒక చేదు అనుభవం ఎదురయ్యింది. ఈ ఫ్లోరో కార్బన్‌లకు ప్రత్యామ్నాయ వనరులపై పేటెంట్లు కలిగివున్న అమెరికా సంస్థ, ఈ సాంకేతిక పరిజ్ఞానంపై భారతదేశానికి లైసెన్సు ఇచ్చేందుకు నిరాకరించింది. తమ విదేశీశాఖలలో, బహుళజాతి సంస్థల పెట్టుబడులు 1996వ సంవత్సరంలో 1.4 లక్షల కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. రాయల్టీ చెల్లింపులు లైసెన్సు ఫీజుల ద్వారా జరిగే సాంకేతిక పరిజ్ఞానపు మార్పిడిలో 70 శాతం మేరకు మాతృసంస్థలు - వాటి విదేశీ శాఖల మధ్యే జరుగుతోంది.

ఓ పక్క బహుళజాతి సంస్థలు దేశాల సరిహద్దుల అవలకూడా, తాము పేటెంటు పొందిన సాంకేతిక పరిజ్ఞానంపై గట్టి అదుపును కొనసాగిస్తున్నాయి. మరోపక్క, మూడవ ప్రపంచదేశాలు తమ సాంకేతిక సామర్థ్యాన్ని కోల్పోతున్నాయి. వాణిజ్య సంబంధిత మేధోహక్కుల వ్యవస్థ (ట్రిప్స్) నిర్దేశిస్తున్న ప్రపంచ పేటెంట్ల సామ్రాజ్యం వలన సాంకేతిక మార్పిడీ రంగంలో మూడవ ప్రపంచదేశాలు గతంలోకంటే రెట్టింపు కోల్పోతున్నాయి. మొదటగా, మేధోహక్కుల వ్యవస్థ ద్వారా సాంప్రదాయక సాంకేతిక పరిజ్ఞానాన్ని తస్కరించటం, దానిని పేటెంటు చేసుకోవటం జరుగుతోంది. యుఎన్‌డిపి అధ్యయనం ప్రకారం మూడవ ప్రపంచదేశాలు అభివృద్ధి చేసిన జీవవైవిధ్యం విషయంలో 2 శాతం రైతులు వాడే విత్తనాలకు సంబంధించి, చెల్లించబడని రాయల్టీల రూపంలో ఈ దేశాలు 30 కోట్ల డాలర్లను కోల్పోతున్నాయి. ఔషధమొక్కల విషయంలో ఈ మొత్తం 500 కోట్ల డాలర్లుగా వుంది కాగా, ప్రపంచంలోని దక్షిణార్ధభాగ దేశాల సాంప్రదాయక విజ్ఞానాన్ని వినియోగించుకొన్నందుకు తగిన మొత్తాన్ని చెల్లించకపోగా, వ్యవసాయ రసాయనాల రాయల్టీల పైన తనకే 20.2 కోట్ల డాలర్ల మొత్తం దక్షిణార్ధ భాగ దేశాలు రుణపడి వున్నాయని అమెరికా ఎదురు అడుగుతోంది. అలాగే, ఔషధ రాయల్టీల రూపంలో కూడా తనకు 250 కోట్ల డాలర్లు రావాలని కోరుతోంది. . మూడవ ప్రపంచ దేశాలు అమెరికా తరహా పేటెంటు చట్టాలను ప్రవేశపెట్టాయనే ఊహాజనిత ప్రాతిపదికన ఈ అంకెలను లెక్కించటం జరిగింది.

కాబట్టి, పేటెంట్ల వ్యవస్థ అనేది దక్షిణార్ధ భాగ దేశాల నుంచి ఉత్తరార్ధ భాగ దేశాలకు సాంకేతిక పరిజ్ఞానం సంపదల ప్రవాహానికి కారణమౌతోంది. ఇది, ధనిక దేశాలనుంచి పేద దేశాలకు సాంకేతిక పరిజ్ఞానం మార్పిడి సాధనంగా ఉపయోగపడటం లేదు. వివిధ దేశాలు వాణిజ్య సంబంధిత మేధోహక్కులు వ్యవస్థను అమలుజరిపేలా ఒత్తిడి పెరిగినకొద్దీ, ఆ దేశాలనుంచి రాయల్టీ చెల్లింపుల రూపంలో విలువైన విదేశీ మారకం తరలిపోతోంది. దీనివలన ఆ దేశాల రుణభారం మరింత పెరుగుతోంది పేద దేశాలు మరింత పేదరికంలోకి నెట్టివేయబడుతున్నాయి. వాణిజ్య సంబంధిత మేధో సంపత్తి హక్కుల వ్యవస్థ ఒప్పందం ఆహారం మరియు వ్యవసాయం, విత్తనాలు, మరియు వృక్షజాతులకు విస్తరించిన ఈ పరిస్థితి మరింత దుర్భరం అవుతోంది. ఈ రకంగా, మూడవ ప్రపంచ దేశాల వనరులు, విజ్ఞానం, ఉత్తరార్ధభాగ దేశాల సంస్థల "మేధోహక్కులు"గా మారిపోతున్నాయి. ఈ హక్కుల ద్వారా ఆ సంస్థలు మూడవ ప్రపంచదేశాలనుంచి రాయల్టీలను వసూలు చేసుకొంటున్నాయి ఈ పరిస్థితి, గతంలోని వలసవాద దేశాలు తమ వలసల నుంచి వనరులను దోచుకొన్న పరిస్థితిని పోలింది

## విజ్ఞాన సృష్టి పుక్కిటి పురాణం

పేటెంట్లు కనుక లేకపోతే విజ్ఞానం గుప్తంగా వుండిపోతుందనేది కొందరి వాదన ఈ

వాదనలో మూడు లోపాలు వున్నాయి, మొదటిది పేటెంట్లు లేకపోతే విజ్ఞానాన్ని పంచుకుంటారు. దాచుకోరు. రెండవది, పేటెంట్ల ద్వారా అందజేయబడేది విజ్ఞానం కాదు. అది సమాచారం మాత్రమే. ఎందుచేతనంటే, పేటెంటు అమలులో వున్నంతకాలం, ఆ సమాచారాన్ని ఇతరులు వినియోగించుకో వీలుకాదు. అంటే, సమాచారాన్ని బహిరంగపరచటం మాత్రమే ఉపయోగకరం కాదు. ఇక చివరగా, పేటెంట్ల వలన ఉత్తరార్ధభాగ దేశాల నుంచి దక్షిణార్ధ భాగదేశాలకు సాంకేతిక పరిజ్ఞానపు మార్పిడికి ఆటంకం ఏర్పడుతుంది. అంటే, పేటెంట్లు విజ్ఞాన సృష్టికిగానీ లేదా దాని బదలాయింపుకుగానీ ఉపయోగపడవు అవి ప్రధానంగా ఆదాయ సృష్టి మార్గం మాత్రమే.

బోధన మరియు విజ్ఞాన సృష్టి సంస్థలు తరగతి గదులు, పత్రికలు, పుస్తకాల ద్వారా విజ్ఞానపు స్వేచ్ఛా ప్రవాహంపైన ఆధారపడి వున్నాయి. ప్రస్తుతం ఈ స్వేచ్ఛా ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. విశ్వవిద్యాలయాలు విజ్ఞాన సముపార్జనా, పరిశోధనా కేంద్రాలుగా ఉండే పరిస్థితి మారిపోతోంది. అంటే, అవి ప్రజలకు సేవ చేసే తీరులో విజ్ఞానాన్ని ఉత్పత్తి చేయలేవు. అవి కేవలం, విజ్ఞాన ఉత్పత్తిని మేధోసంపత్తిగా మార్చుకొనే కేంద్రాలుగా మాత్రమే మిగిలిపోతున్నాయి. పేటెంట్ల పరిరక్షణ లేకుండానే ప్రజాజీవితంలో హెచ్చుభాగం విజ్ఞానం, పురోగతి, ఆవిష్కరణలు జరిగాయి ఎందుచేతనంటే మానవులు పలు రకాల ప్రోత్సాహకాలకు ప్రతిస్పందిస్తారు. ప్రశంసలు, ప్రచురణలే ప్రధాన ప్రోత్సాహకంగా వున్నప్పుడు, శాస్త్రవేత్తలు "ప్రచురించు లేదా నశించు" అనే తర్కం ఆధారంగా పనిచేశారు మేధోసంపత్తి హక్కుల వ్యవస్థ పరిశోధనా సంస్కృతిలో ప్రవేశపెట్టిన మార్పుల వలన ఈ తర్కం "పేటెంటు చేయి లేదా నశించు"గా మారుతోంది. ఏది ఏమైనా పేటెంట్ల సంస్కృతిని విలసిల్ల చేయటానికి అవసరమైన నిగూఢత విజ్ఞానసంస్కృతిని విలసిల్ల చేయటానికి కావల్సిన బహిరంగ వాతావరణాన్ని నశింపజేస్తుంది ఎందుచేతనంటే, విజ్ఞానం సామాజిక సంపద, అయితే విజ్ఞాన సృష్టి, ఆవిష్కరణలకు అవసరమైన సామాజిక పునాదిని పేటెంట్ల వ్యవస్థ దెబ్బతీస్తుంది ఫలితంగా విజ్ఞాన సృష్టి, మార్పిడికి నష్టం జరుగుతుంది

మేధోసంపత్తి హక్కుల వ్యవస్థ లేకుంటే పరిశోధనకు ప్రోత్సాహం వుండదనేది తరచుగా వినపడే వాదన. అయితే మేధోసంపత్తి హక్కుల వ్యవస్థ వలన ఈ ప్రోత్సాహక పద్ధతి ప్రజాహితం కోసమైకాక కొందరి వ్యక్తిగత లాభాలకు మాత్రమే ఉపయోగపడుతుంది. విజ్ఞాన సముదాయం స్థానంలో కార్పొరేట్ విశ్వవిద్యాలయం వేళ్లూనుకుంటుంది. ఉదా : ఎంఐటిలోని ప్రయివేటు నిధులతో నడిచే ఒక కేంద్రం తన సిబ్బందిలో మూడవవంతు భాగం జీవశాస్త్రవేత్తలను నియమిస్తోంది. తద్వారా వారు సృష్టించిన మేధోసంపత్తి అంతటినీ సొంతం చేసుకుంటుంది.

శాస్త్ర పరిశోధనను పేటెంట్ల వ్యవస్థతో ముడిపెట్టిన చోటల్లా, పరస్పర సమాచార మార్పిడికి విఘాతం ఏర్పడుతోంది. విస్తృత ప్రచారంలో వున్న రీతిలో శాస్త్రవేత్తలు ఎప్పుడూ సంపూర్ణంగా బహిరంగతను చూపి వుండకపోవచ్చు. అయితే వాణిజ్యసంస్థలలో పనిచేస్తున్న శాస్త్రవేత్తల మధ్య శాస్త్ర సమాచార మార్పిడి నేడు మరింత పెద్ద సమస్య అయి కూర్చుంది. ప్రముఖ మైక్రోబయాలజిస్టు ఇమాన్యుయల్ ఎప్‌స్టెయిన్ మాటలలో చెప్పాలంటే : "గతంలో సహ పరిశోధకులు తమ ఆలోచనలను తక్షణం పంచుకోవటం అత్యంత సహజమైన విషయంగా వుండేది " అధిక శక్తిగల అణుధార్మికత

తీవ్రతను గుర్తించి, కొలవగల పరికరాలు; విద్యుదావాహ ఫీల్డు ప్రభావం కింద ఛార్జ్ అయిన కణాల కదలికల బ్యాటరీలు మొదలైన అత్యాధునిక ఆవిష్కరణల గురించి సమాచారాన్ని మార్పిడి చేసుకునేందుకు, తమ తమ పరిశోధనా పత్రాల ముసాయిదాలను ఇచ్చిపుచ్చుకునేందుకు, ఇటువంటి మరి ఇతర పద్ధతుల ద్వారా ఉత్సాహపూరితులైన సహ పరిశోధకులుగా వ్యవహరించేందుకు కూడా గతంలో బాగా అవకాశం వుండేది. ఇదంతా సహజ ప్రక్రియగా వుండేది. (అయితే) ఆ అవకాశం ఇప్పుడు లేకుండా పోయింది. (జీవ సాంకేతిక పరిజ్ఞానం : విశ్వవిద్యాలయ – పారిశ్రామిక సముదాయంలో మార్టిన్‌కెన్నీ ఉల్లేఖించిన అంశం)

విశ్వవిద్యాలయ పారిశ్రామిక సముదాయాలలో శాస్త్ర సంబంధిత బహిరంగత అంతర్ధానం కావటం గురించి మార్టిన్ కెన్ని (1993) ఈ విధంగా పేర్కొన్నారు:.'కాపీలాగబడటం గురించిన భయం లేదా తమ స్వంతకృషిని ఇతరులు సరకుగా చేసుకొనే పరిస్థితిపై అదుపులేకపోవటం పరిశోధకుల మధ్య పరస్పర సందేహానికి కారణమౌతోంది. ప్రాణపదమైన కృషి ఫలితం కేవలం ఒక సరుకుగా మార్పివేయబడుతోంది. పరిశోధకుల కృషి మార్పిడికి యోగ్యమైన అంగడి సరుకుగా మారుతుంది. శాస్త్ర పరిశోధన తాలూకు విలువకు డబ్బు కొలబద్ద అవుతోంది.

పరిశోధకుల సృజనాత్మకత, ఉత్పాదకతలో, బహిరంగతా, నూతన ఆలోచనలు మరియు సమాచారపు స్వేచ్ఛామార్పిడి అలాగే పరిశోధనా వస్తువులు మరియు పద్ధతుల స్వేచ్ఛామార్పిడి కీలక అంతర్భాగాలు. శాస్త్ర విజ్ఞానరంగంలో రహస్యాలకు తావు ఇవ్వటం ద్వారా మేధోసంపత్తి హక్కుల వ్యవస్థా, అలాగే దాని తాలూకూ వాణిజ్యీకరణ, విజ్ఞానాన్ని ప్రైవేటీకరించటం అనేవి శాస్త్ర పరిశోధకుల సృజనాత్మక సామర్థ్యాన్ని చంపివేస్తాయి మేధోసంపత్తి హక్కుల వ్యవస్థ సృజాత్మకతను దోచుకుంటుంది. ఫలితంగా సృజనాత్మకత తాలూకు మూలం నశించిపోతుంది. సరైన సమయంలో నింపబడని ఏ నిల్వలైనా హరించుకుపోతాయి అనేది మనకు తెలుసు వృక్షం తాలూకు వ్రేళ్లకు పోషణ లభించకపోతే ఆ వృక్షం మరణిస్తుందనేది అందరికీ తెలిసిందే. పేటెంట్ల వలన విజ్ఞానం వినాశనం పాలు అవుతుంది. అంతేకాకుండా, ఉత్పాదకసామర్థ్యం కూడా నశిస్తుంది. మరింత అభివృద్ధి కావల్సిన సామర్థ్యానికి గండి పడుతుంది.

ఆర్థిక ప్రయోజనాల నుంచి దూరంగా వుండటం విజ్ఞాన సంస్థల ప్రధాన లక్షణం. అయితే, వాణిజ్యీకరణ వలన విజ్ఞానపు స్వభావమే మారిపోతోంది. పరిశోధనా అంశాలను వాణిజ్య సంబంధాలు నిర్దేశిస్తున్నాయి. వాణిజ్యంవైపు మొగ్గుగల ప్రైవేటు ప్రయోజనాల విజ్ఞానం, ప్రజాహిత విజ్ఞానాన్ని పక్కకు నెట్టివేస్తోంది. 1992వ సంవత్సరంలో మసచూసెట్స్‌కు చెందిన శాస్త్రవేత్తలు పద్నాలుగు పేరుమోసిన శాస్త్ర, వైద్య సంబంధిత పత్రికలలో వ్రాసిన వ్యాసాలను గురించిన అధ్యయనాన్ని, షల్డన్ క్రిమ్‌స్కీ "బయోటెక్నిక్స్ అండ్ సొసైటీ : ది రైజ్ ఆఫ్ ఇండస్ట్రియల్ జనటిక్స్" అనే తన పుస్తకంలో ప్రస్తావించారు. ఈ అధ్యయనం ప్రకారంగా ఈ వ్యాసరచయితలలో మూడవ వంతుమందికి తమ పరిశోధనలలో ఆర్థిక ప్రయోజనం వుంది. 20 శాతం మంది జీవసాంకేతిక పరిశ్రమకు చెందినవారు, అలాగే 22 శాతం తమ వ్యాసంలోని అంశానికి సంబంధించి పేటెంటుకై దరఖాస్తు చేసుకున్నారు.

కార్పొరేట్ సంస్థల అధ్వర్యంలో జరిగే పరిశోధన, పరిశోధనా ఫలితాల వక్రీకరణకు

దారితీయగలదని పలు అధ్యయనాలు రుజువు చేస్తున్నాయి. ఈ పరిశోధనలు కార్పొరేట్ సంస్థలకు లాభదాయకంగానూ, ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగానూ వుండగలవు. కార్పొరేట్ సంస్థలు, మేధోసంపత్తి హక్కుల ఆధిపత్యం క్రింద వున్న వ్యవస్థలలో ప్రజాహితం అంతర్ధానం కావడంతోపాటు, పలు శాస్త్ర పరిశోధనారంగాలే అదృశ్యం అయిపోగలవు బోధన, పరిశోధనా కార్యక్రమాల ఆవశ్యకతను అంచనా వేయడంలో వాణిజ్య ప్రయోజనాలది పెద్దపీట కావడం దీనికి కారణం.

వాణిజ్య ప్రయోజనాలకు అనుగుణంగా పెట్టుబడిపై రాబడి అవకాశాల ప్రాతిపదికన జరిగే పరిశోధనలది, సామాజిక అవసరాలకై జరిగే పరిశోధనలపై పైచేయి. అయితే, పలు విజ్ఞాన స్రవంతులు, అలాగే అధ్యయనం విస్మరించబడి అంతర్ధానమై పోతాయి. పలు శాస్త్ర రంగాలు వాణిజ్యపరంగా లాభదాయకం కాకపోయినా, అవి సామాజికంగా అవసరం ఉదాహరణకు పర్యావరణ సమస్యలను ఎదుర్కొంటున్న మన సమాజంలో అంటువ్యాధులు, పర్యావరణం, పరిణామక్రమం మరియు అభివృద్ధికి సంబంధించిన జీవశాస్త్రం అవసరం జీవవైవిధ్యపు వినాశన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న మనకు సూక్ష్మజీవులు, కీటకాలు, మొక్కలు మొదలైన జీవజాతులకు సంబంధించిన నిపుణులు అవసరం. అందుచేత మానవులకు ఉపయోగకరమైనవి, అవసరమైనవి అయినవాటిని విస్మరించిమనం లాభసాటి అయినవాటిపై మాత్రమే దృష్టిని కేంద్రీకరిస్తే మేధో వైవిధ్యపు సృష్టికి కావల్సిన సామాజిక పరిస్థితులు రూపుమాసిపోతాయి. విజ్ఞానపు స్వేచ్ఛా మార్పిడిని చౌర్యంగాను లేదా కొల్లగొట్టటంగాను, నిర్వచించటం విజ్ఞానాన్ని ప్రైవేటీకరించడం తాలూకు అంతిమ తర్కం. దురదృష్టవశాత్తు విజ్ఞాన మార్పిడిని నేరంగా చేసే పరిస్థితి ఇప్పటికే వాస్తవరూపం ధరించింది.

## గూఢచారులు-నేరం, మేధోసంపత్తి హక్కుల వ్యవస్థ గురించి

వ్యాపార ప్రయోజనాల రక్షణకు సైనిక పాటవాన్ని వినియోగించటం అనే కలయిక పైనే సామ్రాజ్యవాద శక్తి ఆధారపడి వుంది. వలసవాద యుగంలోని బలప్రయోగ దౌత్యానికి ఈ కలయికే కేంద్రబిందువు. ప్రపంచీకరణ, అలాగే స్వేచ్ఛా వ్యాపారంగా చెప్పబడుతున్న నేటి కాలంలో వ్యాపార ప్రయోజనాల రక్షణకై ఇటువంటి కలయికే రూపు దిద్దుకుంటోంది. మేధోసంపత్తి హక్కుల వ్యవస్థను తన జాతీయ భద్రతకు కీలకంగా భావిస్తూ, 1996వ సంవత్సరంలో అమెరికా కాంగ్రెస్ ఆమోదించిన చట్టమే దీనికి తార్కాణం. ఈ చట్టం విజ్ఞానపు సహజ అభివృద్ధిని, మార్పిడిని నేరపూరితం చేసేదిగా భావించవచ్చు ఎందుచేతనంటే, దీని ప్రకారంగా అమెరికా గుత్తసంస్థల మేధోసంపత్తి హక్కులను పరిరక్షించే ప్రయత్నంలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా సాధారణ పౌరుల కార్యకలాపాలను పరిశోధించేందుకు అమెరికా గూఢచారి సంస్థలకు అధికారం కట్టబెట్టబడింది. కాగా, 'మేధోసంపత్తి'గా చూడబడుతున్నది తరచుగా పాశ్చాత్యేతర సమాజాలు, స్థానిక తెగలనుంచి 'చోరీ' చేయబడిన సమాచారం అనేది మనకు సుస్పష్టం గనుక, అమెరికా చేసిన ఈ చట్టం మరింత అసంబద్ధమైనది అని అర్థం అవుతుంది.

వలస దేశాలలోని ఉత్పాదక సామర్థ్యాలను ధ్వంసం చేయటం ద్వారా, అలాగే సామర్థ్యం అభివృద్ధి చెందకుండా నిరోధించటం ద్వారా బ్రిటీషు సామ్రాజ్యం నిర్మించబడింది. బెంగాల్‌కు చెందిన

అత్యున్నతశ్రేణి నేతగాళ్ల బ్రొటనవేళ్లను కత్తిరించటం, బలప్రయోగం ద్వారా బీహార్ రైతులను నీలిమందు పండించేలా చేయటం, అమెరికాలోని పత్తిపొలాలలో పనిచేసేందుకు ఆఫ్రికానుంచి నయాపైసా ఖర్చులేని బానిసలను సరఫరా చేసే వ్యాపారం, అలాగే ఉత్తర అమెరికాలోని స్థానిక ప్రజలను నిర్మూలించటం- ఇలా వీటి అన్నింటిపైనా ఇంగ్లాండ్ 'సాంకేతిక ఆధిపత్యపు' శకంలో, 'స్వేచ్ఛా వాణిజ్యపు' పునాదులు నిర్మించబడ్డాయి. వీటితోపాటుగా సాంకేతిక మార్పిడిని నిరోధించే చట్టాలు తమ వంతు పాత్రను పోషించాయి. కొత్తయంత్రాలు, లేదా పథకాలు, లేదా నమూనాలను ఎగుమతి చేయటాన్ని నిరోధిస్తూ, 1765-1789 సంవత్సరాల మధ్య ఇంగ్లాండు పార్లమెంటు వరుసగా పలు కఠినమైన చట్టాలను చేసింది. ఈ యంత్రాలతో పనిచేసే నిపుణులను ఇంగ్లాండు వదిలి వెళ్లడానికి అనుమతించలేదు తద్వారా ఇంగ్లాండు పారిశ్రామిక ఆధిపత్యం హామీ చేయబడింది

యంత్రాలతో నూలు వడకటం, నేతపనుల విజ్ఞానాన్ని, బ్రిటీషు చట్టాలను ఉల్లంఘించి అమెరికాలోకి తన వలస ద్వారా రహస్యంగా చేరవేయటం ద్వారా సామ్యూల్ స్లేటర్ 'అమెరికా పారిశ్రామిక ఉత్పత్తి పితృసమానుడిగా' గౌరవం పొందాడు. ఇంగ్లాండు కర్మాగారాలలో పనిచేయటం ద్వారా సంపాదించిన అనుభవాన్ని ఆయన అమెరికా దేశానికి బదలాయించాడు. తద్వారా నూలు వడికే యంత్రాల తొలి సంపూర్ణ మిల్లును అమెరికాలో నిర్మించాడు. అంటే, అమెరికా తన ఆర్థిక పాటవాన్ని, ఉత్పత్తి సామర్థ్యాన్ని బ్రిటీషు గుత్తసంస్థల గుప్పిటనుంచి బయటపడటం ద్వారా నిర్ణయించుకుంది. కాగా, అమెరికా చరిత్రకు/ఆర్థిక అభివృద్ధికి మౌలిక ప్రాతిపదిక అయిన ఈ స్వేచ్ఛా స్ఫూర్తిని నేడు అమెరికా కాంగ్రెస్ కానీ లేదా నేటి కార్పొరేట్ సంస్థలు కాని ప్రపంచంలోని మరే ఇతర చోట ఆమోదించేందుకు సిద్ధంగా లేవు.

సామ్యూల్ స్లేటర్ అడుగుజాడలలో నడిచిన ఎవరికైనా నేడు అమెరికాలోని 1996వ సంవత్సరపు ఆర్థిక గూఢచారిత్వం చట్టం కింద 15 సంవత్సరాల జైలుశిక్ష లేదా 10 మిలియన్ల డాలర్ల వరకూ జరిమానా పడతాయి ఈ చట్టం సైనిక వ్యవహారాల పరిధిలోని గూఢచారిత్వ నిబంధనలను ఆర్థికరంగంలోకి విస్తరించింది ఇది మేధోసంపత్తి ఉల్లంఘనను నేరంగా పునర్ నిర్వచించింది అంతేకాకుండా, శాస్త్ర, సాంకేతిక మార్పిడి అంశాలలో గూఢచారి సంస్థలను వినియోగించుకోవడాన్ని సమర్థిస్తోంది చట్టం తాలూకు ముందుమాట ఇలా పేర్కొంటుంది· 'అమెరికా ఆర్థిక మనుగడలో గుత్తాధిపత్య ఆర్థిక సమాచారపు అభివృద్ధి అంతర్భాగం అనేదానిలో సందేహం లేదు అంతే కాకుండా, జాతీయ ఆర్థిక ప్రయోజనాలు జాతీయ భద్రతాప్రయోజనాలలో ఒక భాగం. అంటే, జాతి ఆర్థిక ప్రయోజనాలకు కలిగే ముప్పు కీలకమైన జాతీయ భద్రతా ప్రయోజనాలకు కలిగే ముప్పువంటిదే.' ఈ చట్టం ద్వారా, సాంకేతిక పరిజ్ఞానపు బదలాయింపును 'ఆర్థిక లేదా పారిశ్రామిక గూఢచారిత్వం'గా పునర్నిర్వచించారు.

ప్రతిదేశానికి తన జాతీయ భద్రతను కాపాడుకునే హక్కు వున్నదన్నది నిర్వివాదం. అయితే ఆర్థిక గూఢచారిత్వ చట్టంతో పలు సమస్యలు ఉన్నాయి. మొదటగా ప్రపంచీకరణ, సరళీకృత ఆర్థిక విధానాల కాలంలో 'జాతీయార్థిక ప్రయోజనాలను' 'జాతీయ భద్రతా ప్రయోజనాలు'గా నిర్వచించబూనటం అసంబద్ధమైనది. ఇతర దేశాలు తమ జాతీయ ప్రయోజనాలను, జాతీయ భద్రతను, అలాగే జాతీయ

సార్వభౌమాధికారాన్ని వదులుకునేలా ఒత్తిడి తెచ్చేవిధంగా ప్రపంచీకరణ అనేది వినియోగించబడుతోంది. ఉదాహరణకు భారతీయ పేటెంటు చట్టపు సవరణను నిరోధించటం ద్వారా, భారతదేశపు పార్లమెంటు జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరిస్తుంది గనుక, అమెరికా భారతదేశాన్ని ప్రపంచ వాణిజ్యసంస్థ పరిధిలోకి లాక్కుంది వివిధ దేశాలు తమ జాతీయ భద్రత కోల్పోయేలా చేయటంద్వారా అమెరికా కార్పొరేటు సంస్థలకు అవకాశాలు కల్పించేందుకుగాను తన వ్యాపార చట్టపు సూపర్ 301, స్పెషల్ 301 నిబంధనలను అమెరికా వినియోగిస్తోంది అలాగే, వినియోగదారులు జన్యుపరంగా కృత్రిమంగా సృష్టించబడ్డ ఆహారాలను వ్యతిరేకిస్తున్నప్పటికీ, అమెరికా తన దేశానికి చెందిన ఒక పెద్ద కార్పొరేట్ సంస్థ ఉత్పత్తి చేస్తున్న కలుపునాశకాలకు లొంగని జన్యుపరంగా కృత్రిమమైనదైన సోయాబీన్‌ను దిగుమతి చేసుకునేలా యూరప్‌పై ఒత్తిడి తెస్తోంది. ఒకపక్క ఇతర దేశాలకు తమ జాతీయ భద్రతా,సార్వభౌమాధికారాలను తిరస్కరిస్తూ, మరోపక్క అమెరికా తన జాతీయ భద్రతకు పునర్నిర్వచనాన్ని ఇచ్చుకుంటోంది. తద్వారా, ఇతర దేశాల వనరులు, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్‌లపై అమెరికా కార్పొరేట్ సంస్థల అదుపును పెంచుకోచూస్తోంది. ఆర్థిక గూఢచారిత్వ చట్టపు నేపథ్యంలో చూస్తే ప్రపంచీకరణ అంటే జాతీయ రాజ్యపు చరమాంకం అనే విస్తృత ప్రచారంలో వున్న భావన తప్పు అని రుజువు అవుతోంది జాతీయత అనేది సజీవంగా వుంది. అది అమెరికాలోని బహుళజాతి సంస్థల క్రియాశీల సేవలో నిమగ్నమై వుంది.

రెండవది, మేధోసంపత్తి అనేది నూతన విభాగాలలోకి విస్తరింపబడుతున్నది గనుక, మేధోసంపత్తి ఉల్లంఘనను ఆర్థిక గూఢచారిత్వపు అర్థంలో నిర్వచించటం ఏకపక్షం అయినది. అలాగే అది ఒకపక్కకు ఎక్కువగా మొగ్గు కలది. దీనిలో విశ్వవిద్యాలయ వ్యవస్థల మొత్తం ప్రజలకు సంబంధించిన విభాగం. అలాగే పాశ్చాత్యేతర సమాజాల సామూహిక విజ్ఞాన వారసత్వం రెండు వున్నాయి. మొత్తం ప్రజానీకానికి సంబంధించిన సామూహిక మేధోఫలితాలను మేధోసంపత్తి హక్కుల వ్యవస్థ ద్వారా ప్రైవేటుపరం చేసే చర్య. స్వయానా విజ్ఞానపు 'చోరీ'. జీవచౌర్యం, మేధోచౌర్యాలకు సంబంధించిన సందర్భంలో ఆర్థిక గూఢచారిత్వ చట్టాన్ని ప్రవేశపెట్టటం అమెరికా కార్పొరేట్ సంస్థలకు, అలాగే గూఢచర్య విభాగాలకు, సాధారణ ప్రజానీకానికి, సామాన్య శాస్త్రవేత్తలకు వ్యతిరేకంగా ఉపయోగించే అవకాశమున్న ప్రమాదకరమైన పనిముట్టును ఇస్తోంది.

తన స్వంత నూతన ఆలోచననే 'కాజేసినందుకు' పీటర్ టబోర్‌స్కీ అనే విద్యార్థిని అరెస్టు చేసి, జైలు పాలుచేయటం, అలాగే అతనిపై 20,000 డాలర్ల అపరాధరుసుంను విధించటం ఆర్థిక గూఢచారిత్వచట్టం తాలూకు ప్రమాదకర ఏకపక్ష నిర్ణయాలకు ఒక మచ్చుతునక. (ఈ ఉదాహరణ అమెరికా జాతీయ చట్టాలకు సంబంధించినది. దీనిలో అంతర్జాతీయ చట్టం/వాణిజ్య ఒప్పందాల జోక్యం లేదు అయితే అమెరికా ఆర్థిక జోక్యం ఉన్న సందర్భాలలో ప్రపంచంలో ఎక్కడైనా ఇటువంటి అన్యాయాలు జరగవచ్చు ) పీటర్ టబోర్‌స్కీ ఫ్లోరిడా విశ్వవిద్యాలయంలో పరిశోధనాశాల అసిస్టెంటుగా పనిచేసేవాడు ఈ ప్రాజెక్టుకు ప్రొగ్రెసివ్ టెక్నాలజీస్ కార్పొరేషన్ నిధులను సమకూర్చింది. కాగా, తన ఖాళీసమయంలో పీటర్ స్వంత పరిశోధన చేసి ఒక పేటెంటును పొందాడు అయితే, ఈ పరిశోధనలకై పీటర్ పరిశోధనాశాలను, దాని పరికరాలను వాడుకున్నాడు గనుక ఇది 'చోరీ'యేనంటూ విశ్వవిద్యాలయం, కార్పొరేషనూ కలిసి అతనిపై నేరారోపణ చేసాయి ప్రభుత్వ సంస్థలకు ప్రయివేటు నిధులను

సమకూర్చడానికి సంబంధించిన మేధోసంపత్తి హక్కుల రక్షణ వ్యవస్థ తాలూకు సమస్యలను పీటర్ అరెస్టు నాటకీయంగా వెలుగులోకి తెస్తోంది. పలు పరిశోధనా సౌకర్యాలు ప్రజాధనంతో నిర్మించబడ్డాయి. కార్పొరేట్ సంస్థలు ఒక ప్రాజెక్టుకు నిధులను సమకూర్చినప్పుడు ఆ పరిశోధనా ఫలితాలను తన మేథోసంపత్తిగా చేసుకున్నప్పుడు, ఈ విజ్ఞాన ఉత్పత్తికి అవకాశం కల్పించిన సౌకర్యాలు ప్రజాధనంతో నిర్మించబడ్డాయి అనేది విస్మరించబడుతోంది. అనంతరం, కొత్త ఆలోచనలను సృష్టించేందుకు ఎవరైనా ఈ ప్రభుత్వ వనరులను వాడుకుంటే పీటర్ టబోర్స్కీ లాగానే, అది చోరీగా పరిగణించబడుతోంది.

అమెరికా గూఢచారిత్వచట్టం ప్రకారంగా పీటర్ వంటి పరిశోధకులకు 20,000 డాలర్లకు బదులుగా కోటి డాలర్ల అపరాధరుసుం, అలాగే సంవత్సరం జైలు శిక్షకు బదులుగా 14 సంవత్సరాల జైలుశిక్ష విధించవచ్చు.

విజ్ఞానం సాంకేతిక పరిజ్ఞానాలు, నూతన భావాల స్వేచ్ఛా మార్పిడి ద్వారా మాత్రమే శాస్త్ర, సాంకేతికాభివృద్ధి సాధ్యపడుతుంది. అయితే, నేడు అటువంటి మార్పిడి గూఢచర్యంగా నిర్వచించబడుతోంది. ఇక, పాశ్చాత్యేతర, స్థానిక వ్యవస్థలనుంచి పాశ్చాత్య కార్పొరేట్ సంస్థలకు విజ్ఞానమార్పిడి ద్వారా ఏర్పడే 'మేధోసంపత్తి' వంటి సందర్భాలలో 'మేధోసంపత్తి చౌర్యం' తాలూకు అసంబద్ధత మరింత తేటతెల్లం అవుతుంది. జీవచౌర్యం సర్వసాధారణంగా జరిగిపోతున్న ప్రపంచంలో, ఈ గూఢచారిత్వ చట్టం, రైతులు, స్థానిక వైద్యులు, విద్యార్థులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తల దైనందిన కార్యకలాపాలను నేరాలుగానూ, గూఢచర్యంగానూ ముద్రవేసే ప్రమాదం వుంది. అమెరికా కార్పొరేట్ సంస్థలు స్థానిక ఆవిష్కరణలను 'చోరీ' చేసి, వాటిని తమ 'మేధోసంపత్తిగా' చాటుకుంటున్నాయి. దీనికి తార్కాణాలే వేప, పసుపు, మొదలైనవి ఈ 'మేధోసంపత్తి'ని కాపాడేందుకు అమెరికా ప్రభుత్వపు గూఢచర్య సంస్థలు ముందుకు వస్తాయి. డబ్ల్యు.ఆర్.గ్రేస్ సంస్థ వేప పేటెంట్లలో అత్యధిక భాగాన్ని కలిగివుంది. ఇటువంటి 'గుత్తాధిపత్య ఆర్థిక సమాచారపు యజమానులను' కాపాడేందుకుగాను సాంప్రదాయక వినియోగాలు, జీవన రీతులు, సంస్కృతులను అస్థిరపరిచేందుకై ఎటువంటి పద్ధతులను వినియోగిస్తారు? అమెరికా తర్కంతోనే మూడవ ప్రపంచదేశాలు గనుక; అమెరికా కార్పొరేషన్లలో పనిచేస్తున్న జీవ పరిశోధకులు, జాతి సంబంధిత వృక్ష శాస్త్రవేత్తలు 'ఆర్థిక గూఢచర్యం'లో తలమునకలై వున్నారని, ఇది తమ 'జాతీయభద్రతకు' ముప్పు అని ప్రకటిస్తే పర్యవసనాలు ఎలా వుంటాయి?

మేధో సంపత్తి లేదా 'మేధస్సుకు సంబంధించిన ఉత్పత్తులు సంపత్తి'లో ఏడు విభాగాలు వున్నాయి. ఇవన్నీ వాణిజ్య సంబంధిత మేథోసంపత్తి హక్కుల వ్యవస్థ పరిధిలోకి వస్తాయి. వీటిలో-

1. పేటెంట్లు
2. పారిశ్రామిక డిజైన్లు
3. ట్రేడ్‌మార్కులు
4 భూ, భౌగోళిక సూచికలు లేదా పుట్టుక తాలూకు పేర్లు
5 పరస్పరం అనుసంధానించబడిన సర్క్యూట్ల తాలూకు లే అవుట్ డిజైన్లు (స్థలాకృతులు)
6. బహిరంగపరచబడని సమాచారం లేదా వ్యాపార రహస్యాలు

7. సాహిత్యం, కళలు, సంగీతం, ఫోటోగ్రఫీ, దృశ్య శ్రవణ కార్యక్రమాల కాపీరైట్లు

ఈ భిన్న తరహాల మేధోసంపత్తి హక్కుల నన్నింటినీ పేటెంట్లుగానే భావించటం సాధారణ విషయం అయితే, వాస్తవానికి మేధోసంపత్తి హక్కులలో పేటెంట్లుకూడా ఒక తరహావి మాత్రమే. ఆర్థికంగా చూస్తే పేటెంట్లకు అత్యధిక ప్రాధాన్యత వుంది ఎందుచేతనంటే మౌలికఅవసరాలు, జీవనాధారాలపై, అలాగే ఆర్థిక వ్యవస్థ నిర్మాణంపై పేటెంట్ల ప్రభావమే అత్యధికం అంతేకాకుండా, మేధోసంపత్తి హక్కుల పరిరక్షణ రూపాలలో పేటెంట్లది పెద్ద పీట.

ఏదేమైనా, పేటెంట్లను సమర్థించుకోవటానికి చేసే 'సృజనాత్మకతకు బహుమతి', 'పెట్టుబడిపై రాబడి' వంటి వాదనలు లోపభూయిష్టమైనవి. మార్కెట్‌లను అదుపుచేసేందుకుగాను పేటెంట్లు పెట్టుబడి తాలూకు హక్కులుగా మారాయి. అందుచేతనే సాంకేతిక పరిజ్ఞానాన్ని వాణిజ్యీకరించటం ద్వారా కార్పొరేట్ సంస్థలు పొందేందుకు వీలు అయిన గుత్త లాభాలపై భారతదేశపు 1970వ సంవత్సర పేటెంటు చట్టం వంటివి పరిమితిని విధించాయి. పేటెంట్ల పరిధినుంచి మినహాయింపు కల్పించటం గుత్త సంస్థలపై పరిమితికిగాను ఒక వ్యూహం. భారతదేశంలోని 75శాతం మంది జనాభాకు వ్యవసాయం జీవనోపాధి. అలాగే మన దేశంలో చాలామంది పేదలు మించి, వారికున్న ఆహారభద్రత కూడా పరిమితమైనదే. అందుచేత భారతీయ పేటెంటు చట్టం పరిధినుంచి తోటల పెంపకం, వ్యవసాయ పద్ధతులు, అలాగే ఆహారాన్ని మినహాయించారు. అదే విధంగా, భారత దేశంలో కోట్లాది మందికి వైద్య సదుపాయం అందుబాటులో లేదు. అందుచేత మందులను కూడా ఈ పరిధినుంచి తప్పించారు. లేకుంటే ఖరీదైన మందుల వలన వైద్య సదుపాయం ప్రజలకు అందుబాటులో వుండకుండా పోతుంది. ఆహారం, మందులు గనుక ప్రజలకు అందుబాటు ధరలలో లేకపోతే, ప్రైవేటు లాభాన్ని కల్పించటం ద్వారా, ప్రజలకు బాగా సరకులను అందించటం అనే ఒప్పందంగా పేటెంటు వ్యవస్థ తాలూకు మౌలిక వాగ్దానం పునాదులు కదిలిపోతాయి. పేటెంట్లు, ఒకపక్క ఉత్పత్తిదారులు, వినియోగదారుల ప్రయోజనాల మధ్య సమతుల్యాన్ని సాధించేవిగా చెప్పబడుతున్నాయి. అంటే, సాంకేతిక ఆవిష్కరణలను అభివృద్ధి చేయటం లేదా వాణిజ్యీకరించటం చేసేవారు. తద్వారా లభించే సరకులను లేదా సేవలను వినియోగించుకునేవారి ప్రయోజనాలమధ్య సమతుల్యతగా ఇది చెప్పబడుతోంది. అయితే వినియోగదారుల హక్కులైన ఆహారం, ఆరోగ్యాలకు ముప్పువాటిల్లితే పేటెంట్లు జారీ చేసేందుకు ఎటువంటి సమర్థనా లేదు.

తీవ్రమైన అసమానతలు వున్న ప్రపంచంలో పాశ్చాత్య తరహా మేధోసంపత్తి హక్కుల వ్యవస్థను విస్తరించటం పేదల ఆర్థిక హక్కులపై ప్రత్యక్షదాడి. దీపక్‌నాయర్ మాటలలో చెప్పాలంటే-'ఆవిష్కర్తలకు ప్రయోజనాలు చేకూరేలా చూడవల్సిందే అయితే, గుత్త లాభాల రక్షణ అనేది, అసమాన అభివృద్ధి ప్రపంచంలా వినియోగదారుల ప్రయోజనాలపై పైచేయికారాదు' ఈ రెంటి మధ్య సమతుల్యత సాధించటమే అసలైన సవాలు ఆవిష్కర్తలను ప్రోత్సాహించేందుకు తగినంత పరిరక్షణ కావాలి. కానీ, ఈ ప్రక్రియలో సామాజిక ప్రయోజనాలు దెబ్బతినరాదు. దురదృష్టవశాత్తు వ్యాపారసంబంధిత మేధోసంపత్తి హక్కుల రక్షణ వ్యవస్థ మదుపుదారుల హక్కులను రక్షించటంలో శృతిమించి రాగాన పడింది ప్రజా ప్రయోజనాల రక్షణకు తగిన వ్యవస్థను సృష్టించేలా ఇది కొనసాగలేదు.

# 3. జీవ వైవిధ్యానికి ముప్పులు

చారిత్రకంగా చూస్తే పేటెంట్లకు భిన్న అర్థాలు, విధులు వున్నాయి కాగా, 20వ శతాబ్దంలో ఇవి స్పష్టంగా మానవ సృజన అయిన నూతన యంత్రాలు, సముదాయాల అవిష్కరణతో ముడిపడి ఉన్నాయి. యంత్రాలు, కణ సముదాయాలపై పేటెంట్లు, రెండు పారిశ్రామిక విప్లవాలయిన మెకానికల్ ఇంజనీరింగును, రసాయన ఇంజనీరింగును ప్రతిబింబించాయి. అయితే, జన్యుపరమైన ఇంజనీరింగు రూపంలో మరో నూతన పారిశ్రామిక విప్లవం వృద్ధిలోకి వస్తోంది. జీవరీతులను జన్యుపరమైన స్థాయిలో మార్పు చేయటం, వాటిని పునర్ నిర్మించటం ఈ ఇంజనీరింగు విభాగపు లక్షణం. అందుచేత జీవరీతుల భిన్నత్వాన్ని సూచించే పర్యావరణ సంబంధిత పదమైన-జీవరీతులు లేదా జీవ వైవిధ్యాన్ని కూడా తన పరిధిలోనికి తీసుకొనే విధంగా పేటెంట్లను విస్తరించే ప్రయత్నం జరుగుతోంది

జీవాన్ని పేటెంటు చేసే మొదటి ప్రయత్నం జన్యుపరంగా మార్పిడి చేయబడిన సూక్ష్మజీవుల విషయంలో జరిగింది. కొన్ని గమనార్హమయిన మినహాయింపుల విషయంలో తప్ప ప్రయోగశాలలో సృష్టించిన సూక్ష్మజీవులను. అమెరికా పేటెంట్ల చట్టం పరిధిలోకి తెచ్చే ఉద్దేశ్యం లేదని, 1980వ సంవత్సరానికి ముందు, అమెరికా పేటెంట్లు, ట్రేడ్ మార్కుల కార్యాలయం పేర్కొంది. అయితే పేటెంట్లు, ట్రేడ్ మార్కుల కమీషనరు మరియు చక్రవర్తి అనే వ్యక్తుల మధ్య నడిచిన వివాదంలో, 1980వ సంవత్సరం జూన్ 16వ తేదీన అమెరికా సుప్రీం కోర్టు ఒక భిన్న తరహా తీర్పును ఇచ్చింది. ఈ తీర్పు ప్రకారంగా చమురును విచ్ఛిత్తి చేయగల నూతన మానవ సృష్టి అయిన సూక్ష్మ జీవిపై కోర్టు పేటెంటును ఆమోదించింది. ఈ సూక్ష్మజీవి ఉత్పాదక లేదా పదార్థ నిర్మాణ సంబంధిత అంశాలను కలిగి ఉన్నది కనుక, అది పేటెంటుకు అర్హమేనని కోర్టు పేర్కొంది.

కథ ఇలా నడిచింది: 1980వ సంవత్సరంలో, జన్యుపరంగా మార్పిడి చేయబడిన ఒక బాక్టీరియాపై పేటెంటుకుగాను జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీ మరియు దానిలోని ఒక ఉద్యోగి అయిన ఆనందమోహన చక్రవర్తులు దరఖాస్తు చేసారు. ఈ విషయంలో వాస్తవానికి జరిగింది, అప్పటికే ఉనికిలో ఉన్న ఒక బాక్టీరియాలోని జన్యువులను కాస్త అటూ ఇటూ మార్చడం మాత్రమే. కాగా, జీవాన్ని 'సృష్టించానని' చక్రవర్తి ఈ కేసులో చెప్పుకోలేదు అయితే, అమెరికా సుప్రీంకోర్టు మాత్రం ఈ సూక్ష్మజీవిని జన్యుపరంగా మార్పిడి చేయటం 'ఉత్పత్తి'గానే పేర్కొంది. తదనుగుణంగా చక్రవర్తికి ఈ బాక్టీరియాపై పేటెంటు లభించింది. ఈ సూక్ష్మజీవి ప్రకృతి సృష్టి కాదుకనక, అది చక్రవర్తి సొంత అవిష్కరణ కనుక, అది పేటెంటుకు అర్హమేనని కోర్టు పేర్కొంది ఈ కేసు గురించి వ్యాఖ్యానిస్తూ, అమెరికాకు చెందిన ప్రఖ్యాత న్యాయవాది ఆండ్రూ కింబ్రోల్ ఇలా పేర్కొన్నారు: 'గతంలోని తీరు తెన్నులను బద్దలు చేసే ఈ నిర్ణయం తీసుకోవటం ద్వారా, అవిష్కర్తే స్వయంగా తన "సృష్టిని" కేవలం

'నూతన జీవరాసి సృష్టి కాదని, అది జన్యువులను అటూ ఇటూ మార్చటం మాత్రమే" అని పేర్కొనటాన్ని విస్మరించింది. ఈ విధంగా సరైన పునాదులు లేకుండానే జీవంపై తొలి పేటెంటును ఇచ్చారు అలాగే; వృక్ష జాతులు, జంతువులకు అమెరికా పేటెంటు చట్టం నుంచి మినహాయింపు ఉన్నప్పటికీ, ఈ మొదటి పేటెంటు ఇవ్వబడిన నాటినుంచి అమెరికా అన్ని రకాల జీవరీతులపై పేటెంట్లను ఇచ్చేందుకై ఆత్రుత పడుతోంది.

ఒక జీవ జాతిలోకి కొత్త జన్యువును ప్రవేశపెట్టటం చేసిన ప్రతి జన్యు శాస్త్రవేత్త తాను నూతన 'ఆవిష్కారం' 'తయారీ' చేసానని ప్రకటించుకొనే అవకాశం లభించింది. తద్వారా, వారికి పేటెంట్లు కోరే అవకాశం లభించింది. ఈ పేటెంట్ల ఫలితంగా, మరే ఇతరులు అదే తరహా జీవాన్ని 'తయారుచేసే' అవకాశం ఉండదు. అలాగే ఈ జీవాన్ని; పేటెంటు యజమానికి రాయల్‌టీలు చెల్లించకుండా ఉపయోగించే, అమ్మే హక్కు ఎవ్వరికీ వుండదు. పలువురు పరిశోధకులు, కార్పొరేటు సంస్థలు జన్యుపరంగా మార్పిడి చేసిన చేపలు, ఆవులు, చిట్టెలుకలు, పందులు మొదలైన వందలాది జంతువులపై పేటెంట్లకై బారులు కట్టడం మొదలైంది. ఈ విధంగా సూక్ష్మజీవులపై పేటెంట్లు ఇవ్వడం; నేడు వృక్ష జాతులు, తదనంతరం జంతువులపై పేటెంట్లకై నిర్దాక్షిణ్యమైన ప్రయత్నాలకు దారి తీసింది. జీవరీతులపై పేటెంట్లను ఏమంత పెద్ద వివాదాస్పదంగా కనబడనీయకుండా చేసేందుకుగాను జీవ వైవిధ్యాన్ని, 'జీవ సాంకేతిక అవిష్కరణలు', 'జన్యుపరమైన నూతన నిర్మాణాలు'గా పునర్ నిర్వచించారు ఈ పేటెంట్లు 25 సంవత్సరాలపాటు చెల్లుతాయి. కాబట్టి, ఇవి వృక్ష, జంతు జాతుల భావి తరాలకు కూడా అన్వయిస్తాయి. ఏది ఏమైనా విశ్వవిద్యాలయాలు, లేదా కార్పొరేటు సంస్థలకు చెందిన శాస్త్రవేత్తలు వివిధ జీవాలలోని జన్యువులను కాస్తంత అటూ ఇటూగా మార్చడం మాత్రమే చేస్తున్నారు తాము పేటెంటు తీసుకొంటున్న జీవాన్ని, వారు వాస్తవానికి 'సృష్టించటం' లేదు. కోర్టు తీర్పులలో పెద్ద మలుపు అయిన చక్రవర్తి కేసులో, చక్రవర్తి నూతన జీవరీతిని సృష్టించలేదని పలువురు అమెరికా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. భిన్న తరహాల బాక్టీరియాలు, జన్యుపరమైన సమాచారాన్ని మార్పిడి చేసుకొని నూతన తరహా బాక్టీరియాను సృష్టించుకొనే సాధారణ ప్రక్రియలో చక్రవర్తి కేవలం జోక్యం చేసుకున్నాడు. 'ఆయన' బాక్టీరియా, అన్ని కణజీవులు జీవించే, పునరుత్పత్తి చేసుకొనే శక్తుల ప్రభావం కిందే జీవిస్తోంది. అంటే, మనం నూతన జీవితాన్ని సృష్టించే సామర్థ్యానికి చాలా చాలా దూరంలోనే ఉన్నాం. కాబట్టి, చక్రవర్తి బాక్టీరియాను సృష్టించాడనే వాదన మానవుల శక్తి సామర్థ్యాలను అతిశయించటమే. ఇది జీవశాస్త్ర రంగంలో అజ్ఞానాన్ని వెల్లడిస్తోంది దీనంతటి ఫలితంగా, మన భూగోళపు పర్యావరణంపై వినాశకర ప్రభావం పడుతుంది. జీవంపై పేటెంట్లు, ఇతర జీవరీతులను ఆవిష్కరించేవానిగా మానవుని ముందుకు తీసుకురావటం అనేవి ఆర్థికపరంగానూ, పర్యావరణ పరంగానూ పెను ప్రభావాన్ని కలుగజేస్తాయి ఇక వీటితోపాటుగా ఈ పరిణామాలవలన ఏర్పడే నైతికపరమైన సమస్యల గురించి వేరే చెప్పనవసరంలేదు జీవ జాతులు తమను తాము 'తయారు చేసుకుంటాయి' – ఎదుగుతాయి, పునరుత్పత్తి చేసుకొంటాయి; పునరుజ్జీవింప చేసుకొంటాయి. సంఖ్యాపరంగానూ పెరుగుతాయి. ఇదంతా, ఆ జీవజాతుల తాలూకు అంతర్గతమైన సంక్లిష్ట, క్రియాశీల నిర్మాణాల ద్వారా జరుగుతుంది. జీవ జాతులను కాస్తంత అటూ ఇటుగా మార్చటం, జీవాన్ని 'తయారు చేయటం'తో సమానం కాదు జీవ జాతులలోకి జన్యువులను ప్రవేశపెట్టటం, జీవాన్ని 'తయారు చేయటం' ఏమాత్రం కాదు. జీవంపై

పేటెంట్లు తీసుకోవటం, సృష్టికర్త, లేదా భగవంతుని పాత్రను తమకు తాము ఆపాదించుకోవటమే. జీవ వైవిధ్యం, దాని తాలూకు జన్యువులు, కణాలు, ప్రక్రియలు, ఉత్పత్తులపై పేటెంట్లు తీసుకోవటం సాధ్యమైన మరుక్షణం; జన్యుపరంగా మార్పిడి చేయబడిన జీవజాతులపై పేటెంట్లు తీసుకోవటం పరిధిని దాటి, వృక్ష జాతులపై పేటెంట్లు కోరే ప్రక్రియ ప్రారంభం కావటం ఏమంత కష్టం కాదు.

జీవ వనరులను సంబంధించిన పేటెంట్లు; జీవవైవిధ్యపు మనుగడ, దానిని సరైన రీతిలో వినియోగించుకోవటం మొదలైనవాటిపై పర్యావరణపరంగా పెద్ద ప్రభావాలను కలిగి వుంటాయి. పేటెంట్ల ద్వారా జీవ 'సంపద'ను సృష్టించటం వలన ఆర్థికంగా శక్తివంతమైన కార్పొరేటు సంస్థలు, గతంలోని భూస్వాములు, లేదా జమీందార్లలాగా, నూతన 'జీవ-యజమానులు'గా తయారు అవుతాయి. నాటిన ప్రతి విత్తనంపైనా, అలాగే తరతరాలుగా ప్రజలకు ఎటువంటి వ్యయం లేకుండా అందుబాటులో ఉన్న ప్రకృతిలోని జీవవైవిధ్యపు కానుకలనుంచి తయారు చేసిన ప్రతి ఔషధంపైనా, ఈ కార్పొరేటు సంస్థలు అద్దెను వసూలు చేసుకోగలవు. ఈ రకంగా, పేటెంట్ల ద్వారా 'జీవంపై అద్దె' వసూలు చేసుకొనే అధికారం ఇవ్వటం, కోట్లాది ప్రజలను మనుగడ అంచుకు నెట్టివేయడాన్ని మాత్రమే హామీ చేయగలదు.

యూరోపేతర ప్రజలను పరిపాలించే సహజహక్కు యూరోప్ దేశాలవారికి ఉందనే అనవాయితీని మొదటగా కొలంబస్ సృష్టించాడు. యూరోపేతర దేశాలలో భూమిపై అసలు హక్కులు కలిగి ఉన్న ప్రజల బానిసత్వం, అణచివేతలపై వలసవాదుల స్వేచ్ఛ నిర్మించబడింది. ఈ హింసాత్మక ఆధిపత్యానికి 'సహజ' హక్కుగా పేరు పెట్టుకొన్నారు. తద్వారా, యూరోపేతర ప్రజల మానవ హక్కులను, స్వేచ్ఛను తిరస్కరించారు. ఈ దోపిడీని, దొంగతనాన్ని లాకే రచించిన ఆస్తికి సంబంధించిన గ్రంథం న్యాయ సమ్మతంగా చిత్రీకరించింది దోచుకొనే హక్కుపై ఆధారపడి, తన వ్యవస్థను నిర్మించుకొనే స్వేచ్ఛను లాకే పెట్టుబడిదారీ వ్యవస్థకు ఆపాదించాడు. ప్రకృతి నుంచి వనరులను తీసుకోవటం ద్వారా మాత్రమే అస్తి సృష్టించబడగలదని ాకే ప్రకటించాడు. ప్రకృతి నుంచి తీసుకొన్న సంపదకు విలువను జోడించడాన్ని పెట్టుబడి మాత్రమే చేయగలదనేది లాకే వాదన. అంటే, పెట్టుబడి కలిగివున్న వారికి మాత్రమే ప్రకృతి వనరులపై సహజమైన హక్కు ఉంది. ఈ హక్కు, భూమిపై ముందుగా యాజమాన్యం ఉన్నవారి హక్కులను పూర్వపక్షం చేయగలదు. అంటే, పెట్టుబడిని స్వేచ్ఛకు మూలంగా లాకే నిర్వహించాడు. ఫలితంగా భూమి, అడవులు, నదులు, జీవ వైవిధ్యంపై స్థానిక ప్రజల హక్కులను తిరస్కరించటంపై పెట్టుబడి తాలూకు ఈ స్వేచ్ఛ ఆధారపడి వుంది. స్థానిక ప్రజల సామూహిక ఆస్తిని ప్రైవేటు పరం చేయటం ద్వారా ఆస్తిని సంపాదించుకోవటం స్వేచ్ఛకు ప్రతీకగా చేయబడింది. ఫలితంగా, ఆ ఆస్తి సొంతదారులం తామేనన్న స్థానికులు పెట్టుబడి యజమానుల తాలూకు స్వేచ్ఛను హరిస్తున్నట్లుగా భావించటం జరిగింది. అందుచేత, వనరులపై తమ హక్కులను, అదుపును తిరిగి తమకే చెందేలా చేయాలని డిమాండ్ చేసిన స్థానిక రైతులు, గిరిజనులు దొంగలుగాను, విధ్వంసకులుగాను బావించడ్డారు.

గతంలో భూ ఖండాలను, భూమిని స్వాధీనం చేసుకోవటం; నేడు జీవవైవిధ్యాన్ని, స్థానిక ప్రజల విజ్ఞానాన్ని దోచుకోటం ఈ రెండూ స్థానిక ప్రజలను భూమినుంచి 'వేరుచేయటం', అలాగే

వారిని తమ పరిసరాల తాలూకు జీవవైవిధ్యం నుంచి దూరం చేయటంపై ఆధారపడి వున్నాయి. వైవిధ్య భరితమైన స్థానిక నాగరికతలన్నీ భూమిని సకల సంపదలకూ మూలమైన మాతృమూర్తిగా భావించాయి. కాగా, వలసవాదం భూమిని నిర్జీవమైనదిగాను, ఖాళీ అయినదనిగాను భావించింది. ఈ భావనకు రెండు నిర్దిష్ట లక్ష్యాలున్నాయి – స్థానిక ప్రజల ఉనికిని, ముందస్తు హక్కులను నిరాకరించటం; భూమిపై ఉన్న జీవప్రక్రియలను పునరుజ్జీవింపచేసుకొనే శక్తిని తిరస్కరించటం. ఉదాహరణకు ఆస్ట్రేలియా విషయంలో మొత్తం భూ ఖండాన్ని గతంలో మానవ ఉనికిలేని ప్రాంతంగా ప్రకటించటం ద్వారా, ఆ భూ ఖండాన్ని, దాని ప్రకృతి వనరులను సొంతం చేసుకొనే హక్కును వలసవాదులు పొందారు. ఈ ప్రకటన ద్వారా స్థానికుల సమష్టి ఆస్తిని తేలికగా వలసవాదులు సొంతం చేసుకోగలిగారు. ఎందుచేతనంటే, వలసవాదుల సిద్ధాంతం ప్రకారంగా, ఆస్ట్రేలియాలో అసలు స్థానికులే లేరు!

యూరోప్ కేంద్ర బిందువుగా సాగే ఆస్తి తాలూకు భావన, కేవలం ధనరూప పెట్టుబడిని మాత్రమే అసలైన పెట్టుబడిగా భావిస్తుంది అందుచేత ఈ రకమైన పెట్టుబడిపై రాబడిని మాత్రమే పరిరక్షణకు అర్హమైన ఏకైక హక్కుగా భావించింది కాగా, పాశ్చాత్యేతర స్థానిక ప్రజలు, సంస్కృతులు; శ్రమను లేదా ప్రకృతిని కాపాడుకుంటూ వినియోగించుకోవడాన్ని కూడా పెట్టుబడిగానే భావించాయి. అంటే, ఈ సాంస్కృతిక వ్యవస్థలు పాశ్చాత్య పెట్టుబడి నిర్వచనపు అవలి పెట్టుబడులను కూడా పరిరక్షించుకోవలసినవిగా భావించాయి. అవి ప్రకృతిని కాపాడుకుంటూ వినియోగించుకొనే సంస్కృతిని, పరస్పర శ్రద్ధ, సంపదను పంచుకోవటాన్ని కూడా గౌరవించాయి.

యూరప్‌లో ఎంక్లోజర్‌ల (ఆక్రమిత ప్రాంతాల) ఉద్యమం, వలస వాద ఆధిపత్య కాలంలో రూపు దిద్దుకొన్న వనరుల యాజమాన్య భావనకు; వైవిధ్య భరిత సమాజాలలో, యావత్ చారిత్రక కాలంలోను గిరిజనులు, రైతులు పాటించిన 'యాజమాన్య' విధానానికి మధ్య ప్రధానమైన తేడాలు చాలా ఉన్నాయి. వీటిలో మొదటిది యాజమాన్యాన్ని, ప్రైవేటు ఆస్తిగా భావించటంపై ఆధారపడి ఉంది. అలాగే అది, లాభాలకై, పెట్టుబడిపై రాబడి భావంపై ఆధారపడి ఉంది. మరో ప్రక్క వలసవాద ఆక్రమిత స్థానిక ప్రజలు, ఫలభోగ హక్కుల ద్వారా, తమ తమ పిల్లల, కుటుంబాల, సమూహాల జీవనాధారానికై శ్రమపై రాబడి హక్కు భావనను నమ్ముకున్నారు. ఫలభోగ హక్కులను (భూమిపై అనుభవ హక్కులను) వ్యక్తిగతంగాను, లేదా సామూహికంగాను కూడా కలిగివుండవచ్చు. ఈ హక్కులు సామూహికమైనవైనప్పుడు, అది సామూహిక ఆస్తిగా నిర్వచించబడింది.

**సామూహిక హక్కుల అతిక్రమణ:**

జీవ వైవిధ్యాన్ని, విజ్ఞానాన్ని 'అతిక్రమించటం' ఈ అతిక్రమణల పర్వంలోని తుది అడుగు. ఇది వలసవాద ఆవిర్భావంతో ఆరంభం అయ్యింది. భూమి, అడవులు; మొట్టమొదటగా 'అతిక్రమించబడ్డాయి.' తద్వారా అవి సామూహిక ఆస్తినుంచి సరకులుగా రూపాంతరం చెందాయి. తరువాత ఆనకట్టలు, భూగర్భ జలాల వెలికితీత, ప్రైవేటీకరణ పథకాల ద్వారా జలవనరులను 'అతిక్రమించారు.' ఇక ఇప్పుడు మేధో సంపత్తి హక్కుల వ్యవస్థ ద్వారా జీవ వైవిధ్యం, విజ్ఞానాల వంతు వచ్చింది.

ప్రపంచీకరణ యుగంలో, సమష్టి ఆస్తి అతిక్రమించబడుతోంది. అలాగే సామూహిక వ్యవస్థల అధికారాన్ని కార్పొరేటు సంస్థలు కాలరాస్తున్నాయి. జీవరాసే కార్పొరేటు సంస్థల ప్రైవేటు ఆస్తిగా మార్చివేయబడుతోంది. కార్పొరేటు సంస్థల అతిక్రమణ రెండు విధాలుగా జరుగుతోంది మొదటగా, మేధోసంపత్తి హక్కుల రక్షణ వ్యవస్థ ద్వారా జీవ వైవిధ్యాన్ని, విజ్ఞానాన్ని 'అతిక్రమిస్తున్నారు ' ఈ విధంగా సమష్టి ఆస్తులు, సామూహిక వ్యవస్థలు అంతరించిపోతున్నాయి. రెండవది, చట్టపరంగా వ్యక్తిత్వం కలదిగా గుర్తింపుగల కార్పొరేటు సంస్థల రూపంలోని సముదాయాలు మాత్రమే ఏకైక సముదాయ రూపంగా గుర్తింపు పొందుతున్నాయి.

పారిశ్రామిక విప్లవానికిగాను సమష్టి ఆస్తిని ధ్వంసం చేయటం తప్పనిసరి అవసరం అయ్యింది. తద్వారా మాత్రమే పారిశ్రామిక రంగానికి ముడిసరుకుల సరఫరాను గ్యారంటీ చేయవచ్చు. ఎందుచేతనంటే, జీవ-భద్రతా వ్యవస్థ కేవలం పంచుకోడానికి మాత్రమే వెసులుబాటు కల్పించేది. దానిని ప్రైవేటు ఆస్తిలా స్వంతం చేసుకోవటమో, లేదా ప్రైవేటు లాభానికై దోపిడీ చేయటమో సాధ్యంకాదు అందుచేత, సమష్టి ఆస్తిపై ఆధారపడిన ప్రజల జీవనాధారాన్ని దోపిడీ చేయాలి. పారిశ్రామిక ప్రగతి యంత్రాన్ని పెంచి పోషించేందుకు పెట్టుబడిని కూడబెట్టేందుకు ఇది తప్పనిసరి. సమష్టి ఆస్తిని అతిక్రమించటాన్ని, పేదలకు వ్యతిరేకంగా ధనికుల విప్లవంగా పేర్కొనవచ్చు. అయితే, ఈ అతిక్రమణలు అనేవి కేవలం 16వ శతాబ్దపు ఇంగ్లాండ్‌లో మాత్రమే జరిగిన చారిత్రక ఘటన కాదు. మేధోసంపత్తి హక్కుల రక్షణ వ్యవస్థను జీవవైవిధ్యానికి విస్తరించే క్రమంలో ఉత్పన్నం అయ్యే ఘర్షణలను అర్థం చేసుకొనేందుకు, సమష్టి ఆస్తిని అతిక్రమించటం తాలూకు సూత్రం మార్గదర్శకం కాగలదు.

ఇంగ్లాండ్‌లో ఆరంభమైన అడవుల నరికివేత విధానం, అలాగే సమష్టి ఆస్తిని అతిక్రమించటం; తదనంతరం భారతదేశంవంటి వలసలలో పునరుక్తం అయింది. 1865వ సంవత్సరంలో సుప్రీం లెజిస్‌లేటివ్ కౌన్సిల్ ఆమోదించిన తొలి భారతీయ అటవీచట్టం అడవులను, బంజరు భూములను రిజర్వ్ ఫారెస్టులుగా ప్రకటించే అధికారాన్ని ప్రభుత్వానికి ఇచ్చింది. అడవులను 'శాస్త్రీయంగా యాజమాన్యం' చేయటం అని పిలిచే ప్రక్రియకు ఈ చట్టం ఆరంభకారకమైనది. అడవులను నరికేందుకు, అలాగే అటవీ ఉత్పత్తులపై స్థానిక ప్రజల హక్కులను హరించివేసేందుకు ఈ చట్టం ప్రాతిపదికను కల్పించింది. ఈ చట్టం ప్రకారం అడవులు జాతీయ సంపత్తిగా మార్చివేయబడినప్పటికీ, రిజర్వుఫారెస్టులనేవి వాస్తవానికి అతిక్రమణలే. ఎందుచేతనంటే, ఈ చట్టం సామూహిక వనరులను వాణిజ్యపరం చేసింది. ఈ ప్రయివేటీకరణ క్రమంలో రాజ్యం కేవలం మధ్యవర్తి పాత్ర వహించింది.

వలస వాదకాలంలో; ఆహారాన్ని పండించే బదులుగా నీలిమందు తోటలను పెంచే విధంగా రైతులపై వత్తిడి తెచ్చారు. బ్రిటీషు సైన్యానికి వనరులను సమకూర్చి పెట్టేందుకుగాను ఉప్పుపై పన్నును వేశారు మరో పక్క అడవులను అతిక్రమించి, వాటిని వాణిజ్య పరమైన దోపిడీకై ప్రభుత్వ గుత్తాధిపత్యంలోకి తెచ్చారు. దీనిఫలితంగా గ్రామీణ ప్రాంతాలలో ఆహారం, వంటచెరుకు, పశుసంపద మేతకై సమష్టి ఆస్తినుంచి లభించే ఫలభోగహక్కులను పొందే అవకాశం రైతులకు క్రమేణా కరవైపోయింది తమకు చెందిన అడవులు, పవిత్రమైన ఔషధమొక్కలు బంజరు భూములపై

రైతాంగానికి హక్కులు హరించుకుపోవటం-వారు పేదరికంలోనికి నెట్టివేయబడటానికి ప్రధాన కారణం.

జీవ వైవిధ్యం అనేది గతంలో యావత్తు, స్థానిక సమాజపు యాజమాన్యంలో ఉండేది. స్థానిక ప్రజా సమూహాలు ఈ సంపదను వినియోగించుకొనేవి. న్యాయబద్ధత, అలాగే పునరుజ్జీవన సూత్రాల ప్రాతిపదికగా వనరులను వినియోగించుకునే సామాజిక వ్యవస్థ వున్నప్పుడు ఆ వనరులు సామూహిక ఆస్తిగా వుండేవి. ఈ సూత్రాలలో లబ్ధిదారులకు వర్తించే విధుల, బాధ్యతల కలయిక; వినియోగం, పరిరక్షణల కలయిక ఉన్నాయి. అలాగే ప్రకృతితో చేదోడువాదోడుగా సహ ఉత్పత్తి భావన కూడా ఉంది. అంతేకాకుండా, భిన్న సమూహాల సభ్యులమధ్య సంపదను పంచుకొనే న్యాయం కూడా వుంది. ఈ సమూహాలకు చెందిన ప్రజలు తమ వారసత్వాన్ని ఆస్తిగా చూడలేదు. అంటే, వారు ఆ వారసత్వ సంపదను యజమాని ఉన్న వస్తువుగా చూడలేదు. ఆర్థిక లబ్ధికై దానిని ఉపయోగించుకునే ఉద్దేశ్యమూ లేదు. కాగా, దీనికి భిన్నంగా ఈ సంపదను వారు సామూహిక వారసత్వంగానూ, వ్యక్తిగత బాధ్యత వహించవలసినదిగాను చూశారు. స్థానిక ప్రజల దృష్టిలో ఈ వారసత్వం పరస్పర సంబంధాల సమూహం. అది అర్థిక హక్కుల సముదాయం ఏమాత్రమూ కాదు. దీనివలననే, సామూహిక సంపదపై సమాజాలలో 'ప్రయివేటు ఆస్తి' అనే భావన ఏమాత్రమూ లేదు.

కొన్ని నూతన ఆవిష్కరణలను కొందరు వ్యక్తులు ముందుగా ప్రవేశపెట్టినప్పటికీ, ఆవిష్కరణ అనేది సామాజిక, సమష్టి ప్రక్రియగా స్థానిక ప్రజలు భావించారు. అంటే, ఆవిష్కరణల ఫలితాలు, వాటి అవసరం వున్న ఎవరికైనా స్వేచ్ఛగా లభించేవి. ఫలితంగా, జీవ వైవిధ్యమే కాక దాని వినియోగం కూడా మొత్తం సమాజానికి చెందేది. తద్వారా ఆ ఆవిష్కరణలు ఒక జనసమూహంలోనూ లేదా వివిధ జనసమూహాల మధ్య స్వేచ్ఛగా మార్పిడి అయ్యేవి. నూతన ఆవిష్కరణల ఫలితంగా లభించిన సామూహిక విజ్ఞాన వనరులు శతాబ్దాలపాటు ఒక తరంనుంచి మరొక తరానికి బదలాయింపు అయ్యేవి. అలాగే, ఈ ఆవిష్కరణలు నూతన వినియోగ రీతులలోకి కూడా మరలేవి. కాలక్రమేణా ఈ ఆవిష్కరణలు సామాజిక విజ్ఞాన సంపదలలో మమేకం అయ్యేవి. నేడున్న విస్తారమైన వ్యవసాయక, ఔషధ సంబంధిత వృక్షాల వైవిధ్యానికి ఈ సామూహిక విజ్ఞాన సంపద అనంతంగా దోహదపడింది. అంటే, వనరుల విషయంలోకానీ లేదా విజ్ఞానం విషయంలోకానీ వ్యక్తిగత 'ఆస్తి' హక్కు అనేది స్థానిక ప్రజల పరిభాషలో లేనేలేదు. కాబట్టి, స్థానిక ప్రజల విజ్ఞాన సంపదను అపహరించటం అనేది ఆ ప్రజలకు, అలాగే జీవవైవిధ్యపు పరిరక్షణకు తీవ్రమైన చెరుపు చేస్తుంది.

సామూహిక వ్యవస్థలు, సమాజాలు స్వయం నిర్ణాయక అనవాయితీల ప్రకారం నడిచేవి. అంటే, అని తమను తాము పరిపాలించుకొనేవి కాగా, 'వలసవాద', 'అభివృద్ధి' శకంలో ఈ సామూహిక వ్యవస్థలు అతిక్రమించబడుతున్నాయి. రాజ్యం ఈ సమాజాల అధికారాలకు ఎసరు పెడుతున్నది నీటినీ, అడవులను ప్రభుత్వ ఆస్తిగా మార్చారు దీనివలన, స్థానిక సమాజాలు ఆ సంపదనుంచి దూరం చేయబడ్డాయి. ఆ వనరుల పునాదులు ధ్వంసం అయ్యాయి. ఈ విధంగా రాజ్యం ఆధ్వర్యంలో జరిగిన 'అతిక్రమణలు' పేదరికానికి, పర్యావరణ విధ్వంసానికి, సామాజిక విచ్ఛిత్తికి, రాజకీయ అసహాయతకు కారణం అయ్యాయి. భారతదేశంలో అత్యధిక సంఖ్యాకులైన గ్రామీణుల హక్కులను రక్షించేందుకుగాను నేడు మనం ప్రభుత్వం, మార్కెట్ వ్యవస్థల పరిధిని దాటి ఆలోచించాలి. సమాజానికి హక్కులను కట్టబెట్టటం మాత్రమే సామూహిక సంపద పరిస్థితిని మెరుగు పరచగలదు. సామూహిక

సంపద అనేది సమాజపు అదుపులో రూపు దిద్దుకొనే, యాజమాన్యం చేయబడే, వినియోగించుకోబడే వనరు. ఈ సామాజిక సంపద నుంచి ఏ ఒక్కరినీ వేరు చేయలేము. ఈ సామాజిక సంపదను ఆర్థికంగా శక్తివంతులైన పౌరులు లేదా కార్పొరేటు సంస్థలు లేదా రాజకీయంగా శక్తివంతమైన రాజ్యం గుత్త సొత్తుగా చేసుకోలేవు. గిరిజనులు, గ్రామీణ సమాజాలు నేడు రాజ్యం అదుపులోని 'అతిక్రమణల' అదుపులో ఉన్నాయి. కాగా, మరోప్రక్క పేటెంట్ల రూపంలో జీవరీతులు, జీవవైవిధ్యంపై కార్పొరేటు సంస్థలు, ప్రపంచ వాణిజ్య సంస్థ ఆధ్వర్యంలోని నూతన 'అతిక్రమణల' తాలూకు పనిముట్లు రూపుదిద్దుకుంటున్నాయి.

మన దేశంలో జీవ వైవిధ్యమనేది చిరకాలంగా మన సాంప్రదాయక సమాజాలకు చెందిన కోట్లాదిమంది ప్రజల సామూహిక వనరు. ఈ ప్రజలు ఆ సంపదను శతాబ్దాలనుంచి వినియోగించుకుంటూ, రక్షించుకుంటూ, అలాగే దాని తాలూకు వైవిధ్య వారసత్వాన్ని పదిలపరుచుకుంటూ వచ్చారు. వీరి సమష్టి, సంయుక్త ఆవిష్కరణలు; స్థానిక సంస్కృతి, స్థానిక ఆర్థిక వ్యవస్థలకు పునాదిగా వున్నాయి. జీవన భృతిని కల్పించటంలోను, అవసరాలను తీర్చటంలోనూ ఈ ఆవిష్కరణలు ప్రధాన ఆర్థిక శక్తిగా ఉన్నాయి. వాస్తవానికి వైద్యం, వ్యవసాయం, చేపల పెంపకాలలోని ఈ సాంప్రదాయక విజ్ఞానం ప్రజల ఆహారం, ఆరోగ్య అవసరాలను తీర్చే ప్రధాన పునాదిగా వుంది. పలు సమాజాలలో జీవవైవిధ్యాన్ని పరిరక్షించుకోవటం అంటే ప్రాకృతిక వ్యవస్థ, జీవ జాతుల సమగ్రతను పదిల పరచుకోవటమే. అలాగే, వనరులు, విజ్ఞానం, ఉత్పాదక వ్యవస్థలపై హక్కు అనేది ఈ జీవ వైవిధ్యంపైనే ఆధారపడి వుంది. అందుచేత, జీవ వైవిధ్యం అనేది సాంప్రదాయక మూలవిజ్ఞాన వ్యవస్థలు, అలాగే తమ విజ్ఞానాన్ని, వనరులను రక్షించుకొనే ప్రజల హక్కులతో గాఢంగా ముడిపడివుంది.

# 4.జీవ చౌర్యం

**జీవ చౌర్యం అంటే ఏమిటి?**

పారిశ్రామికేతర సంస్కృతులు శతాబ్దాలనుంచి వినియోగించుకుంటున్న జీవ వనరులు జీవ ఉత్పత్తులు - ప్రక్రియలపై అవిభాజ్య యాజమాన్యాన్ని చట్టబద్ధం చేసేందుకుగాను మేధో సంపత్తి హక్కుల వ్యవస్థను వినియోగించుకోవటాన్ని జీవచౌర్యంగా పేర్కొనవచ్చు. మూడవ ప్రపంచ దేశాల ప్రజల ఆవిష్కరణలు, సృజనాత్మకత, మేధస్సుపై ఆధారపడిన జీవ వైవిధ్యం, స్థానిక పరిజ్ఞానాలపై పేటెంట్లను కోరటం 'జీవచౌర్యం'చర్యగా ముద్రవేయబడుతున్నది. 'పేటెంటు'ను ఆవిష్కరణకు ఇస్తారు కనుక, స్థానిక పరిజ్ఞానంలో నిక్షిప్తంగా ఉన్న ఆవిష్కరణకు పేటెంటు నిరాకరించబడుతోంది. పేటెంట్లను జారీచేసే, ఆవిష్కరణలకు పురస్కారాన్ని ఇచ్చే పరుగుపందెంలో, కార్పొరేటు సంస్థలు, పారిశ్రామిక దేశాల ప్రభుత్వాలు తరతరాలుగా గ్రామీణ సమాజాలలో ప్రోది అయిన శతాబ్దాల చరిత్రగల సమష్టి, సమీకరించబడిన ఆవిష్కరణలను విస్మరిస్తున్నాయి.

పాశ్చాత్య దేశాల పేటెంటు వ్యవస్థలోని అసంపూర్ణత, అలాగే ఇతర సంస్కృతుల పట్ల పాశ్చాత్య దేశాల చిన్నచూపువలన జీవచౌర్యం జరుగుతోంది. పాశ్చాత్య దేశాల పేటెంటు వ్యవస్థ దిగుమతుల గుత్తాధిపత్యానికై రూపొందించబడింది. అది అన్ని విజ్ఞాన వ్యవస్థలను క్షుణంగా పరిశీలించి, ఇప్పటికే అస్తిత్వంలో ఉన్న ఆవిష్కరణలను, ఇతర సంస్కృతుల చారిత్రక విజ్ఞాన సంపదను పేటెంట్ల పరిధినుంచి మినహాయించేందుకు ఉద్దేశించినది కాదు. ఇతరేతర ప్రజలు, వారి హక్కులు, వారి విజ్ఞానాన్ని ఉనికిలో లేనిదిగా పరిగణించడం ద్వారా పాశ్చాత్య సంస్కృతి తన లూటీ చేసే హక్కును ప్రకటించుకుంటోంది. కొలంబస్ అమెరికాను కనుగొన్నప్పుడు దానిని అనివేశ ప్రాంతంగా భావించాడు. కాగా నేడు, ఇతరేతర దేశాల సనాతన సృజనాత్మకతను, హక్కులను, పాశ్చాత్య దేశాలు ఈ విధంగానే విస్మరిస్తున్నాయి. తద్వారా; ఆ సృజనాత్మకత, హక్కులను 'ఆవిష్కరణల' పేరిట 'సొత్తు'గా చేసుకోచూస్తున్నాయి.

జీవ వైవిధ్యానికి సంబంధించిన విజ్ఞానానికి అన్వయించినప్పుడు; రసాయనాలను, జన్యువులను విడివిడి చేసి చూసే చర్యను మేధోపరంగాను, భౌతికంగాను కూడా సృజనగానే పరిగణిస్తున్నారు. జీవ జాలంలో ఉపయుక్తమైన లక్షణాలను గుర్తించేందుకుగాను స్థానిక విజ్ఞానం నుంచి ఆధారాలను పొందుతున్నారు. వృక్షజాతుల నుంచి తయారు చేయబడి, విరివిగా అమ్ముడవుతోన్న 947 మేరకు ఔషధాలలో సాంప్రదాయక వైద్యవిజ్ఞానంలో వినియోగించే మూలపదార్థాలలో, కనీసం ఒక్కటైనా ఉంది. స్థానిక విజ్ఞానాన్ని సొంతం చేసుకోవటం, జీవ వైవిధ్యాన్ని వినియోగించుకోవటం; అటు

మేధోపరంగాను లేదా ఇటు భౌతిక స్థాయిలో కూడా సృజనాత్మక చర్యకాదు. మేధోపరంగా చూస్తే, ఇటువంటి ఆవిష్కరణ ఇప్పటికే స్థానిక విజ్ఞాన వ్యవస్థలో భాగంగా తయారైంది ఇక భౌతికంగా చూస్తే, పేటెంటు చేసిన గుణాలు, తీరుతెన్నులు ప్రకృతిలో ఇప్పటికే ఉన్నాయి వీటిని వేరుచేయటము, వెలికితీయడాన్ని సృజనాత్మకతగా పేర్కొనలేము ఇప్పటికే ఉనికిలో ఉన్న స్థానిక విజ్ఞానాన్ని బదలాయించటం, రూపాంతరం చెందించటం మరియు జీవ రీతులలోని ఉపయుక్తమైన గుణాలను వేరుచేయడాన్ని 'సృజన', 'ఆవిష్కరణ'గా చెప్పుకోవటం పారిశ్రామిక సమాజపు తాలూకు తాత్విక భావనలలో అంతర్భాగంగా ఉంది. ఈ భావనల ప్రకారం పాశ్చాత్యేతర సంస్కృతుల కంటే పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన పాశ్చాత్య సంస్కృతి గొప్పది. ఈ పారిశ్రామిక సంస్కృతి ప్రకృతిని జడత్వంతో కూడుకున్న నిర్జీవ పదార్థంగా భావిస్తుంది. ప్రకృతి, ఇతర సంస్కృతులలోని సృజనాత్మకతను తిరస్కరిస్తూనే, మరోప్రక్క ఆ సృజనాత్మకతను కొల్లగొట్టడాన్ని సృజనాత్మక చర్యగా అభివర్ణించుకొంటున్నారు.

విజ్ఞానపు బహుళత్వం అంచంచల విజ్ఞాన వ్యవస్థగా రూపాంతరం చెందుతోంది. సరిసమానంగా, ఆమోదయోగ్యమైన భిన్నవ్యవస్థలు, అసమాన వ్యవస్థలుగా మార్చివేయబడుతున్నాయి. పాశ్చాత్య పారిశ్రామిక సమాజపు తత్వశాస్త్రపునాదులను ఇతర వ్యవస్థలపై రుద్దుతున్నారు. తద్వారా వాటిని విలువలేనివిగా చేస్తున్నారు. ఈ విధంగా విజ్ఞాన బహుళత్వాన్ని అంచంచల విజ్ఞాన వ్యవస్థగా మార్చివేయడం ద్వారా, తమకు బదలాయించుకొన్న విజ్ఞానాన్ని ఆవిష్కరణగా చెప్పుకుంటున్నారు. విజ్ఞాన బదలాయింపును విజ్ఞాన 'సృష్టి'గా తప్పుడు నిర్ధారణ చేస్తున్నారు. అంటే– ఒక సామాజిక బదలాయింపును, తాత్విక పదాల బదలాయింపుగా లేదా మార్పుగా తప్పుగా నిర్వచిస్తున్నారు. ఈ విధంగా సామాజిక, సాంస్కృతిక బదలాయింపును నూతన విజ్ఞానాన్ని సృష్టించే మొత్తం తాత్విక అంశాల బదలాయిపుంగా భావించే పొరపాటుకు, పాశ్చాత్య విజ్ఞానాన్ని శాస్త్రీయమైనదిగాను, పాశ్చాత్యేతర విజ్ఞానాన్ని అశాస్త్రీయమైనదిగానూ భావించే వలసవాద ఏకపక్షధోరణే కారణం. అయితే, తాత్విక పునాదులలో తేడా స్థానిక విజ్ఞాన వ్యవస్థలను ఏమాత్రం తక్కువస్థాయిగా చేయదు. అది, వీటిని కేవలం భిన్నమైనవిగా మాత్రమే చూపగలదు.

విజ్ఞాన అవసరాల తాలూకు ఈ వైవిధ్యాన్ని గుర్తించాలి. అలాగే గౌరవించాలి. దీనికై స్థానిక విజ్ఞానాన్ని గుర్తించి, గౌరవించటానికి ఆస్కారం కల్పించే స్థానిక విజ్ఞాన వ్యవస్థలను పద్ధతులను, వాటిపైన ఆధారపడిన ప్రజల జీవన భృతిని పరిరక్షించే బహుళత్వంగల మేధో సంపత్తి హక్కుల వ్యవస్థను ఏర్పరచాలి. అందుచేత, భిన్న విజ్ఞాన వ్యవస్థలను, భిన్న సమాజాలను పరిరక్షించేందుకుగాను భిన్న న్యాయ వ్యవస్థలు, మనకు అవసరం. వాణిజ్య సంబంధిత మేధో సంపత్తి హక్కుల వ్యవస్థ (ట్రిప్స్), ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ)ల ద్వారా విశ్వజనీనం చేస్తోన్న చట్టవ్యవస్థ పాశ్చాత్య మేధోసంపత్తి హక్కులకు మాత్రమే పరిమితమై ఉంది. ఈ చట్టవ్యవస్థ, పాశ్చాత్య దేశాలలోని బలీయమైన ఆర్థిక సంస్థలైన బహుళ జాతి సంస్థల ప్రయోజనాలను ప్రతిబింబిస్తోంది.

స్థానిక విజ్ఞాన వ్యవస్థలోని ఒక అంశాన్ని పాశ్చాత్య విజ్ఞాన వ్యవస్థలోకి బదలాయించుకోవడాన్ని పాశ్చాత్య వ్యవస్థలు ఆవిష్కరణగా పరిగణిస్తున్నాయి. దీనికి ప్రతిగా, పాశ్చాత్య న్యాయవ్యవస్థలలో పాశ్చాత్యేతర సమాజాల ప్రయోజనాలు, హక్కులకు స్థానం లేకుండా పోయింది ఈ హక్కులు,

ప్రయోజనాలు, పాశ్చాత్య విజ్ఞాన వ్యవస్థల శాస్త్రవేత్తలకు బదిలీ అవుతున్నాయి. ఈ బదిలీ ప్రధానంగా కార్పొరేటు పెట్టుబడుల అండ వున్నవారికి జరుగుతోంది. వ్యవసాయం, ఔషధ విజ్ఞానాలలో పాశ్చాత్య విజ్ఞాన వ్యవస్థనే ఏకైక శాస్త్రీయ వ్యవస్థగా నిర్వచిస్తున్నారు. స్థానిక వ్యవస్థల విజ్ఞానాన్ని తక్కువ స్థాయి గలదిగాను, అశాస్త్రీయమైనదిగాను నిర్వచిస్తున్నారు తద్వారా, సురక్షితమైన, నిరవధికంగా కొనసాగింప వీలైన వేప మొదలైన వృక్ష ఆధారిత క్రిమిసంహారకాలకు సంబంధించిన పరిశోధనను ముమ్మరం చేసే బదులుగా ప్రమాదకరమైన, దీర్ఘకాలిక ప్రాతిపదికన కొనసాగింపు అసాధ్యం అని డి.డి.టి., సెవిన్ వంటి రసాయన క్రిమి సంహారకాల అభివృద్ధి, వినియోగించటానికి ప్రోత్సహించటాలపై పూర్తిగా మనం కేంద్రీకరిస్తున్నాం. దురదృష్టవశాత్తు, డి.డి టి. వినియోగం వల్ల క్రిమి కీటకాల ప్రభావం 12000 రెట్లు పెరిగింది భోపాల్‌లోని యూనియన్ కార్బైడు ప్లాంటులో సెవిన్ క్రిమిసంహారకాన్ని ఉత్పత్తి చేస్తున్నప్పుడే, విషవాయువు విడుదల ప్రమాదం జరిగింది ఈ ప్రమాదంలో వేలాది మంది చనిపోయారు. 4,00,000 మందికి పైగా అంగవికలులు అయ్యారు

మరోప్రక్క క్రిమికీటకాల నివారణకు రసాయనాల వినియోగం తాలూకు వైఫల్యాన్ని గుర్తించిన అభివృద్ధి చెందిన దేశాలలో వృక్షసంబంధిత క్రిమిసంహారకాలకు ఆదరణ పెరుగుతోంది. రసాయనాల వినియోగాన్ని ప్రోత్సహించిన కార్పొరేట్ సంస్థలే ప్రస్తుతం జీవ సంబంధిత ప్రత్యామ్నాయాలకై వెతుకులాడుతున్నాయి. నూతన మార్కెట్‌లకై వేటలో భాగంగా, క్రిమిసంహారకాలు, రసాయనాలు ఉత్పత్తి తాలూకు జీవవైవిధ్యపు పునాదిపై అదుపుకోసం ఈ కార్పొరేట్ సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. ఈ ప్రయత్నంలో భాగంగానే వేప ఆధారిత జీవక్రిమి సంహారకాలపై మేధోసంపత్తి హక్కులకై ప్రయత్నిస్తున్నాయి.

వ్యవసాయ సంబంధిత రసాయనాల విషయంలో చేకూరిన అనుభవాన్నే ఔషధాలు, మందుల విషయంలో కూడా అనుసరిస్తున్నారు. ప్రమాదకరమైన ఔషధాల తాలూకు ఇతరేతర ప్రభావాలపై ప్రజల అవగాహన పెరుగుతోంది. అలాగే యాంటీ బయాటిక్స్‌కు లొంగని వైరస్‌లు, బ్యాక్టరియాలు సవాలుగా మారుతున్నాయి దీనితో భారతీయ, చైనా వైద్య విధానాలకు సంబంధించిన వృక్ష సంబంధిత వ్యవస్థల దిశగా పాశ్చాత్య మందుల పరిశ్రమ మరింతగా మళ్ళుతోంది. స్థానిక వైద్య వ్యవస్థలు 7,000 రకాల ఔషధ మొక్కలపై ఆధారపడి వున్నాయి అలాగే, అవి పదిహేను వేల రకాల వృక్ష ఔషధాలపై ఆధారపడి వున్నాయి. ఆయుర్వేద గ్రంధాలు 1400 రకాల ఔషధ మొక్కలను గురించి ప్రస్తావిస్తున్నాయి. యునానీ వైద్య విధానంలో 342 మొక్కల వినియోగం వుంది. ఇక, సిద్ధ వ్యవస్థలో 328 రకాల ఔషధ మొక్కలపై ఆధారపడుతున్నారు. హోమియోపతి వైద్యంలో 570 రకాల ఔషధ మొక్కల వినియోగం వుంది. వీటిలో 100 రకాల వరకు భారతదేశానికి చెందినవే, 10 కోట్ల గ్రామీణ కుటుంబాలకు సంబంధించినంతవరకూ ఈ ఔషధ మొక్కల ఆర్థిక విలువ వెలకట్టలేనిది.

స్థానిక వైద్య విధానాల నుంచి పొందిన ఔషధాలపై పేటెంట్లను తీసుకోవటం విపరీతంగా పెరిగిపోయింది. స్థానిక వ్యవస్థల నుంచి పొందిన విజ్ఞానంతో గుర్తించిన ఔషధ మొక్కల తాలూకు ప్రపంచ మార్కెట్ విలువ నేడు 4300 కోట్ల డాలర్ల మేరకు వుంది. సాంప్రదాయక విజ్ఞానాన్ని వినియోగించుకోవటం వలన వివిధ మొక్కలను వాటి వాటి ఔషధ గుణాలకై పరీక్షించటం 40%

పెరిగింది.

స్థానిక వ్యవస్థలను కించపరచటం, తద్వారా వాటి ప్రాధాన్యతను తగ్గించటం తాలూకు ప్రాతిపదికపైనే పాశ్చాత్య 'జీవచౌర్యం' ఆధారపడి వుంది. ఈ క్రమంలో భాగంగా స్థానిక విజ్ఞాన సాంప్రదాయాలు ప్రస్తుతం వినియోగించుకుంటున్న పరిజ్ఞానం నుంచి తయారు చేసిన ఉత్పత్తులు, ఆవిష్కరణలపై పాశ్చాత్య వాణిజ్య ప్రయోజనాలు కోరలు చాస్తున్నాయి. వాటిపై పేటెంట్ల వంటి 'మేథోసంపత్తి హక్కుల ద్వారా' పరిరక్షణ కల్పించబడిన 'మేథోసంపత్తి'ని కల్పించుకుంటున్నారు. పాశ్చాత్య శాస్త్ర విజ్ఞానం తాలూకు, ఒక అంశాన్ని వేరు చేసి అధ్యయనం చేసే పద్ధతిని, స్థానిక విజ్ఞాన వ్యవస్థల తాలూకు దీనికై భిన్నమైన పద్ధతిపై రుద్దడం వలన ఈ కించపరిచే ప్రక్రియ రూపుదిద్దుకుంది. అంతేకాకుండా, పాశ్చాత్య తరహా మేథోసంపత్తి హక్కుల రక్షణ వ్యవస్థ పాశ్చాత్య విజ్ఞాన వ్యవస్థల వైపు మొగ్గు కలిగి వుంది ఈ పాశ్చాత్య విజ్ఞాన వ్యవస్థ జీవవైవిధ్యాన్ని దాని తాలూకు రసాయన, జన్యు సంబంధిత నిర్మాణాలుగా విడగొడుతోంది. ఈ పరిస్థితిలో స్థానిక వ్యవస్థలకు రక్షణ లేకుండా పోయింది. వాస్తవానికి ఈ స్థానిక వ్యవస్థల చోరీకి రక్షణ కల్పించబడుతోంది.

ప్రపంచంలోని దక్షిణార్ధ భాగ దేశాలు చేసే చౌర్యాన్ని అరికట్టేందుకు, ఖచ్చితమైన, పాశ్చాత్య తరహా మేథోసంపత్తి హక్కుల రక్షణ వ్యవస్థలు, మొత్తం ప్రపంచ స్థాయిలో అవసరమనే పునాదుల చట్రంలోనే, ఉరుగ్వే రౌండు గాట్ చర్చలు జరిగాయి. అయితే, ప్రపంచంలోని ఉత్తరార్ధ భాగ దేశాలకు చెందిన కార్పొరేట్ సంస్థలే వాస్తవానికి చౌర్యానికి పాల్పడుతున్నాయనే విషయం ఈ మధ్యకాలంలో సుస్పష్టమౌతోంది. ఈ కార్పొరేట్ సంస్థలు, దక్షిణార్ధ భాగ దేశాల జీవ వైవిధ్యాన్ని, స్థానిక విజ్ఞానాన్ని కబళిస్తున్నాయి. జీవ వైవిధ్యానికి, స్థానిక విజ్ఞాన వ్యవస్థలకు రక్షణ లేకపోవటం వలన; అలాగే పాశ్చాత్య తరహా మేథోసంపత్తి హక్కుల రక్షణ వ్యవస్థలు విశ్వజనీనం కావటం వలన, ఇటువంటి మేథో, జీవ చౌర్యం పెరిగిపోగలదు. జీవ చౌర్య యుగంలో, మన జీవ, మేథో వారసత్వాన్ని రక్షించుకొనేందుకుగాను మన వారసత్వాన్ని గుర్తించి, పునరుజ్జీవింప చేసుకోవాలి. అలాగే, ఆవిర్భవిస్తోన్న మేథోసంపత్తి హక్కుల వ్యవస్థల నేపథ్యంలో, ఈ వారసత్వాన్ని కాపాడుకొనేందుకు తగిన చట్ట వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవాలి.

## పేదల ఔషధ దుకాణం నుంచి చోరీ చేస్తూ.....

సాధారణమైన పలు వ్యాధులకు వైద్యం చేసేందుకుగాను ఆయుర్వేదం, యునాని, సిద్ధ వంటి సాంప్రదాయక భారతీయ పద్ధతులు వివిధ రకాల మొక్కలను వాడాయి. ఫైలాంతస్ నిరూరీ ఇటువంటి ఒక ఔషధమొక్క. వివిధ రకాల హెపటైటిస్‌నూ, ఇతర కాలేయ సంబంధిత జబ్బులను నయం చేసేందుకుగాను ఈ మొక్కను భారతదేశమంతటా వాడతారు ఇది స్థానిక వైద్య పద్ధతులు, తరతరాల వారసత్వంగా వస్తున్న వైద్యం. సాంప్రదాయక స్థానిక సమష్టి విజ్ఞానంలో మాత్రమే కాక వ్యవస్థీకృత ఆరోగ్య పరిరక్షణా వ్యవస్థలలో కూడా అంతర్భాగం అయ్యింది. ఈ మొక్కను సంస్కృతంలో భూధర్త్రిగానూ, హిందీలో జారామ్లాగానూ, బెంగాలీలో భూయీన్ ఆమ్లాగానూ పిలుస్తారు.

ఈ మొక్క భారతదేశంలో ఉష్ణప్రాంతాలలో ఎక్కువగా కనబడుతుంది. ఇది సాగుచేయని

భూమి౦లోనూ, నీడలోనూ పెరుగుతుంది. ఇది సంవత్సరకాల జీవితం కల, 10-30 సెంటీమీటర్ల ఎత్తు ఎదిగే మొక్క ఈ మొక్క ఆకులు దీర్ఘవృత్తాకార రూపంలో వాలుగా వుంటాయి. అంటే, ఇవి ఉసిరి ఆకులను పోలివుంటాయి. (అందుచేతనే వీటిని జారామ్ల లేదా భూఆమ్లగా పిలుస్తారు.) ఈ మొక్క ఏప్రిల్-సెప్టెంబర్ నెలల మధ్య పువ్వులు పూసి, కాయలు కాస్తుంది. ఈ మొక్క తాలూకు ఆకులు, కొమ్మలు, వ్రేళ్ళను - అంటే, మొత్తం మొక్కను పచ్చకామెర్ల వ్యాధికి చికిత్స చేసేందుకు వాడతారు. అంటే, ఈ మొక్కను సనాతన కాలం నుంచి, భారతీయ వైద్య వ్యవస్థలో పచ్చకామెర్ల వ్యాధికి మందుగా వాడుతున్నారు అయితే నేడు ఇదేదో కొత్త ఆవిష్కరణ అన్నట్లుగా ఈ విజ్ఞానంపై పేటెంట్లకై దరఖాస్తు చేస్తున్నారు

హైపటైటిస్ వ్యాధికి చికిత్స చేసేందుకు పైలాంథస్ నిరూరీ మొక్కను వినియోగించడానికై, అమెరికాకు చెందిన ఫిలడల్ఫియాలోని ఫాక్స్ ఛేస్ క్యాన్సర్ సెంటర్, యూరోప్ పేటెంట్ల ఆఫీస్‌లో దరఖాస్తు చేసుకుంది. వైరస్‌వల్ల వచ్చే హైపటైటిస్-బి వ్యాధికి వైద్యం చేసేందుకు అవసరమైన మందును తయారు చేసేందుకై ఈ పేటెంటు దరఖాస్తును చేస్తున్నారు. ఈ పేటెంటు దరఖాస్తు, డాక్టర్ కె.ఎం.నాదకర్ణికి చెందిన 'ఇండియన్ మెటీరియ మెడికా' అనే పుస్తకాన్ని ప్రస్తావిస్తుంది. ఈ పుస్తకం ప్రకారంగా పైలాంథస్ నిరూరీ మొక్కనుంచి తయారు చేస్తున్న ఔషధాలను సాంప్రదాయక, తరతరాలుగా కొనసాగుతున్న వైద్యం వినియోగిస్తుంది. హెపటైటిస్-బితో సహా హెపటైటిస్ వ్యాధి రూపాలకు వైద్యం చేయటంలో ఈ విజ్ఞానానికి దీర్ఘ చరిత్ర ఉన్నప్పటికీ, ఫాక్స్ ఛేస్ క్యాన్సర్ సెంటర్ ఈ మొక్కపై పేటెంటును కోరుతుంది. వైరస్‌ల వల్ల వచ్చే హెపటైటిస్ వ్యాధి నివారణకు పైలాంథస్ నిరూరీ మొక్కతో చేసే వైద్యం గతంలో లేదని ఈ సంస్థ పేర్కొంటుంది.

పచ్చకామెర్ల వ్యాధికి అల్లోపతి వైద్యవ్యవస్థలో నిర్దిష్ట వైద్యమేమీలేదు. వైరస్‌లవల్ల వచ్చే హెపటైటిస్ విషయంలో, వ్యాధి లక్షణాలకు వైద్యం చేయటానికై గ్లూకోస్‌ను, విటమిన్-బి కాంపెక్స్‌ను వాడుతున్నారు. వీటితోపాటుగా కొవ్వు పదార్థాలను, బాగా వేయించిన ఆహారాలను తినరాదని పథ్యాన్ని చెబుతున్నారు. ఆయుర్వేదం, ఇతర సాంప్రదాయ వైద్య వ్యవస్థలలో కాలేయపు కణాలను పునరుజ్జీవింపజేసే ఔషధాలు వున్నాయి. అందుచేత, ఈ వైద్యం వ్యాధి లక్షణాలకు కాక, వ్యాధి మూలాలను తాకుతోంది. సాంప్రదాయక వైద్య వ్యవస్థ పచ్చకామెర్ల వ్యాధిని కాలేయం పనితీరుకు సంబంధించిన సమస్యగా చూస్తుంది. అది యే రకమైన హెపటైటిస్ వ్యాధి అన్నది ఇక్కడ నిమిత్తమాత్రం. ఎందుచేతనంటే, అన్ని రకాల హెపటైటిస్ వ్యాధికి సాంప్రదాయక విధానంలో ఒకే రకమైన వైద్యం వుంది.

హెపటైటిస్-బి వంటి హెపటైటిస్ వ్యాధులలో ఒకానొక రూపానికే వైద్యం చేసేందుకు పైలాంథస్ నిరూరీని కుదించటం, అలాగే దానిని నూతన వైద్యంగా పరిగణించటం జరుగుతుంది. పైలాంథస్ నిరూరీ నుంచి తయారు చేసిన ఔషధాలను, సాంప్రదాయక వైద్యవ్యవస్థ అన్నిరకాల కాలేయ సంబంధిత వ్యాధులకు వైద్యం చేసేందుకు వినియోగించింది. కాగా, ఫాక్స్‌ఛేస్ క్యాన్సర్ సెంటర్‌కు చెందిన శాస్త్రవేత్తలు ఈ ఔషధ చోరీని నూతన ఆవిష్కరణగా పేర్కొంటున్నారు.

కాకర, నేరేడు, వంగ తాలూకు చక్కెరవ్యాధిని నివారించే లక్షణాలను ఈమధ్య పేటెంటు చేయటం, జీవ చౌర్యపు సమస్యను మరింతగా ముందుకు తెస్తోంది దయాబెటీస్‌ను అదుపు చేసేందుకు

కాకర, నేరేడు, వంగ మొదలైన వాటిని వాడటం భారతీయ వైద్యవిధానంలో అత్యంత సాధారణ విషయం. చక్కెర వ్యాధికి వైద్యం చేయటంలో వీటిని ఉపయోగించటం గురించి 'వెల్త్ ఆఫ్ ఇండియా', 'కంపెండియమ్ ఆఫ్ ఇండియన్ మెడిసినల్ ప్లాంట్స్', 'ట్రైబైజాన్ ఇండియన్ మెడిసినల్ ప్లాంట్స్' మొదలైన పుస్తకాలలో పేర్కొన్నారు. కాబట్టి, కాకర లేదా నేరేడును డయాబెటిస్ నివారణలో ఉపయోగించడాన్ని నూతన ఆవిష్కరణగా చెప్పుకోవడం తగని పని న్యూజెర్సీలోని క్రోమేక్ రీసెర్చ్ సంస్థకు ఈ వృక్షజాతులపై పేటెంటుని ఇవ్వటం మేథోసంపత్తి చోరీయే అంతేకాకుండా, పాశ్చాత్య పరిశోధనాశాలలో ప్రాసెస్ చేయబడితే, ఈ మొక్కలకు 'విలువ వచ్చి చేరుతుంది' అనేది దురహంకార పూరిత వాదన. భారతీయ వైద్యవ్యవస్థ తాలూకు అవసరాలను తీర్చే స్వదేశీ కంపెనీల ఔషధాలను ఎగుమతి చేసే విషయంలో ఈ పేటెంటు తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని కల్గిస్తుంది.

## రైతుల పొలాలనుంచి చోరీ

అత్యంత నాణ్యమైన, సువాసన గల - బాసుమతి బియ్యాన్ని ఉత్పత్తి చేయటంలోను, ఎగుమతి చేయటంలో కూడా భారత ఉపఖండానిదే అగ్రస్థానం. భారతదేశం సాలీనా 650,000 టన్నుల బాసుమతి బియ్యాన్ని పండిస్తుంది. భారత దేశంలో వరిధాన్యపు పంటవున్న భూములలో 10-15% భూమి బాసుమతి బియ్యాన్ని పండించేందుకు వినియోగించబడుతుంది. బాసుమతి బియ్యాన్ని, ఇతర రకాల బియ్యాన్ని భారతదేశం ప్రపంచంలోని 80కిపైగా దేశాలకు ఎగుమతి చేస్తోంది. 1996-97సంవత్సరంలో బాసుమతియేతర బియ్యాన్ని 19 లక్షల టన్నుల మేరకు ఎగుమతి చేశారు. దీనివిలువ మొత్తం 1800 కోట్ల రూపాయలు(450 మిలియన్ డాలర్లు) కాగా, 488,700 టన్నుల బాసుమతి బియ్యాన్ని ఎగుమతి చేశారు. దీని విలువ 1120 కోట్ల రూపాయలు (280 మిలియన్ డాలర్లు) బాసుమతి బియ్యపు వార్షిక ఎగుమతులు 400,000 నుంచి 5,00,000 టన్నుల వరకు వున్నాయి. భారత దేశపు ఎగుమతులలో, ఈ మధ్యకాలంలో బాసుమతి బియ్యపు వాటా బాగా పెరుగుతున్నది. భారతదేశపు బాసుమతి దిగుమతిదారులలో మధ్యప్రాచ్యం (20%) యూరప్, అమెరికాలు (10-15%) ఉన్నాయి. ఈ బియ్యం ధర టన్నుకు 850 డాలర్లుగా వుంది యూరోపియన్ యూనియన్ దిగుమతి చేసుకునే బియ్యపు రకాలన్నింటిలోనూ అత్యంత ఖరీదైనది భారతదేశపు బాసుమతి బియ్యమే. పాకిస్తాన్ నుంచి ఎగుమతి అయ్యే బాసుమతి బియ్యం ధర టన్నుకు 700 డాలర్లుగా వుంది కాగా, థాయ్‌లాండ్ దేశపు సువాసన గల బియ్యపు ధర టన్నుకు 500 డాలర్లుగా వుంది. 1996-97 కాలంలో, భారతదేశం 100,000 టన్నుల బాసుమతి బియ్యాన్ని యూరోపియన్ యూనియన్‌కు ఎగుమతి చేసింది

పురాతన గ్రంథాలు, లోకోక్తులు, కవిత్వాలలో బాసుమతి బియ్యం తాలూకు ప్రస్తావన వుంది. అంటే, బాసుమతి బియ్యాన్ని పలు శతాబ్దాల కాలంగా ఉపఖండంలో పండిస్తున్నారు. భారతదేశంలో, 27 విభిన్న రకాల బాసుమతి బియ్యాన్ని పండించారనడానికి లిఖిత పూర్వక ఆధారాలున్నాయి. బాసుమతి బియ్యానికి సంబంధించిన ఒక మొట్టమొదటి ప్రస్తావన, ప్రఖ్యాత పురాణ గ్రంథమైన 'హీర్‌రంజా'లో వుందని సి.ఎస్ ఎస్. హర్యానా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన హిస్సార్ పేర్కొన్నారు ఈ పురాణాన్ని 1766లో వారిస్‌షా అనే కవి రచించారు ఈ సహజ

పరిమళం గల బియ్యపు రకాన్ని సుదీర్ఘకాలంగా దేశంలోని రాజులు రక్షించుకుంటూ వచ్చారు. ఈ రకం బియ్యమంటే విదేశీయులకు కూడా మక్కువే శతాబ్దాలపాటు రైతుల పరిశీలనలో, ప్రయోగాలలో, ఎంపికలో చూపిన శ్రద్ధనుంచి ఈ బియ్యం ఆవిర్భవించింది. సనాతన కాలంనుంచి వివిధ రకాల వాతావరణ పరిస్థితులు, వంట అవసరాలు, రుచులను దృష్టిలో ఉంచుకొని రైతులు పలు బియ్యపు రకాలను అభివృద్ధి చేశారు వ్యవస్థీకృతంకాని పద్ధతులు, ఆవిష్కరణల ద్వారా అత్యున్నత శ్రేణి బియ్యం రకాలు తయారయ్యాయి. అందుచేత వీటిని ఉపఖండపు రైతుల కృషి ఫలితాలుగానే భావించాలి.

1997వ సంవత్సరం సెప్టెంబర్ 2వ తేదీన బాసుమతి బియ్యం రకాలు, ధాన్యాలపై టెక్సాస్‌కు చెందిన రైస్‌టెక్ సంస్థకు 5663484నంబరుగల పేటెంటునిచ్చారు ఈ 'ఆవిష్కరణ' తాలూకు పేటెంటు అత్యంత విస్తారమైన పరిధి కలది. దీనిలోకి 20 రకాల బియ్యం వస్తాయి. ఈ పేటెంటు క్రిందకు బాసుమతి బియ్యపు రకాల జన్యువులు వస్తాయి. స్థానిక రైతులు అభివృద్ధి చేసిన వివిధ బియ్యపు రకాల జన్యువులు కూడా ఈ పేటెంటు క్రిందకు వస్తాయి ఈ పేటెంటే గనక అమలు జరిగితే, రైతులు స్వయంగా అభివృద్ధి చేసుకున్న బియ్యపురకాలపై హక్కు వారికి వుండదు. అంటే, ఈ బియ్యపు రకాలను పండించాలంటే రైస్‌టెక్ సంస్థ అనుమతిని తీసుకోవాలి. దీనికై రాయల్టీ చెల్లించాలి ఈ సంస్థ ఇప్పటికే కాస్మతి, టెక్స్‌మతి, జాస్మతి అనే బ్రాండ్ల పేరిట బియ్యం వ్యాపారాన్ని చేస్తుంది.

రైస్‌టెక్ సంస్థ వ్యాపారం చేస్తున్న బియ్యపురకం మన భారత సాంప్రదాయ రకాల లాగానే – పొడుగైనది, ప్రత్యేకమైన సుగంధం కలది, అధిక ఉత్పత్తినిచ్చేది, అలాగే ఆకారం దృష్ట్యా ఎక్కువ ఎత్తు పెరగనిది. రైస్‌టెక్ సంస్థ పేటెంటు తీసుకున్న బియ్యం రకం బాసుమతి బియ్యంనుంచే ఆవిర్భవించింది అందుచేత దానిని 'నూతన తరహా' బియ్యంగా పరిగణించరాదు దానిపై పేటెంటు తగదు

## ప్రాకృతిక క్రిమిసంహారపు చౌర్యం

వేపచెట్టును భారతదేశంలో శతాబ్దాలుగా వివిధ రకాలుగా ఉపయోగిస్తున్నారు. దానిని వైద్యంలోనూ, వ్యవసాయంలోనూ వాడుతున్నారు. వేపచెట్టు గురించిన ప్రస్తావన రెండువేల సంవత్సరాల క్రితం వ్రాసిన భారతీయ గ్రంథాలలో వుంది. ఆ గ్రంథాలు వేపను గాలిని శుద్ధి చేసేదిగానూ, మనుష్యులకు, జంతువులకు వచ్చే అన్ని రకాల వ్యాధులకు వైద్యంగానూ పేర్కొన్నాయి. కీటకాలను, క్రిములను పారద్రోలే లక్షణాలు వేపలో వుండటమే దీనికి కారణం. వేపను భారతదేశంలోని అన్ని పొలాలు, ఇళ్లలోనూ దరిదాపు ప్రతిరోజూ వాడేవారు. పరిశోధనల ప్రకారంగా వేప ఉత్పత్తులు దరిదాపు 200 రకాల కీటకాలను నశింపజేయగలవు ఈ కీటకాలలో చాలా మేరకు క్రిమిసంహారకాలకు లొంగనివే. ఈ మధ్యకాలంలో, వేప నుంచి తయారుచేసే పలురకాల వాణిజ్య ఉత్పత్తులు భారతదేశపు మార్కెట్‌లోకి వచ్చాయి వీటిలో క్రిమిసంహారకాలు, ఔషధాలు, అలంకారానికి ఉపయోగించే పదార్థాలు ఉన్నాయి. వేప ఉత్పత్తులలో కొన్ని చిన్న తరహా పరిశ్రమలలోనూ, మరికొన్ని మధ్యస్థాయి పరిశోధనా శాలలలోనూ తయారవుతున్నాయి. అయితే, ఈ ఉత్పత్తుల ఫార్ములాలపై యాజమాన్య పేటెంటు చట్టం ప్రకారంగా వ్యవసాయ, ఔషధ ఉత్పత్తులు పేటెంట్లకు అర్హం కాకపోవటం దీనికి కారణం

వేపచెట్టు తాలూకు సాంస్కృతిక, ఔషధ సంబంధిత వ్యవసాయ విలువల కలయిక వలన ఈ చెట్టు విస్తారంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. మక్కాకు వెళ్లే దారిలో యాత్రికులకు నీడను ఇచ్చేందుకు 50 వేల వేపచెట్లున్నాయి. వేపకు సంబంధించిన విజ్ఞానాన్ని భారతదేశం మొత్తం ప్రపంచానికి కానుకగా ఇచ్చింది. భిన్నజాతులు వుండటం, స్వేచ్ఛగా విజ్ఞానాన్ని పంచుకునే అవకాశాలకు వేపమొక్క అత్యున్నత చిహ్నం. అందుచేతనే వేపమొక్కను భారతదేశపు 'స్వేచ్ఛావృక్షం'గా పేర్కొంటారు. వేపమొక్కను, దాని సుగుణాలను పాశ్చాత్య ప్రపంచం శతాబ్దాల పాటు పట్టించుకోలేదు. భారతదేశపు రైతులు, వైద్యుల పద్ధతులను హెచ్చుమంది ఆంగ్ల, ఫ్రెంచి, పోర్చుగీసు వలస వాదులు పట్టించుకోనవసరం లేనివిగా భావించారు. అయితే, గత కొద్ది సంవత్సరాలుగా పాశ్చాత్య దేశాలలో రసాయన ఉత్పత్తులకు, ముఖ్యంగా వాటిలో క్రిమిసంహారకాలకు వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీనితో, వేపతాలూకు ఔషధ గుణాలకు అకస్మాత్తుగా ఆదరణ లభించింది. 1971వ సంవత్సరంలో అమెరికాకు చెందిన కలప దిగుమతిదారుడైన రాబర్ట్ లార్సన్ భారతదేశంలో వేపచెట్టు ప్రయోజనాలను గమనించాడు. అప్పటినుంచి తన కేంద్రకార్యాలయమైన విస్కాన్సిన్‌కు వేపగింజలను దిగుమతి చేసుకోనారంభించాడు. తరువాతి దశాబ్దకాలంలో, వేపనుంచి తీసిన క్రిమిసంహారకమైన మార్గోసాన్-0 అనే పదార్థంపై రక్షణ, పనితీరుకు సంబంధించిన ప్రయోగాలను కొనసాగించాడు. 1985వ సంవత్సరంలో అమెరికా వాతావరణ పరిరక్షణసంస్థ (ఇపిఎ) నుంచి ఈ ఉత్పత్తికి అనుమతిని పొందాడు. మూడు సంవత్సరాల తర్వాత, డబ్ల్యుఆర్, గ్రేస్ అనే బహుళజాతి రసాయన సంస్థకు ఈ ఉత్పత్తిపై పేటెంటును అమ్మివేశాడు. 1985 మొదలుకొని, స్థిరమైన వేపసంబంధిత ద్రవాలు, ఎమల్షన్‌లు మొదలైనవాటి ఫార్ములాలపై అమెరికా, జపాన్‌లకు చెందిన సంస్థలు డజనుకుపైగా పేటెంట్లను తీసుకున్నాయి. వీటిలో ఒకటి వేపతో తయారు చేసిన టూత్‌పేస్టు.

పేటెంటును స్వంతం చేసుకోవటం, ఇపిఎ నుంచి లైసెన్స్‌ను పొందే అవకాశాల ద్వారా, గ్రేస్ సంస్థ భారత దేశంలో శాఖలు ఏర్పరచి తన సరుకును ఉత్పత్తి చేయటం, వాణిజ్యపరంగా అమ్మటం ఆరంభించింది. పలు భారతీయ ఉత్పత్తి సంస్థల సాంకేతిక పరిజ్ఞానాన్ని కొనుగోలు చేస్తానంటూ, ఆ సంస్థలకు ప్రతిపాదనలు చేసింది. అలాగే, ఆ సంస్థలు తయారుచేసే వేప విలువ చేర్చిన ఉత్పత్తుల తయారీని ఆపివేయవలసిందిగా నచ్చచెప్పచూసింది. ద్వారా, వివిధ స్థానిక వేప ఉత్పత్తి ఉత్పత్తిదారులను ముడిసరుకు సరఫరాదారులుగా తయారుచేయ తలపెట్టింది కానీ పలు సందర్భాలలో గ్రేస్ సంస్థకు చుక్కెదురయింది. చివరికి ఎలాగోలా పిజె మార్గో ప్రైవేటు లిమిటెడ్ అనే స్థానిక సంస్థతో కలిసి, సంయుక్తంగా పరిశ్రమను ఏర్పాటు చేసుకునే అంగీకారానికి వచ్చింది. ఈ నూతన సంస్థ రోజుకు 20 టన్నుల వేపగింజలను ప్రాసెస్ చేయగలదు. దీనితోపాటుగా వేపగింజల సరఫరాదారుల సమూహాన్ని తయారుచేసుకుంటోంది. సరసమైన ధరకు నిరవధికంగా విత్తనాల సరఫరాను హామీ చేసుకోవటమే దీని ఉద్దేశ్యం. ఇతర పేటెంట్లు ఉన్న కంపెనీలు కూడా గ్రేస్ సంస్థ బాటలోనే పయనించే అవకాశం వుంది. ఈ కంపెనీ విత్తనాల అవసరాల తాలూకు డిమాండు ఫలితాలు మూడు ప్రాథమిక రకాలుగా వుంటాయి :

1. వేప విత్తనాల ధర సామాన్య ప్రజలకు అందుబాటులో లేని స్థాయికి పెరిగి పోయింది.

స్థానిక ప్రజలు, తమ ఇళ్లలో దీపాలను వెలిగించుకునేందుకు ఉపయోగించే వేపనూనె లభించకుండా పోయింది. స్థానిక నూనె తయారీదారులకు వేపగింజలు అందుబాటులో లేకపోవటమే దీనికి ప్రధాన కారణం.

2 గతంలో రైతులకు, స్థానిక వైద్యులకు ప్రకృతిలో ఉచితంగా లభించే వేపవిత్తనాలను, ఈ సంస్థ తన ఆర్థిక బలం ద్వారా కొనివేస్తుంది

3. పేద ప్రజల మనుగడకు కీలకమైన వనరు వారికి అందుబాటులో లేకుండా పోయింది. గతంలో వారికి ఈ వనరు విస్తృతంగానూ, కారుచౌకగానూ లభించేది.

'వేపచెట్టు నుండి లభించే అనంతమైన భిన్నరకాల ఉత్పత్తులపై పాశ్చాత్య ప్రపంచపు కార్పొరేట్ సంస్థల దృష్టిని సారించటానికి'గాను, 1992వ సంవత్సరంలో అమెరికా జాతీయ పరిశోధనా సమితి ఒక నివేదికను ప్రచురించింది. 'కృత్రిమమైన క్రిమిసంహారకాలపట్ల ఏమంత సంతోషంలేని నేటికాలంలో వేప గొప్ప ఆకర్షణగా వుంది' అని ఆ పరిశోధనా సమితికి చెందిన ఒక సభ్యుడు పేర్కొన్నారు ఈ మొత్తం నగ్నంగా వాణిజ్యమే. అమెరికాలో క్రిమిసంహార మందుల మార్కెట్టు 200 కోట్ల డాలర్ల మేరకు వుంది. దీనిలో నేడు జీవసంబంధిత క్రిమిసంహారకాల వాటా 1992 నాటికి 45 కోట్ల డాలర్లుగా వుంది. 1998వ సంవత్సరం నాటికి ఈ విలువ 80 కోట్ల డాలర్లకు పెరిగింది.

వాస్తవానికి వేపపై, చెట్టుగా పేటెంటు లేదు అలాగే దాని ఆకులు, చిన్న కొమ్మలు, వేళ్లు, కాండం మొదలైనవాటిపై కూడా పేటెంట్లు లేవు, అయితే వేపకు చెందిన పలు క్రియాశీల సూత్రాలు ఇమిడివున్న కొన్ని ఉత్పత్తులు, ప్రక్రియలపై పేటెంట్లు వున్నాయి భారతదేశపు వేప ఉత్పత్తులపై గ్రేస్ సంస్థ దూకుడుగా దాడి చేయటాన్ని పలువురు ముక్తకంఠంతో ఖండించారు. శతాబ్దాల చరిత్రల స్థానిక పరిశోధనలను, పలు దశాబ్దాలపాటు కొనసాగిన భారతీయ శాస్త్ర పరిశోధనను దోచుకునే హక్కు బహుళజాతి సంస్థలకు లేదనేది వీరందరి అభిప్రాయము. దీనంతటి ఫలితంగా మేథోసంపత్తి పేటెంటు హక్కులకు సంబంధించిన చర్చ అన్ని భూఖండాలలోనూ తీవ్రంగా జరిగింది. ఈ ఆధునీకరించిన దోపిడీ ప్రక్రియ నికార్సయిన ఆవిష్కరణ అనే పునాదిపై గ్రేస్ సంస్థ ఈ పేటెంటులను సమర్థించుకొంటోంది పేటెంటు చేసిన ఈ మిశ్రమాలు, ప్రక్రియల అభివృద్ధిలో సాంప్రదాయక విజ్ఞానం తాలూకు పరిశోధన అభివృద్ధి కీలకపాత్ర వహించింది ఈ ఆవిష్కరణలను వాటి వాస్తవిక రూపమైన ప్రకృతి సహజ ఉత్పత్తులు, సాంప్రదాయక పద్ధతులుగా కాక, పేటెంటు చేయవీలైన తగినమేరకు నవీన, భిన్నమైనవిగా పరిగణిస్తున్నారు

ఒక్కముక్కలో చెప్పాలంటే, ఈ ప్రక్రియలు నవీనమైనవిగా చెప్పబడుతున్నాయి. అంతేకాకుండా, ఇవి భారతీయ మెలకువలపై పురోగతిగా భావించబడుతున్నాయి. అయితే, ఈ నవీనత అనేది పాశ్చాత్య దేశాల అజ్ఞానపు నేపథ్యంలో ప్రధానంగా వుంది. వేప సంబంధిత జీవక్రిమి సంహారకాలను ఔషధాలను రెండు వేల సంవత్సరాలపైబడి భారతదేశంలో వినియోగిస్తున్నారు. నిర్దిష్ట అవసరాలకోసమై వేప ఉత్పత్తుల వినియోగానికిగాను పలు సంక్లిష్ట ప్రక్రియలను భారతీయులు అభివృద్ధి చేస్తున్నారు అయితే, ఈ మిశ్రమాలలోని మూల పదార్థాలకు లాటిన్ భాషలో "శాస్త్రీయ పేర్లను మాత్రం పెట్టుకోలేదు. 1968వ సంవత్సరపు కీటక సంహారక చట్టం క్రింద వేప ఉత్పత్తులను నమోదు చేసేందుకు భారతీయ

కేంద్ర కీటక సంహారక బోర్డు నిరాకరించింది. దీనికి ప్రధాన కారణం వేప భారతీయ జీవితంలో సాధారణ విజ్ఞానంగానూ, సమష్టి వినియోగంలోనూ ఉండటమే. వేప సంబంధిత పదార్థాలు భారతదేశంలో చిరకాలంగా వివిధ అవసరాలకు విస్తృతంగా ఉపయోగించబడుతున్నాయని బోర్డు వాదించింది. అంతేకాకుండా, ఈ వేప పదార్థాలకు ఎటువంటి దుష్ఫలితాలు లేవని పేర్కొంది. కాగా, అమెరికాకు చెందిన ఇపిఎ మాత్రం సాంప్రదాయక విజ్ఞానపు ప్రామాణికత్వాన్ని ఆమోదించడం లేదు.

భారతీయ శాస్త్రవేత్తలు తమ ఆవిష్కరణలను పేటెంటు చేసుకోవడంలో సంకోచం చూపటం వలన ఈ ఆవిష్కరణలు చౌర్యానికి అవకాశం కల్పిస్తున్నాయి. వాస్తవానికి ఈ ఆవిష్కరణల విషయంలో అనామకులైన పలువురు ప్రయోగకారులు తరతరాలుగా చేస్తూ వచ్చిన కృషి ప్రధానమైనదనే భావన భారతీయ శాస్త్రవేత్తల గుర్తింపులో వుంది. వేప తాలూకు క్రిమిసంహారక గుణాలను కనుగొనటం, దానిని ప్రాసెస్ చేయటం అనేవి ఏమాత్రం 'కొట్టవచ్చినట్లు కనపడేవి' కావు. ఇవి, పాశ్చాత్యేతర సంస్కృతులలో సుదీర్ఘకాలంపాటు జరిగిన క్రమబద్ధమైన విజ్ఞానాభివృద్ధి క్రమంలో భాగం.

ఇక ఇప్పుడు వేప ఏమాత్రము 'స్వేచ్ఛావృక్షం' కాదు. ఈ చెట్టుపై ఇప్పటికే 90 పేటెంట్లు తీసుకున్నారు. అమెరికా, జపాన్, జర్మనీలకు చెందిన కంపెనీలు ఈ చెట్టుపై పేటెంట్లకై అర్రులు చాస్తున్నాయి. ఇప్పుడు వేప పాశ్చాత్యశాస్త్రవేత్తలు. కార్పొరేటు సంస్థల 'మేధోసంపత్తి ' అయితే, గ్రేస్ సంస్థ సంపాదించిన రెండు పేటెంట్లను, రెండు వందల సంస్థలు చట్టపరంగా సవాలు చేశాయి. వీటిలో ఒకటి అమెరికా పేటెంట్ల ఆఫీసులోనూ, రెండవది యూరోప్‌కు చెందిన పేటెంట్ల ఆఫీసులోనూ నమోదు అయ్యాయి. రెండువేల సంవత్సరం మే 10వ తేదీన జీవచౌర్యం నుంచి స్వేచ్ఛకై సాగుతోన్న సమకాలీన ఉద్యమం ఒక ప్రధాన మైలురాయిని దాటింది. ఆ రోజున, యూరోప్‌కు చెందిన పేటెంట్ల ఆఫీసు అమెరికా ప్రభుత్వం, గ్రేసు సంస్థలు సంయుక్తంగా యాజమాన్యం కలిగివున్న పేటెంట్లు చెల్లవని ప్రకటించింది. ఈ పేటెంటు, అప్పటికే అస్తిత్వంలోవున్న విజ్ఞానాన్ని చౌర్యం చేయటం ద్వారా సంపాదించినదని, దీనిలో నూతనత్వంగానీ, ఆవిష్కరణగానీ లేదని పేర్కొంది

## జీవచౌర్యాన్ని పరిష్కరిస్తూ...

జీవచౌర్యం, స్థానిక విజ్ఞానాన్ని పేటెంటు చేయడం రెండింతలు పెద్దచోరీ. మొదటగా ఇది సృజనాత్మకతను, ఆవిష్కరణను చోరీ చేయటాన్ని అనుమతిస్తోంది. రెండవది, స్థానిక జీవవైవిధ్యం, విజ్ఞానాల ప్రాతిపదికన సాగే దైనందిన మనుగడ తాలూకు ఆర్థిక అవకాశాలను ఈ పేటెంట్ల ద్వారా చోరీచేయబడిన విజ్ఞానం గుత్తసొత్తుగా చేసుకుంటోంది. కాలక్రమేణా ఈ పేటెంట్లు గుత్తాధిపత్యాన్ని సాధించేందుకు, దైనందిన జీవితంలో అవసరమైన ఉత్పత్తుల ధరలను విపరీతంగా పెంచేందుకు ఉపయోగించబడవచ్చు జీవచౌర్యం ప్రాతిపదికన, ఆవిష్కరణల పేరిట ఇటువంటి ఒకటో లేదా రెండో ఘటనలు జరిగితే, వాటిని పొరపాట్లుగా భావించవచ్చు. కానీ వాస్తవానికి జీవచౌర్యం అంటువ్యాధి వంటిది. పసుపు విషయంలో రుజువైనట్లుగా అసలు సమస్యల్లా ఏదోఒక పేటెంట్ల గుమాస్తా చేసిన తప్పిదం కాదు. ఈ సమస్య లోతైనదీ, వ్యవస్థీకృతమైనది. దీని పరిష్కారానికి వ్యవస్థాగత మార్పులు జరగాలి. ఒక్కో ప్రత్యేక సందర్భాన్ని ఒక్కోసారి సవాలు చేయటంద్వారా ఫలితం ఉండదు.

చౌర్యాన్ని ప్రోత్సాహించటం అమెరికా పేటెంట్ల చట్టం తాలూకు కేవలం పొరపాటున త్రోవతప్పటం కాదు. ఇది ఆ చట్టం తాలూకు వాస్తవిక స్వభావం. స్వేచ్ఛా వ్యాపారం, వ్యాపార సరళీకరణల నేపధ్యంలో మేధోసంపత్తి హక్కుల రక్షణ మూడు స్థాయిలలో చౌర్యానికి గురవుతున్నది.

**1. వనరుల చౌర్యం**

ఎటువంటి గుర్తింపు లేదా అనుమతి లేకుండానే వివిధ సమాజాల, దేశాల జీవ, సహజ వనరులను స్వేచ్ఛగా స్వంతం చేసుకోవటం తద్వారా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థల నిర్మాణాన్ని సాగించటం. ఉదాహరణకు, భారతదేశం నుంచి బాసుమతి రకాల బియ్యాన్ని బదలాయించుకోవటం. ఈ రకంగా ఎగుమతులకై రైస్‌టెక్ వంటి కార్పొరేట్ సంస్థల ద్వారా అమెరికా బియ్యం ఆర్థిక వ్యవస్థను నిర్మించుకోవటం.

**2. మేథోసంబంధిత, సాంస్కృతిక చౌర్యం**

దీనిద్వారా మేథోసంపత్తి హక్కుల రక్షణ కోరేందుకై ఎటువంటి గుర్తింపు లేదా అనుమతి లేకుండానే వివిధ సమాజాల, దేశాల సాంస్కృతిక, మేధోవారసత్వాన్ని ఎటువంటి మూల్యం చెల్లించకుండానే స్వంతం చేసుకోవటం తద్వారా ఆ సంపదపై పేటెంట్లు, ట్రేడ్ మార్కులను పొందటం. కార్పొరేట్ పెట్టుబడుల ద్వారా ప్రాథమిక ఆవిష్కరణ, సృజనాత్మకతలు ఏమాత్రం లేకుండానే ఇది జరుగుతోంది. ఉదాహరణకు, తమ సుగంధ వాసన గల బియ్యానికి 'బాసుమతి' అనే వ్యాపార నామధేయాన్ని వినియోగించుకోవటం, లేదా పెప్సీ సంస్థ *బికనేరి భుజియా* అనే వ్యాపార నామధేయాన్ని వినియోగించుకోవటాలను పేర్కొనవచ్చు

**3. ఆర్థిక చౌర్యం :**

వ్యాపార నామధేయాలు, మేధోసంపత్తి హక్కుల రక్షణ వ్యవస్థలను ఉపయోగించుకొని, స్వదేశీ, విదేశీ మార్కెట్లను అన్యాయంగా అక్రమించుకోవటం, తద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థలను, జాతీయ ఆర్థిక వ్యవస్థలను నాశనం చేయటం.-వాస్తవానికి ఈ ఆవిష్కరణలు ఆయా ఆర్థిక వ్యవస్థలలోనే తయారయ్యాయి. దీనంతటి ఫలితంగా కోట్లాది మంది ప్రజలు జీవన భృతి, ఆర్థిక మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. ఉదాహరణకు, అమెరికా బియ్యం వ్యాపారులు యూరప్ మార్కెట్లను అన్యాక్రాంతం చేసుకోవటం. అలాగే వేప సంబంధిత క్రిమి సంహారకాలను భారతదేశంలోని చిన్న ఉత్పత్తిదారుల నుంచి కొల్లగొట్టి గ్రేస్ సంస్థ అమెరికా మార్కెట్‌ను స్వంతం చేసుకోవటం.

జీవచౌర్యం సమస్య, పాశ్చాత్య తరహా మేధో సంపత్తి హక్కుల సమస్య ఫలితం. ఇది భారత దేశంలో మేధోసంపత్తి హక్కుల రక్షణ లేకపోవటం వలన జరగడం లేదు. పాశ్చాత్య పేటెంట్ల వ్యవస్థ బాగానే పని చేస్తోందని కూడా ఒక వాదన వుంది. దీనితోపాటుగా, విడివిడి పేటెంట్లను సవాలు చేయటం ద్వారా జీవచౌర్యాన్ని సరిదిద్దవచ్చనే వాదన కూడా వుంది. ఈ వాదనలలో రెండు లోపాలున్నాయి. మొదటగా, పేటెంట్లను సవాలు చేయటం బాగా ఖర్చుతో కూడుకున్న పని. కాబట్టి రోజు రోజుకు పెరిగిపోతున్న వందలాది జీవచౌర్యపు అంశాలను సవాలు చేయటానికి అయ్యే వ్యయాన్ని మూడవ ప్రపంచ దేశాలు భరించలేవు. ఇక రెండవది, 1996వ సంవత్సరంలో సి ఎస్ ఐ

ఆర్ సంస్థ సవాలు చేయటం వలన పసుపుపై పేటెంట్‌ను ఉపసంహరించుకుంది. కానీ ఈ తీర్పు పసుపుపై సరికొత్త పేటెంట్లు జారీ చేయకుండా అమెరికా పేటెంట్లు ట్రేడ్ మార్కుల కార్యాలయాన్ని (యుఎస్‌పిటిఒ) నిలువరించలేకపోయింది చర్మవ్యాధుల నివారణకుగాను, పసుపును ఉపయోగించేందుకు 1999వ సంవత్సరం ఏప్రిల్ 27వ తేదీన యుఎస్‌పిటిఓ పేటెంటును జారీ చేసింది.

విడివిడిగా పేటెంట్లను సవాలు చేయటం ద్వారా జీవచౌర్యం ఆగదు మొత్తం మేధో సంపత్తి హక్కుల రక్షణ వ్యవస్థే మారాలి. ఆవిష్కరణలను, సృజనాత్మకతను ప్రోత్సహిస్తుందని చెప్పబడే పేటెంట్ల వ్యవస్థ చౌర్యాన్ని ఒక క్రమ పద్ధతి ప్రకారం ప్రోత్సహిస్తోంది. స్థానిక విజ్ఞానాన్ని సంబంధించి పేటెంట్ల జారీలో, నూతనత్వం, సుస్పష్టంగా దాఖలాలు లేకపోవటం అనే కొలబద్దలను నిజాయితీగా అమలుపరచలేని పేటెంట్ల వ్యవస్థ లోపభూయిష్టమైనది. దీనిని మార్చి తీరాలి. ఈ పేటెంట్లను జారీ చేయటం లేదా సర్వ సంపూర్ణ మార్కెట్ హక్కులను కల్పించేందుకు ఈ పేటెంట్ల వ్యవస్థ పునాది కారాదు.

## చట్టబద్ధత కల్పించబడిన జీవచౌర్యంగా - జీవసర్వేలు

జీవ చౌర్యానికి పరిష్కారంగా జీవ సర్వేలను, లాభాలను పంచుకోవటాలు మొదలైన సాధారణ ప్రతిపాదనలు ముందుకు వస్తున్నాయి. అంటే, స్థానిక విజ్ఞానంపై పేటెంట్లు కోరేవారు తమ వాణిజ్య గుత్తాధిపత్యం ద్వారా లభించే లాభాలను అసలైన ఆవిష్కర్తలతో పంచుకోవాలి స్థానిక విజ్ఞానాన్ని వాణిజ్యీకరించే కార్పొరేటు సంస్థలు, అలాగే సామూహిక ఆవిష్కరణ ద్వారా విజ్ఞానాన్ని ప్రోదిచేసిన స్థానిక జనసమూహాల మధ్య సత్సంబంధాల నమూనాగా జీవ సర్వేను ముందుకు తెస్తున్నారు

ఐతే, జీవసర్వే అనేది కేవలం ఒక ఆడంబరమైన జీవచౌర్యపు రూపం మాత్రమే. ఈ నమూనాలో రెండు మౌలిక సమస్యలున్నాయి. మొదటగా, విజ్ఞానం గనక ముందునుంచి వుంటే, దానిపై పేటెంట్ పూర్తిగా అన్యాయమైనది. ఎందుచేతనంటే, ఈ తరహా పేటెంట్ నవీనత, ప్రస్ఫుటంగా లేకపోవడం అనే సూత్రాలను ఉల్లంఘిస్తోంది. స్థానిక విజ్ఞానంపై పేటెంట్లను జారీ చేయడం; పేటెంట్ల వ్యవస్థ అనేది బలప్రదర్శనకు, అదుపుకు సంబంధించినదిగా పేర్కొనటమే. అది ఆవిష్కరణకు, నూతనత్వానికి ఏమాత్రం ప్రతిబింబం కాదు. రెండవది, ఆహారానికి, ఔషధాలకు కీలకమైన స్థానిక విజ్ఞానాన్ని కొల్లగొట్టడం, పేటెంట్ల ద్వారా దానిని సర్వసంపూర్ణ హక్కుగా మార్చుకోవటం, తద్వారా తాము సృష్టించిన విజ్ఞానాన్ని తామే కొనుక్కోవలసిన స్థితిలోనికి ప్రజలను నెట్టే ఆర్థిక వ్యవస్థను ఏర్పరచటం వలన ప్రజల ఇక్కట్లు తీవ్రతరమౌతాయి. ఈ ప్రక్రియ లాభాలను పంచుకోవడాన్ని ఏమాత్రం ప్రోత్సహించదు. ఇది రొట్టెను మొత్తం లాక్కొని, దాని ముక్కలను మాత్రం పంచటం వంటిది.

అంటే, జీవ సర్వేల వలన జీవ సంబంధిత, మేధో సంబంధిత సామాన్య ప్రజల హక్కుల ఆక్రమణకు దారితీస్తుంది. ఈ పద్ధతి స్థానిక ప్రజా సమూహాలకు చెందిన జీవ వైవిధ్యాన్ని, మేధోవారసత్వాన్ని వారినుంచి లాక్కొని, మేధోసంపత్తి హక్కుల వ్యవస్థ ద్వారా పరిరక్షణను పొందుతున్న సరకులుగా వాటిని మార్చివేస్తోంది. కాలానుగతంగా ఆవిర్భవించిన సామూహిక ఆవిష్కరణలు పలువురి వ్యక్తుల సమష్టి కృషి ఫలితం. ఇది కాలమాన పరిస్థితుల దష్ట్యా స్థానికీకరించిన వ్యక్తిగత ఆవిష్కరణలకు భిన్నమైనది. సామూహిక ఆవిష్కరణల అభివృద్ధి క్రమంలో పలువురు వ్యక్తులు సుదీర్ఘకాలక్రమంలో

పాల్గొంటారు ఈ రకమైన ఆవిష్కరణ దాని వినియోగక్రమంలో కాలానుగుణంగా మారుతూ, మెరుగవుతూ వస్తోంది. ఒక తరం నుంచి వేరొక తరానికి బదలాయింపు అవుతుంది. కొన్ని ప్రత్యేక సందర్భాలలో ఈ సామూహిక ఆవిష్కరణ ఎంతమాత్రం స్థానికమైనదిగా వుండదు. ఉదాహరణకు; విత్తనాలు, ఆయుర్వేదం, చైనా వైద్యాలవంటి ప్రధాన పాశ్చాత్యేతర సాంప్రదాయాలను పేర్కొనవచ్చు. కొన్ని సందర్భాలలో ఈ ఆవిష్కరణలు దేశాల సరిహద్దులను దాటికూడా పోతాయి.

ప్రైవేటీకరణ నేపథ్యంలో, స్థానిక జన సమూహాల మధ్య పరస్పర మార్పిడి ప్రక్కకు నెట్టివేయబడింది. దీని స్థానంలో స్థానిక జన సమూహాల అమూల్యమైన, ఆవిభాజ్యమైన వారసత్వాన్ని స్వాహా చేసే కార్పొరేట్ సంస్థల జీవసర్వేల ఒప్పందాలు వచ్చాయి. ఇవి తరచుగా, శాస్త్రీయ సేకరణ కార్యక్రమాలు, జాతుల వృక్ష సంబంధిత పరిశోధన మొదలైన వాటిద్వారా అమలు జరుగుతున్నాయి. వాణిజ్యపరంగా విలువైన జన్యుపరమైన, జీవ రసాయన వనరులను వెతకటమే జీవ వైవిధ్యపు సర్వేగా ప్రపంచ వనరుల సంస్థ నిర్వచించింది. ఈ సర్వే అనే మాటను, బంగారం లేదా చమురులకై చేసే సర్వేల తాలూకు మాట నుంచి అరువు తెచ్చుకున్నారు. జీవ వైవిధ్యం ఔషధ జీవ సాంకేతిక పరిశ్రమల పరిభాషలో పచ్చని బంగారం, పచ్చని చమురుగా వేగంగా మారిపోతుంది. ఈ పరిస్థితిలో సర్వే చేయడం అనే మాటను ఉపయోగించటమంటే ఈ సర్వేకు ముందు ఆ వనరు వెలుగు చూడకుండా నిక్షిప్తంగానూ, నిరుపయోగంగాను, విలువలేకుండానూ ఉండిపోయింది. కానీ, బంగారం, చమురు నిక్షేపాలలాకాక జీవ వైవిధ్యపు ఉపయోగాలు, విలువలు స్థానిక జన సమూహాలకు ముందు నుంచి తెలిసినవే. ఈ స్థానిక జన సమూహాల నుంచి, జీవ సర్వే ఒప్పందాల ద్వారా విజ్ఞానాన్ని తీసివేసుకుంటున్నారు. అందుచేత, జీవ సర్వే అనే మాట విజ్ఞానం ముందునుంచి వినియోగంలో వుండటాన్ని దానికి సంబంధించిన హక్కులను కప్పిపెడుతోంది మేధోసంపత్తి హక్కుల పరిరక్షణ వ్యవస్థ ద్వారా పరిరక్షణను పొందుతోన్న పారిశ్రామిక వ్యవస్థను అభివృద్ధి చేయటంలో, స్థానిక జన సమూహాల నుంచి జీవ సర్వేల ద్వారా విజ్ఞానాన్ని తీసుకోవటం మొదటి మెట్టుగా వుంది. స్థానిక విజ్ఞానాన్ని ఉత్పాదకంగా ఉపయోగించుకొని, ఈ పారిశ్రామిక వ్యవస్థ సరకులను అమ్ముకుంటోంది. అయితే, ఈ పారిశ్రామిక వ్యవస్థ, స్థానిక విజ్ఞాన వ్యవస్థల తాలూకు నైతిక, విజ్ఞానం పుట్టుక, లేదా పర్యావరణ సంబంధిత నిర్మాణాలను పునాదులుగా చేసుకోవటం లేదు ఈ పారిశ్రామిక సంస్థలు పేటెంట్ల ద్వారా కాపాడబడుతున్న జీవ సంబంధిత ఉత్పత్తులను తయారు చేసేందుకుగానూ జీవ వైవిధ్యపు విడివిడి అంశాలను ముడి సరకుగా ఉపయోగించుకుంటున్నాయి. తద్వారా జీవ వైవిధ్యాన్ని, స్థానిక విజ్ఞానాన్ని ఒకపక్క దోపిడి చేస్తూనే మరోపక్క వాటిని స్థానిక జనసమూహాల పునాదుల నుంచి తీసివేస్తున్నాయి. దీర్ఘకాలం పాటు ఒకే పంటను పండించే ప్రధాన వ్యవస్థను, గుత్తాధిపత్యాన్ని అతిక్రమించటంలో జీవ సర్వే మొదటి అడుగు. దీని వలన జీవ వైవిధ్యం నశించిపోతోంది.

స్థానిక విజ్ఞానం అనేది ప్రజలు ప్రకృతితోనూ, తమ మధ్యగల పరస్పర సహకారంపైనా ఆధారపడి నిర్మించుకునేది. కాబట్టి, మేధోసంపత్తి హక్కుల వ్యవస్థ అనేది ప్రకృతిలో సహజమైన సృజనాత్మకతను తిరస్కరించే పునాదిపై ఆధారపడి వుంది జీవ సర్వేల ఒప్పందాల ద్వారా మేధోసంపత్తి హక్కుల రక్షణ వ్యవస్థను అనుసరించటం తాలూకు నైతిక, జ్ఞాన సంబంధిత నిర్ధారణలను మరింత

లోతుగా విశ్లేషించాలి. పరిశీలించాలి జీవ సర్వేకి సంబంధించిన నమూనాను సమప్రాతిపదిక, ముఖ్యంగా దానిని ప్రసాదించిన సమాజంపై పడే నిర్దిష్ట ప్రభావాల నేపథ్యంలో పరిశీలించాలి అలాగే, ఈ జీవ సర్వే తాలూకు ప్రయోజనాలను అందుకుంటున్న సమాజాలు, జీవ సర్వేలు చేసే సంస్థలపై పడే ప్రభావాలను కూడా తెలుసుకోవాలి.

జీవ సర్వేల తాలూకు ఒప్పందాలు ముందస్తు అంగీకారపు సమాచారం, పరిహారపు చెల్లింపులపై ఆధారపడి ఉన్నాయి. కాగా, జీవ చౌర్యం విషయంలో స్థానిక విజ్ఞాన సాంప్రదాయాలకు అందరు యజమానులు, కొనసాగింపుదారుల నుంచి ఎటువంటి అనుమతిని తీసుకోవటంలేదు. అలాగే వారికి ఎటువంటి పరిహారాన్ని ఇవ్వటంలేదు. కాగా, దీనివలన అసమానతలు ఏర్పడుతున్నాయి. అన్యాయం జరుగుతుంది. అంతేకాకుండా, ఇది ఒకే సమాజంలోని మనుష్యుల మధ్య సంబంధాలను దెబ్బతీస్తోంది అలాగే, వివిధ స్థానిక జనసమూహాల మధ్యకూడా అనారోగ్యకరమైన వాతావరణం నెలకొంటుంది. ఈ కారణం చేతనే, ఒక వ్యక్తి లేదా ఒక జనసమూహం లేదా ఒక స్వయం ప్రయోజనాల బృందం ద్వారా పనిచేసే జీవ సర్వే నమూనాలు ఎప్పటికి సమానత్వాన్ని సాధించలేవు. వాణిజ్య ప్రయోజనాల అవసరాలు అనేవి జీవవైవిధ్య సంబంధిత విజ్ఞానాన్ని సమష్టి ఆవిష్కరణ ద్వారా అభివృద్ధి చేసి, వినియోగించుకుంటున్న అన్ని జనసముదాయాలు, అందరు సభ్యుల అంగీకారాన్ని ముందుగా తీసుకోవాలి విజ్ఞానం అభివృద్ధిలో భాగస్వామ్యంగల అన్ని బృందాల ప్రయోజనాలకై, ప్రభుత్వ భాగస్వామ్యమనేది ఒక మార్గం. జీవవైవిధ్య సంబంధిత సామూహిక ఆవిష్కరణలో పలు ప్రయోజనాలు అంతర్భాగం రైతులు, విత్తనాల పరిశ్రమ, సాంప్రదాయక వైద్యులు, ఔషధాల తయారీ కంపెనీలు, పాశ్చాత్యేతర శాస్త్ర సాంప్రదాయాలు, విజ్ఞాన సముపార్జన తాలూకు పురుష, స్త్రీల భిన్న విధానాలు ఇవన్నీ ఈ ప్రయోజనాలలో భాగమే. కాబట్టి లావాదేవీలో భిన్న సమూహాల ప్రయోజనాలు అన్నింటినీ పరిగణలోకి తీసుకోవాలి.

ఏ ఒక్క వినియోగదారుల సమాజం, లేదా ఏ సామూహిక బృందానికి చెందిన వ్యక్తి, లేదా సమాజం తరపున ప్రభుత్వం తన సమష్టి ప్రయోజనాలను కోల్పోవటం లేదా పరిత్యజించటం చేయరాదు. జీవ వైవిధ్య సంబంధిత విజ్ఞానం విషయంలో, జీవ సర్వే నమూనా, ప్రయోజనాల పంపిణీకీ సరైన మార్గం కాదు. ఇది రెండు రకాల వెలివేతలపై ఆధారపడి వుంది. మొదటగా, విజ్ఞానాన్ని వినియోగదారుల సమూహాలు ఆవిష్కర్తల నుంచి వేరుచేసి, ఒక స్థానిక బృందాన్ని ఈ విజ్ఞానపు సొత్తుదారుగా చూడటం. రెండవది, స్థానిక సమాజాల నుంచి బదిలీ చేసుకున్న విజ్ఞానంపై మేధోసంపత్తి హక్కులను, జీవసర్వే ఒప్పందాల ద్వారా ఒక వాణిజ్య సంస్థ తీసుకోవటం తాలూకు సమర్థనీయంకాని తీరు. కాలక్రమేణా, ఈ పరిస్థితి ఆ విజ్ఞానాన్ని ప్రసాదించిన ప్రజాసముదాయాన్ని పక్కకు నెట్టివేస్తోంది జీవ వనరులు, విజ్ఞానాన్ని అందించిన జనసముదాయం ఏకఛత్రాధిపత్యం గల కార్పొరేట్ సంస్థల నుంచి సరకుల రూపంలో ఈ విజ్ఞాన ఫలాలను కొనుక్కోవలసి రావటం జరుగుతుంది. ఉదాహరణకు విత్తనాలను పండించడంలో భాగం పంచుకున్న రైతులు అదే విత్తనాన్ని యాజమాన్యం పేరిట విత్తన పరిశ్రమ నుంచి కొనుగోలు చేయవలసి వస్తోంది

పేదలను ధనికులుగా మార్చటానికి జీవ సర్వేను మార్గంగా పేర్కొంటున్నారు. జీవ సర్వే

ధనరూప పరిహారంతో ముడిపడి వుంది కనుక, విస్తారంగా జీవ వైవిధ్యంగల పేద ప్రాంతాలను ఈ జీవ సర్వే ధనవంతంగా చేయగలదు అని చెబుతున్నారు. ఐతే, జీవ సర్వే నమూనా అనేది పేదల నుంచి వారికి చివరగా మిగిలిన ప్రకృతి, మేధోవనరులకు లాగివేసుకోవటానికి ఉద్దేశించినది. అందుచేత, ఈ జీవ సర్వే వాస్తవానికి, మొత్తం సమాజంలో పేదరికాన్ని సృష్టించే నమూనా. అయితే, అది సమాజంలోని కొద్దిమంది వ్యక్తులకు డబ్బును సంపాదించి పెట్టవచ్చు. భౌతిక సంపత్తి ఆర్థిక వ్యవస్థకు, ద్రవ్యసంబంధిత ఆర్థిక వ్యవస్థకు మధ్యగల తేడాను గుర్తించినప్పుడు మాత్రమే జీవ చౌర్యం, జీవ సర్వేల తాలూకు పేదరికాన్ని సృష్టించే ప్రభావాన్ని గుర్తించగలం. సంపన్నవంతమైన జీవ వైవిధ్యం, మేధోసంపత్తి ఉన్నప్పుడు మాత్రమే ప్రజలు తమ ఆరోగ్యరక్షణ, పోషకాహారపు అవసరాలను తమ స్వంతవనరుల ద్వారానూ, తమ విజ్ఞానం ద్వారానూ నెరవేర్చుకోగలరు. కాగా, మరోప్రక్క వనరులు, విజ్ఞానం రెండూ సమాజం నుంచి మేధోసంపత్తి హక్కుదారులకు బదిలీ అవుతుయిన్నాయి. అంటే, వాస్తవానికి తమ స్వంతమైన, తాము స్వేచ్ఛగా వినియోగించుకున్న వనరులకుగాను అధిక ధరలు, రాయల్టీలను చెల్లించే స్థితికి సమాజంలోని సభ్యులు నెట్టివేయబడుతున్నారు. అంటే, వారు భౌతిక సంపత్తిపరంగా పేదలౌతున్నారు

ఒక సమాజపు జీవ వైవిధ్య విజ్ఞానాన్ని, ఒక కార్పొరేట్ సంస్థ స్వంతం చేసుకుని వాణిజ్యీకరిస్తే, దానిని మేధోసంపత్తి హక్కుల పరిరక్షణ కింద ఆస్తిపరమైన విజ్ఞానంగా మార్చుకుంటే, ఈ విజ్ఞానాన్ని అందించిన సమాజంపై పలు దుష్ప్రభావాలు పడతాయి.

1. మూల్యం లేకుండా స్వంతం చేసుకోవటం, అదే సమయంలో గుత్తాధిపత్య అమ్మకాలు, వ్యక్తులు, జన సమూహాల మధ్య స్వేచ్ఛగా మార్పిడిని నిషేధించటం వలన జీవవైవిధ్యం, విజ్ఞానాలపై గుత్త అదుపు ఏర్పడుతుంది.

2. ప్రపంచ వ్యాపితంగా జీవవైవిధ్యం వాణిజ్య విలువను సంతరించుకున్నకొద్దీ, దానిని దోపిడి చేయటం పెరుగుతుంది. ఉదాహరణకు, ఒక ఔషధమొక్కనే తీసుకోవచ్చు. దీనివలన జీవ వనరులు స్థానిక అవసరాలను తీర్చటంనుండి వైదొలగిపోయి స్థానికేతర దురాశను పోషిస్తాయి దీనివలన కొరత ఏర్పడుతుంది. అలాగే ధరలు పెరిగిపోతాయి.

3. వనరులు శృతిమించిన దోపిడికి గురైనకొద్దీ అవి అంతరించిపోతాయి.

4. ఈ వనరుల నుంచి తయారైన సరుకులపై మేధోసంపత్తి హక్కులతో కలగలసి స్థానికంగా కొరత ఏర్పడినకొద్దీ ఈ వనరు, దాని ఉత్పత్తులు, ఈ వనరును ప్రసాదించిన సమాజంలో అందుబాటులో లేకుండా పోతాయి. (ఉదా. వేప.)

5. ఆవిర్భవిస్తున్న మార్కెట్లలో ఈ వనరులు సృష్టించిన సమాజాలకు తగిన వాటా లభించదు.

6. విజ్ఞానాన్ని ఎటువంటి వ్యయం లేకుండాను లేదా అతి తక్కువ ఖర్చుతోను పొందిన ఇతర పేద (స్వేచ్ఛా మార్పిడి లేదా అతి తక్కువ ఖరీదైన విత్తనాలపై ఆధారపడిన సాంప్రదాయం గల) సమాజాలు వాణిజ్య ప్రయోజనాలపై ఆధారపడే స్థితికి నెట్టివేయబడతాయి.



4488

ఈ దృక్పథం జీవసర్వే లేదా సరకుల నమూనాను మాత్రమే ప్రతిబింబిస్తుంది ఈ నమూనా, ప్రజల సామూహిక వనరులను కొల్లగొట్టి, వాటిని సరకులుగా మార్చుకునేవారి హక్కులను మాత్రమే పరిరక్షిస్తోంది ముందుగా చర్చించినట్లుగా స్థానిక జనసముదాయాలు పొందే, పంచుకునే ప్రయోజనాలు కంటికి కనబడకుండా పోతాయి. కాగా, ఈ వనరులను ప్రైవేటీకరించే, సామూహిక వనరులను అన్యాక్రాంతం చేసుకొనేవారు పంచుకునే లాభాలపైకే దృష్టి మళ్ళుతుంది. నా ఉద్దేశ్యంలోజనసమూహాల సామూహిక మేధోసంపత్తిని తిరిగి వారికే అందించటం, దీనికై, సామూహిక మేధోసంపత్తి హక్కులను ధృడంగా ప్రకటించడం పైనే న్యాయమైన లాభాల పంపిణీ తాలూకు నిజమైన నమూనా ఏర్పడగలదు. కాగా, స్వదేశీ విజ్ఞానం, జీవ వైవిధ్యాల విషయంలో న్యాయమైన లాభాల పంపిణీ అనేది గుత్తసంస్థలు, పేటెంటు హామీలున్న గుత్తాధిపత్య హక్కులతో పొసగదు. అందుచేత, జీవ చౌర్యాన్ని చట్టవ్యతిరేకమైనదిగా నిర్ణయించాలి. స్వదేశీ పరిజ్ఞానపు చౌర్యంపై ఆధారపడిన పేటెంట్లను చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించాలి. తద్వారా మాత్రమే సమానత్వం, దీర్ఘకాలిక ప్రాతిపదికన వినియోగం నెరవేరుతాయి.

# 5.విత్తును సొత్తు చేసుకోవచ్చా?

**విత్తనం : అత్యున్నత కానుక**

ఆహారపు గొలుసుకట్టులో విత్తనం మొదటి లింకు. ఇది జీవితం తాలూకు కొనసాగింపుకు, పునరుజ్జీవనానికి ప్రతీక అలాగే, జీవపు, జీవసంబంధిత, సాంస్కృతిక వైవిధ్యానికి కూడా ఇది చిహ్నం. రైతు దృష్టిలో విత్తనమనేది కేవలం భవిష్యత్ మొక్కలు, ఆహారం మాత్రమే కాదు. అది, సంస్కృతి, చరిత్రల నిల్వ ప్రదేశం ఆహారభద్రతకు విత్తనమనేది అత్యున్నత చిహ్నం.

జీవ వైవిధ్యాన్ని, ఆహారభద్రతను కొనసాగించటంలో రైతులు తమమధ్య విత్తనాలను స్వేచ్ఛగా మార్పిడి చేసుకోవడం పునాది. ఈ మార్పిడి, సహకారం పరస్పరతలపై ఆధారపడి వుంది. విత్తనాన్ని మార్పిడి చేసుకోదలచిన రైతు తాను పొందిన విత్తనాలకు ప్రతిగా, తన పొలంలో పండిన అదే పరిమాణంలోని విత్తనాలను చెల్లిస్తాడు.

రైతులమధ్య స్వేచ్ఛగా మార్పిడి అనేది కేవలం విత్తనాల మార్పిడికి మాత్రమే సంబంధించినది కాదు. అది, నూతన భావాలు, విజ్ఞానపు మార్పిడి రూపంలో కూడా జరుగుతుంది. అలాగే సంస్కృతి, వారసత్వం కూడా పంచుకోబడతాయి. ఇది సాంప్రదాయాన్ని ప్రోది చేసుకునే ప్రక్రియ. అలాగే విత్తనాన్ని వినియోగించుకునే తీరు, అభివృద్ధి చేసుకునే ప్రక్రియ ఇతర రైతుల పొలాలలో పండుతున్న పంటను గమనించడం ద్వారా తాము భవిష్యత్తులో ఉపయోగించదలచుకున్న విత్తనాల గురించిన విజ్ఞానాన్ని ఆ విత్తనం ఇతర రైతుల పొలాల్లో మొలకెత్తి ఎదగడాన్ని పరిశీలించడం ద్వారా తెలుసుకుంటాడు మొక్క యొక్క సాంస్కృతిక, మతపరమైన ప్రాధాన్యతలు ఆహారరీతులు కరవు, వ్యాధులను ఎదుర్కొనే శక్తి, క్రిమి కీటకాలను ఎదుర్కొనే శక్తి, నిల్వవంటి విలువలు సమాజంలో విత్తనానికి, దానినుంచి మొలకెత్తే మొక్కకుగల విధానాన్ని నిర్ధారిస్తాయి.

ఉదాహరణకు, భారతదేశంలోని పలు ప్రాంతాలలో వరికి మత సంబంధిత ప్రాధాన్యత ఉంది. పలు పండగలలో వరి తప్పనిసరి అంతర్భాగం ఛత్తీస్‌గడ్‌లో అత్తి పండుగను జరుపుకుంటారు. ఇది ఇండికా రకపు బియ్యం తాలూకు వైవిధ్యానికి కేంద్రబిందువు. జీవ వైవిధ్యపు పరిరక్షణ తాలూకు పలుసూత్రాలను ఇది మరింత బలోపేతం చేస్తుంది. దక్షిణ భారత దేశంలో, బియ్యపు ధాన్యాన్ని కుంకుమ, పసుపుతో కలిపి, ఆశీర్వాదంగా ఇస్తారు. పురోహితునికి బియ్యాన్ని ఇస్తారు. దానితోపాటుగా కొబ్బరికాయను కూడా ఇస్తారు. ఇదంతా మతాచారం తాలూకు గౌరవానికి సూచిక. మత ఆచరణలో తప్పనిసరి అంతర్భాగంగా వుడే ఇతర వ్యవసాయ ఉత్పత్తులలో కొబ్బరి, తమలపాకు,

వక్క, గోధుమలు, జొన్నలు, శనగలు, మినుములు, ఉలవలు, నువ్వులు, చెరుకు పనసపండు విత్తనంయాలకులు, అల్లం, అరటిపండ్లు, ఉసిరి వంటి వాటి విత్తనాలు, ఆకులు లేదా పూలు మొదలైనవి ఉన్నాయి.

కొత్తపంట విత్తనాలకు మొదటగా పూజ చేసి, తరువాత హాటిని నాటుతారు. అలాగే, కొత్తగా చేతికి వచ్చిన పంటను పూజించి తరువాతనే వినియోగించుకుంటారు. విత్తనాలను నాటటం, పంటను అందుకోవటం అనే ఈ రెండు పండుగలను ప్రజలు జరుపుకుంటారు ప్రకృతితో ప్రజల సన్నిహిత సంబంధానికి ఈ పండగలు నిదర్శనం. విత్తనాలు నాటే సమయంలో పొలాన్ని తల్లిగా భావిస్తారు. భూమిని పూజించటం అంటే అది భూమికి కృతజ్ఞతలు తెలపడమే అంటే, భూమి తన బిడ్డలయిన లక్షలాది జీవరీతులకు ఆహారాన్ని అందిస్తుంది. ఉగాది, రామనవమి అక్షయ్ త్రాతీయ ఏకాదశి, అత్యాయన అమావాస్య, నాగపంచమి, నూలు హునిమే, గణేష్, చతుర్థి, ఋషి పంచమి, నవరాత్రి, దీపావళి, రథసప్తమి, తులసి వివాహ, కేపా సృష్టి, భూమి పూజ మొదలైన పండగలు అన్నింటిని విత్తనం చుట్టూ అల్లుకున్న మత ఆచారాలు లేకుండా జరుపుకోలేం ఏ విత్తనాలను పెంచాలి దాని తాలూకు మొలక, ఇతర అంశాలను గుర్తించటంవంటివన్నీ విత్తన పండగలలో భాగమే.

హిందూ పురాణాల ప్రకారంగా విత్తనం అనేది సృష్టికర్త (బ్రహ్మ) కానుక. బ్రహ్మ విత్తనాలను మానవ జాతి ఆవిర్భావపు తొలిదశలోనే సృష్టించాడు అనేది కూడా ఒక విశ్వాసం. పురాణాల ప్రకారంగా, మత ఆచారాల ద్వారా దేవుని ప్రార్థించటం వలన కోరికలు నెరవేరుతాయనేది మరో విశ్వాసం. పదార్థపు ఏ రూపమయినా పూర్తిగా అంతరించిపోయినప్పుడు, దానిని తిరిగి సృష్టించుకునేందుకు ప్రజలు సముద్రమథనం నిర్వహించేవారు. విత్తనాలను నాటటం కోసమై భూమిని దున్నిన రాజుల ఉదాహరణలు భారత దేశపు వ్యవసాయ లోకోక్తులలో అంతర్భాగం. సీత తండ్రి అయిన జనక మహారాజు ఒక కరవు సమయంలో వరుణుడిని (వానదేవతను ) పూజించటం ద్వారా విత్తనాలను పొందాడు. వాటిని ఆయన స్వయంగా భూమిని దున్ని నాటాడు. తద్వారా తన ప్రజలు ఆకలి బారిన పడకుండా కాపాడాడు విత్తనాన్ని ధనలక్ష్మిగా భావించి కొలవడం పరిపాటి.

భారతీయ సంస్కృతి ప్రకారంగా, ప్రకృతిలోని అన్ని అంశాలు ఒకదానితో ఒకటి సంబంధం కలవి; పరస్పరం ప్రభావితం చేసుకునేవి. అవి భూమిపైన వున్నా లేదా శూన్యంలో ఉన్నా ఇది వాస్తవం. గ్రహాలు, నక్షత్రాల తాలూకు ప్రభావం భూమిపై వున్న జీవ జాతులపై పడటం గురించిన విశ్వాసం ఈ పరస్పరప్రభావాలకు నిదర్శనం. నవధాన్యాలు, నవగ్రహాలు పొలాలలోని సమతుల్యతకు చిహ్నం. అలాగే అవి ఆయుర్వేద సాంప్రదాయంలో కూడా అంతర్భాగం. కొన్ని విత్తనాలు, గ్రహాల తాలూకు సంబంధాన్ని ఈ క్రింది పట్టికలో చూడవచ్చు.

## విత్తనాలు, వాటి తాలూకు గ్రహ ప్రభావాలు

| విత్తనం | గ్రహం | ధాతువులు (శరీర మూలకాలకు ప్రాతినిధ్యం వహించేవి) | వ్యాధి/లక్షణం |
|---|---|---|---|
| బార్లీ | సూర్యుడు | ఎముకలు | అధిక జీర్ణశక్తి నొప్పి, జ్వరం |
| చిట్టి జొన్నలు | చంద్రుడు | రక్తం, మాంసం | వాంతులు, మలబద్ధకం, విరోచనాలు, దాహం, తల తిరగటం |
| కందులు | కుజుడు | ఎముక గుజ్జు | రక్తస్రావం, పుండ్లు |
| మాంగ్ | బుధ | చర్మం | నొప్పి, జ్వరం, మానసిక రుగ్మత |
| శనగలు | బృహస్పతి | క్రొవ్వు | మానసిక రుగ్మత |
| నువ్వులు | శని | సూక్ష్మనాళాలు | దాహం, రుచి తెలియకపోవటం |

విత్తనం సమాజపు మత ఆచార వ్యవహారాలలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా శతాబ్దాలపాటు ప్రోది అయిన ప్రజల విజ్ఞానానికి అది గుర్తు. అలాగే ప్రజల ముందున్న భిన్న అవకాశాలకు ప్రతిబింబంగా అది ప్రజల ఎంపిక చేసుకునే అవకాశాన్ని ప్రతిబింబిస్తుంది. జీవ, పర్యావరణ విధ్వంసం జరుగుతున్న నేటి నేపధ్యంలో విత్తనాన్ని జాగ్రత్తపరిచేవారు, ఆ విత్తనాన్ని జాగ్రత్త నిజంగా కానుకగా ఇస్తున్న వారు విత్తనాన్ని జాగ్రత్తపరచడం అంటే అది కేవలం ఆ విత్తనం. ధాతువులను జాగ్రత్తపరచడం మాత్రమే కాదు; విత్తనాన్ని జాగ్రత్తపరచడం అంటే జీవ వైవిధ్యాన్ని కాపాడటమే, అలాగే విత్తనానికి సంబంధించిన విజ్ఞానాన్ని వినియోగాన్ని కూడా కాపాడటమే. దీనంతటితోపాటుగా, ఇది సంస్కృతిని, దీర్ఘకాలిక పాత్రిపదికన విత్తనాన్ని ఉపయోగించుకునే అవకాశాన్ని ప్రతిబింబిస్తుంది

భారతీయ వ్యవసాయానికి పునాది అయిన విత్తనాలను పదిలపరిచే, మార్పిడి చేసుకునే సంస్కృతి నేడు ముప్పును ఎదుర్కొంటోంది హరిత విప్లవ సాంకేతిక పరిజ్ఞానం, అలాగే జీవ సాంకేతిక పరిజ్ఞానం వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానాలు విత్తనాలలో అంతర్భాగంగా వున్న సాంస్కృతిక, సాంప్రదాయక విజ్ఞానాన్ని కించపరుస్తున్నాయి. అవి, విత్తనానికి సంబంధించిన సమగ్ర పరిజ్ఞానాన్ని సమాజంలో రూపుమాపుతున్నాయి. దీనివలన విత్తనమే అంతరించిపోయే ప్రమాదం వుంది. విత్తన పునః అస్తిత్వం దాని తాలూకు సమగ్రవిజ్ఞానంలో సన్నిహితంగా ముడిపడివుంది.

వ్యాపార సంబంధిత మేధోసంపత్తి హక్కుల రక్షణ వ్యవస్థ విశ్వజనీనం చేస్తున్న నూతన

మేధోసంపత్తి హక్కుల వ్యవస్థపై ప్రక్రియను వేగిరపరుస్తోంది. పాశ్చాత్య దేశాలకు చెందిన మేధోసంపత్తి హక్కుల వ్యవస్థలు, విత్తనానికి సంబంధించిన విజ్ఞానాన్ని స్వంతం చేసుకునేందుకు కార్పొరేట్ సంస్థలకు అనుమతిస్తున్నాయి. అలాగే అవి విత్తనాన్ని గుత్తసొత్తుగా మార్చి, దానిని ప్రయివేటు ఆస్తిగా చేసివేస్తున్నాయి. దీనివలన కాలక్రమంలో విత్తనాలపైన కార్పొరేట్ సంస్థలకు గుత్తాధిపత్యం లభిస్తోంది ఫలితంగా వివిధ సమాజాలలోనూ, సమాజాల మధ్య విత్తనాల స్వేచ్ఛామార్పిడికి అవకాశం తగ్గిపోతోంది.

పేటెంట్లు, సృష్టికర్తల హక్కులు మొదలైననాటి రూపాలలో ప్రపంచవాణిజ్య సంస్థ ద్వారా నూతన మేధోసంపత్తి హక్కులను ప్రవేశపెడుతున్నారు. మొక్కలు విత్తనాలపై పేటెంట్ల అర్థం ప్రకారంగా ఈ పేటెంట్లను పొందిన కార్పొరేట్ సంస్థలకు ఆ విత్తనాన్ని లేదా మొక్కను లేదా పంటరకాన్ని తమ ఆవిష్కరణగా చెప్పుకునే అవకాశం ఉంది. తద్వారా ఆ సంస్థలు ఆ విత్తనం లేదా పంటను ఇతరులెవ్వరూ తయారుచేయకుండానూ, అమ్మకుండానూ, వినియోగించకుండానూ లేదా పంపిణీ చేయకుండానూ నిరోధించే హక్కు వుంది. మేధోసంపత్తి హక్కుల వ్యవస్థ ప్రకారంగా విత్తనాలను పదిలపరచడం లేదా స్వేచ్ఛగా వాటిని ఇరుగుపొరుగులతో మార్పిడి చేసుకోవడం వంటి పురాతన వ్యవస్థ 'మేధోసంపత్తి' చోరీగా పరిగణించబడుతుంది. విత్తనాలను పదిలపరచుకోవడం, మార్పిడి చేసుకోవటాలపై ఇప్పటికే పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలలో రైతులను కోర్టులకు ఈడుస్తున్నారు.

వ్యవసాయ వ్యవస్థలు, విత్తనాలకు సంబంధించిన రైతుల హక్కులు, స్వేచ్ఛలు రెండు విధాలుగా దెబ్బతింటున్నాయి మొదటగా, విత్తనాల చట్టం వలన రైతులు వాడే రకాల విత్తనాలు కనుమరుగైపోతాయి. స్వంతంగా విత్తనాలను తయారుచేసుకునే హక్కు చట్టవ్యతిరేక కార్యకలాపంగా పరిగణించబడుతుంది. రెండవది, రైతులు తమ విత్తనాలను దాచుకోవటం, మార్పిడి చేసుకోవటం, అభివృద్ధి చేసుకోవటం వంటి వారి అవిభాజ్య హక్కులన్నీ వదులుకోవలసి వస్తుంది దీనివలన 'రిజిస్టరు' చేసిన రకాల విత్తనాలను మాత్రమే వాడవలసిన స్థితికి రైతులు నెట్టబడతారు. రైతులు వాడే రకాల విత్తనాలు రిజిస్టరు కాకపోవటం, వ్యక్తిగతంగా చిన్న రైతులు రిజిస్ట్రేషన్ ఖర్చులను భరించలేకపోవటం వలన వారు క్రమేణా కార్పొరేట్ సంస్థలపై ఆధారపడే స్థితికి నెట్టివేయబడతారు. ఈ రకంగా వారు 'రిజిస్టరు' అయిన విత్తన రకాలను మాత్రమే కొనుగోలు చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది.

## విత్తనచట్టం

వివిధ దేశాలలో విత్తనచట్టాలు, మేధోసంపత్తి హక్కుల వ్యవస్థలను ప్రవేశపెట్టడం వలన, ఆయా దేశాలలోని రైతులు స్వయంగా విత్తనాలను తయారు చేసుకునే అవకాశాన్ని ఎలా కోల్పోతున్నారో పలు ఉదాహరణల ద్వారా చూడవచ్చు. జర్మనీకి చెందిన సహజ ప్రాకృతిక పద్ధతులలో వ్యవసాయం చేస్తున్న జోసఫ్ ఆల్‌బ్రెట్జ్, వాణిజ్యపరంగా లభిస్తోన్న విత్తనాల విషయంలో అసంతృప్తితో ఉన్నాడు అతను తన కృషి ద్వారా కొన్ని రకాల గోధుమ గింజలను అభివృద్ధి చేశాడు పక్క గ్రామాలలోని పదిమంది ప్రాకృతిక వ్యవసాయం చేస్తోన్న రైతులు ఆల్‌బ్రెట్జ్ వద్దనుంచి ఈ విత్తనాలను తీసుకున్నారు. కాగా, సర్టిఫికెట్ లేని విత్తనంతో వ్యాపారం చేసినందుకుగాను ప్రభుత్వం ఆయనకు జుల్మానా విధించింది. దీనితో ఆయన ఆ జుల్మానాను విత్తన చట్టాన్ని కూడానూ కోర్టులో సవాలు చేశాడు ఈ విత్తన చట్టం

ప్రకారంగా ప్రాకృతిక వ్యవసాయదారుడిగా తన హక్కులు కుంచించుకుపోతున్నాయనేది ఆయన అభిప్రాయం.

స్కాట్‌లాండ్ దేశంలో విత్తనంగా ఉపయోగపడే బంగాళాదుంపను పండించే పలువురు రైతులున్నారు. వారు ఈ విత్తన రకపు బంగాళాదుంపను ఇతర రైతులకు అమ్ముతారు. 1990వ దశకం మొదటి వరకు వీరు పునరుత్పత్తి పదార్థాన్ని ఇతర విత్తనరకపు బంగాళాదుంపలను పండించేవారికి, వ్యాపారులకు, రైతులకు స్వేచ్ఛగా అమ్ముకోగలిగేవారు. అయితే, 1990వ దశకంలో, మొక్కలను పెంచే హక్కులు స్వంతం చేసుకునేవారు: బ్రిటీష్ సొసైటీ ఆఫ్ ప్లాంట్ బ్రీడర్స్ ద్వారా వీరికి కోర్టు నోటీసులను ఇవ్వసాగారు. విత్తనరకపు బంగాళాదుంపలను ఇతర రైతులకు అమ్మటాన్ని చట్టవిరుద్ధంగా ప్రకటించారు దీనంతటి ప్రకారంగా విత్తనరకపు బంగాళా దుంపలను పండించేవారు ఆ రకాలను ఒప్పందం కింద విత్తన పరిశ్రమకు అందివ్వాలి ఈ పరిశ్రమే పండిన పంటను కొనే ధరను నిర్ణయిస్తుంది. పంటను మరెవ్వరికీ అమ్మకుండా రైతులను కట్టడి చేస్తోంది. తర్వాత అనతికాలానికే, ఈ కంపెనీలు పంటను పండించే భూమి విస్తీర్ణాన్ని, ధరలను కూడా తగ్గించసాగాయి. 1994వ సంవత్సరంలో, స్కాట్‌లాండ్ దేశానికి చెందిన రైతులనుంచి 140 పౌన్లకు కొన్న విత్తన తరహా బంగాళాదుంపను, దానికి రెట్టింపు ధరకు ఇంగ్లాండ్‌లోని రైతులకు అమ్మారు. అమ్మకందారులు, కొనుగోలుదారులుగా వున్న ఈ రైతు బృందాల మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని ఆటంకపరిచారు. కొద్ది కంపెనీలు కలిసి 'కార్టెల్'గా ఏర్పడి తమను పీల్చిపిప్పి చేయటాన్ని వ్యతిరేకిస్తూ విత్తనతరహా బంగాళాదుంపలు పండించే రైతులు పిటీషన్లు దాఖలు చేశారు. అంతేకాకుండా, ఎటువంటి గుర్తింపు పత్రం లేని విత్తనాలను సరాసరి ఇంగ్లాండు రైతులకు అమ్మనారంభించారు. ఈ రకమైన అమ్మకాల వలన తాను నాలుగు మిలియన్‌ల పౌండ్లను నష్టపోతున్నానని విత్తన పరిశ్రమ చెప్పుకొంది. 1995వ సంవత్సరం ఫిబ్రవరి నెలలో, అబర్డీన్ షైర్ ప్రాంతానికి చెందిన రైతుకి వ్యతిరేకంగా కోర్టు కేసు దాఖలు చేయాలని బ్రిటీష్ సొసైటి ఫర్ ప్లాంట్ బ్రీడర్స్ నిర్ణయించుకొంది. కంపెనీ మధ్యవర్తిత్వం లేకుండా సరాసరి ఇతర రైతులకు విత్తనాలను అమ్మినందుకు కోల్పోయిన రాయల్టీల రూపంలో రైతుపై 30,000 పౌండ్ల పరిహారాన్ని విధించారు. బ్రిటన్, యూరోపియన్ యూనియన్ దేశాలకు చెందిన ప్రస్తుత చట్టాలు గుర్తింపు పత్రం లేని విత్తనాలను అమ్మకుండా రైతులను నిలువరిస్తున్నాయి. అలాగే, ఈ తంతు రక్షిత రకాల విత్తనాల విషయాలలో కూడా అమలు జరుగుతోంది

అమెరికాలో కూడా, రైతులు ఒకరితో ఒకరు ప్రత్యక్షంగా విత్తనాలను మార్పిడి చేసుకోవటాన్ని చట్ట విరుద్ధంగా చేశారు అయోవా ప్రాంతంలో డెన్నిస్ డెన్నీస్, బెకీ వింటర్ బోయర్ అనేవారు ఐదువందల ఎకరాలలో సాగుచేస్తున్న రైతులు. 1987నుంచి మొదలుకొని, ఈ రైతులు ఇరువురు విత్తనంగా పనికివచ్చే తమ పంటను ఇతర రైతులకు అమ్మటం ద్వారా పెద్ద మొత్తంలో ఆదాయాన్ని పొందారు ఈ పద్ధతినే 'బ్రౌన్ బేగింగ్'గా పిలుస్తారు. తన పొలంలో పండించిన విత్తనాలను ఇతర రైతులకు విత్తనాలుగా అమ్మే విధానాన్ని 'బ్రౌన్ బేగ్' అంటారు. ఈ ఇరువురు రైతులకు వ్యతిరేకంగా అజ్‌గ్రో(సోయాబీన్ విత్తనాలకు మొక్కరకపు రక్షణను కలిగివున్న వాణిజ్య కంపెనీ) కోర్టులో దావా వేసింది. ఈ రైతుల కార్యకలాపాల వలన తన ఆస్తి హక్కులకు విఘాతం కలిగిందనేది అజ్‌గ్రో

కంపెనీ వాదన. అయితే, ఈ రైతులు మాత్రం తాము చట్టపరిధిలోనే వ్యవహరించామని తమ వాదనలో పేర్కొన్నారు. ప్లాంట్ వెరైటీ చట్టం క్రింద రైతులకు తమ విత్తనాలను అమ్ముకునే హక్కువుంది అయితే, ఈ అమ్మకంలో ఇరుపక్షాల భాగస్వాములు రైతులే అయివుండాలి. తదనంతరం, 1994వ సంవత్సరంలో ప్లాంట్ వెరైటీ చట్టాన్ని సవరించారు. ఈ సవరణ ప్రకారంగా విత్తనాలను పదిలపరచుకొని, మార్పిడి చేసుకునే రైతుల హక్కు అంతరించిపోయింది. దీని ప్రకారంగా, విత్తన పరిశ్రమకు నిర్నిరోధమైన గుత్తాధిపత్యం లభించింది. రైతులకు , రైతులకు మధ్య జరిగే విత్తనాల మార్పిడి, అమ్మకాలను కూడా చట్టవిరుద్ధంగా ప్రకటించడం వలన ఈ పరిస్థితి ఏర్పడింది.

ఇక మాన్‌శాంటో రౌండ్-అప్-రెడీ జీన్ ఒప్పందం మరో వ్యవహారం. ఈ ఒప్పందం క్రింద తమ పొలంలో పండిన విత్తనాలు పంటను ఏ ఇతర వ్యక్తికి, లేదా సంస్థకు అమ్మే, లేదా సరఫరా చేసే హక్కులు, లేదా దాచుకునే హక్కులు చట్టవిరుద్ధం చేశారు. అంతేకాకుండా, ఈ ఒప్పందం ప్రకారంగా విత్తనాల ధరలు, రాయల్టీలకు అదనంగా ఒక పౌండుకు మరో ఐదు డాలర్లను 'సాంకేతిక పరిజ్ఞానపు రుసుము'గా చెల్లించవలసి వుంటుంది. ఈ ఒప్పందంలోని ఏ అంశాన్ని ఉల్లంఘించినా రైతు కంపెనీకి జరిగిన నష్టానికి వందరెట్ల అధిక జరిమానా చెల్లించవలసి వుంటుంది. అయితే, ఈ జరిమానాపై వాస్తవానికి ఏ పరిమితి లేదు. ఒప్పందం తరువాత, తనకు తోచిన సమయంలో మూడేళ్ల కాలం పాటు రైతుల పొలాలను సందర్శించే హక్కు మాన్‌శాంటో కంపెనీకి వుంటుంది దీనికిగాను, రైతులను వెంటబెట్టుకొని వెళ్లకుండానే, లేదా రైతుల అనుమతి లేకుండానే వారి పొలాలను తనిఖీ చేయవచ్చు. అంటే రైతుల ఆస్తిహక్కుకు కూడా గౌరవం లేదు. ఈ నిబంధన రైతులను తీవ్రంగా ఆగ్రహపరిచింది. ఒక రైతు మాటలలో చెప్పాలంటే, 'మేము చోరబాటుదారులను కాల్చి చంపుతాము!' ఈ ఒప్పందం రైతుల వారసులు, వ్యక్తిగత ప్రతినిధులకు కూడా వర్తిస్తుంది. అయితే, మాన్‌శాంటో సంస్థ అనుమతి లేకుండా పండించేవారు తమ హక్కును బదిలీ చేయరాదు. అంటే, మాన్‌శాంటో సంస్థకు, రైతుకు సంబంధించిన ఇతరులపై కూడా హక్కులు వున్నాయి. కాగా, ఒప్పందాన్ని బదిలీచేసే హక్కుమాత్రం రైతుకు లేదు

దీనితోపాటుగా, ఈ ఒప్పందంలో కంపెనీకి సంబంధించిన ఎటువంటి బాధ్యతకు సంబంధించిన నిబంధన లేదు. విత్తనం పనితీరుకు సంబంధించిన ఎటువంటి ప్రస్తావన లేదు. మాన్‌శాంటో కంపెనీ వాగ్దానం చేసిన విధంగా విత్తనం ఫలితాలను ఇవ్వలేకపోయినా, లేదా ఈ విత్తనం వల్ల కలిగే పర్యావరణ హానికి కూడా కంపెనీ బాధ్యత వహించదు. మాన్‌శాంటో కంపెనీ జన్యు ఇంజనీరింగ్ ద్వారా తయారు చేసిన ప్రత్తి రకమైన 'బోల్‌గార్డ్' వైఫల్యం నేపథ్యంలో ఈ అంశం మరింత ప్రాధాన్యతను సంతరించుకొంటోంది. 1996వ సంవత్సరంలో, తమ ప్రత్తి పంటను బోల్ క్రిమి నుంచి రక్షించుకునేందుకు రైతులు పురుగుమందులు చల్లవలసి వచ్చింది వాస్తవానికి ఈ పంటకు సంబంధించిన విత్తనాలు అమ్మేటప్పుడు బోల్‌క్రిములు ఈ పంటను ఎటువంటి నష్టం చేయలేవని మాన్‌శాంటో సంస్థ ప్రచారం చేసుకొంది

విత్తనాలు, రైతులపై తిరుగులేని గుత్తపెత్తనాన్ని సంపాదించేందుకుగాను రౌండ్-అప్-రెడీ జన్యు ఒప్పందం జరిగింది. పంట విత్తనాలలోకి కలుపునాశక లేదా క్రిముల బారిన పడనీయని

జన్యువులను ప్రవేశపెట్టే ప్రక్రియ వలన ఏర్పడే అవకాశం వున్న పర్యావరణ సంబంధిత లేదా సామాజిక అంశాలకు సంబంధించి ఈ సంస్థకు ఎటువంటి బాధ్యతా లేదు. అంటే, విత్తనాల పరిశ్రమకే సర్వహక్కులు వున్నాయి రైతులకు ఎటువంటి హక్కులు లేవు. ఈ విధమైన ఏకపక్ష ఒప్పందం వలన జీవవైవిధ్యానికి ఎటువంటి రక్షణా లేదు. అలాగే ఈ ఒప్పందం ఆహారభద్రతను కూడా కల్పించలేదు. ఇది క్రమంగా జీవవైవిధ్యపు ఏకఛత్రాధిపత్య నియంతృత్వానికి దారితీస్తోంది.

## మొక్కలపై పేటెంట్లు

మొక్కలపై పేటెంట్లను తీసుకోవటం వలన ఆహారం, వ్యవసాయ వ్యవస్థలపై గుత్తాధిపత్యం తాలూకు తీవ్రమైన ఆందోళనకు తావు ఏర్పడుతోంది. మొక్కలపై పేటెంట్ల వలన జీవవైవిధ్యానికి హాని జరిగే, చిన్న రైతుల మనుగడ దెబ్బతినే, ప్రజల ఆహార భద్రతకు ముప్పు వాటిల్లే రెండు ధోరణులకు అవకాశం వుంది మొదటి ధోరణి ప్రత్తి, సోయాబీన్‌లపై అగ్రాసెటాస్(ప్రస్తుతం మోన్‌శాంటో యాజమాన్యంలో వున్న) మొత్తం మొక్కల జాతులకు సంబంధించిన పేటెంట్లు కలిగి వుండటం. ప్రవేశపెట్టిన జన్యువుతో నిమిత్తం లేకుండా అవి ఎలా ప్రవేశపెట్టబడ్డాయో పట్టించుకోకుండా ఒక వృక్షజాతికి చెందిన జన్యుపరంగా మార్పిడి చేసిన రకాలపైన పేటెంట్లను ఇవ్వటం వలన ఒక వ్యక్తిగత అవిష్కర్త చేతికి మన పొలాలు, తోటలలో పండించే పంటలపై అదుపు లభిస్తుంది.

మొక్కల పెంపకందారుల హక్కులకు (పిబిఆర్‌లు) భిన్నంగా, వినియోగ పేటెంట్లు అత్యంత విస్తృతమైనవి. వీటివలన విడివిడి జన్యువులపైన, లక్షణాలపైనా కూడా గుత్తాధిపత్య హక్కులు లభిస్తాయి. పిబిఆర్ హక్కుల వలన మొక్కలలోని జన్యుపదార్థంపై ఎటువంటి యాజమాన్య హక్కు లభించదు. ఇది కేవలం ఒక నిర్దిష్ట పేటెంట్ల వలన మొత్తం వృక్షాలేకాక వాటి భాగాలు, వాటి ప్రక్రియలపై కూడా బహుళహక్కులు లభిస్తాయి. తద్వారా, ఒక కంపెనీ కొన్ని పంటరకాలపై రక్షణకు, అంటే ఆ రకాల ప్రధానభాగాలు (పువ్వులు, పండ్లు, విత్తనాలు మొదలైనవి), సూక్ష్మభాగాల(కణాలు, జన్యువులు, జీవపదార్థం మొదలైనవి)పై దరఖాస్తు చేయవచ్చు అంతేకాకుండా, ఈ భాగాలపై పనిచేసేందుకు అభివృద్ధి చేసిన ఎటువంటి నూతన ప్రక్రియలపైన అయినా ఒక బహుళపేటెంటు ద్వారా అదుపు సంపాదించవచ్చు

ఈ రకమైన జన్యువులు, లక్షణాలు గల వనరులు అన్నింటిపైనా పేటెంట్ రక్షణ వలన, రైతులు తమ హక్కులు కోల్పోతారు. ఇది వ్యవసాయం తాలూకు అన్ని పునాదులను దెబ్బతీస్తోంది. ఉదాహరణకు వోలేయిన్ ఆమ్లం అధికంగా వున్న ఒక పొద్దుతిరుగుడు రకంపై అమెరికాకు చెందిన ఒక జీవసాంకేతిక సంస్థ సన్‌జీన్‌కు పేటెంటు లభించింది. ఈ పేటెంట్, ఈ ఆమ్లాన్ని తయారుచేసే జన్యువుపైకాక, ఆ ఆమ్లంపైననే తీసుకున్నారు. తద్వారా అధికంగా వోలియేన్ ఆమ్లంగల ఎటువంటి పొద్దుతిరుగుడు రకాన్నైనా పొద్దుతిరుగుడు రకాలను తయారు చేస్తోన్న ఎవరూ తయారు చేయరాదని, అది తమ పేటెంట్ హక్కుకు విఘాతం అని సన్‌జీన్ సంస్థ ప్రకటించింది. మొక్కలను పేటెంట్ చేయటం విషయంలో అమెరికా కోర్టు 1985వ సంవత్సరంలో ఇచ్చిన తీర్పు అత్యంత ప్రధానమైనది. ఈ తీర్పు ప్రకారంగా 'మాలిక్యులార్ జన్యువిభాగం'లో శాస్త్రవేత్త అయిన కెన్నెత్ హిబ్బర్డ్ అతని సహ

పరిశోధకులకు, కణ సంబంధిత ఎంపిక ద్వారా, ఒక తరహాకు చెందిన మొక్కజొన్న రకం తాలూకు కణసముదాయాలు, విత్తనం, మొత్తం మొక్కపై పేటెంట్ లభించింది. మొత్తం 260 రకాల అంశాలపై హిబ్బర్డ్ దరఖాస్తు చేసుకున్నాడు. దీనివలన, ఆ 260 అంశాలపైన ఇతరులకు ఏ హక్కు ఉండదు. కార్పొరేట్ సంస్థల పోటీలో హిబ్బర్డ్ తీసుకున్న పేటెంట్ నూతన చట్ట సంబంధిత నేపథ్యాన్ని ఏర్పరుస్తుంది. దీని ప్రభావం రైతులు, విత్తన పరిశ్రమల మధ్య పోటీపై ప్రగాఢంగా పడుతుంది

విత్తన పరిశ్రమ సుదీర్ఘకాలంగా ఆశిస్తోన్న లక్ష్యమైన రైతులు ఏ పంట విషయంలోనైనా విత్తనం పునరుత్పత్తిపై కాక, తమ కంపెనీలు తయారుచేసిన విత్తనాన్ని ప్రతి సంవత్సరం కొనుగోలు చేసేలా ఒత్తిడి చేయటం అనే దానికి ఈ తీర్పు వలన తగిన చట్టం ఏర్పడుతోంది. పారిశ్రామిక పేటెంట్ల ప్రకారంగా వస్తువు వినియోగంపైనే హక్కు ఉంటోంది. దానిని తయారు చేసే హక్కు ఉండదు. విత్తనం తనను తాను తయారు చేసుకుంటుంది అందుచేత, విత్తనంపై శక్తివంతమైన వినియోగ పేటెంటు అంటే, ఈ పేటెంటు చేయబడిన విత్తనాన్ని కొన్న రైతు దానిని వినియోగించుకోవచ్చు. అయితే, అతను దానిని తయారుచేయరాదు (భద్రపరచుకోవటం లేదా తిరిగినాటడం). భారతదేశంలో ఇటువంటి పేటెంట్లను ప్రవేశపెట్టడం వలన పేటెంటు రక్షణ గల విత్తనం లేదా మొక్క రకపు విత్తనాన్ని దాచుకొని తిరిగి నాటిన రైతు చట్టాన్ని ఉల్లంఘించినవాడు అవుతాడు. భారతదేశంలో వ్యవసాయ రంగంపై పేటెంట్ల వ్యవస్థను రుద్దేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది. వ్యాపార సంబంధిత మేధోసంపత్తి, హక్కుల రక్షణ ఒప్పందం మానవుల ఆహార, ఆరోగ్య హక్కులకు వ్యతిరేకమైనది. ఇది కీలక రంగాలైన ఆరోగ్యం, వ్యవసాయంపైన కార్పొరేట్ సంస్థలకు పరిమితిలేని గుత్త హక్కులను కట్టబెడుతోంది. అమెరికాలో మొక్కల పేటెంటు విస్తృతికి సంబంధించి ఈమధ్య ఇచ్చిన ఒక తీర్పు కొత్త అనవాయితీని సృష్టిస్తోంది. ఈ తీర్పు ప్రకారం పేటెంటు చేయబడిన మొక్కతో కేవలం ఒకే రకమైన లక్షణాలు గల మొక్క చట్టవ్యతిరేకమైనది. నిరపరాధులమని ఋజువు చేసుకునే భారాన్ని ముద్దాయిపైనే వుంచటంతోపాటుగా, పైరకమైన అనవాయితీ వలన మొక్కలలో ఈ రకమైన లక్షణాలను ఏ దేశపు జీవ వైవిధ్యం గురించి తీసుకున్నారో ఆ దేశానికి ఇది వినాశకరంగా పరిణమించగలదు జీవ వైవిధ్యపు వాస్తవ దాతలపై ఈ రకమైన అనవాయితీ ద్వారా చౌర్యం నేరం మోపబడినపుడు ఇది మరింత నిజం. ఇటువంటి న్యాయ సంబంధిత అనవాయితీని దుర్వినియోగపరచే జీవవైవిధ్య చట్టాలు ముందస్తుగా లేకపోవటం వలన ఈ ప్రమాదం మరింత తీవ్రతరమౌతోంది

మొక్కలపై పేటెంట్లను ఆమోదించని దేశాలలో, మొక్కల లక్షణాలను, గుణాలను పేటెంటు చేసేందుకుగాను, జన్యువులను పేటెంట్ చేయటం దారి కల్పిస్తోంది. తద్వారా ఆ లక్షణాలు, గుణాలపై గుత్తాధిపత్యం లభిస్తోంది. డబ్ల్యు.ఆర్. గ్రేస్ వంటి బహుళజాతి సంస్థలు వేపనుంచి తయారుచేసిన అజార్ డైరాచ్‌టిన్‌వంటి క్రిమిసంహారకాలపై పేటెంట్ల వంటివి. అంటే, వృక్ష సంబంధిత ఉత్పత్తులపై పేటెంట్ల వలన వేప ఉత్పత్తుల మార్కెట్‌పైన, ముడిసరుకు అందుబాటుపైనా తీవ్రమైన ప్రభావం పడుతుంది

వ్యవసాయ రంగంలో పేటెంట్లను అనుమతించడంవలన ఈ క్రింద పేర్కొన్న తరహా ఆచరణాత్మక ప్రతికూల ప్రభావాలు పడతాయి:

1. వృక్ష సంబంధిత పదార్థాలపై పాశ్చాత్య బహుళజాతి సంస్థల గుత్తాధిపత్యానికి ప్రోత్సాహం లభిస్తోంది. వ్యవసాయరంగంలో కీలక ఉత్పాదకమైన విత్తనానికై రైతులు కార్పొరేట్ సంస్థలపై ఆధారపడవలసి వస్తోంది అతిపెద్ద రసాయన, వ్యవసాయ సంబంధిత ఉత్పత్తుల కార్పొరేట్ సంస్థలు విత్తనాల సంస్థలను స్వాహా చేయటం వలన ఈ గుత్త అదుపు ప్రభావం మరింత తీవ్రతరం అవుతుంది. ఈ గుత్త సంస్థలు ఎరువులు, క్రిమిసంహారకాలు, కలుపు నివారకాలు మొదలైనవాటిపై అదుపు కలిగివుండటమే దీనికి కారణం. వ్యవసాయ రంగంపై కార్పొరేట్ అదుపుతోపాటుగా విత్తనంపై గుత్తపెత్తనం వలన వ్యవసాయదారులకు అందుబాటులో వున్న పలు రకాలు పెద్దస్థాయిలో అంతర్ధానమైపోతాయి. దీనివలన జీవవైవిధ్య పరిరక్షణకు, అలాగే రైతుల మనుగడకు ముప్పు వాటిల్లుతుంది జీవవైవిధ్యం నశించటం వలన, మన దేశపు పరిపుష్ట సాంస్కృతిక వైవిధ్యం కూడా దెబ్బతింటుంది.

2 రాయల్టీల చెల్లింపుల వలన విత్తనాల ధరలు బాగా పెరిగిపోతాయి.

3. మేధోసంపత్తి హక్కుల వ్యవస్థ పర్యవసానంగా మారే ఆర్థిక సూత్రాలు చిన్న రైతులను ఋణభారంలోకి, దీనస్థితిలోకి నెట్టివేస్తాయి. ఫలితంగా వారు వ్యవసాయరంగం నుంచి బయటకు నెట్టివేయబడతారు

4. నూతన పారిశ్రామికరంగంలో ఉపాధి అవకాశాలు పెరగకుండానే, వ్యవసాయ సమాజంలో పలువురు ఉపాధి కోల్పోవటం వలన సామాజిక విచ్ఛిత్తి పరిస్థితికి దారితీస్తుంది. నేరాలు, శాంతిభద్రతల పరిస్థితి అధ్వాన్నమౌతాయి.

5. వ్యవసాయం, వృక్షరీతుల విషయంలో మేధోసంపత్తి హక్కుల వలన ఆహార భద్రతకు ముప్పు వాటిల్లుతుంది. రక్షిత, పేటెంట్ చేయబడిన రకాలు ఆహార అవసరాలతో ముడిపడి వుండకపోవటం దీనికి కారణం. ఈ రకాలు వ్యవసాయ వ్యాపార రంగపు ప్రాసెసింగ్, మార్కెటింగ్ అవసరాలతో ముడిపడి వున్నాయి.

6. విత్తనాన్ని అదుపు చేయటం ద్వారా వ్యవసాయాన్ని అదుపు చేసే పరిస్థితికి మార్పువలన ఇతర సహజవనరులపై ప్రచ్ఛన్న ప్రభావాలు కూడా వుంటాయి. భూమి, నీరు వంటివి బహుళజాతి సంస్థల అదుపులోకి వెళ్ళే ప్రమాదం వుంది.

7. విత్తనాలు, మొక్కల విషయంలో మేధోసంపత్తి హక్కుల వ్యవస్థ వలన దేశ ఋణభారం పదింతలు పెరుగుతుంది. ఆహార భద్రత అడుగంటడం వలన ఆహారపు దిగుమతులు పెరుగుతాయి. దీనివలన విదేశీ మారకపు భారం పెరుగుతుంది. చివరకు ఐ.ఎం.ఎఫ్., ప్రపంచ బ్యాంకు వంటి సంస్థల షరతులకు మరింతగా తల వంచవలసి వస్తుంది.

8. ఆహార భద్రత క్షీణించడంవలన ఆహార రంగంలో పరాధీన స్థితి ఏర్పడుతుంది దీనివలన, ఆహారం కూడా పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాల చేతిలో ఆయుధంగా మారుతుంది. ఇది బానిసత్వానికి, మరల వలసగా మారిపోవటానికి దారితీస్తోంది.

## విత్తనంపై పేటెంట్లు : మొలకలను చిదిమివేస్తూ

పునరుత్పత్తికి పనికిరాని విత్తనాలపై పేటెంట్లు లేదా విత్తనాలపై పేటెంటుగల కంపెనీయే సరఫరా చేసే వ్యవసాయ సంబంధిత రసాయనాలను వాడవలసి అవసరం ఉన్న విత్తనాలు- ఇవి పాశ్చాత్య తరహా మేథోసంపత్తి తరహా హక్కుల రక్షణ వ్యవస్థ తాలూకు కోరు తెన్నులు. విత్తనాలు సరఫరా చేసిన కంపెనీ నుంచే వ్యవసాయ సంబంధిత రసాయనాలను కొనేలా రైతుపై వత్తిడి తెచ్చే పేటెంట్లకు ఉదాహరణే కలుపుమొక్కలు ఎదుర్కోగల విత్తనాలపై పేటెంట్లు. అందుచేత, మొన్‌శాంటోకి చెందిన రౌండ్-అప్-రెడీ పంటల పేటెంట్ల వలన, ఈ పంటల పెంపకానికి మొన్‌శాంటో సంస్థకి చెందిన రౌండ్-అప్ కలుపు నాశనిని కూడా కొనుగోలు చేయవలసి రావటం. రౌండ్-అప్ కలుపునాశని మొన్‌శాంటో కంపెనీకి చెందిన వ్యవసాయ ఉత్పత్తులలో, అలాగే మొత్తం కంపెనీ తాలూకు ప్రధాన భాగం. కంపెనీ చెబుతున్నదాని ప్రకారంగా, రౌండ్-అప్ 'అన్ని రకాల కలుపుమొక్కలను, అన్నిచోట్ల, తక్కువ ఖర్చుతో నాశనం చేస్తుంది.' ఇక్కడ అసలు ప్రమాదమల్లా రౌండ్-అప్ క్రిమిసంహారిణి ఎంపిక చేసిన విధంగా పని చేసే కలుపు సంహారిణికాదు. అందుచేత ఇది కలుపు మొక్కలకు, ఉపయోగకరమైన మొక్కలకు మధ్య తేడాను చూపదు. దానివలన ఇది ఇతర పంట మొక్కలను కూడా చంపివేస్తుంది. అంటే, ఇది ఎంతమాత్రం 'తక్కువ ఖర్చు'తో కూడుకున్నదికాదు తన గుత్తాధిపత్యాన్ని, లాభాలను మరింతగా పెంచుకునేందుకు మొన్‌శాంటో సంస్థ రౌండ్-అప్-రెడీ పంటలను అభివృద్ధి చేసింది ఈ పంటలు రౌండ్-అప్ కలుపు నాశనిని తట్టుకొనేవిధంగా తయారయ్యాయి.

మొన్‌శాంటో సంస్థ సంపాదించిన పేటెంట్ల క్రిందకు కలుపును తట్టుకోగల మొక్కజొన్న, గోధుమ, బియ్యం, సోయాచిక్కుడు, పత్తి, నువ్వులు, అవిసెచెట్టు, పొద్దుతిరుగుడు, బంగాళాదుంపలు, పొగాకు, బూరుగ, దేవదారు, యాపిల్, ద్రాక్ష మొదలైన రకాలన్నీ వస్తాయి. ఈ సంస్థ కలుపు నివారణ విత్తనాలను నాటటం, గ్లైఫోసేట్‌ను ఉపయోగించటం మొదలైన పద్ధతులన్నింటిపైన పేటెంటు తీసుకుంది. ఈ రకంగా, మొన్‌శాంటో సంస్థ మొక్కల తాలూకు మొత్తం ఉత్పత్తి ప్రక్రియను, అంటే మొక్కలను తయారు చేయటం నుంచి వాటి పెంపకం, అమ్మకాల వరకు అదుపు చేస్తోంది. ఈ ఉత్పత్తులు మొన్‌శాంటో సంస్థ లాభాలను పెంచగలవు అయితే, మూడవ ప్రపంచ దేశాలలో జీవవైవిధ్యం, ఆహార పంటలు నాశనమైపోతాయి అవసరంలేని రకాల మొక్కల రకాలకై కృత్రిమ డిమాండు సృష్టించబడుతుంది.

విత్తనంపై పేటెంటు తీసుకోవటంలో అసలైన ప్రమాదమల్లా టెర్మినేటర్ సాంకేతిక పరిజ్ఞానం నుంచి వస్తుంది. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని 'వ్యవసాయరంగపు న్యూట్రాన్ బాంబు'గా పేర్కొంటున్నారు. రైతులు విత్తనాల కంపెనీలు అమ్మే హైబ్రిడ్ యేతర, పరపరాగసంపర్క, లేదా జన్యుపరంగా మార్పిడి చేయబడిన విత్తనాలను దాచుకోవటాన్ని నిరోధించేందుకు ఉద్దేశించినదే టెర్మినేటర్ సాంకేతిక పరిజ్ఞానం. ఈ సాంకేతిక పరిజ్ఞానం 1998లో ఆరంభమైనది అమెరికా వ్యవసాయ శాఖ, మొన్‌శాంటో కంపెనీకి చెందిన ప్రపంచంలోని ప్రత్తి విత్తనాల కంపెనీలలో అతిపెద్ద విభాగమైన డెల్టా అండ్ పైన్‌లాండ్ కంపెనీలు సంయుక్తంగా దీనిని తయారుచేశాయి. ఈ సంస్థలు ఈ నూతన, వ్యవసాయ సంబంధిత జీవసాంకేతిక పరిజ్ఞానంపై పేటెంటు తీసుకున్నట్లుగా ప్రకటించాయి దీనికే ఆ సంస్థలు 'మొక్కల

జన్యువుల తాలూకు వ్యక్తీకరణను అదుపు చేయడం' అనే ముద్దుపేరును పెట్టుకున్నాయి. ఈ పేటెంటు ద్వారా, దాని యజమానులు, లైసెన్స్ పొందినవారు, మొక్కల జన్యువులను తెలివిగా ప్రోగ్రాం చేయటం ద్వారా, అవి వాటంతటికవే తమ మొలకలను చంపేసుకునే విధమైన, పునరుత్పత్తికి సాధ్యంకాని విత్తనాలకు సృష్టించారు ఈ పేటెంటు అన్ని తరగతులకు చెందిన మొక్కలు, విత్తనాలకు వర్తిస్తుంది. దీని పర్యవసానం ఏమిటి? కోతల సమయంలో, భవిష్యత్తులో వేసే పంటకై ఈ విత్తనాలను దాచుకుంటే ఎటువంటి ప్రయోజనం ఉండదు. బఠానీలు, టమోటాలు, మిరియాలు, గోధుమ కంకులు, మొక్కజొన్న పొత్తులు మొదలైనవన్నీ విత్తనాల సమాధులుగా మారతాయి. ఇందుచేతనే ఈ వ్యవస్థకు టెర్మినేటర్ సాంకేతిక పరిజ్ఞానంగా నామకరణం చేశారు దీని ప్రకారంగా రైతులు విత్తనాల కంపెనీల నుంచి ప్రతి సంవత్సరం విత్తనాలు కొనుక్కోవాలి.

ఈ టెర్మినేటర్ సాంకేతిక పరిజ్ఞానంపై అమెరికా వ్యవసాయ శాఖ, డెల్టా అండ్ పైన్‌లాండ్ కంపెనీలు 78 దేశాలలో పేటెంట్లకై దరఖాస్తు చేశాయి. ఈ రకమైన అమ్మకాల తాలూకు లాభాల నుంచి వ్యవసాయ శాఖకు 5% వాటా లభిస్తుందనేది గమనించవలసిన విషయం. ప్రభుత్వ విభాగ విషయంలో ఇది విస్మయం కలిగించే విషయం. కానీ మొన్‌శాంటో సంస్థకు, అమెరికా వ్యవసాయశాఖకు మధ్యవున్న దీర్ఘకాల సంబంధాల దృష్ట్యా ఇదేమంత ఆశ్చర్యకరం కాదు.

టెర్మినేటర్ సాంకేతిక పరిజ్ఞానంలో మరొక ప్రత్యేక అవకాశంగల ప్రమాదం కూడా పొంచివుంది. ఈ సాంకేతిక పరిజ్ఞానం తాను ప్రవేశపెట్టబడిన పంటల నుంచి పరపరాగ సంపర్కం ద్వారా ఇతర పంటలకు లేదా దగ్గరలోని సంబంధిత మొక్కలను వ్యాపించే ప్రమాదాన్ని జీవశాస్త్రవేత్తలు పరిశీలిస్తున్నారు. ప్రకృతి తాలూకు అత్యద్భుతమైన మార్పులు చేసుకోగల గుణం దృష్ట్యాను, ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పుడూ పెద్దస్థాయిలో పరీక్షకు పెట్టని కారణం దృష్ట్యాను పై ప్రమాదాన్ని తప్పనిసరిగా తీవ్రంగానే పరిగణించాలి. విత్తనాలు వేసే మొక్క రకాలలో పునరుత్పత్తి గుణం క్రమేణా నశించిపోవటం ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర విపత్తుకు దారితీయగలదు. దీనివలన మానవులతో సహా ఉన్నత తరహా జీవరాశులన్నీ కాలక్రమేణా భూగోళంపైనుంచి అంతరించిపోయే ప్రమాదం ఉంది.

జన్యువులను అదుపు చేసే ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని మూడవ ప్రపంచ దేశాల ప్రభుత్వాలు, రైతులు తిరస్కరిస్తున్నారు. ఈ సాంకేతిక పరిజ్ఞానపు లక్ష్యం రైతులచేత ప్రతి సంవత్సరం విత్తనాలను కొనిపించటమే. అలాగే, మన దేశాలలో ఆహార భద్రతకు పునాది అయిన స్థానికంగా విత్తనాలను భద్రపరచుకునే అతి పురాతన పద్ధతిని నాశనం చేయటమే దీని లక్షణం. ఇది జీవవైవిధ్యాన్ని, స్థానిక పరిజ్ఞానాన్ని కొనసాగింప వీలైన వ్యవసాయ పద్ధతిని నాశనం చేస్తుంది ఈ రకమైన వ్యవసాయ పద్ధతులను రైతులు వందలాది సంవత్సరాల నుండి అభివృద్ధి చేసుకుంటూవచ్చారు. దీనంతటివలన మన ఆహారభద్రతకు ముప్పు వాటిల్లుతుంది. ఇటువంటి సాంకేతిక పరిజ్ఞానాలపై ఆధారపడిన మేధోసంపత్తి హక్కుల రక్షణ వ్యవస్థలు, రైతులు గనుక తమ సహజపద్ధతిలో విత్తనాలను దాచుకుని తిరిగి మరుసటి పంటకు వాడుకునే పద్ధతిని అనుసరిస్తే దానిని 'దొంగతనం'గా పరిగణిస్తున్నాయి. రైతులకు చేయూతనిచ్చే బదులుగా, ఈ సాంకేతిక పరిజ్ఞానం వారిని కోర్టు వ్యాజ్యాలతోనూ, జైలు శిక్షలతోనూ బెదిరిస్తోంది.

టెర్మినేటర్ వంటి జన్యువులను అదుపుచేసే సాంకేతిక పరిజ్ఞానపు ప్రభావాలు కేవలం వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకే పరిమితం కావు. అది జీవం, దాని పునరుత్పత్తి, దాని కొనసాగింపుల పట్ల మన అవగాహన మొత్తాన్ని మార్చివేస్తుంది. మానవుడు గతంలో మునుపెన్నడూ ఇటువంటి కృత్రిమమైన ప్రమాదకర దీర్ఘకాలిక ప్రభావంగల జీవన భృతులను, ఆహార సరఫరాను, భూమి పై మానవుల మనుగడనే అదుపు చేయగల ఇటువంటి పకడ్బందీ పథకాన్ని సృష్టించలేదు. ఒకేఒక్క విస్తృతమైన నిర్లజ్జాపూర్వకమైన చర్యద్వారా, మానవుడు మొక్క-విత్తనం- మొక్క -విత్తనం పరంపరను తిరిగి పునరుద్ధరించ వీలులేని స్థాయిలో విచ్ఛిన్నం చేస్తున్నాడు. ఈ పరంపరే భూమిపై పలు జీవజాతుల మనుగడకు హామీ. ఈ కొత్త సాంకేతిక పరిజ్ఞానాల వ్యవస్థ ప్రకారంగా మరింతగా విత్తనం కొంటే మినహా, విత్తనం లేని, ఆహారంలేని పరిస్థితిని సృష్టిస్తున్నాయి.

అస్తిత్వంలో వున్న విజ్ఞానాన్ని 'నవీనమైన' దానిగా పరిగణించి పేటెంట్లనిచ్చే అమెరికా పేటెంట్ల చట్టంలోని పెదధోరణులను తొలగించే బదులుగా, వ్యాపార సంబంధిత మేధోహక్కుల సంపత్తి వ్యవస్థ జీవంపై పేటెంట్లను విశ్వజనీనం చేస్తోంది. వ్యాపార సంబంధిత మేధో హక్కుల వ్యవస్థ విత్తనాలపై అమలు జరుపుతున్న పేటెంట్లు, ఆస్తిహక్కులు బ్రిటిష్ ప్రభుత్వం చేసిన క్రూరమైన ఉక్కు చట్టాల వంటివి. ఈ చట్టాలు, సమృద్ధిగా పెరిగిన పంట నుంచి విత్తనాలను తీసుకుని వాటిని దాచుకునే, మార్పిడి చేసుకునే, తిరిగి ఉపయోగించుకునే రైతుల హక్కును చట్టవిరుద్ధం చేస్తున్నాయి. కార్గిల్ వంటి అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలు, ప్రపంచ వాణిజ్య సంస్థద్వారా ఎగుమతులు, దిగుమతులపై పరిమితులను తొలగించవలసిందిగా భారతదేశంపై వత్తిడి తెస్తున్నాయి. సబ్సిడీలతో కూడుకున్న ఆహార దిగుమతులు కోట్లాదిమంది రైతుల జీవనభృతిని ధ్వంసం చేస్తాయి. వ్యవసాయ సంబంధిత ఉత్పత్తుల ఎగుమతులు, నిత్యావసర వస్తువుల చట్టం, అలాగే ప్రజాపంపిణీ వ్యవస్థలో మార్పులు మొదలైనవన్నీ ఇప్పటికే ధరల పెరుగుదలకూ, క్షుద్బాధ పెరుగుదలకు, పౌష్టికాహార లోపానికి దారితీస్తున్నాయి. విత్తనాలపై మేధోసంపత్తి హక్కుల వ్యవస్థ అమలువలన రైతులపై క్రొత్త ఆర్థిక వత్తిళ్ళు వస్తాయి. ఫలితంగా వారు తమ భూముల నుంచి, జీవనభృతి నుంచి తొలగించబడతారు. ఈ మధ్యకాలంలో, ఋణభారం క్రింద వేలాదిమంది భారతీయరైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వ్యవసాయ రసాయనాలు, విత్తనాల కంపెనీలు స్వయంగా కాబూలీవాలాలుగా వ్యవహరించి, ఖరీదైన విత్తనాలు, క్రిమిసంహారకాలను కొనేవిధంగా రైతులను దగా చేయటం వలన ఈ పరిస్థితి ఏర్పడింది.

ఇదంతా జరుగుతున్నప్పటికీ అమెరికా వత్తిడికింద, అలాగే వ్యాపార సంబంధిత మేధోహక్కుల రక్షణవ్యవస్థ అవసరాల మేరకు వృక్ష సంబంధిత జన్యు వనరుల విషయంలో క్రొత్త మేధోసంపత్తి హక్కుల చట్టాన్ని ప్రవేశపెడుతున్నారు. అంతేకాకుండా, విత్తనాల పరిశ్రమను అదుపు చేస్తోన్న గుత్తసంస్థలకు గుత్తాధిపత్యపు హామీనీ కూడా అమెరికా డిమాండ్ చేస్తోంది. మరోప్రక్క జీవవైవిధ్యం మనుగడ తాలూకు రైతుల హక్కులను రక్షించేందుకు ప్రజాసంఘాలు పోరాడుతున్నాయి. అలాగే కార్పొరేట్ సంస్థల లాభాల కోసం కాక ఆకలిని నిర్మూలించేందుకు కృషి చేసే దిశగా శాస్త్రవేత్తల స్వేచ్ఛను కాపాడుకునేందుకు కూడా కృషి జరుగుతోంది రైతుల హక్కుల పరిరక్షణకై రైతు సంఘాలు, జీవవైవిధ్య పరిరక్షణా బృందాలు, దీర్ఘకాలం కొనసాగింపవీలైన వ్యవసాయ మద్దతుదారులు, ప్రజాహితం

కోరే శాస్త్రవేత్తలు ప్రయత్నిస్తున్నారు. రైతుల హక్కులను రక్షించటం ద్వారా, మన జీవసంపదపై సార్వభౌమాధికార హక్కు, దానిని వ్యవసాయ ఉత్పత్తిలో సమర్థవంతంగా ఉపయోగించుకునే హక్కు హామీ చేయబడగలదు. మొక్కల జన్యువనరుల చట్టంపై రేగుతున్న ఘర్షణ, వాస్తవానికి రైతులు విత్తన పరిశ్రమకు; ప్రజాజీవితం, ప్రైవేటు లాభాలకు, అలాగే వైవిధ్యాన్ని ఉత్పత్తి చేసి, పునరుత్పత్తిచేసే వ్యవసాయానికి, వైవిధ్యాన్ని మింగివేసి ఏకత్వాన్ని సృష్టించే పరిస్థితికి మధ్య జరిగే ఘర్షణే. మొక్కలపై పేటెంట్ల వలన సాంప్రదాయిక రైతులు తమ స్థానిక విత్తనాలను వినియోగించుకోవటం ఆగబోదని పలుమార్లు చెబుతుంటారు. కానీ, రైతులు స్థానిక విత్తనాలను ఇక ఎంతమాత్రము ఉపయోగించని, బహుళజాతి విత్తన సంస్థలు సరఫరా చేసే విత్తనాలనే వినియోగించే వ్యవసాయ సంబంధిత - వ్యాపార రంగం అదుపులోని పరిస్థితిలో పేటెంట్లు అనివార్య అంతర్భాగం అనేది గుర్తించాలి. ఈ పరిస్థితిలో పేటెంట్లు విత్తనాలను భద్రపరచుకునే, మార్పిడి చేసుకునే తాలూకు రైతుల హక్కును హరించివేసేందుకు ఉద్దేశించిన గుత్తాధిపత్యమేననేది స్పష్టమౌతుంది దీనివలన వ్యవసాయ రంగంలో బహుళజాతి సంస్థల ఏకఛత్రాధిపత్య నియంతృత్వం ఏర్పడుతుంది. రైతులు ఏమి పండించాలో, ఏ ఉత్పాదకాలను వాడాలో, తమ పంటను ఎప్పుడు, ఎవరికి, ఏ ధరకు అమ్ముకోవాలో కూడా గుత్త సంస్థలే నిర్ణయిస్తాయి వినియోగదారులు ఏ ఆహారం తినాలో, దానిని ఏ ధరకు కొనాలో కూడా బహుళజాతి సంస్థలే నిర్ణయిస్తాయి అలాగే, ఆహార సరుకుల స్వభావం గురించిన సమాచారాన్ని కూడా వినియోగదారులకు ఎంతవరకు అందించాలో కూడా ఈ సంస్థలే నిర్ణయిస్తాయి.

ఈ రకమైన ఏకఛత్రాధిపత్య నియంతృత్వ స్థాపనకు పేటెంట్లు ప్రధాన పనిముట్లు. ఉత్పత్తిదారులు, వినియోగదారులుగా పౌరుల హక్కుల పరిరక్షణకై నూతన భావాలు, విభాగాలు, నూతన పనిముట్లు, యంత్రాంగాలు తప్పనిసరి అవుతాయి. వ్యవసాయంలో బహుళజాతి సంస్థల శక్తిని ఎదుర్కొనేందుకు పరిమితం చేసేందుకు ఇది తప్పని సరి కార్పొరేట్ సంస్థలకు అందిస్తున్న మేధోసంపత్తి హక్కుల రక్షణ నేపధ్యంలో ప్రజాప్రయోజనాలను కాపాడేందుకు సామాజిక హక్కులు అనేవి ప్రధానమైన సమతుల్యతా మార్గం అలాగే, తయారీదారుల హక్కులు, విత్తనాలపైన, వృక్షపదార్థాలపైన పేటెంట్లకు ప్రతిగా ఆహారం, వ్యవసాయ రంగాలలో రైతుల హక్కులు ప్రధానమైనవి ఆహార వ్యవస్థ తాలూకు గుత్త అదుపు నేపధ్యంలో రైతుల హక్కులు కేవలం రైతాంగానికి మాత్రమే పరిమితమైనవి కాదు అవి వినియోగదారులకు కూడా రక్షణ కవచం. ఇవి కేవలం ప్రజల మనుగడకే కాక, దేశ మనుగడకు కూడా అవసరం విత్తనం, మొక్కల జన్యుపదార్థాలపై రైతాంగానికి సార్వభౌమాధికార హక్కు లేకుండా దేశపు సార్వభౌమాధికారం ఉండలేదు.

పర్యావరణ పరంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా కూడా రైతుల హక్కులు అనేవి తప్పనిసరి అవసరం. సామూహిక హక్కులు లేకుండా వ్యవసాయ సమాజాలు, వ్యవసాయ సంబంధిత జీవవైవిధ్యాన్ని కాపాడుకోలేవు. ఈ జీవవైవిధ్యం కేవలం వ్యవసాయానికి సంబంధించిన పర్యావరణ రక్షణకు మాత్రమే ఉద్దేశించినది కాదు. అది ఆర్థిక అవసరం కూడా. ఎందుచేతనంటే, జీవవైవిధ్యం లేకుండా మన రైతాంగం, మన దేశం తమ స్వేచ్ఛను కోల్పోతాయి. అలాగే, మనుగడ తాలూకు అవకాశాలు కూడా క్షీణిస్తాయి. జీవవైవిధ్యం, సాంస్కృతిక వైవిధ్యం ఒకదానితో ఒకటి

ముడిపడివున్నాయి. అందుచేత, వ్యవసాయ రంగంలో జీవవైవిధ్యాన్ని కాపాడుకోవడం సాంస్కృతికపరంగా కూడా తప్పనిసరి. చివరగా, రైతుల హక్కులు లేకుండా వ్యవసాయ రంగంలో గుత్తాధిపత్యాన్ని అదుపుచేసే రాజకీయ యంత్రాంగం వుండజాలదు. అలాగే, ఆ హక్కులు లేకుండా పోతే, రైతులు భూమి నుంచి వేరుచేయబడటం, క్షుద్బాధకు, కరవుకు బలి అవ్వటం జరుగుతుంది. దీని పర్యవసానంగా ఆహార ఉత్పత్తి, వినియోగంపై పూర్తి గుత్తాధిపత్య అదుపు ఏర్పడుతుంది. ఇది ఆహార గొలుసుకట్టులో మొదటి లింకు అయిన విత్తనాలపై గుత్తాధిపత్య యాజమాన్యం ద్వారా జరుగుతుంది.

A C No ... ...
-500 044

# 6.వ్యాధులపై లాభాలు

**1981 మే 6వ** తేదీన జెనీవాలో ప్రపంచ ఆరోగ్య సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ, ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఇలా అన్నారు:

"బాధ నుంచి ఉపశమనం కలిగించేందుకు, జీవిత కాలాన్ని మరింతగా పొడిగించేందుకు నూతన ఉత్పత్తుల, ప్రక్రియలకై ధనిక సమాజాలు డబ్బును ఇబ్బడిముబ్బడిగా ఖర్చు చేస్తున్నాయి. ఈ ప్రక్రియలో ఔషధ ఉత్పత్తిదారులు శక్తివంతమైన పరిశ్రమగా రూపొందారు. వైద్యరంగంలో కనుగొనబడే అంశాలపై పేటెంట్లు లేని జీవితంనుంచికాని లేదా మృత్యువునుంచికానీ లాభార్జన జరగని ప్రపంచమే నా ఉద్దేశ్యంలో ఉన్నతమైనది."

-బి.కె.కేయిలా, 'కాంక్వెస్ట్

బై పేటెంట్స్, 1998లో ఉల్లేఖించింది.

అమెరికా తరహా పేటెంట్ల వ్యవస్థను అమలు జరపడం వలన ఆరోగ్య రక్షణ, ఔషధాల వ్యయం, ప్రపంచవ్యాపితంగా విపరీతంగా పెరిగిపోతుందనేది ఎయిడ్స్ వ్యాధి మహమ్మారి స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న దేశాలలో 3.23 కోట్ల మంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులున్నారు. ప్రతి సంవత్సరం 25 లక్షల మంది ఈ వ్యాధితో చనిపోతున్నారు. అమెరికాలో మూడేళ్ళకాలంలో, రకరకాల మందుల కలయిక ద్వారా ఈ వ్యాధి నుంచి మృత్యువు వాతబడే వారి సంఖ్యను 75% తగ్గించారు. అలాగే వ్యాధిగ్రస్తుల సంఖ్యను 73% వరకు తగ్గించగలిగారు. అయితే, ఈ వైద్యం చాలా ఖరీదైనది. సంవత్సరానికి వైద్యానికయ్యే ఖర్చు పదివేల అమెరికా డాలర్ల నుంచి పదిహేనువేల అమెరికా డాలర్ల వరకూ వుంది. యు.ఎన్.ఎ.ఐ.డి.ఎస్ చొరవ ఈ ఖర్చుపై సబ్సిడీల ద్వారా 85% మేరకు తగ్గించగలిగినప్పటికి, ఇంకా సంవత్సరానికి 2,250 అమెరికా డాలర్ల వ్యయం తప్పదు. మూడవ ప్రపంచదేశాలలో మలేరియా, క్షయ వంటి ప్రాణాంతక వ్యాధులలో ఎయిడ్స్ ఒకటి.

పేద దేశాలలో ఔషధాల ధరలు ప్రత్యేక మార్కెటింగ్ హక్కులు (ఇ.ఎం.ఆర్‌లు) ఉత్పత్తిపై పేటెంట్లతో సన్నిహితంగా ముడిపడివున్నాయి. తలసరి స్థూల జాతీయ ఉత్పత్తి 140 నుంచి 6,190 అమెరికా డాలర్ల వరకు వున్న దేశాలలో సాధారణ తరహా ఔషధ ఉత్పత్తిని లేదా చౌకైన దిగుమతులను నిరోధించే పేటెంట్ల వలన ఔషధాలు సామాన్య మానవుడికి అందుబాటులో లేకుండా పోతాయి ఈ దేశంలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు అతి త్వరగా మృత్యువువాత పడుతున్నారు అయితే, సాధారణ తరహా ఔషధాల ఉత్పత్తి వలన (జనరిక్ డ్రగ్ ప్రొడక్షన్) ఔషధాల ధరలు తక్కువగా వుంటాయి ఈ రకమైన ఔషధాలు లభ్యం కావటం వలన మూడవ ప్రపంచదేశాలలో ఎయిడ్స్‌కు సంబంధించిన ఔషధాల ధరలు సరాసరిన అమెరికాలో కంటే 82% తక్కువగా వుంటాయి. అలాగే, వైద్యం ఖర్చు కూడా తగ్గుతుంది. ఉదాహరణకు, ఎయిడ్స్ వ్యాధి చికిత్సలో వాడే ఫ్లొకనాజోల్ అనే ఔషధానికి

థాయ్‌లాండ్‌లో పేటెంటు లేదు. ఫైజర్ కంపెనీ ఈ ఔషధాన్ని 6 2 అమెరికా డాలర్లకు అమ్ముతోంది. కాగా, థాయ్ ఉత్పత్తిదారులు 0.3 అమెరికా డాలర్లకు అమ్ముతున్నారు. అంటే, ఇది ఫైజర్ కంపెనీ మందుకంటే 207 రెట్లు చౌకైనది. కాగా మరోప్రక్క సాధారణత (జనరిక్)గల ఔషధాలు లభ్యం కాకపోవటం వలన ఫ్లోకనాజోల్ ఔషధం ఖరీదు దక్షిణాఫ్రికాలో 21.4 అమెరికా డాలర్లుగా వుంది. రెండు రకాల రిట్రోవైరల్‌పై పనిచేసే (ఒకరకమైన వైరస్) ఔషధాల ఖరీదు థాయ్‌లాండ్‌లో నెలకు 96 అమెరికా డాలర్లుగా వుంది. కాగా, ఉగాండాలో ఈ వ్యయం 342 అమెరికా డాలర్లుగా వుంది.

తక్కువ వ్యయం కల ఎయిడ్స్ మందును తయారు చేయటంలో బ్రెజిల్ దేశం చాలా ప్రగతిని సంపాదించింది. నెలకు 192 అమెరికా డాలర్లతో ఆ దేశం ఎయిడ్స్ చికిత్సా సదుపాయాన్ని కలిగించగలుగుతోంది. ఎయిడ్స్ వ్యాధికి వైద్యం చేసేందుకుగాను ఔషధాలను తయారు చేయాల్సిందిగా 1994 సంవత్సర ఆరంభం నుంచి బ్రెజిల్ ప్రభుత్వం స్థానిక కంపెనీలను కోరింది. ఎ.జడ్.టి. వంటి రిట్రోవైరల్స్‌పై పనిచేసే తక్కువ ఖర్చుగల ఔషధాలను ఉత్పత్తి చేసేందుకుగాను బ్రెజిల్ ప్రభుత్వం తన పేటెంట్ల చట్టానికి జాతీయ ఆత్యయిక పరిస్థితి నిబంధనను ఉపయోగించింది. ఎయిడ్స్ కార్టెల్‌గా పిలువబడే పన్నెండు ఔషధాల ధరలు 70% పైగా తగ్గాయి. 1999 చివరినాటికి 80,000 మంది పౌరులకు బ్రెజిల్ ప్రభుత్వం ఈ తక్కువ ధరగల మందులను అందించగలిగింది. దీనివలన మృత్యువు వాతపడే ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల సంఖ్య 1996-99 సంవత్సరాల మధ్య 50% పైగా తగ్గింది. దీనివలన, ఆసుపత్రి పాలయ్యే వ్యాధిగ్రస్తుల సంఖ్య తగ్గి, ప్రభుత్వానికి 47.2 కోట్ల అమెరికా డాలర్ల వ్యయం పొదుపైయ్యింది.

అయితే ఎయిడ్స్ వ్యాధిని ఎదుర్కోవటంలో బ్రెజిల్ సాధించిన విజయానికి ప్రశంసలు లభించలేదు. 1997వ సంవత్సరపు తన పేటెంటు చట్టం ప్రకారంగా బ్రెజిల్ దేశం ఎయిడ్స్ వ్యాధిని అదుపుచేసే ఔషధాన్ని ఉత్పత్తి చేస్తుంది. కాగా, ఈ రకమైన చట్టాన్ని ఒక నమూనాగా చేసే బదులుగా, అమెరికా, బ్రెజిల్‌ను ప్రపంచవాణిజ్య సంస్థకు చెందిన అభియోగాల ప్యానల్ ముందుకు లాగింది. తద్వారా తన పేటెంటు చట్టాలను తొలగించుకొనేలా వత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించింది బ్రెజిల్ పేటెంటు చట్టాలను తొలగించేటట్లు చేయటం ద్వారా సంపత్తి వ్యవస్థను అమెరికా పేటెంట్ల గుత్తాధిపత్యం ప్రపంచీకరించగలదు. దీనివలన, మూడవ ప్రపంచ దేశాలకు చెందిన కోట్లాదిమంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు వైద్య సదుపాయపు ఖర్చులు భరించలేని పరిస్థితి ఏర్పడుతుంది. అంటే, వారికి జీవించే హక్కు నిరాకరించబడుతుంది.

తప్పనిసరి లైసెన్స్‌సింగ్ విధానం, సమాంతర దిగుమతుల చట్టాల ద్వారా ఔషధాలు ప్రజలకు అందుబాటులో వుండేలా చూసేందుకు, 1977వ సంవత్సరంలో దక్షిణాఫ్రికా ప్రభుత్వం కూడా ఒక చట్టాన్ని చేసింది. దీని లక్ష్యం హెచ్.ఐ.వి./ఎయిడ్స్ వ్యాధుల వైద్యసదుపాయపు ఖర్చును 50 నుండి 90% వరకు తగ్గించటం. 40 లక్షల మంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులున్న ఆ దేశంలో ఈ చర్య ప్రజారోగ్యం దృష్ట్యా తప్పనిసరి. కానీ, దక్షిణాఫ్రికా చట్టాన్ని సవాలు చేసేందుకు పెద్ద పెద్ద ఔషధ ఉత్పత్తి కంపెనీలన్నీ ఒక్కటయ్యాయి.

ఔషధాలు, ఆహారాన్ని పేటెంట్ల పరిధినుంచి తొలగిస్తూ, భారతదేశం వంటి పలు దేశాలు సార్వభౌమాధికార పేటెంట్ల వ్యవస్థలను నిర్మించుకున్నాయి. 'జీవితం నుంచి, మృత్యువు

నుంచి లాభార్జనను' నిరోధించేందుకే అవి ఈ ప్రయత్నం చేశాయి. ఔషధాల విషయంలో ఉత్పత్తి పద్ధతిపైన మాత్రమే ప్రాసెస్ పేటెంట్లను అనుమతించాయి. అలాకాకుండా, ఆహారం, ఔషధాల వంటి రంగాలలో ఉత్పత్తులపైనే పేటెంట్లను ఇస్తే అది గుత్త సంస్థలను సృష్టిస్తుంది. దీనివలన కీలక రంగాలైన ఆరోగ్యం, పౌష్టికాహారాలలో ధరలు పెరిగిపోతాయి. భారతదేశంలో, 1970వ సంవత్సరంలో పేటెంటు చట్టం రూపుదిద్దుకుంది. ఇది రాజ్యాంగంలో నిర్దేశించిన బాధ్యతల కనుగుణంగా రూపొందింది. ఈ చట్టం తరువాత, నమోదు చేసుకున్న ఔషధ ఉత్పత్తిదారుల (చిన్న, మధ్య తరహా, పెద్దస్థాయి) సంఖ్య 5,000 నుంచి 24,000లకు పెరిగింది. వీటిలో 250 పెద్దస్థాయి/మధ్యస్థాయికి చెందినవి. కాగా 8,000 చిన్న స్థాయి యూనిట్‌లు. ఔషధ ఉత్పత్తి కూడా 48 రెట్లు పెరిగింది. అంటే, ఇది 1971వ సంవత్సరపు స్థాయి అయిన 250 కోట్ల రూపాయల నుంచి, 1997-98 సంవత్సరాల నాటికి 12,068 కోట్ల రూపాయలకు పెరిగింది. పదేళ్ళకంటే తక్కువ కాలంలోనే, అంటే 1987-88 సంవత్సరాలలో 228 కోట్ల రూపాయలుగా వున్న ఎగుమతులు 1996-97 సంవత్సరాలకు 4090 కోట్ల రూపాయలకు పెరిగాయి. ఔషధాలపై ఉత్పత్తుల తాలూకు పేటెంట్లను అనుమతించకపోవటం వలన ఈ అభివృద్ధి అంతా సాధ్యమయింది. ఈ పోటీ వాతావరణం, ఉత్పత్తి పేటెంట్ల మినహాయింపు వలన ఔషధరంగంలో స్వావలంబన ఏర్పడింది. ఔషధాల ధరలు సామాన్యమానవునికి అందుబాటులో వున్నాయి. భారతదేశంలో ఔషధాల ధరలు ఇతర దేశాలలో కంటే, వాస్తవానికి చాలా తక్కువ. ఎంపిక చేసిన ఔషధాల విషయంలో భారతదేశంలోని ధరలను పలు ఇతర దేశాలలోని ధరలతో పోల్చినప్పుడు

| ఔషధం/బ్రాండు | కంపెనీ | ధరలు (భారతీయ రూపాయలలో) | | | | |
|---|---|---|---|---|---|---|
| | | భారతదేశం | పాకిస్తాన్ | ఇండోనేషియా | బ్రిటన్ | అమెరికా |
| రానిటిడిన్ | గ్లాక్సో | 7.16 | 127.08 | 142.68 | 339.45 | 739.60 |
| 150 మిల్లీ గ్రాములు×10లు | | | | | | |
| రెట్లు ఖరీదు ఎక్కువ | | | 17.75 | 19.93 | 47 41 | 103.30 |
| డైక్లోఫెనిక్ | సిబాగైగీ | 5.64 | 69.38 | 47.96 | 132.86 | 505.68 |
| (వోల్టారెన్) | | | | | | |
| 50 మిల్లీగ్రాములు×10లు | | | | | | |
| రెట్లు ఖరీదు ఎక్కువ | | | 12.30 | 8.50 | 23.56 | 89 66 |
| పైరాక్సికమ్ | | | | | | |
| (డొలనాక్స్/ఫెల్డీన్) | ఫైజర్ | 24.64 | 97.23 | 61.32 | 254.04 | 1210.88 |
| 20 మిల్లీగ్రాములు×10లు | | | | | | |
| రెట్లు ఖరీదు ఎక్కువ | | | 3 95 | 2.49 | 10.31 | 49.14 |

భారతదేశంలో రిటైల్ ధరలను, ఇతర దేశాలలోని టోకు ధరలను పరిగణనలోకి తీసుకున్నాం

మూలం : రచయిత పరిశోధన.

భారతీయ ఔషధాలు పారిశ్రామిక దేశాలలో కంటేను, పాకిస్తాన్ ఇండోనేషియాలవంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకంటేను బహు తక్కువ. దీనికి కారణం పాకిస్తాన్ వంటి పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు, బ్రిటీషు పాలన కాలం నుంచి వారసత్వంగా వచ్చిన 1911వ సంవత్సరపు వలసవాద పేటెంటు చట్టాన్నే ఇంకా అమలు జరుపుతున్నాయి. దీనివలన, ఆయా దేశాలలో ఔషధాల స్వదేశీ ఉత్పత్తి సామర్థ్యం పెరగలేదు. ఫలితంగా ఆదేశాలు దిగుమతులపైననే ఆధారపడుతున్నాయి. దిగుమతులపై ఈ ఆధారిత స్థితిని ఆసరా చేసుకుని బహుళజాతి సంస్థలు అధిక లాభాలను పిండుకుంటున్నాయి. ధరలను అదుపు చేసేందుకు ప్రభుత్వాలు చేసిన ప్రయత్నాలను, బహుళజాతి సంస్థలు తరచుగా విజయవంతంగా అడ్డుకున్నాయి. ఉదాహరణకు, 1995వ సంవత్సరంలో, పాకిస్తాన్ ప్రభుత్వం ఔషధాలు, మందులపై 5 శాతం అమ్మకంపన్నును విధించింది దీనికి ప్రతిగా బహుళజాతి సంస్థలు తమ ఉత్పత్తుల పంపిణీని నిలిపి వేశాయి. ఫలితంగా పాక్‌లో ఔషధాల అందుబాటులో తీవ్రకొరతకు సంబంధించిన భయోత్పాతం అలుముకుంది

వ్యాపార సంబంధిత మేధోహక్కుల బహుళజాతి సంస్థలకు ప్రాతినిధ్యం వహించే ఫార్మబ్యూరో అనే సమాఖ్య తాలూకు కార్య నిర్వాహక డైరెక్టరు (9 ఆగస్టు, 1996లో) ఈ విధంగా పేర్కొన్నాడు పరిశ్రమకు గనుక తగిన, హేతుబద్ధమైన లాభాన్ని హామీ చేయకపోతే, బహుళజాతి సంస్థలు తమ పెట్టుబడులను పసిఫిక్ ప్రాంతానికి తరలించుకుంటాయి . వ్యాపార సంబంధిత మేధో సంపత్తి వ్యవస్థ ఒప్పందపు అనంతర ఇ.ఎం.ఆర్ నిబంధనలను అమలుజరిపేలా కూడా పాకిస్తాన్‌పై ఒత్తిడి తెచ్చారు. దీనికి ముందు, ఔషధాలపై పేటెంట్ల గుత్తాధిపత్యాన్ని అమలుజరిపేలా భారతదేశంపై ఒత్తిడి తెచ్చేందుకుగాను, అమెరికా భారతదేశాన్ని ప్రపంచ వాణిజ్య సంస్థ తాలూకు వివాదాల పానెల్ ముందుకు లాగింది. భారతదేశంతోపాటుగా బ్రెజిల్, డొమినికా రిపబ్లిక్, అర్జెంటీనా, వియత్నాం, థాయ్‌లాండ్ దేశాలను ప్రత్యేక 301వ చట్టం కింద అమెరికన్ బెదిరింపులకు గురి చేసింది. ప్రపంచ వాణిజ్య సంస్థ, అమెరికా ప్రభుత్వం ఔషధ బహుళజాతి శక్తిని సవాలు చేస్తూ, భారతదేశానికి సంబంధించిన మందుల కంపెనీ అయిన సిప్లా తాను ఏయిడ్స్ వ్యాధి మందులను మెడిసిన్స్ శాన్స్ ఫ్రాంటియస్ 350 లోపే ఖర్చయ్యే విధంగా అందించగలనని ప్రకటించింది. ఈ మందులను మెడిసిన్ శాన్‌ఫ్రాంటియన్ ఆఫ్రికాలో ఉచితంగా పంచి పెడుతుంది. గ్లాక్సో కంపెనీకి చెందిన ఎయిడ్స్‌పై పనిచేసే సాధారణ రూపు ఔషధపు మిశ్రమాన్ని ఘనాలో అమ్మేందుకు సిప్లా 2000 సంవత్సరంలో ప్రయత్నించినపుడు, ఆ సంస్థపై దావా వేస్తానని గ్లాక్సో వెల్‌కం సంస్థ బెదిరించింది. ఆఫ్రికా ప్రాంతీయ పేటంట్ల అధారిటీ గ్లాక్సోకు వ్యతిరేకంగా తీర్పు నిచ్చింది. అయితే, సిప్లా మాత్రం సాధారణ రూప ఔషధాలను అమ్మటం ఆపివేసింది (ది టైమ్స్ ఆఫ్ ఇండియా-13 ఫిబ్రవరి, 2001.)

పేటెంటు చట్టాలలో మార్పు వలన పారిశ్రామిక దేశాలు కూడా తీవ్రంగా నష్టపోతున్నాయి. దీనికి ఉదాహరణ కెనడాయే. కెనడా దేశంలో ఆరోగ్య, ఔషధ విధానాలలో ప్రజాహిత దృక్పథం బలంగా వుంది అయితే, 1994వ సంవత్సరంలో ఉత్తర అమెరికా స్వేచ్ఛా వ్యాపార ఒప్పందం (ఎన్ఎఎఫ్‌టిఎ) అమలులోకి వచ్చిన తర్వాత, ఔషధాల కంపెనీలు మూతపడటం ఆరంభమైంది. ఔషధాల విషయంలో కెనడా వాణిజ్యలోటు భారీగా పెరిగింది. 1994 నాటికి ఈ లోటు 160

కోట్ల డాలర్లను చేరుకుంది. బ్రాండ్ల పేర్లు గల కంపెనీలు కెనడాలో తమ ఉత్పత్తి సదుపాయాలను మూసివేసి, ఆ మందులను దిగుమతి చేసుకోనారంభించటం ఈ వాణిజ్య లోటుకు ప్రధాన కారణమని డ్రగ్స్ న్యూస్ అండ్ వ్యూస్ పత్రిక 1995వ సంవత్సరంలో పేర్కొంది. స్థానిక పరిశ్రమలను మూసివేయటం, దిగుమతులపై ఆధారపడటం అనే ఈ పద్ధతి ఇతర దేశాలలో కూడా పునరావృతం అయ్యింది

ఇది అమెరికా తరహా పేటెంట్ల చట్టం అమలు తాలూకు ఫలితం. ఉదాహరణకు చిలీలో ఫైజర్, ఫార్మ్‌డేవీస్, స్క్విబ్, బేయర్, షేరింగ్ వంటి బహుళజాతి సంస్థలు ఉత్పత్తిని నిలిపివేసి, ఔషధాల దిగుమతులను ఆరంభించాయి దీనివలన పలువురు ఉపాధి కోల్పోవటంతోపాటుగా ఔషధాల ధరలు విపరీతంగా పెరిగాయి. చిలీకి చెందిన జాతీయ పారిశ్రామిక సంస్థ కార్యనిర్వాహక డైరెక్టర్ అయిన మిరియామ్ ఓరెల్లానా ఇలా పేర్కొన్నారు: 'అమెరికా తరహా పేటెంట్ల చట్టాన్ని అమలుజరిపితే లభిస్తాయని వాగ్దానం చేసిన వ్యాపార లాభాలు, పెట్టుబడులు ఎప్పుడూ వాస్తవరూపం ధరించలేదు.'

(పేటెంట్స్ ఫర్ మెడిసిన్ అనే పుస్తకంలో ఎన్ బి జవీర్ 1998లో పేర్కొన్నారు.)

బ్రిటీష్ జాతీయ ఆరోగ్య సేవా విభాగానికి అఫ్‌మన్ –లా రోఛే సంస్థ అమ్ముతోన్న థోరియం, వేలియం వంటి పేటెంటు చేయబడిన ఉత్పత్తులు వినియోగదారులు భరిస్తున్న అంతులేని భారానికి ఉదాహరణలు. అఫ్‌మన్– లా రోఛే ఎజి సంస్థకు రోఛే ప్రొడక్ట్స్ అనేది ఇంగ్లాండ్ శాఖ. ఈ శాఖ తన మాతృ సంస్థకు కిలోకు 925 డాలర్లు చెల్లించి పదార్థాలను తీసుకొంటోంది. ఇదే పదార్థాన్ని ఇటలీలో కిలోకు 22.50 డాలర్లకు కొనుక్కోవచ్చు కాగా, మరో పదార్థాన్ని రోఛే ప్రొడక్ట్స సంస్థ కిలోకు 2305 డాలర్లు చెల్లించి కొంటుంది. దీని ఖరీదు ఇటలీలో కిలోకి 50 డాలర్లు. ఇటలీలో ఈ పదార్థాలకు పేటెంటు రక్షణ లేకపోవటం వల్లన అవి చౌకగా దొరుకుతున్నాయి. రోఛే సంస్థ ఆరోగ్య సేవా విభాగం నుంచి అధికంగా వసూళ్ళు చేస్తోందని గుత్త సంస్థకు సంబంధించిన సంఘం పేర్కొంది. మొదటి పదార్థం విషయంలో ప్రత్యామ్నాయ సరఫరా కంటే ఇది 41 రెట్లు ఎక్కువ. ఇక రెండవ పదార్థం విషయంలో ఇది 46 రెట్లు ఎక్కువ. మానసిక వత్తిడి తగ్గించే ఈ మందుల అమ్మకం ధరను 60 నుంచి 75 శాతం వరకు తగ్గించాలని ప్రభుత్వం రోఛే సంస్థను ఆదేశించింది. అలాగే, అధికంగా వసూలు చేసిన 27.5 మిలియన్ డాలర్‌లను తిరిగి ఇచ్చివేయాలని కూడా కోరింది.

పేటెంట్ల హక్కులు అనేవి రోగుల హక్కులకు వ్యతిరేకంగా పని చేస్తున్నాయనేది సుస్పష్టం. ఉత్పత్తులపై పేటెంటు విధానం వలన వ్యాధులపై పోరాటానికి బాగా అవకాశం దొరుకుతుందనే పుక్కిటి పురాణాన్ని ఎయిడ్స్ వ్యాధికి సంబంధించిన ఔషధాల ఉదాహరణ బద్దలుచేస్తోంది తక్కువ ఖర్చులో సాధారణ రూప ఔషధాలకు తయారు చేయటాన్ని నివారించటం ద్వారా, ఔషధాలపై ఇచ్చే 20 సంవత్సరాల పేటెంట్లు, మూడవ ప్రపంచ దేశాలలో వ్యాధుల నివారణకు కాక, వ్యాధుల వ్యాప్తికి కారణమౌతున్నాయి. పేటెంట్ల గుత్తాధిపత్యం వలన తక్కువ ఖర్చుతో కూడుకున్న మందులు, వాటి అవసరం బాగావున్న పేదలను చేరటంలేదు.

పేటెంట్ల గుత్తాధిపత్యం వలన ఔషధాల ధరలు బాగా పెరిగిపోతాయి కాబట్టి ప్రజాజీవితాన్ని

కాపాడేందుకు చర్యలు అవసరం. వీటిలో తప్పనిసరి లైసెన్స్‌లు; హక్కుకు సంబంధించిన లైసెన్స్‌లు; వాటంతటికవే దుల్లిపోయే విధానం; వెనక్కి తీసుకోవటం; వినియోగం, స్వాధీనం చేసుకోవటంలో రాజ్యం పాత్ర; ఉపయోగపడకపోవటానికి వ్యతిరేకంగాను లేదా అసంపూర్ణంగా ఉపయోగపడటానికి వ్యతిరేకంగా నిబంధనలు; పేటెంటు చేసిన వస్తువులను దిగుమతి చేసుకోవటంపై పరిమితులు, జాతీయ మార్కెట్ డిమాండ్‌ను పరిపూర్తి చేయటంలో వైఫల్యంపై పరిమితులు, జాతీయ మార్కెట్ డిమాండ్‌ను పరిపూర్తి చేయటంలో వైఫల్యంపై పరిమితులు మొదలైన చర్యలన్నీ వున్నాయి. ప్రజలకు హానిచేసి ప్రైవేటు లాభాలను ఆర్జించిపెట్టే పరిస్థితిని మార్చేందుకు ఈ చర్యలు అవసరం. 1998వ సంవత్సరంలో భారతదేశంలోని పేటెంట్ల వ్యవస్థపై జరిగి జాతీయ సదస్సులో సురేంద్ర పటేల్ "ది ఇండియన్ పేటెంట్ యాక్ట్ '1970' అనే పత్రాన్ని సమర్పించారు. దానిలో ఆయన ఈ విధంగా పేర్కొన్నారు: "పేటెంటు యజమానులకు ఇచ్చే గుత్తాధిపత్య ప్రత్యేకప్రయోజనాలు ఆ పేటెంట్లను ఇస్తున్న దేశంపై తీవ్రమైన భారాన్ని వేస్తాయి. ఇవి, పేటెంటు చేసిన ఉత్పత్తుల ధరలు పెరగటానికి కారణమౌతాయి. దీనివలన వినియోగదారుల నుంచి, ఉత్పత్తిదారులకు ఆదాయాలు బలవంతంగా మార్పిడి అవుతాయి. అయితే, ఈ ప్రత్యక్షంగా కనబడే వ్యయాలు అభివృద్ధి చెందుతున్న దేశాల పరిస్థితిలో సముద్రంలో నీటిబొట్టు వంటివే ఇక కనపడని వ్యయాలు అంతులేనివి." (మార్పిడి ధర, దుర్వినియోగ చర్యలు, జాతీయ ఉత్పత్తిని అభివృద్ధి చేసుకునే పరిమితి అవకాశాలు) ఇవన్నీ నేడు అందరికీ తెలిసిన అంశాలలోవే!

తప్పనిసరి లైసెన్సింగ్‌కాక, లైసెన్సింగ్ పరిధినుంచి వేరు చేయటమే భారత దేశంలో ప్రజాప్రయోజనాలను కాపాడేందుకు సమర్థవంతమైన మార్గం. వ్యవసాయరంగాన్ని, తోటల పెంపకాన్ని ఔషధాల ఉత్పత్తులపై పేటెంట్లను, మానవులకు సంబంధించి వైద్యం విషయంలో ఔషధ, శస్త్ర చికిత్స, వ్యాధులను తగ్గించే, వ్యాధినిరోధక లేదా ఇతర రకాల వైద్య ప్రక్రియలను, మొక్కలను, జంతువులను, అణుఇంధనాన్ని భారతదేశపు పేటెంటు చట్టం నుంచి మినహాయించారు. కాగా, 1990వ దశకంలో వ్యాపార సంబంధిత మేథోసంపత్తి హక్కుల వ్యవస్థ అమలుగల ఒత్తిడికింద ఈ పరిరక్షిత విభాగాలకు మార్పులను లక్ష్యంగా చేసుకున్నారు ఈ మధ్యకాలంలో పేటెంటు చట్టంలో మార్పుకు సంబంధించిన ప్రజల ఆందోళనలలో ఇది ప్రధానం అంశం సంబంధిత మేధో సంబంధిత హక్కుల వ్యవస్థను కనుక ప్రస్తుత రూపంలో అమలుజరిపితే, భారతదేశంలోని వైవిధ్యభరితమైన ఔషధాల ఉత్పత్తి పునాది పూర్తిగా నాశనం అయిపోతుంది. ఔషధాలకు ఎక్కువగా ధరలు చెల్లించవలసి వుంటుంది. అంతేకాకుండా, స్థానిక ఔషధాలకు కూడా భారీ మొత్తాలు చెల్లించుకోవలసిన పరిస్థితిలో ప్రజలు పడిపోతారు. 1980వ సంవత్సరపు చట్టం సవరణ ద్వారా 1998వ సంవత్సరంలో ఇ.ఎం ఆర్.ల వ్యవస్థను అమలుపరిచేలా భారతదేశంపై ఒత్తిడి వచ్చింది. అయితే, తీవ్రమైన ప్రజానిరసన, సుప్రీంకోర్టులో దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాలవలన ఈ ఇ.ఎం.ఆర్.లను ప్రభుత్వం ఇవ్వలేకపోయింది. కాబట్టి, ప్రపంచవ్యాప్తంగా ఒకేరకంగా అన్వయించ వీలైన పేటెంట్ల వ్యవస్థను అమలుచేసేలా ఒత్తిడి చేయడం సమంజమైనదికాదు ప్రజాహితంపై, ముఖ్యంగా మూడవ ప్రపంచదేశాలలో పేటెంట్ల ప్రభావం తాలూకు వాస్తవిక ఆధారాలు దీనికి తార్కాణం.

# 7.ప్రజాస్వామ్యమా-నియంతృత్వమా?

మేధో సంపత్తిని చట్టాలు చేయటం ద్వారా కాపాడే విధాన విషయంలో అభివృద్ధి చెందిన, చెందుతోన్న దేశాల అభిప్రాయాలు, దృక్పథాలలో ప్రగాఢమైన విభేదాలున్నాయి. వ్యక్తిగతంగా తమ పౌరులు, కంపెనీల సృజనాత్మకశక్తి, మేధోకృషుల ఫలితమైన మేధో సంపత్తిని తమ దేశాలకే చెందిన వ్యక్తులు, కంపెనీలు వ్యాపార ప్రయోజనాలకు ఉపయోగించుకునే న్యాయబద్ధమైన పునాది ఉండాలని అభివృద్ధి చెందిన దేశాలు, ముఖ్యంగా వాటిలో పారిశ్రామికంగా బాగా అభివృద్ధి చెందిన దేశాలు భావిస్తున్నాయి. ఇటువంటి మేధో సంపత్తికి-అంటే, పారిశ్రామిక ఆవిష్కరణలు, డిజైన్‌లు, ప్రసారాలు, రికార్డింగులు, ట్రేడ్‌మార్కులు, మూలాలను సూచించే పేర్లు – ఇతరులు ఉపయోగించుకోకుండా రక్షణ కల్పించడం ద్వారా మాత్రమే ఇటువంటి ప్రయోజనాన్ని అమలుజరపగలరు. ఇటువంటి రక్షణ, తద్వారా తరువాత లభించే ప్రోత్సాహకం లేకుండా విలువగల నూతన ఆవిష్కరణలు, నూతన ఉత్పత్తులు అందరికీ చెందటం జరగదనేది వారి విశ్వాసం. ఈ వాదనలోని, అందరికీ చెందటమనే అంశాన్ని; ఔషధాల ఉత్పత్తిదారులు, ఇతర సరకులు ఉత్పత్తి చేసేవారి విషయంలో ఎక్కువ బలంగా ముందుకు తెస్తున్నారు ఎందుచేతనంటే, ఈ ఉత్పత్తులను అభివృద్ధి చేసేందుకు ఎక్కువ ఖర్చు అవుతుంది. అలాగే, ఈ ఉత్పత్తులకు ప్రభుత్వ ఆమోదాన్ని పొందేందుకు, వాటిని మార్కెట్‌లో తెచ్చేందుకు కూడా బాగా ఖర్చవుతుంది.

అభివృద్ధి చెందుతున్న దేశాల దృక్పధం దీనికి భిన్నంగా వుంది. ఆ దేశాలు పేటెంట్లు, కాపీరైట్లు రక్షణను దాని సాధారణ రూపంలో వివాదాంశంగా భావించటంలేదు. అయితే, ఈ దేశాల పౌరులు, కంపెనీలకు, రక్షణ కల్పించుకునేందుకుగాను వారి వద్ద వున్న మేధోసంపత్తి బహుతక్కువ. అందుచేత, తమ కవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేందుకుగాను, పెద్దమొత్తంలో డబ్బును చెల్లించవలసిన లేదా అసలు ఆ సాంకేతిక పరిజ్ఞానమే తమకు అందుబాటులోకి రాకుండా పోయేలా చేసే అంతర్జాతీయ రక్షణ ప్రమాణాలకు వారు విముఖంగా వున్నారు. దీనికి బలమైన ఉదాహరణలుగా వారు ఔషధాలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానపు ఉత్పత్తులను పేర్కొంటున్నారు. మేధో సంపత్తిని అతిగా రక్షించటం వలన ఏర్పడే అధిక ధరల వలన జాతీయ ఆరోగ్య, అభివృద్ధి అంశాల అందుబాటు పరిమితం చేయబడటాన్ని దీనికి వారు ఉదాహరణలుగా చెబుతున్నారు.

ఆరోగ్య హక్కు, అభివృద్ధి చెందే హక్కుల తాలూకు అభివృద్ధి చెందుతోన్న దేశాల జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన విషయాలు వ్యాపార సంబంధిత సమస్యలుగా; నూతన ప్రపంచమార్కెట్లకై వెంపర్లాడుతున్న ప్రపంచ ఉత్తరార్ధ భాగ దేశాల కార్పొరేట్ సంస్థలు భావిస్తున్నాయి. దురదృష్టవశాత్తు, మేధోసంపత్తి హక్కుల్ళకు సంబంధించిన చర్చలలో మూడవ ప్రపంచదేశాలకు చెందిన జాతీయ

సమస్యలను, ప్రపంచ ఉత్తరార్ధభాగ దేశాలు మొత్తం ప్రపంచపు సమస్యలుగా ముందుకు తెస్తున్నాయి.

## వ్యాపార సంబంధిత మేధోసంపత్తి హక్కులు (ట్రిప్స్)

ట్రిప్స్ అనేది అంతర్జాతీయ సంపత్తిని కాపాడే ఒప్పందం. అయితే, అది ఆవిష్కరణ అనే అత్యంత పరిమితమైన భావనపై ఆధారపడివుంది. నిర్వచన రీత్యా, అది బహుళజాతి సంస్థలకు అనుకూలమైనది మొత్తంమీద పౌరులకు వ్యతిరేకమైనది. ఇది ముఖ్యంగా మూడవ ప్రపంచదేశాల రైతులు, అడవులలో జీవించేవారికి వ్యతిరేకమైంది. ప్రజలు అన్నిచోట్ల అవిష్కరణలను, నూతన సృష్టులను చేస్తారు. వాస్తవానికి, నిరుపేదలే ఎక్కువ సందర్భాలలో ఆవిష్కర్తలుగా వుంటారు. దినగండంగా నడిచే తమ జీవితాల మనుగడకు వారికివి తప్పనిసరి అంతేకాకుండా, ట్రిప్స్ అనేది మౌలిక అవసరాలు, మనుగడకు వ్యతిరేకమైనది. అది వ్యాపారానికి మాత్రమే అనుకూలమైనది.

వాస్తవానికి, ట్రిప్స్ ఒప్పందాన్ని గాట్ సభ్యులు చర్చించి ఏర్పరుచుకోలేదు. దీనిని బహుళజాతి సంస్థలు ఇతరులపై రుద్దాయి. ఇతర సభ్యులపై ఒత్తిడితెచ్చేందుకుగానూ బహుళజాతి సంస్థలు అమెరికా ప్రభుత్వాన్ని ఉపయోగించుకున్నాయి. ప్రపంచ వ్యాపార సంస్థ అప్రజాస్వామిక, పారదర్శకతలేని స్వభావానికి ఇది స్పష్టమైన ఉదాహరణ. 1988వ సంవత్సరం జూన్ మాసంలో గాట్ కార్యనిర్వాహక వర్గానికి అమెరికాకు చెందిన మేథో సంపత్తి సంఘం (జెడ్‌పిసి), జపాన్, యూరప్‌లకు చెందిన పారిశ్రామిక సమాఖ్యలు ఒక సంయుక్త ప్రకటనను సమర్పించాయి. వ్యాపార సంబంధిత మేథో సంపత్తికి సంబంధించిన పేటెంట్ల వ్యవస్థ తాలూకు మౌలిక చట్టాన్ని ఈ సంయుక్త ప్రకటనలోనే నిర్ణయించి రూపొందించారు. వ్యాపార సంబంధిత మేథో సంపత్తి హక్కుల వ్యవస్థ తమకు అనుకూలమైన తుది రూపాన్ని ఇవ్వడంలో ప్రయోజనాలుగల 13 ప్రధాన అమెరికా కార్పొరేట్ సంస్థల కలయికగా ఈ జడ్‌పిసి ఉంది. బ్రిస్టల్ మైయ్యర్స్, డ్యూపాంట్, జనరల్ ఎలక్ట్రిక్, జనరల్ మోటార్స్, హ్యూలెట్ పాకార్డ్, ఐ.బి.ఎం, జాన్‌సన్ & జానసన్, మెర్క్, మోన్‌సాన్‌టో, ఫైజర్, రాక్‌వెల్, వార్నర్ వంటి కార్పొరేట్ సంస్థలు జడ్‌పిసిలో భాగస్వాములు.

ఈ మొత్తం ప్రక్రియలో జడ్‌పిసి పలు స్వీయ ప్రయోజనాలు గల బృందాలను సంప్రదించింది. అయితే, అప్పటికే ఉనికిలో ఉన్న ఏ వాణిజ్య బృందం లేదా సమాఖ్య జడ్‌పిసి కొలబద్దలకు (తగిన స్వీయ ప్రయోజనాల బృందంగా) సరితూగలేదు. దానితో జడ్‌పిసి ఒక కొత్త బృందాన్ని సృష్టించవలసి వచ్చింది. ఈ బృందాన్ని సృష్టించిన తరువాత, ఒక సాధారణ వ్యాపార సంబంధిత మేధో హక్కుల చట్టం సాధ్యమని యూరప్, జపాన్ దేశాలకు చెందిన పారిశ్రామిక సమాఖ్యలకు వివరించటం జడ్‌పిసి చేపట్టిన ప్రథమ కర్తవ్యం. ాగా అభివృద్ధి చెందిన దేశాల చట్టాలనుంచీ అన్ని రకాల మేథో సంపత్తిని రక్షించేందుకుగాను అవసరమైన మౌలిక సూత్రాలను వడపోసి తీసారు. మొదటగా ఈ భావాలకు స్వదేశంలో ఆమోద యోగ్యతను సంపాదించేందుకు అమెరికా ప్రయత్నించింది. తరువాత ఈ అంశాలకు సంబంధించిన పత్రాన్ని జెనీవాలోని గాట్ కార్యనిర్వహక బృందం ముందు ఉంచింది. దీనితోపాటుగా, ఈ పత్రాన్ని జనీవా కేంద్ర కార్యాలయంగా పనిచేస్తోన్న పలుదేశాల ప్రతినిధుల ముందు కూడా ఉంచింది.

ఇటువంటివి ఇంతకు ముందు ఎన్నడూ జరుగలేదు. ప్రపంచ వాణిజ్యంలో ఒక ప్రధాన సమస్యను పారిశ్రామిక వర్గం గుర్తించింది ఈ సమస్యకు పరిష్కారాన్ని సిద్ధం చేసింది. దానిని నిర్దిష్ట ప్రతిపాదనగా మార్చి, ప్రపంచంలోని పలు ప్రభుత్వాలచేత దానికి ఆమోద ముద్ర వేయించుకుంది. అంటే, ప్రపంచ వ్యాప్తంగా లావాదేవీలు నడుపుతోన్న పరిశ్రమలు, వ్యాపారులు తమకు తామే రోగి, రోగ నిర్ధారకుడు, రోగానికి మందును సూచించే వైద్యులపాత్రలను కూడా ఏక కాలంలో పోషించారు. ఈ విధంగా భిన్న సామాజిక బృందాల హక్కులను వాణిజ్య ప్రయోజనాలు కబళించాయి. దీనివలన వ్యాపార సంబంధిత మేధోసంపత్తి హక్కుల ఒప్పందంలో నైతిక, పర్యావరణ, సామాజిక సమస్యలకు తావు లేకుండా పోయింది అంటే, ఈ వాణిజ్య సంబంధిత మేధో సంపత్తి హక్కుల వ్యవస్థను విస్తృత ప్రజారాసులు, వాణిజ్య ప్రయోజనాలమధ్య ప్రజాతంత్రయుత చర్చల ద్వారా నిర్ణయించలేదు. లేదా, కనీసం పారిశ్రామిక దేశాలు, మూడవ ప్రపంచ దేశాల మధ్య చర్చల ద్వారా కూడా ఈ వ్యవస్థను తయారు చేసే ప్రయత్నం జరగలేదు. జరిగినదల్లా, ప్రపంచపు ఉత్తరార్ధభాగ దేశాల బహుళజాతి సంస్థల విలువలను, ప్రయోజనాలను, ప్రపంచంలోని ఇతరేతర దేశాలకు చెందిన భిన్న సంస్కృతులు, సమూజాలపై రుద్దడమే.

అంటే, మేధోసంపత్తి హక్కుల చట్టాలను అంతర్జాతీయీకరించేందుకు ప్రధాన ఊపును బహుళజాతి సంస్థలే ఇచ్చాయి. మేధోసంపత్తి హక్కుల వ్యవస్థ తాలూకు హక్కులు స్వతస్సిద్ధమైనవి కావు. అవి చట్టాల ద్వారా నిర్ణయించబడినవి. అయితే, బహుళజాతి సంస్థలు మాత్రం ఈ హక్కులను స్వతఃసిద్ధమైనవిగా పేర్కొనచూస్తున్నాయి. 'మేధోసంపత్తి యజమానులుగా' తమకు తాము నిర్వచించుకున్న 'హక్కుల'ను రక్షించుకునేందుకుగాను ఈ సంస్థలు గాట్‌ను వాడుకున్నాయి. ప్రజా జీవితంలో హెచ్చుభాగం ఆవిష్కరణలు స్వదేశీ, స్థానిక, ప్రజల వినియోగానికి సంబంధించినవి. అవి అంతర్జాతీయ వాణిజ్యానికి సంబంధించినవి కావు. అయితే ఉత్పత్తి యావత్తును, యావత్ పంపిణీని, మొత్తం లాభాలను గుత్త పెత్తనం క్రిందికి తెచ్చుకొనేందుకుగాను బహుళజాతి సంస్థలు వ్యాపార సంబంధిత మేధోసంపత్తి హక్కుల వ్యవస్థను ఏర్పరిచాయి. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పౌరులకు చిన్న ఉత్పత్తిదారులకు, ప్రధానంగా తృతీయ ప్రపంచ దేశాలలోనివారికి హానికరం.

ఉరుగ్వే రౌండుకు ముందు, మేధోసంపత్తి హక్కుల వ్యవస్థకు గాట్‌లో స్థానం కల్పించలేదు. వివిధ దేశాలు తమ తమ నైతిక, సామాజిక-ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా వాటివాటి జాతీయ మేధోసంపత్తి హక్కుల చట్టాలను కలిగివున్నాయి పేటెంట్ల పరిధిలోకి వచ్చే అంశాలను విస్తరించటం అనేది మేధోసంపత్తి హక్కుల వ్యవస్థలో, వ్యాపార సంబంధిత మేధోసంపత్తి హక్కుల వ్యవస్థ ద్వారా చేసిస ప్రధాన మార్పు. వాణిజ్య సంబంధిత మేధోసంపత్తి హక్కుల వ్యవస్థ తాలూకు 27 1 అధికరణ పేటెంటు చేయవీలైన అంశాలకు సంబంధించినది దీని ప్రకారంగా, పారిశ్రామిక వినియోగానికి పనికివచ్చే అన్ని రంగాలకు చెందిన సాంకేతిక పరిజ్ఞానం తాలూకు ఉత్పత్తులు, లేదా ప్రక్రియలకు అవి నూతనమైనవి అయితే గనుక, లేదా నూతన ఆవిష్కరణలుగా ముందడుగు అయితే గనుక, అటువంటి ఆవిష్కరణలకు పేటెంటును పొందవచ్చును.

పేటెంట్ అర్హతకుగాను అన్ని పరిమితులను తొలగించాలి అన్నది బహుళజాతి సంస్థల

డిమాండు. ఆహారం, ఔషధాలపై భారతదేశపు పేటెంట్ చట్టం పేటెంట్లను అనుమతించదు. ఔషధాల విషయంలో, కేవలం ఔషధ తయారీ ప్రక్రియపై మాత్రమే పేటెంట్‌ను ఇస్తుంది అయితే, బహుళజాతి సంస్థలు రూపొందించిన ఈ వాణిజ్య సంబంధిత మేధోసంపత్తి హక్కుల వ్యవస్థ మన దేశ చట్టంలోని ఈ పరిధులను అతిక్రమిస్తుంది 1970వ సంవత్సరపు మన దేశ చట్ట ప్రకారంగా, స్వదేశీ ఉత్పత్తి సామర్ధ్యాన్ని పెంచుకోవడం, ఔషధాల విషయంలో స్వావలంబన, ఔషధాల ధరలను నియంత్రించి వాటిని అందుబాటులో వుంచేందుకు అవసరమైన అదుపు మొదలైనవన్నీ సాధ్యం అవుతాయి. అయితే, ఈ పరిమితులను బహుళజాతి సంస్థలు తమ లాభాలకు గండి పడడంగా భావిస్తున్నాయి. జీవరీతులకు కూడా అన్వయించే విధంగా వాణిజ్య సంబంధిత మేధోసంపత్తి హక్కుల వ్యవస్థ, పేటెంట్ల పరిధిని విస్తరించింది. ప్రపంచ వాణిజ్య సంస్థ పరిధిలోని వాణిజ్య సంబంధిత మేధో సంపత్తి హక్కుల వ్యవస్థ తాలూకు 27.5.3(బి) అధికరణ క్రిందకు జీవరీతులు వస్తాయి. స్థానిక విజ్ఞానాన్ని చౌర్యం చేసేందుకు ఈ అధికరణం వీలు కల్పిస్తుంది. ప్రాకృతిక ప్రక్రియలను, స్థానిక విజ్ఞానాన్ని, నూతన ఆవిష్కరణల పేరిట చోరీచేసే అవకాశాన్ని కల్పించే ఈ అధికరణ నూతన ప్రక్రియల ద్వారా అప్పటికే ఉనికిలో వున్న పదార్థాలను ఉత్పత్తి చేయడాన్ని మాత్రం నూతన ఆవిష్కరణగా ఆమోదించడం లేదు ఆ అధికరణం ఈ విధంగా పేర్కొంటోంది: "సూక్ష్మకణజీవాలు మినహా మిగతా వృక్షజాతులు, జంతువులను ఒప్పందంలోని భాగస్వామ్య పక్షాలు పేటెంట్లనుంచి మినహాయించుకోవచ్చు. అలాగే, జీవేతర, సూక్ష్మ జీవ సంబంధిత ప్రక్రియలు మినహా వృక్షజాతులు లేదా జంతువుల ఉత్పత్తికి అవసరమైన, ప్రధానంగా జీవసంబంధిత ప్రక్రియలకు కూడా ఇది వర్తిస్తుంది. అయితే, సంబంధిత భాగస్వామ్య పక్షాలు, వృక్షజాతుల పరిరక్షణకు ఏర్పాటు చెయ్యాలి. దీనికై పేటెంట్లు లేదా సమర్ధవంతమైన ప్రత్యేకతను కాపాడే వ్యవస్థను లేదా ఈ రెండు రకాల పద్ధతుల కలయికను వినియోగించాలి. ఒప్పందం అమలులోనికి వచ్చిన నాలుగు సంవత్సరాల తర్వాత ఈ నిబంధనలను సమీక్షించాలి "

జీవరీతులపై పేటెంట్లు ప్రవేశపెట్టేలాగాను, వృక్షజాతుల భిన్నత్వపు చట్టాన్ని ప్రవేశపెట్టేలాగాను పేటెంట్ల చట్టాలను సవరించేలా ఈ అధికరణ వివిధ దేశాలపై వత్తిడి తెస్తుంది. అధికరణలోని మొదటి భాగం జీవాన్ని పేటెంటు చేయడాన్ని ప్రస్తావిస్తుంది. దీనిని మామూలుగా చదివితే, ఈ భాగం ప్రకారంగా వృక్ష, జంతు జాతులకు పేటెంట్ల నుంచి మినహాయింపు లభించినట్లుగా అనిపిస్తుంది. అయితే, 'సూక్ష్మకణజీవాలు మినహా' అన్నమాటలతోపాటుగా, 'జీవేతర', 'సూక్ష్మ జీవ సంబంధిత' ప్రక్రియల ద్వారా తయారు చేసిన వృక్ష, జంతు జాతులు అన్న మాటలు సూక్ష్మకణజీవులు, జన్యుపరంగా మార్చబడిన వృక్ష, జంతువులకు పేటెంట్లు తీసుకోవడాన్ని తప్పనిసరి చేస్తున్నాయి.

సూక్ష్మకణజీవులు కూడా సజీవమైనవే. అందువలన, వాటిపై పేటెంట్ తీసుకోవడాన్ని తప్పనిసరిచేయడం వలన, మొత్తం జీవజాతులు అన్నింటినీ పేటెంటు చేసే అగాధంలోకి జారిపోవడానికి ఆరంభం ఏర్పడుతుంది.

## ట్రిప్స్-వృక్షజాతులపై పేటెంట్లు

అమెరికాలోను, ట్రిప్స్ ప్రకారం విత్తనాలు, వృక్షజాతులను పేటెంటు చేసుకునే యావత్

నిర్మాణం, 1985వ సంవత్సరంలో హిబ్బర్డ్ వ్యాజ్యంలో అమెరికా పేటెంట్లు, ట్రేడ్ మార్క్‌ల కార్యాలయం తీసుకున్న ఏకపక్ష నిర్ణయంపై ఆధారపడి వుంది. 1985వ సం॥పు ఈ నిర్ణయానికి ముందర, 1930 సంవత్సరం నుంచి ఆరంభించి, అమెరికా కాంగ్రెస్ (చట్టసభ) వృక్షజాతులకు అత్యంత జాగరూకతతో నిర్ణయించిన మేధోసంపత్తి పరిరక్షణను కల్పించింది. అయితే ఈ చట్టాలలో రైతులకు, పరిశోధకులకు పలు ప్రాధాన్యత గల మినహాయింపులను కల్పించారు. 1985వ సంవత్సరపు నిర్ణయం ప్రకారం వృక్షజాతులు కూడా యంత్రాలు లేదా ఇతర తరహాల ఉత్పత్తి సాధానాలవలెనే పునర్ నిర్వచించబడ్డాయి. అప్పటినుంచీ అమెరికాలో వృక్షజాతులపై వేలాది పేటెంట్లు జారీ అయ్యాయి. ఇక ట్రిప్స్ ద్వారా వృక్ష సంబంధిత పేటెంట్లను అమలు జరపవలసిందిగా అమెరికా మిగతా ప్రపంచంపై వత్తిడిని కూడా తేనారంభించింది. వ్యక్తిగత లాభాపేక్ష లేకుండా ప్రజలు ఆవిష్కరణలు జరపరనీ, లేదా విజ్ఞానాన్ని సృష్టించరనే తప్పుడు భావనపై అమెరికా మేధోసంపత్తి హక్కుల సాంప్రదాయక ఆలోచన ఆధారపడి వుంది. అయితే, దురాశ అనేది 'మానవ స్వభావం తాలూకు మౌలిక లక్షణం' కానేకాదు. కాగా ఇటువంటి దురాశకు ప్రోద్బలాన్ని ఇచ్చే సమాజంలో మాత్రం అది ప్రధాన ధోరణిగానే వుండి తీరుతుంది. విత్తనాలు, వృక్ష జన్యు వనరుల విషయంలో, 'లాంఛనప్రాయమైన', 'లాంఛనప్రాయంకాని' వ్యవస్థలలో ఆవిష్కరణలు నేటివరకూ మానవ జాతి విశాల ప్రయోజనాలు మార్గదర్శకంగా జరిగాయి.

### యు.పి.ఓ.వి. సదస్సు, పశుపోషకులు - రైతుల హక్కులు

వృక్ష జాతుల పెంపకందారుల హక్కులను కాపాడే అంతర్జాతీయ ఒప్పందం - యు.పి.ఓ.వి సదస్సులో జరిగింది. దీనినే 'నూతన తరహాల వృక్షజాతుల పరిరక్షణకై జరిగిన అంతర్జాతీయ సదస్సు'గా పిలుస్తారు. యు.పి.ఓ.వి. సదస్సు నిర్ణయాలను తొలుత అయిదు యూరప్ దేశాలు అమలు జరిపాయి. 1968వ సంవత్సరం వరకు యు పి.ఓ వి.లో సభ్యత్వం యూరప్ దేశాలకే పరిమితం అయ్యి వుంది. 1968వ సంవత్సరపు సదస్సులో ప్రపంచంలోని అన్ని దేశాలకు సభ్యత్వాన్ని ఇచ్చేందుకు యు.పి ఓ.వి. తీర్మానించింది. యు.పి.ఓ.వి. సదస్సు ఏర్పాటుకు 1961వ సంవత్సరంలో సభ్యదేశాలు సంతకాలు చేసాయి. అయితే, ఈ సదస్సు 1968లో ఆచరణలోనికి వచ్చింది. తొలుత, ఈ సదస్సు తాలూకు ఆచరణాత్మక మైలురాయిగా యు.పి.ఓ.వి. 1978 వుంది. తరువాత దీనిని సవరిం ౖ, యు.పి.ఓ.వి 1991ని ఏర్పరిచారు.

యు.పి.ఓ.వి లో ప్రస్తుతం 20 సభ్యదేశాలు వున్నాయి. వీటిలో పలు యూరప్ సమాఖ్య దేశాలు, ఇతర యూరప్ దేశాలు, జపాన్, అమెరికా మొదలైన దేశాలకు సభ్యత్వం వుంది. దీనిలో, అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఏ దేశమూ సభ్యదేశంగా లేదు. దీనివలన, యు పి.ఓ.వి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాల సామాజిక-ఆర్థిక నేపథ్యానికి బాగా నప్పే చట్టంగా రూపొందింది ఈ దేశాలలో రైతాంగం సంఖ్యరీత్యా తక్కువగా వుందనేది గమనార్హం. అంతేకాకుండా, వున్న కొద్దిపాటి రైతాంగానికి కూడా వృక్షజాతుల సంతతిని వృద్ధి చేయటం లేదా విత్తనాల సరఫరాపై ఎటువంటి అదుపు లేదు. ఇది, మనదేశం వంటి వాటి పరిస్థితికి పూర్తిగా భిన్నమైనది మనదేశంలో అత్యధిక ప్రజానీకం వ్యవసాయరంగంలో వున్నారు. ఈ రైతాంగమే విత్తనాలు తయారు చేసుకోవడం, సరఫరా వ్యవస్థలో భాగస్వాములు కావడం అనేవి ఇప్పటికీ విత్తనాల అందుబాటులో ప్రధాన మార్గాంతరంగా వుంది.

నూతన తరహాల మొక్కల జాతులను అభివృద్ధి చేసేవారికి, ఆ మొక్క జాతులపై కొన్ని ప్రధాన హక్కులను కల్పించడమే యు.పి.ఓ.వి. లక్ష్యం. నూతన తరహా మొక్కలను అభివృద్ధి చేసేందుకుగాను, వృక్షసంతతిని అభివృద్ధి చేసేవారికి అవసరమైన మొక్కలను, సాధారణంగా రైతులే అందిస్తారు. అలా తయారైన నూతన తరహా మొక్కల వినియోగదారులు కూడా రైతులే కాబట్టి, నూతన వృక్ష సంతతిని అభివృద్ధి చేసేవారి, రైతాంగాల హక్కులకు మధ్య సమతుల్యత అవసరం.

అయితే, యు.పి.ఓ.వి. సదస్సు పట్టువిడుపులు లేనిది. అది సభ్యదేశాలు తన ప్రమాణాలను తు-చ తప్పకుండా పాటించాలని కోరుతుంది. నూతన మొక్కల సంతతి అభివృద్ధిదారులకు కల్పించే పరిరక్షణను స్వతఃసిద్ధ చట్టంగా అది భావిస్తుంది. దీనివలన, ప్రామాణికీకరణ శృతిమించి రాగాన పడింది. అది జీవవైవిధ్యం, భిన్న దేశాలకు సంబంధించిన సామాజిక-ఆర్థిక వైవిధ్యానికి సానుకూలమైనదికాదు. అందుచేత యు.పి.ఓ.వి. భిన్నవాస్తవాలకు చెందిన వృక్షజాతులు, ప్రజలు, సృజనాత్మకతలను పరిరక్షించేందుకు ఆవిర్భవించిన ఏకైక వ్యవస్థ స్థానానికి అర్హమైనదికాదు.

వృక్షజాతులను నిర్వచించే తీరులో ప్రామాణికీకరణ అంతర్భాగంగా ఏర్పరచబడింది. పరిరక్షణ అర్హతను పొందేందుకుగాను ఒక వృక్ష తరహాకు ఈ క్రింది లక్షణాలు వుండాలి

నూతనమైనది - ఈ రకమైన వృక్షజాతి అంతకుమునుపు వాణిజ్యపరంగా వినియోగించుకోబడనిదై వుండాలి.

ప్రత్యేకత - పరిరక్షణకై దరఖాస్తు చేసిననాటికి, ఈ వృక్ష తరహాను పోలిన మరొకటి వుండరాదు.

సారూప్యత - ఈ తరహాకు చెందిన వృక్షజాతిలోని మొక్కలు అన్నీ తగిన స్థాయిలో సారూప్యత కలిగి వుండాలి. తద్వారా ఆ వృక్షజాతి పునరుత్పత్తి విధానాన్ని పరిగణనలోనికి తీసుకున్నప్పుడు, అది ఇతర వృక్షజాతులనుంచి వేరుచేసి చూడ వీలు కలిగించేలా వుండాలి.

స్థిరమైనది - ఆ వృక్ష జాతి తన స్వభావాన్ని కోల్పోకుండా పునరుత్పత్తిని చేయగలగాలి.

ఈ నిర్వచనం, దాని సహజ స్వభావందృష్ట్యా రైతులు తయారుచేసుకునే తరహా మొక్కలను తిరస్కరణకు గురిచేస్తోంది. జీవ వైవిధ్యాన్ని ధ్వంసం చేస్తుంది. సారూప్యతను తప్పనిసరి షరతుగా చేస్తుంది. కాబట్టి, ఈ రకమైన వృక్ష జాతుల సంతతివృద్ధి హక్కుల (పి.బి.ఆర్) వ్యవస్థలో జీవవైవిధ్యాన్ని ధ్వంసం చేసేందుకు, సారూప్యతగల వృక్షజాతులను సృష్టించేందుకు - తద్వారా పర్యావరణపరంగా తట్టుకొని నిలబడలేని వ్యవసాయ వ్యవస్థలను ఏర్పరచేందుకు మాత్రమే ప్రోత్సాహకాలు లభిస్తాయి. జీవవైవిధ్యాన్ని మరింత మెరుగుపరచి, కొనసాగించేందుకు, లేదా పర్యావరణ పరంగా అనుకూలమైన వృక్షసంతతిని అభివృద్ధి చేసేందుకు ప్రోత్సాహం లభించదు. కాబట్టి, యు.పి ఓ.వి. లాగానే పి.బి.ఆర్. చట్టం కూడా స్వతహాగానే రైతుల హక్కులను కాపాడగలది కాదు. వృక్ష సంతతిని వృద్ధిపరచేవారుగాను; నూతన ఆవిష్కరణల ద్వారా వైవిధ్య పూరితమైన భిన్న రకాల వృక్ష జాతులను తయారుచేయగలిగినవారుగాను - అంటే స్థూలంగా ఇతర అన్ని రకాల వృక్ష జాతుల వృద్ధి వ్యవస్థలకు

పునాదిని ఏర్పరచే కృషి తాలూకు పాత్రనుంచి ముందు పేర్కొన్న రైతుల హక్కులు ఆవిర్భవిస్తాయి.

యు.పి.ఓ వి రైతుల హక్కులను గుర్తించలేదు. అందుచేత అది రైతుల సానుకూల హక్కులను కాపాడే స్థితిలో లేదు.

1978వ సంవత్సరపు యు.పి.ఓ.వి.లో రైతులకు ఒకే మినహాయింపు వుంది. దీని ప్రకారంగా, రైతులు రక్షిత రకాల విత్తనాలను దాచుకునే హక్కు వుంటుంది. అయితే, 1991వ సంవత్సరపు యు.పి.ఓ.వి. ఈ మినహాయింపులు అన్నింటినీ తొలగించివేసింది. వృక్షజాతులను వృద్ధిచేసేవారు, పరిశోధకులు, ఇతర రకాలను వృద్ధిచేసేందుకై రక్షిత రకాన్ని వినియోగించుకున్నందుకుగాను పి.బి.ఆర్ వున్నవారికి రాయల్టీలను చెల్లించాలి వృక్షజాతుల సంతతి వృద్ధిదారులు తమ న్యాయబద్ధమైన హక్కులను నిర్ణయించుకుంటారు వారు ఈ హక్కులను ప్రభుత్వంపై రుద్దుతారు. ఈ రకమైన సందర్భాలలో వృక్షజాతుల సంతతిని వృద్ధిచేసేది. బహుళజాతి విత్తన సంస్థలే. ఈ సంస్థలు పలు మూడవ ప్రపంచ దేశాల ప్రభుత్వాలకంటే శక్తివంతం అయినవి. కాబట్టి ఈ విషయంలో "సమంజసమైన పరిమితులు" అనే వాటిని ఏర్పరచేది కూడా బహుళజాతి సంస్థలే తప్ప ప్రభుత్వాలు కాదు. పండించిన పంటను అమ్ముకోవడంలో తుది నిర్ణేత వృక్ష సంతతి వృద్ధిదారుగా అనుమతి వున్న సంస్థలే. యు.పి.ఓ.వి., 1991 అనేది పేటెంట్ల వ్యవస్థకు ఏమాత్రం తీసిపోని గుత్తాధికారమే.

యు.పి.ఓ.వి, 1991ను అమలు జరిపేందుకుగాను పలు మూడవ ప్రపంచదేశాల ప్రభుత్వాలు ఆసక్తి చూపలేదు. అయితే, 1995వ సంవత్సరం డిసెంబరు మాసం వరకూ యు.పి.ఓ.వి. 1978లో చేరేందుకు ఈ దేశాలకు అవకాశాన్ని కల్పించారు. పలు ఆంక్షలు వున్న 1991వ సంవత్సరపు యు.పి.ఓ.వి. సదస్సు బారినుండి తప్పించుకునేందుకై పలు దేశాలు 1978వ సంవత్సరపు యు.పి.ఓ.వి. సదస్సులో భాగస్వాములు అయ్యేందుకు ఆతృత చూపాయి. తద్వారా, తమ ప్రత్యేక వ్యవస్థకు ఈ సదస్సును పునాదిగా చేసుకున్నాయి. భారతదేశం 1995వ సంవత్సరంలో యు.పి.ఓ.వి.లో చేరలేదు. కాబట్టి యు.పి ఓ.వి. సభ్యదేశంగా ఇప్పుడు చేరదలచుకుంటే; అది యు పి.ఓ.వి. చట్టపు 1991వ సంవత్సరపు తీరును అనుసరించాలి.

అన్ని జీవజాతుల సమగ్రత, స్వతఃసిద్ధమైన విలువను, ధనికులు, పేదలకు ఒకేరకమైన జీవించే హక్కును కల్పించి, గౌరవించగలగాలంటే, దానికై ట్రిప్స్ నుంచి జీవజాతులను మినహాయించటం అవసరం. అలాగే యు.పి.ఓ.వి. వంటి సదస్సులను ఉపసంహరించాలి. జీవజాతులను పేటెంట్ల నుంచి మినహాయించేందుకుగాను చొరవ చూపాలి. దానికై 1999వ సంవత్సరంలో జరిగిన అధికరణ 27.3 (బి) సమీక్షను, మొత్తం ట్రిప్స్ ఒప్పందపు సమీక్షను వినియోగించుకోవాలి. తద్వారా, మానవులతో సహా అన్ని జీవజాతుల పర్యావరణ సంబంధిత, నైతిక పునరావాసాన్ని ఆరంభించగలగాలి

## ట్రిప్స్ - జీవ వైవిధ్యం

జీవ వైవిధ్యంపై సదస్సు (సి.బి.డి.) అనేది 1992వ సంవత్సరంలో రియోడిజనైరోలో

జరిగిన ధరిత్రి సదస్సు సందర్భంగా పాల్గొన్న దేశాలు సంతకం చేసిన అంతర్జాతీయ ఒప్పందం. సి.బి.డి.లో దరిదాపు 200 దేశాలు పాల్గొన్నాయి. అయితే, అమెరికాతో సహా మరో 7 దేశాలు ఈ సమావేశపు తీర్మానంపై సంతకం పెట్టలేదు. జీవ వైవిధ్యంపై జరిగిన ఈ ఒప్పందం కల్పించిన అవకాశాలను, ఆశలను, జీవజాతులకు పేటెంట్లను విస్తరించటం ద్వారా ట్రిప్స్ ఒప్పందం నీరుకార్చివేసింది. ఈ రెండు ఒప్పందాలలోనూ భాగస్వాములుగా ఉన్న దేశాలు సి.బి.డి., ట్రిప్స్‌ల మధ్య వైవిధ్యాల వలన ఆచరణలో పలు సమస్యలను ఎదుర్కొంటున్నాయి.

జీవ వైవిధ్యాన్ని పరిరక్షించేందుకు, దాని తాలూకు అంశాలను పునరుద్ధరింప వీలయ్యే రీతిలో వినియోగించుకునేందుకు, జన్యువనరులను వినియోగించుకోవటం ద్వారా లభించే ఫలితాలను న్యాయంగాను, సమానతాసూత్రం ప్రాతిపదికగాను పంచుకునేందుకు, దీనిలో భాగంగా అందరికీ తగిన రీతిలో జన్యు వనరుల అందుబాటు కల్పించేందుకు, అలాగే, దీనంతటికై సంబంధిత సాంకేతిక పరిజ్ఞానాన్ని బదలాయించేందుకుగాను సి.బి.డి. అనేది చట్టపరమైన, అమలు చేసి తీరవలసిన ఒప్పందం. ఈ విధంగా, సి.బి.డి.లో లక్ష్యాలైన పరిరక్షణ, పునరుద్ధరింపవీలైన వినియోగం, ప్రయోజనాలను సమానతా ప్రాతిపదికన పంచుకోవడానికి ట్రిప్స్ ఒప్పందం విరుద్ధంగా ఉంది. జీవ వైవిధ్యపు ప్రయోజనాలను పంచుకోవడం, అటువంటి వినియోగం కొనసాగింప వీలైనదిగా ఉండేలా చూడటం, జీవ వైవిధ్యాన్ని సరిసమాన రీతిలో పరిరక్షించుకోవటం మొదలయిన వాటన్నింటిలో ప్రభుత్వ కార్యాచరణను ట్రిప్స్ ఆటంకపరుస్తోంది ఎందుచేతనంటే, ట్రిప్స్ ఒప్పందం పేటెంట్ల గుత్తాధిపత్యాన్ని కాపాడేలా ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తోంది. పలువురు ప్రజల దృష్టిలో, ప్రయోజనాలను సరిసమానంగా పంచుకోవటానికి, జీవ వారసత్వాన్ని పంచుకోవటం మాత్రమే ఏకైక న్యాయబద్ధ మార్గం. అటువంటి పంచుకోవటాన్ని, మార్పిడిని చట్ట విరుద్ధం చేయుటం ద్వారా పాశ్చాత్య తరహా పేటెంట్ల వ్యవస్థలు, ప్రయోజనాలను సరిసమానంగా పంచుకోవటం తాలూకు మౌలిక పునాదులని దెబ్బతీస్తున్నాయి.

పేటెంటు చేసిన 'ఆవిష్కరణ' తాలూకు వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను, ఆ పేటెంటు అమలులో ఉన్న కాలంలో మరే ఇతరులు పొందేందుకు వీలు లేకుండా పేటెంట్ల చట్టం, పేటెంటుదారుకు హక్కును కల్పిస్తుంది. ట్రిప్స్ ప్రకారం పేటెంటు జీవితకాలం 20 సంవత్సరాలు ఉంటుంది. దీని ప్రకారం, పేటెంటు చేసిన వస్తువులను, లేదా ప్రక్రియను ఉత్పత్తి చేసే, దిగుమతి చేసుకొనే, అమ్మే లేదా వినియోగించుకొనే హక్కు పేటెంటుదారుకు మినహా మరే ఇతరులకు ఉండదు.

ఇలా పేటెంటు చేసిన 'ఆవిష్కరణ' ఒక జీవరీతి గనుక అయితే, లేదా అది ఒక జీవ వనరు తాలూకు భాగం కానీ, లేదా ఉత్పత్తిగానీ అయితే, పేటెంటు హక్కుల ప్రకారంగా పేటెంటుదారుకు (సాధారణంగా ఇది ఒక కార్పొరేటు సంస్థే అయి ఉంటుంది), రైతులు విత్తనాలను మరుసటి సంవత్సరపు పంటకు దాచుకోకుండా నిలువరించే హక్కు ఉంటుంది. అలాగే స్థానిక సంస్కృతుల నుంచి చౌర్యం చేసిన ప్రక్రియలను వినియోగించి, జీవ వైవిధ్యంపై ఆధారపడిన ఉత్పత్తులను తయారుచేసే చిన్న ఉత్పాదక సంస్థల హక్కు కూడా హరించుకుపోతుంది. (ఉదాహరణకు : వేపలో క్రిమిసంహారకాలు, ఫంగస్ నిర్మూలకాలను తయారుచేయటంపై డబ్ల్యు.ఆర్. గ్రేస్ సంస్థ పేటెంటును తీసుకోవటం). తద్వారా సి.బి.డి. తాలూకు మౌలిక లక్ష్యాన్నే ట్రిప్స్ జావకారుస్తుంది.

సి.బి.డి.లోని మరో ప్రధాన అంశం- సార్వభౌమాధికార సూత్రం అనేది. తమ తమ దేశాలలో వున్న జీవ, జన్యువనరులపై ఆయా దేశాల సార్వభౌమాధికార హక్కులను సి బి డి గుర్తిస్తోంది. ఈ సార్వభౌమాధికారం ప్రకారంగా జీవవైవిధ్యంపై సంపత్తి హక్కుల వ్యవస్థను రూపొందించుకోవచ్చు. కాగా, మరోప్రక్క, ట్రిప్స్ ఒప్పందానికి చెందిన జీవంపై పేటెంట్ల నిబంధన, జీవ రీతులను 'మేధో సంపత్తి'గా నిర్వచిస్తోంది. తద్వారా అది, ప్రపంచస్థాయిలో ప్రైవేటు-ఆస్తిహక్కుల వ్యవస్థను సృష్టిస్తోంది. దీనివలన, వివిధ దేశాలు తమతమ స్వంత మేధోసంపత్తి హక్కుల వ్యవస్థను రూపొందించుకొని, అభివృద్ధి చేసుకొనే సార్వభౌమాధికారానికి విఘాతం కలుగుతోంది.

సిబిడి ప్రకారంగా వివిధ సామాజిక బృందాలు, రైతులు, స్థానిక ప్రజలు తాము సాంప్రదాయకంగా వినియోగించుకుంటున్న జీవ వనరులు, విజ్ఞాన వ్యవస్థలను పరిరక్షించి, ప్రోత్సహించవలసిన బాధ్యత ఆ ఒప్పందంపై సంతకాలు చేసిన దేశాలకు వుంటుంది. సిబిడి ప్రకారం స్థానిక విజ్ఞానాన్ని కాపాడవలసి వుంది. కాగా మరోపక్క, పాశ్చాత్య తరహా పేటెంట్ల వ్యవస్థకు పునాది అయిన ట్రిప్స్‌లో స్థానిక విజ్ఞాన వ్యవస్థలను గుర్తించి కాపాడే అవకాశం లేదు. దీనివలన జీవ చౌర్యానికి ప్రోత్సాహం లభిస్తుంది.

జీవ వైవిధ్య విషయంలో మూడవ ప్రపంచదేశాలు సుసంపన్నమైనవి. ఆ దేశాలలోని ప్రజల మనుగడ జీవవైవిధ్యంపై ఆధారపడివుంది. అందుచేత, ఈ దేశాలకు సార్వభౌమాధికారం, జీవ వైవిధ్య పరిరక్షణ, దానిని కాపాడుకోగల తీరులో జరిగే వినియోగం, ప్రయోజనాలను సమానరీతిలో పంచుకోవడం, స్థానిక పరిజ్ఞానాన్ని పదిలపరుచుకోవడం ప్రధానమైన అంశాలు. ఈ కారణాల వల్లనే ట్రిప్స్ కంటే సిబిడికే ప్రాధాన్యత వుండాలని ఈ దేశాలు పదేపదే కోరుతున్నాయి

ట్రిప్స్ అనేది ప్రైవేటు హక్కులపై ఆధారపడి వుంది. కాగా, సిబిడి సార్వభౌమాధికార సూత్రంపై ఆధారపడి వుంది. జీవజాల పరిరక్షణ బాధ్యత అనేది ట్రిప్స్‌లో లేదు. సిబిడి జీవవైవిధ్యం, స్థానిక పరిజ్ఞానాల పరిరక్షణకు ప్రాధాన్యతను ఇస్తోంది ఈ పరస్పర విరుద్ధ అంశాలను తొలగించాలి. తద్వారా మాత్రమే వివిధదేశాలు, జాతీయస్థాయిలో సర్వసమగ్ర చట్టాలను అమలు చేయగలవు. దీనివలన పర్యావరణాన్ని పరిరక్షించడం, ప్రజల అవసరాలను హామీ చేయడం, హక్కులను పరిరక్షించడం సాధ్యం అవుతుంది. ఉన్నత విలువలు, విస్తృతప్రజారాసుల ప్రయోజనాలకు అనుకూలమైన సిబిడిని అత్యున్నత అంతర్జాతీయ చట్టంగా పరిగణించాలి. ట్రిప్స్, సిబిడిల మధ్య వైరుధ్యాలను తొలగించేందుకు గాను, ట్రిప్స్‌లో మార్పులు జరిగేవిధంగా, దాని (ట్రిప్స్) సమీక్ష సాగాలి.

## ట్రిప్స్-భారతదేశంలో పేటెంటు చట్టాలు

వలసవాదపాలనలో భాగంగా 1850వ దశకంలో భారతదేశంలో పేటెంట్ల చట్టాన్ని తొలిసారిగా ప్రవేశపెట్టారు. 1911వ సంవత్సరంలో మొట్టమొదట పేటెంటు అక్టుకు చట్టరూపం ఇచ్చారు. స్వాతంత్ర్యం వచ్చేనాటికి, 1911వ సంవత్సరపు పేటెంటు చట్టమే అమలులో వుంది. ఈ చట్టాన్ని 1930లోనూ, 1945లోనూ సవరించారు 22 సంవత్సరాల వాద ప్రతివాదాలు, చర్చ సమీక్షల తరువాత, 1970వ సంవత్సరంలో నూతన పేటెంటు అక్టు చట్టరూపం తీసుకుంది.

స్వాతంత్ర్య సముపార్జనా కాలంలోనూ, స్వాతంత్ర్యం వచ్చి 50 ఏళ్లు గడిచిన తరువాత కూడా ప్రధాన వాద ప్రతివాదాలు ఒకే అంశంపై వున్నాయి. సామాజిక సృజనాత్మకతను, స్థానిక ఉత్పత్తిని చిదిమివేయడంలో గుత్త సంస్థలకు సంబంధించిన ప్రశ్న. ఆహారం, ఔషధాలను సరకుల పేటెంట్ల పరిధినుంచి 1970వ సంవత్సరపు చట్టం మినహాయించింది. దీనిద్వారా ఆ చట్టం కీలక అంశాలు అయిన ఆరోగ్యం, పౌష్టికాహారాల విషయంలో గుత్తాధిపత్యం ఏర్పడకుండా నిలువరించే ప్రధానమైన మేలును ఒనగూర్చింది. ప్రజాహితం దృష్ట్యా మినహాయింపును ఇవ్వడం అనే మార్గం, తప్పనిసరి లైసెన్సు విధానంకంటే మరింత మెరుగైనదిగా కనపడుతున్నది. అయితే, మన దేశ పౌరుల దైనందిన జీవితాన్ని ప్రభావితం చేసే ఈ రక్షణలనే, ట్రిప్స్ ఒప్పందాన్ని అమలు జరిపి తీరాలనే వత్తిళ్లక్రింద, 1990వ దశకంలో తొలగించి వేసేందుకు లక్ష్యంగా ఎంచుకున్నారు.

ప్రపంచవాణిజ్య సంస్థ, సియాటెల్ రౌండు సమావేశం విఫలం అయినప్పటికీ, 1999వ సంవత్సరం డిసెంబరు నెలలో, భారత ప్రభుత్వం పలు మేధోసంపత్తి హక్కుల (ఐపిఆర్) సంబంధిత చట్టాలను ఆతృతగా చేసింది. 2000వ సంవత్సరం జనవరి 1వ తేదీ నాటికి ట్రిప్స్‌ను అమలుపరిచేందుకుగాను, ఈ చట్టాలను చేయడం అవసరమని ప్రభుత్వం పేర్కొంది. ఈ ఐపిఆర్ చట్టాలలో క్రింద పేర్కొన్నవి. ఈ ఐపిఆర్ చట్టాలలో క్రింద పేర్కొన్నది వున్నాయి:

1. భిన్న వృక్షజాతుల పరిరక్షణ మరియు రైతుల హక్కుల బిల్లు 1999.

2. పేటెంట్ల(సవరించిన)అక్టు, 1999.

3. కాపీరైట్ల బిల్లు, 1999.

4. భౌగోళిక సూచికలు మరియు గుర్తులు (నమోదు మరియు పరిరక్షణ)బిల్లు, 1999.

6. డిజైన్‌ల అక్టు, 1999.

**పేటెంట్ల(సవరించిన) అక్టు, 1999.**

ఆహారం, ఔషధాల విషయంలో కల్పించిన సరకుల పేటంట్ల మినహాయింపును తొలగించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశ్యం. ప్రపంచ వాణిజ్య సంస్థలో సభ్యదేశంగా ఇది భారతదేశపు బాధ్యత అని ప్రభుత్వం పేర్కొంది ఔషధాలు, వ్యవసాయ సంబంధిత రసాయనాల పరిధిలో సరకుల పేటెంటు అన్వయింపులకు సంబంధించిన గుత్తాధిపత్య మార్కెటింగ్ హక్కులకై నూతన క్లాజులను ప్రవేశపెట్టడం సరైనది కాదు. మినహాయింపులకు సంబంధించి నూతన క్లాజులను ప్రవేశపెట్టకుండానే ఇలా జరగడం వలన, పేటెంట్లు (సవరించిన) అక్టు, 1999 వాస్తవానికి ఈ కింది అంశాలలో ముప్పుగా పరిణమిస్తుంది:

1. జీవరీతులను పేటెంటు చేయడం.

2. జీవ జాలం నుంచి పొందిన ఉత్పత్తులపై పేటెంట్లు పొందడం.

3. జీవజాలం తాలుకు జన్యువులు, అంగాలు, భాగాలపై పేటెంట్లు ఏర్పడడం.

భారతీయ పేటెంటు అక్టు, 1970 ప్రకారంగా చాలా అంశాలు పేటెంట్ల పరిధి నుంచి మినహాయింపును పొందాయి. దీనికి భిన్నంగా, 1999వ సంవత్సరపు అక్టు ప్రకారం, 1995వ సంవత్సరం జనవరి 1వ తేదీ తరువాత విదేశాలలో పేటెంట్ లభించిన వాటికి, మన దేశంలో గుత్తాధికార మార్కెటింగ్ హక్కులను (ఇఎంఆర్ఎస్) కల్పిస్తున్నారు. ప్రజారోగ్యం, ప్రజా జీవితంలో నైతికత లేదా విస్తృతంగా ప్రజా ప్రయోజనాలపై ఈ విధానం తాలూకు ప్రభావం గురించిన ఎటువంటి పరిశీలనకు తావు కల్పించలేదు విదేశాలలో పలు పేటెంట్లను స్థానిక విజ్ఞానం నుంచి చోరీ ద్వారానే పొందారనేది గమనార్హం. (ఉ। వేప, మిరియాలు, పచ్చి అల్లం వినియోగంపై పేటెంట్లు.) కానిపక్షంలో ఈ పేటెంట్లు జీవంపై తీసుకుంటున్నారు. (ఉ , మానవ సముదాయాల మీద పేటెంట్లు, బొడ్డు తాడు నుంచి స్రవించే రక్తం పేటెంటు, జంతువులు, మొక్కలపై పేటెంట్లు తీసుకోవడం.)

కాబట్టి, మినహాయింపులకు సంబంధించినటువంటి నిబంధనలు, కొలబద్దలు ఏర్పరచకుండానే, ఇటువంటి పేటెంట్లపై ఇఎంఆర్ఎస్‌లు ఇవ్వడం వలన మనం మన ఆర్థిక పునాదిని, మన పర్యావరణాన్ని, మన ప్రజారోగ్యాన్ని, చివరకు మన సమాజపు నైతిక మూలాలను కూడా నాశనం చేసివేయగల మార్కెట్ శక్తుల విశృంఖలత్వానికి అనుమతిని ఇచ్చినవారు అవుతాం.

1999వ సంవత్సరపు పేటెంటు (సవరించిన) అక్టు, ట్రిప్స్ అనుమతించే ఏ రక్షణ వలయాలను వినియోగించుకోలేకపోవడం మరింత ఆందోళన కలిగించే విషయం. ఉదాహరణకు, ట్రిప్స్ ప్రకారంగా వివిధ దేశాలు జీవంపై పేటెంట్లకు మినహాయింపును ఇచ్చుకోవచ్చు, అటువంటి పేటెంట్లు మన ప్రజలపై నైతికతను ఉల్లఘించుతాయనే కారణం చేత ఈ మినహాయింపుకు ట్రిప్స్‌లో ఆస్కారం కల్పించారు. ఔషధాలు, మందులపై సరకుల పేటెంట్‌ను అనుమతించేటప్పుడు అటువంటి పేటెంట్లు ఆధారంగా ఇఎంఆర్ఎస్‌లు జారీ చేసేటప్పుడు ట్రిప్స్‌లోని అధికరణ 27.2 కిందకు వచ్చేవిధంగా, మన హక్కులను ప్రతిబింబించే తీరులో, మినహాయింపు క్లాజును కూడా పేటెంటు (సవరించిన) అక్టు ప్రవేశపెట్టి వుండవలసింది.

పేటెంటు (సవరించిన) అక్టు ప్రకారం మాత్రమే పేటెంట్ల పరిధి నుంచి మినహాయింపును ఇవ్వవచ్చు తద్వారా ప్రజాప్రయోజనాలను, నైతిక విలువలను పరిరక్షించవచ్చును. జంతుజాలం, మొక్కలు, మానవ జీవ కణాలపై కూడా పేటెంట్లను తీసుకునే కొత్త క్రమం; అలాగే జీవ చౌర్యపు నూతన మహమ్మారి, మన స్థానిక విజ్ఞానంపై పేటెంట్లను తీసుకోవడం దృష్ట్యా నైతిక, పర్యావరణం, ఆర్థిక దృక్పథం నుంచి చూస్తే మినహాయింపు క్లాజు తప్పనిసరి అవసరం. పేటెంటు తీసుకోవడానికి వీలులేని సరుకులు ఏమిటో స్పష్టంగా వెల్లడించడం అంటే, ఏ సరుకులు ఇఎంఆర్ లకు అర్హమైనవి కావో తేల్చి చెప్పడం, ప్రజా జీవితంలో క్రమబద్ధతను కాపాడేందుకు తప్పనిసరి. అలాగే, తమ మనుగడకై జీవవైవిధ్యం, దాని తాలూకు ఫలాలపై ఆధారపడిన భారతీయ పౌరుల జీవన వనరులను, మౌలిక, అవసరాలను కాపాడేందుకు కూడా ఇది అవసరం.

జీవ చౌర్యాన్ని అరికట్టేందుకుగాను చట్టపరమైన సాధనాలను సృష్టించడంలో కూడా పేటెంటు (సవరించిన) అక్టు విఫలం అయ్యింది. స్థానిక విజ్ఞానాన్ని పేటెంటు చేయడానికి వీలులేని కొలబద్దలను

ఈ ఆక్టు ఏర్పరచలేదు అది కేవలం అటువంటి సరకులను అమ్మడం లేదా పంపిణీ చేయడాలకు సంబంధించిన హక్కును గురించి మాత్రమే ప్రస్తావిస్తుంది. పదార్థాలు లేదా సరకుల విషయంలో అది కేవలం భారతీయ వైద్యం గురించి మాత్రమే ప్రస్తావించింది. స్థానిక వైద్య విజ్ఞానం లేదా పద్ధతుల గురించి అది మౌనం వహించింది. న్యాయ సంబంధిత కమిషను నివేదికలో కూడా ఈ విషయాన్ని ఎత్తి చూపారు. పలు జీవ చౌర్య పేటెంట్లు; కేవలం పదార్థాన్ని వేరు చేయగలగడం, వినియోగ పద్ధతులలో కొద్దిపాటి మార్పులపైననే ఆధారపడి వున్నాయి అందుచేత పేటెంటు ఆక్టులోని 3వ అధికరణను సవరించడం అవసరం. ఈ అధికరణం, దేనిని నూతన ఆవిష్కరణగా పరిగణించరాదో తెలుపుతుంది.

ప్రజాప్రయోజనాలను పరిరక్షించేందుకు ఎటువంటి నిబంధనలు ఏర్పరచకుండానే, కార్పొరేట్ సంస్థలకు గుత్తాధిపత్య మార్కెటింగ్ హక్కులను కల్పించడం పేటెంట్ (సవరించిన) ఆక్టులోని ప్రధాన బలహీనత. 24(సి), 24(డి) నిబంధనల విభాగాలు, తప్పనిసరిగా లైసెన్సు తీసుకోవలసివుంటుందనే భ్రాంతిని కలుగచేస్తాయి అయితే, ఈ తప్పనిసరి లైసెన్సింగు విధానం ఉత్పత్తికి మాత్రమే వర్తిస్తుంది. అమ్మకాలు, ఫంపిణీ విషయంలో ఈ నిబంధనల విభాగాలు నోరు మెదపవు. అలాగే, ఒక వస్తువును మన దేశంలో ఉత్పత్తి చేస్తే మాత్రమే దానిపై ధరల నియంత్రణను అమలు జరపవీలవుతుంది. ఇఎంఆర్‌లకు ధరల నియంత్రణ, తప్పనిసరి లైసెన్సింగు వర్తించవు ఈ విధంగా, పేటెంటు (సవరించిన) ఆక్టు విదేశీ బహుళజాతి సంస్థలకు సంపూర్ణమైన, నియంత్రణకు తావులేని మార్కెటింగ్ హక్కులను కల్పించింది. దీనివలన; మన దేశపౌరుల హక్కులైన పౌష్టికాహారం, ఆరోగ్య రక్షణ వంటి వాటికి ముప్పువాటిల్లగలదు.

ఈ విధంగా, 1999వ సంవత్సరపు ఆక్టులో రెండు లోపాలు వున్నాయి. అందుచేత, దేనిని ఆవిష్కరణగా లెక్కించకూడదో నిర్దేశించే పేటెంటు చట్టం తాలూకు మూడవ అధికరణను సవరించాలి.

ఎటువంటి మినహాయింపులూ, తొలగింపులూ లేకుండానే కార్పొరేట్ సంస్థలకు గుత్తాధిపత్య మార్కెటింగ్ హక్కుల నివ్వటం పేటెంట్ల (సవరించిన) చట్టంలోని అతి పెద్ద బలహీనత. ప్రజాప్రయోజనాలను కాపాడేందుకు దీనిలో ఎటువంటి రక్షణ వలయాలు ఏర్పరచబడలేదు. 24 (సి), 4 (డి) విభాగాలు తప్పనిసరి లైసెన్సింగు తాలూకు భ్రమలను కల్పిస్తున్నాయి అయితే, ఈ తప్పనిసరి లైసెన్సింగు కేవలం ఉత్పత్తికి మాత్రమే వర్తిస్తుంది. అది అమ్మకాలు, పంపిణీకి వర్తించదు. అలాగే, ఉత్పత్తి దేశంలో జరిగితే మినహా ధరల నియంత్రణ కూడా అమలు జరపటం సాధ్యంకాదు. అలాగే ఇ.ఎం.ఆర్.లకు తప్పనిసరి లైసెన్సింగు, ధరల అదుపు కూడా వర్తించవు. కాబట్టే ఈ విధంగా పేటెంట్ల (సవరించిన) చట్టం ప్రపంచంలోని గుత్త సంస్థలకు నియంత్రణలేని సర్వసత్తాక మార్కెటింగ్ హక్కులను కల్పించింది. తద్వారా తగిన, అందుబాటులో వున్న పౌష్టిక ఆహారం, ఆరోగ్యరక్షణ హక్కులను భారతీయ ప్రజలకు దూరం చేసింది.

అంటే, 1999 సంవత్సరపు చట్టంలో రెండు ప్రధాన లోపాలున్నాయి. మొదటిది, కార్పొరేట్ సంస్థలకు అపరిమితమైన అధికారాలను కట్టబెట్టే నూతన క్లాజులను కేవలం జోడించటం. దీనివలన

ఆరోగ్యం, వ్యవసాయ రంగాలలో బహుళజాతి సంస్థలకు తిరుగు ఉండదు. ఈ రకంగా ఈ చట్టం 1970వ సంవత్సరపు చట్టంలో పొందుపరిచిన ప్రజాహితం, జాతీయ ప్రయోజనాలకు తూట్లు పొడించింది. రెండవది- వ్యాపార సంబంధిత మేధోహక్కుల వ్యవస్థను ఎంపిక చేసిన రీతిలో అమలు జరిపే సవరణలు. కేవలం పెరిగిపోయిన మేధో హక్కుల వ్యవస్థలోని ప్రజాహితాన్ని పరిరక్షించే విధంగా రాజ్యాన్ని శక్తివంతం చేసే క్లాజులను అమలు పరిచేందుకు వీలుగా తగిన సవరణలు చేయకుండానే ఈ మార్పులు జరిగాయి. తద్వారా పేటెంట్ల (సవరించిన) చట్టం మన రాజ్యాన్ని కేవలం బహుళజాతి సంస్థల పనిముట్టుగా మార్చివేసింది. రాజ్యం ఇక ఎంతమాత్రమూ భారత ప్రజల, వారి ప్రయోజనాల పరిరక్షకురాలిగా లేదు.

కాగా, ఔషధాలు తయారుచేసే, జీవసాంకేతికరంగ పరిశ్రమలు కూడా ప్రైవేటు ప్రయోజనాలకు దఖలు చేసిన ఈ నూతన అధికారాలను ట్రిప్స్ ఒప్పందంలో గుర్తించవలసి వచ్చింది. కాబట్టి ప్రజా ప్రయోజనాలను కాపాడేందుకు సమాజపు నైతిక పరిస్థితిని పరిరక్షించేందుకు, అలాగే వృక్షజాతులు, జంతువులు, మానవులు, పరిసరాలను పరిరక్షించేందుకుగాను పేటెంట్లపై పరిమితులను విధించవల్సిన, సరిహద్దులను ఉంచవల్సిన ప్రభుత్వ బాధ్యత విస్మరించలేనిది. ట్రిప్స్ ఒప్పందంలోని 7,8 అధికరణలు ప్రజా ప్రయోజనాలను కాపాడేందుకు జాతీయ చట్ట సభలలో తగిన పనిముట్లను ఏర్పరిచే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. అయితే, ఈ అధికరణల ద్వారా ప్రజా ప్రయోజనాలను కాపాడే అవకాశాలేవీ పేటెంట్ల (సవరించిన) చట్టంలో క్లాజుల రూపంలో వెల్లడి కాలేదు. కార్పొరేట్ సంస్థలకు, ప్రైవేటు ప్రయోజనాలకు కూడా పేటెంట్ల (సవరించిన) చట్టం ద్వారా అందుబాటులోకి వచ్చిన నూతన అధికారాలు ప్రజా ప్రయోజనాలను, జాతీయ ప్రయోజనాలను అంతర్జాతీయ వాణిజ్య ప్రయోజనాలకు లొంగుబాటు చేసేవిగా వున్నాయి. నూతన సాంకేతిక పరిజ్ఞానాల ఆవిర్భావం దృష్ట్యాను, మేధోసంపత్తి హక్కుల వ్యవస్థ దృష్ట్యాను, స్పష్టమైన నిర్వచనాలు లేని దృష్ట్యాను ఈ పరిస్థితి ఏర్పడుతుంది. నైతిక, పర్యావరణ, ఆర్థిక ప్రాతిపదికలపై ఈ మినహాయింపులను నిర్వచించకపోవటం దురదృష్టకరం.

1970వ సంవత్సరపు చట్టంలో సాంకేతిక చట్టం మార్పిడికి పలు యంత్రాంగాలున్నాయి. వీటిలో తప్పనిసరి లైసెన్సింగు, అలాగే 'పేటెంటును భారతదేశంలో అమలు పరచటం' తాలూకు అవసరం మొదలైనవి ముఖ్యమైనవి. ఎందుచేతనంటే, పలుమార్లు బహుళజాతి సంస్థలు మూడవ ప్రపంచదేశాలలో పేటెంట్లు తీసుకొని, వాటిని అక్కడ వినియోగించటం లేదు. దీనికి కారణం ఈ ఆవిష్కరణలను ఇతరులు వినియోగించుకోకుండా జాగ్రత్తపడే ఉద్దేశ్యమే. డబ్ల్యుఐపిఓ/ యు ఎన్ సి.టి.ఎ.డి.ల అధ్యయనం ప్రకారంగా మూడవ ప్రపంచ దేశాలకు చెందిన ఉత్పత్తుల విదేశీ పేటెంట్లలో 5 శాతం కంటే తక్కువ భాగాన్నే ఆ దేశాలలో ఉత్పత్తి ప్రక్రియలను కాపాడేందుకు వాస్తవానికి వినియోగిస్తున్నారు. పేటెంట్ల (సవరించిన) చట్టం, వాస్తవానికి, ఇటువంటి దిగుమతుల గుత్తాధిపత్యానికి సహకరిస్తోంది. దీనికి కారణం ఈ చట్టం 1970వ సంవత్సరపు చట్టంలోని 83వ విభాగపు లక్ష్యాన్ని తొలగించటమే ఈ 83వ విభాగం ప్రకారంగా ఆవిష్కరణలు భారతదేశంలోనే వాణిజ్యపరంగా వినియోగించవల్సిన అవసరం వుంది. దీనితోపాటుగా, 1970వ సంవత్సరపు చట్టంలోని 84-90 విభాగాల ప్రకారం ప్రజా ప్రయోజనాలు, హేతుబద్ధమైన ధరల అంశాల దృష్ట్యా

తప్పనిసరి లైసెన్సింగును, లైసెన్సింగును వెనక్కు తీసుకొనే హక్కును ప్రభుత్వానికిస్తోంది. 1970వ సంవత్సరపు ఈ చట్టంలోని విభాగాల ప్రకారంగా సాంకేతిక పరిజ్ఞానం మార్పిడి హామీ చేయబడింది. అలాగే అది దిగుమతుల గుత్తాధిపత్యాన్ని అరికట్టింది. కాగా, ప్రతిపాదిత బిల్లులోని సవరణ 24(సి) ప్రకారంగా ఈ 'అవిష్కరణ పనితీరు అంటే వస్తువు లేదా పదార్థాన్ని అమ్మడం లేదా పంపిణీ చేయటంగా పరిగణించవచ్చు.'

ఈ రకంగా పేటెంట్ల (సవరించిన)చట్టం ప్రజారోగ్యాన్ని ఆందోళనకరంగా నష్టపరచగలదు. దీనికై ఆ చట్టంలో పరస్పర ఆధారిత సంక్లిష్ట యంత్రాంగాలున్నాయి పరిమితులులేని పేటెంట్ల వలన స్థానిక వైద్య వ్యవస్థలలో వాడే వైద్య మొక్కలు, ఔషధాలపై బహుళజాతి ఔషధ కంపెనీలకు పేటెంట్లు తీసుకొనే అవకాశం లభిస్తుంది. భారతదేశంలో 70% మేరకు ఆరోగ్య పరిరక్షణ స్థానిక వైద్య వ్యవస్థల ద్వారానే జరుగుతోంది. దీని తాలూకు వ్యయం తక్కువ కావటమే దీనికి కారణం. సాంప్రదాయక విజ్ఞానం ఔషధ మొక్కలపై బహుళజాతి సంస్థలకు పేటెంట్లు దఖలైతే ఈ వైద్య వ్యవస్థ అత్యధిక శాతం భారతీయులకు అందుబాటులో లేకుండా పోతుంది. ఉత్పత్తులపై పేటెంట్లను ప్రవేశపెట్టడం వలన ఔషధ రంగంలో భారతీయ కంపెనీలు తక్కువ ఖర్చుతో ఇతరేతర ఉత్పాదక ప్రక్రియల ద్వారా ఔషధాలను ఉత్పత్తి చేసే అవకాశం లేకుండా పోతుంది. దీనివలన ఔషధాల ధరలు, ముఖ్యంగా ప్రాణరక్షణకు అవసరమైన ఔషధాల ధరలు విపరీతంగా పెరిగిపోయి, అవి ప్రజలకు అందుబాటులో లేకుండా పోతాయి

వ్యవస్థాగత సర్దుబాట్ల కార్యక్రమంలో భాగంగా రోగనిర్ధారణపై పేటెంట్లు, ఆరోగ్య పరిరక్షణా వ్యవస్థతో కలగలిసినప్పుడు వ్యాధినిర్ధారణ పరీక్షలు, విశ్లేషణ ప్రజలకు అందుబాటులో లేకుండా పోతాయి.

ఆరోగ్య సంబంధిత శ్రద్ధ లేకుండా జీవరీతులపై అపరిమిత పేటెంట్లు ఇవ్వటం నూతన రకాల ఆరోగ్య సంబంధిత ప్రమాదాలకు దారి తీస్తుంది. జన్యుపరంగా మార్పిడి చేయబడిన జీవరాశులు అటు వ్యవసాయ రంగంలోనూ, ఇటు వైద్య రంగంలోనూ పరిసరాలలోకి విడుదల చేయబడటం వలన ఈ ప్రమాదం ఏర్పడుతుంది.

1970వ సంవత్సరపు పేటెంటు చట్టం అన్ని రకాల వ్యవసాయ పద్ధతులను, ఉద్యానవనాల పెంపకాన్ని పేటెంట్ల పరిధినుండి మినహాయించింది వీటితోపాటుగా 5(ఎ) విభాగం ద్వారా వ్యవసాయ సంబంధిత రసాయనాలను ఉత్పత్తుల పేటెంట్ల పరిధి నుండి మినహాయించింది. కాగా 1994వ సంవత్సరపు పేటెంట్ల (సవరించిన)చట్టం వ్యవసాయ రంగంలో ఈ పరిమితులను తొలగించింది. దీనివలన ఆహార ఉత్పత్తి వ్యయం పెరిగి, ప్రజలకు ఆహార అందుబాటు స్థాయి తగ్గుతుంది.

అంతేకాకుండా, మినహాయింపులకు నూతన విభజన రేఖలను పేర్కొనకపోవటం వలన ఈ చట్టం మొక్కలు, మొక్కల ఉత్పత్తులు, మొక్కల లక్షణాలు, వాటి జన్యువులు, జీవక్రిమిసంహారకాలు, జీవ సంబంధిత ఎరువులు మొదలైనవాటిపై పేటెంట్లను అనుమతిస్తోంది. కాబట్టి 1999వ సంవత్సరపు చట్టం భారతదేశ వ్యవసాయానికి అశనిపాతం కాగలదు. అది భారతదేశ రైతులకు ముప్పుగాను, దేశ ప్రజల ఆహారభద్రతకు హానికరంగాను పరిణమించగలదు.

అందుచేత ఈ చట్టంలో ఆ క్రింది అంశాలను సంపూర్ణంగా మినహాయించే ప్రధాన సవరణలు తప్పనిసరి

1) జీవరీతులపై పేటెంట్లు

2) ప్రకృతిసహజంగా లభించే పదార్థాలపై పేటెంట్లు

3) జన్యువులు, జీవజాతుల భాగాలు, అంశాలపై పేటెంట్లు

ఉత్పత్తుల పేటెంట్ల నూతన విభాగాలపై మినహాయింపులను స్పష్టంగా ప్రకటించే ప్రాతిపదికన ఈ సవరణలు నైతికంగానూ, ఆర్థికంగా కూడా తప్పనిసరి. అలాగే ప్రస్తుత ప్రపంచ పరిస్థితిలో ఇది ఆచరణాత్మకంగా సాధ్యం కూడా. అలాగే, 1970వ సంవత్సరపు పేటెంటు చట్టంలోని మినహాయింపులను ప్రస్తుత చట్టంలో తొలగించారు. కనుక, నిర్నిబద్ధ మార్కెటింగు హక్కులకు ప్రజావ్యతిరేకతకు ప్రత్యేక నిబంధన అవసరం. ఇది ఆచరణాత్మకంగా చూస్తే ఉత్పత్తులపై పేటెంటుగా పనిచేయగలదు. తద్వారా నైతిక వ్యవస్థ, పర్యావరణం పరిరక్షించబడతాయి.

## భారతదేశం ప్యారిస్ సదస్సులో చేరింది: దొడ్డిదోవగుండా ట్రిప్స్

ప్యారిస్ సదస్సులో చేరవల్సిందిగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలు మనదేశంపై తెచ్చిన ఒత్తిడిని తిరస్కరించటం ద్వారా దశాబ్దకాలం క్రితం భారతదేశంలో పేటెంట్ల రాజకీయాలు ఆరంభమైయ్యాయి. ప్యారిస్ సదస్సులో చేరటం వలన మనకు ఒనగూడే ప్రయోజనాలకంటే నష్టాలే ఎక్కువని అందరికీ తెలుసు అప్పట్లో, ప్యారిస్ సదస్సులో చేరరాదన్న జాతీయ ప్రచారం, భారతదేశపు పేటెంట్ల చట్టాన్ని మార్చరాదన్న జాతీయ ప్రచారానికి రూపునిచ్చింది. దీని పరాకాష్టే ట్రిప్స్ వ్యతిరేక ప్రచారం.

అయితే, ట్రిప్స్ తాలూకు 70.8, 70.9 అధికరణలను భారతదేశం అమలు పరిచి తీరాలన్న డబ్ల్యు.టి.ఓ. ఒత్తిడి భారతదేశం పేటెంటు చట్టం సవరణకు ఒత్తిడిని తెచ్చింది. అయితే, తీవ్రమైన ప్రతిఘటన లేకుండా మన సామాజిక ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా రూపొందించబడ్డ వ్యవస్థను మార్చడం సాధ్యం కాలేదు.

భారతదేశం ప్యారిస్ సదస్సులో చేరుతుందన్న ప్రకటన వాస్తవానికి ట్రిప్స్ దొడ్డి దోవగుండా ప్రవేశించటమే. ప్యారిస్ సదస్సుకు సంబంధించిన ప్రస్తావనలన్నీ దానిలో చేరటం వలన భారతదేశానికి లభించే లాభాలను అతిశయించి చెప్పాయి. అవి ఔత్సిక పారిశ్రామిక వేత్తలందరిని ఆవిష్కర్తలుగా పేర్కొన్నాయి. సదస్సులో భాగంగా పేటెంట్ల సహకార ఒప్పందం (పి.సి.టి.)లో చేరటం మన పారిశ్రామిక వేత్తలకు చాలా ఒరగబెడుతుందని కనపడేలా చెబుతూ వచ్చారు అయితే, భారతదేశం ప్యారిస్ సదస్సులో చేరటాన్ని సమర్థించేవారి ప్రాపంచిక దృక్పథంలో భారతదేశ ప్రజలు నిమిత్తమాత్రులు మాత్రమే. వారి ఉద్దేశ్యంలో, తమ విజ్ఞానంపై ప్రజలకున్న మేథో హక్కులు, విత్తనాలు, ఆహారం, ఔషధాలు మొదలైనవన్నీ అందుబాటు ధరలకు పొందగల ప్రజల ఆర్థిక హక్కులు పూర్తిగా నిర్మూలించదగినవి.

ట్రిప్స్ ఒప్పందం అమలుతాలూకు భారతదేశం అనుభవం ప్రకారంగా ఈ ఒప్పందంలో మేధోసంపత్తి హక్కుల వ్యవస్థలు ప్రజాతంత్ర ప్రక్రియను తప్పనిసరిగా కప్పదాటు వేయవలసి వుంది. దేశానికి అనుకూలమైన, స్వతంత్రంగా అభివృద్ధి చేసుకున్న పేటెంట్ల వ్యవస్థలను ప్రజాతంత్రయుతంగా ఎంపిక చేసుకోవటాన్ని సమర్ధించేవారు, బహుళజాతి సంస్థలు అభివృద్ధి చేసిన విశ్వజనీన పేటెంట్ల వ్యవస్థను నియంతృత్వ పోకడలతో రుద్దటాన్ని ఎంచుకొనేవారిమధ్య చర్చ ఉధృతమౌతోంది ఈ బహుళజాతి సంస్థలు మనపై రుద్దుతున్న పేటెంట్ల వ్యవస్థను ఉరుగ్వే రౌండ్ గాట్ ఒప్పందం ద్వారా అభివృద్ధి చెందిన పారిశ్రామిక దేశాల ప్రభుత్వాలు ముందుకు తోస్తున్నాయి.

ఈ చర్చ కేవలం భారతదేశానికే పరిమితమైనదికాదు ఇది ప్రపంచ వాణిజ్య సంస్థలో కూడా జరుగుతోంది. ఈ సంస్థలోని వ్యాపార, పర్యావరణ సంఘం ట్రిప్స్ తాలూకు పర్యావరణ ప్రభావాలను పరిశీలిస్తోంది. 1999వ సంవత్సరంలో జీవజాతులు, జీవజాలానికి సంబంధించిన అధికరణలు సమీక్షకు వచ్చినప్పుడు జీవంపై పేటెంట్ల తాలూకు నైతిక, పర్యావరణ, ప్రజాతంత్ర ప్రభావాలపై చర్చ ప్రగాఢమై, విస్తృతమై తీరుతుంది.

# 8.ముందున్న మార్గం

ప్రస్తుతం, 190 రకాల జన్యుపరంగా మార్పిడి చేయబడిన జంతువులను పరిశోధకులు, కార్పొరేట్ సంస్థలు పేటెంట్లకై ముందుకు తెస్తున్నాయి. వీటిలో చేపలు, ఆవులు, ఎలుకలు, పందులు వున్నాయి. ట్రిప్స్‌ను ప్రపంచవ్యాపితంగా అమలు చేయటంవలన అన్ని జీవరీతులను, వాటి భాగాలను పేటెంటు చేసుకునేందుకు అంతులేని పోటీ ఏర్పడుతుంది. ప్రస్తుత రూపంలోని ట్రిప్స్ ముసాయిదా ఆవిష్కరణలను గుర్తించే, విజ్ఞానపు అందుబాటును నిర్దేశించే వ్యవస్థలను పరిమితం చేస్తుంది.

వీటిలో మొదటి పరిమితి సాధారణ హక్కుల నుండి ప్రైవేటు హక్కులకు బదలాయింపు. ట్రిప్స్ ఒప్పందపు ముందుమాట ప్రకారం మేధోసంపత్తి హక్కులను కేవలం ప్రైవేటు హక్కులుగానే గుర్తిస్తారు అంటే, 'సామూహిక మేధోసంపత్తి' రంగంలో పోటీపడే అన్ని రకాల విజ్ఞానాన్ని, భావాలను, ఆవిష్కరణలను మేధోసంపత్తిగా గుర్తించరు. దీనర్థం గ్రామీణ ప్రాంతాలలో రైతులు, అటవీ ప్రాంతాలలో గిరిజనులు, విశ్వవిద్యాలయాల్లో శాస్త్రవేత్తలు సైతం సృష్టించే విజ్ఞానికి మేధోసంపత్తిగా గుర్తింపు వుండదు. కాబట్టి ట్రిప్స్ అనేది సామూహిక మేధోసంపత్తిని ప్రైవేటీకరించే యంత్రాంగం. అది పౌర సమాజాన్ని మేధోహీనం చేస్తుంది. మేధస్సు అనేది కార్పొరేట్ సంస్థల గుత్తసొత్తు అవుతుంది

ఇక మేధోసంపత్తి హక్కులకు సంబంధించిన రెండవ పరిమితిని చూద్దాం. దీని ప్రకారంగా, లాభాలను సృష్టించగలిగిందే విజ్ఞానంగానూ, ఆవిష్కరణగానూ గుర్తింపు పొందుతుంది. సామాజిక అవసరాలను తీర్చటంతో ఈ గుర్తింపుకు నిమిత్తం లేదు. ట్రిప్స్ ఒప్పందపు 27.1 అధికరణ ప్రకారంగా మేధోసంపత్తి హక్కుగా గుర్తింపు పొందేందుకు ఆవిష్కరణ అనేది పారిశ్రామిక వినియోగానికి అనువుగా వుండాలి. దీనివలన పారిశ్రామిక తరహా ఉత్పత్తి నిర్మాణం వెలుపల జరిగే అన్ని రంగాలలోని ఉత్పత్తి, ఆవిష్కరణలు మేధోసంపత్తిగా గుర్తింపును పొందవు. సృజనాత్మకతకు కొలబద్దలుగా లాభాలు, పెట్టుబడులను కూడబెట్టగలగటం మాత్రమే వుంటాయి. సామాజిక ప్రయోజనం అనేదానికి ఇక ఎంతమాత్రమూ గుర్తింపు లేదు. కార్పొరేట్ సంస్థల అదుపుకింద సమాజంలోని చిన్నతరహా అసంఘటిత రంగాలలోని ఉత్పత్తి పారిశ్రామిక ప్రతిపత్తిని కోల్పోతుంది.

అయితే ట్రిప్స్ అనేది కేవలం వ్యాపారానికి సంబంధించినదేకాదు. అది మనం ఇతర జాతులతో ఎలా సంబంధాన్ని ఏర్పరచుకుంటామనే నైతికతకు కూడా సంబంధించినది అలాగే అది మన నాగరికత తాలూకు నైతిక, సాంస్కృతిక విలువలుగా మనం పరిగణించే అంశాలకు సంబంధించినది కూడా. అలాగే అది మన జీవవైవిధ్యం ఎలా వినియోగించుకోబడుతుంది; అదుపు చేయబడుతుంది అనే దానికి సంబంధించినది కూడా. జీవవైవిధ్యాన్ని కాపాడుకుంటూ వస్తున్న మన

స్థానిక సమాజాలు లేదా దానిని దోచుకునేందుకు, స్వంతం చేసుకొనేందుకు నూతన విధానాలను కనుగొన్న కార్పొరేట్ సంస్థలు దానిని ఎలా వినియోగించుకుంటాయి, అదుపుచేస్తాయి అన్నది కూడా ప్రధాన సమస్యే అంతేకాకుండా, ఈ మొత్తం సమస్య న్యాయబద్ధత మానవహక్కులకు సంబంధించినది. ఎందుచేతనంటే, ప్రజలు తమ కనీస అవసరాలను తీర్చుకునే, జీవన భృతి తాలూకు హక్కును అది దోచుకొంటుంది. మన సమాజపు ఆర్థిక, పర్యావరణ, నైతిక ప్రాతిపదికతో ప్రత్యక్షంగా సంబంధం వున్న ఈ సమస్య బహుళజాతి సంస్థల, వాణిజ్య అధికార గణపు గుప్పెటలోకి నెట్టివేయబడటం విషాదకరం భారతీయ సంస్కృతి ప్రకారంగా జీవాన్ని స్వంతం చేసుకోవటం సాధ్యం కాదు. ఎందుచేతనంటే, దానిని ఉత్పత్తి చేయటం సాధ్యం కాదు. కాబట్టి జీవంపై పేటెంటును ఎవ్వరూ తీసుకోజాలరు. అయితే, ట్రిప్స్ మన ఈ నైతిక విలువలకు, ఆర్థిక ప్రాధాన్యతలకు, సార్వభౌమాధికారానికి తిలోదకం పలుకుతోంది.

అన్ని ఉత్పత్తులపైనా ఉత్పత్తి మరియు ప్రక్రియ పేటెంటు ఇచ్చేలా ట్రిప్స్ అన్ని దేశాలపై ఒత్తిడి తెస్తోంది. తద్వారా ట్రిప్స్ ఒప్పందం వివిధ దేశాల పేటెంటు చట్టాల బలాన్ని నీరుకార్చి వేస్తోంది. దీనికి మనదేశం కూడా ఒక ఉదాహరణ. ఆహారం, ఔషధాలను పేటెంట్ల పరిధి నుండి మినహాయించటం ద్వారా మనదేశం ప్రజలకు ఆహారం, ఔషధాలు అందుబాటులో ఉండేలా చూసింది. అన్ని రకాల ఆవిష్కరణలకు పేటెంట్లు లభించేలా సభ్యదేశాలపై ట్రిప్స్ ఒప్పందం ఒత్తిడి తెస్తోంది. పేటెంటు తీసుకునేందుకు షరతులు- సమానత్వం ప్రస్ఫుటత లేకపోవడం, వినియోగం, అంటే, ఇతరులు ఎవ్వరూ దానిని అంతకుముందు కనుగొని ఉండకపోవటం, ప్రస్ఫుటత లేనిరీతిలో అది క్రొత్తది అయివుండటం మరియు అది పారిశ్రామిక వినియోగానికి యోగ్యంగా వుండటం మొదలైనవి.

అంతేకాకుండా భారతదేశపు 1970వ సంవత్సరపు పేటెంటు చట్టంలోని ముఖ్య అంశమైన స్థానిక ఉత్పత్తి దిగుమతుల మధ్య తేడాను ట్రిప్స్ తొలగించింది. పేటెంటు చేసిన వస్తువును దిగుమతి చేసుకోవటంలో పేటెంటుదారులకు కేవలం గుత్తాధిపత్యాన్ని ఇచ్చేవిధంగా పేటెంట్లు జారీ కాకుండా హామీ చేయటమే 1970వ సంవత్సరపు చట్టపు స్పష్టమైన లక్ష్యం. ట్రిప్స్ ఒప్పందపు 27. 1 అధికరణ దీనికి తూట్లు పొడిచింది 'ఆవిష్కరణ జరిగిన ప్రదేశంతో నిమిత్తం లేకుండా, అలాగే సాంకేతిక పరిజ్ఞానంతో నిమిత్తం లేకుండా ఆ ఉత్పత్తులు దిగుమతి చేసుకోబడినవా లేదా స్థానికంగా ఉత్పత్తి చేయబడినవా అనేదానితోకూడా నిమిత్తం లేకుండా' ఈ అధికరణ ప్రకారంగా పేటెంటు హక్కులు లభిస్తాయి. దిగుమతుల గుత్తాధిపత్యాన్ని 'వివక్ష'గా పరిగణించటం ద్వారా ట్రిప్స్ ఒప్పందం పేటెంటు చట్టాలను వలసవాద తీరులోకి తిరిగి తెచ్చింది. దీని ప్రకారంగా, వలసలు దిగుమతి చేసుకున్న సరుకులపై ఆధారపడతాయి. స్థానిక ఉత్పత్తి, పరిశ్రమలు పెకలించి వేయబడతాయి

## ట్రిప్స్ సంస్కరణ మరియు సమీక్ష

తాత్కాలిక కాల పరిమితి ఒప్పందం మేరకు, 2000 సంవత్సరం జనవరి 1వ తేదీనాటికి అభివృద్ధి చెందుతోన్న దేశాలు ట్రిప్స్‌ను అమలుజరపవలసి వుంది. అత్యంత తక్కువ అభివృద్ధి చెందిన దేశాలు ఈ ఒప్పందాన్ని 2005 జనవరి 1వ తేదీ నాటికి అమలు చేయవచ్చు ఉత్పత్తుల పేటెంట్ల

రక్షణలేని సాంకేతిక పరిజ్ఞాన రంగంలో ఉత్పత్తుల పేటెంట్లను ప్రవేశపెట్టేందుకుగాను అభివృద్ధి చెందుతున్న దేశాలకు 2005వ సంవత్సరం జనవరి 1వ తేదీ వరకూ వ్యవధి వుంది దీనికి ఉదాహరణ, మనదేశంలో 1970వ సంవత్సరపు పేటెంట్ చట్టం క్రిందకు వచ్చే మందులు, ఔషధాలవంటివి. అయితే, పరివర్తన కాలవ్యవధి ముగిసేలోగా, ప్రపంచ వాణిజ్య సంస్థ సభ్యదేశాలు సమీక్షను చేపట్టవలసి వుంది. ఈ సమీక్ష జరిగే కాలంలో ఒప్పందం అమలును నిలిపివేయవచ్చు

ప్రజా ప్రయోజనాలను కాపాడే చర్యలు గనుక లేకుంటే, పేటెంట్ల వ్యవస్థ ప్రజాహితానికి చెరుపు చేయగలదు దీనివలన ప్రైవేటు లాభాలకు మాత్రమే అవకాశం లభిస్తుంది. పేటెంట్ల పరిధినుంచి ఒక అంశాన్ని తొలగించడం ద్వారా ప్రజా ప్రయోజనాలను కాపాడవచ్చు. దీనికై అతి ప్రధానమైన విషయం ట్రిప్స్‌ను సమీక్షించడం, దానిలో మార్పులు చేయటం. అలాగే విడివిడి దేశాల చట్టాలలో మార్పులు చేసుకోవడం కూడా దీనికి సహాయపడగలదు. అందుచేత ఒక సమీక్షా ప్రక్రియను తక్షణం ఆరంభించాలి. దీనికై ప్రజాతంత్రయుతంగా, పారదర్శకంగా నూతన పరిణామాలను గురించి నిరంతరం తెలుసుకోవాలి. ట్రిప్స్ ఒప్పందంపై సంతకాలు జరిగాక నాలుగు ప్రధాన పరిణామాలు ఆవిర్భవించాయి:

1. జీవచౌర్యం ప్రబలడం అంటే, స్వదేశీ విజ్ఞానాన్ని పేటెంటు చేసివేసుకోవడం.

2. టెర్మినేటర్ సాంకేతిక పరిజ్ఞానం, ప్రమాదకర జన్యు ఇంజనీరింగ్‌ల వంటి నూతన పరిజ్ఞానాలు ఆవిర్భవించడం.

3. ప్రధాన జీవశాస్త్ర కార్పొరేట్‌రంగ సంస్థల రూపంలో గుత్త సంస్థల ఆవిర్భావం.

4. జీవంపై పేటెంట్లకు వ్యతిరేకంగా విస్తృత ప్రాతిపదికన పౌర ఉద్యమాల ఆవిర్భావం.

ఈ నూతన పరిణామాల వలన ట్రిప్స్ ఒప్పందపు లక్ష్యాలే ప్రశ్నార్థకంగా మారాయి. అందుచేత, సాధ్యమైనంత త్వరగా ట్రిప్స్ ఒప్పందం గురించిన సమీక్ష జరగాలి. అప్పటివరకూ ట్రిప్స్ ఒప్పందం అమలుకై వచ్చే వత్తిళ్ళకు అభివృద్ధి చెందుతున్న దేశాలు తల ఒగ్గరాదు.

మేధోసంపత్తి హక్కుల రక్షణ, అమలు సాంకేతిక ఆవిష్కరణలకు ప్రోత్సాహాన్ని ఇవ్వాలి. అలాగే, సాంకేతిక పరిజ్ఞానం వ్యాప్తి, బదలాయింపులకు ఉపయోగపడాలి. తద్వారా, ఉత్పత్తిదారులకు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికీ కూడా లాభం చేకూరాలి. ఇదంతా సామాజిక, ఆర్థిక సంక్షేమానికి అనుకూలంగా వుండాలి. బాధ్యతలు, హక్కులు మధ్య సమతుల్యత రావాలి. జీవ చౌర్యంపై ఆధారపడిన పేటెంట్లు, టెర్మినేటర్ సాంకేతిక పరిజ్ఞానం వంటివాటిపై పేటెంట్లు, జీవశాస్త్ర రంగ పరిశ్రమలో గుత్తాధిపత్యాల వలన ట్రిప్స్ తాలూకు అన్ని అంశాలకు, లక్ష్యాలకు విఘాతం ఏర్పడుతుంది. జీవచౌర్యం వలన సాంకేతిక పరిజ్ఞానం బదలాయింపు, వ్యాప్తులకు ఆటంకం ఏర్పడుతుంది. టెర్మినేటర్ సాంకేతిక పరిజ్ఞానం వంటివాటిపై పేటెంట్ల వలన రైతులకు నష్టం జరుగుతుంది. ఆహార భద్రతకు ముప్పు వాటిల్లుతుంది. జీవప్రక్రియలు, ఉత్పత్తులపై పేటెంట్లు పేదల సామాజిక, ఆర్థిక సంక్షేమానికి విఘాతంగా మారగలవు. జీవాధార వనరులు పేదలకు అందుబాటులో లేకుండా పోవడం దీనికి కారణం. జీవరీతులపై పేటెంట్ల వలన హక్కులు, విధులకు మధ్య సమతుల్యత దెబ్బతింటుంది జీవంపై

పేటెంట్లు, గుత్తాధిపత్యాన్ని నిరోధించేందుకై ప్రపంచవ్యాప్తంగా పౌరులు సంఘటితపడుతున్నారు. జీవరీతులపై పేటెంట్లకు సంబంధించి ఆస్ట్రియా, స్విట్జర్లాండు దేశాలలో పౌరులు ప్రజాభిప్రాయ సేకరణ జరిపారు. జీవరీతులను, జీవ వైవిధ్యాన్ని ట్రిప్స్ ఒప్పంద పరిధినుంచి పూర్తిగా మినహాయించాలని పౌరులు కోరుతున్నారు పేటెంట్లకు సంబంధించిన నిర్ణయాలపై ఈ నూతన ప్రజాతంత్ర పరిణామాలు ట్రిప్స్ ఒప్పందం సమీక్షకు, పరిశీలనకు మార్గదర్శకంగా వుండాలి.

ట్రిప్స్ ఒప్పందం అమలును స్తంభింప చేయాలనే వాదనలు ముందుకు వస్తున్నాయి. అలాగే, ఒప్పందం అమలు కాలపరిమితిని 2005, జనవరి 1వ తేదీని వెనక్కి నెట్టాలనే వాదనలు వస్తున్నాయి. మొదటగా ట్రిప్స్ ఒప్పందం అమలును సమీక్షా ప్రక్రియ తరువాత జరపడం సరైనది, హేతుబద్ధమైనది కూడా. రెండవది, ప్రస్తుత తాత్కాలిక ఒప్పందాల వలన, అభివృద్ధి చెందుతోన్న దేశాలు తమ మేధో సంపత్తి హక్కుల చట్టాలను దశాబ్ద కాలంలో మూడుసార్లు మార్చుకోవాల్సి వుంటుంది. దీనివలన న్యాయవ్యవస్థలో గందరగోళం ఏర్పడుతుంది. ఇప్పటికే అరకొరగా వున్న వనరులపై అదనపు పరిపాలనా సంబంధిత, చట్ట సంబంధిత భారాలు పడతాయి. ట్రిప్స్ ఒప్పందంపై సమీక్ష ఆరంభం అయిన తరువాత, దానిపై ప్రజాతంత్ర చర్చలు జరుగుతున్నప్పుడు ట్రిప్స్ అమలును నిలిపివేయాలి. అలాగే, కార్పొరేట్ సంస్థల హక్కులు, బాధ్యతల మధ్య సమతుల్యతను సాధించేందుకు ట్రిప్స్ ఒప్పందపు సవరణ జరుగుతున్నప్పుడు కూడా ఇది తప్పనిసరి. తద్వారా పౌరులు, ప్రభుత్వం మధ్య, ప్రజాహితం, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల మధ్య ఘర్షణ రాకుండా నివారించేందుకు ఇది అవసరం. ట్రిప్స్ ఒప్పందాన్ని సమీక్షించవలసిన అగత్యానికి మూడవకారణం, సాంప్రదాయక జీవవైవిధ్యానికి (సి.బి.డి.), ట్రిప్స్‌కు మధ్య పెద్ద ఘర్షణ జరుగుతుండడం. ఈ అంశం, భారతదేశపు చొరవ వలన ఇప్పటికే ప్రపంచ వాణిజ్య సంస్థ ముందుకు వచ్చింది. 'ముందు సమీక్ష, తరువాతే అమలు' అనేది ట్రిప్స్‌పై సమీక్షకు పౌర అజెండా. నిర్దిష్ట రూపంలో ఈ అజెండా సారం ఇది:

1. 27.3 (బి) అధికరణపై ప్రపంచ వాణిజ్య సంస్థ తక్షణం సమీక్షను ఆరంభించాలి.

2. నూతన పరిణామాల వెలుగులో, సాధ్యమైనంత శీఘ్రగతిన ట్రిప్స్ ఒప్పందపు సమీక్షను ట్రిప్స్ కౌన్సిల్ చేపట్టాలి.

3. జీవరీతులపై పేటెంట్లు, కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వాలు, పౌరుల విధులు, బాధ్యతల మధ్య సమతుల్యతకు సంబంధించి పార్లమెంట్లలోనూ, సమాజంలోనూ ప్రజాతంత్రయుత చర్చలను ఆరంభించాలి. అలాగే, వ్యాపార ప్రయోజనాలు, ప్రకృతి పరిరక్షణ ప్రయోజనాల మధ్య ఘర్షణను పరిష్కరించాలి. ఈ ప్రజాతంత్ర చర్చలు సమీక్షా ప్రక్రియను మెరుగుపరచాలి.

4. చర్చలు, సమీక్షా జరుగుతున్నప్పుడు ట్రిప్స్ ఒప్పందం అమలును 5 సంవత్సరాలపాటు స్తంభింపచేయాలి.

5. సాంప్రదాయక జీవవైవిధ్య (సి.బి.డి.) బాధ్యతలకు విరుద్ధంగా వున్న ట్రిప్స్ ఒప్పందంలోని అన్ని అంశాలను సవరించాలి. తద్వారా సి.బి.డి. లక్ష్యాలను కాపాడాలి

6 జీవ సాంకేతిక రంగంలో హక్కులు బాధ్యతల నడుమ సమతుల్యతకై, బలమైన జీవరక్షణ సాంప్రదాయాన్ని అమలు పరచాలి. ట్రిప్స్ ఒప్పందాన్ని అన్ని దేశాలు అమలు జరిపితీరవలసిన దానికంటే ఉరుగ్వే రౌండులో వివిధ దేశాలపై ట్రిప్స్ ఒప్పందాన్ని బలవంతంగా రుద్దినపుడు, ప్రజల ప్రయోజనాలకు సంబంధించిన పలు సమస్యలను పూర్తిగా దాటవేసారు. జీవరీతులను పేటెంట్ చేయడం తాలూకు నైతిక, పర్యావరణ, ఆర్థిక ప్రభావాలను సంపూర్ణంగా చర్చించలేదు. పాశ్చాత్య తరహా మేధోసంపత్తి హక్కుల వ్యవస్థలు "దృఢమైనవి", "బాగా అభివృద్ధి చెందినవి' అనే విధంగా అంగీకరించేలా, మూడవ ప్రపంచదేశాలపై వత్తిడి తెచ్చారు. అయితే, ఈ వ్యవస్థలు ప్రపంచవ్యాప్తంగా కార్పొరేట్ సంస్థల గుత్తాధిపత్యాన్ని ఏర్పరచేందుకు మాత్రమే దృఢమైనవని ప్రజా ప్రయోజనాల బృందాలు నిరూపించాయి. అంతేకాకుండా, స్థానిక విజ్ఞానాన్ని పరిరక్షించడంలోను, జీవ చౌర్యాన్ని నిరోధించడంలోనూ ఈ వ్యవస్థలు బలహీనమైనవని ఆ బృందాలు నిర్ధారించాయి. పేదల నుంచి వనరులను తస్కరించటంలో మాత్రమే ట్రిప్స్ ఒప్పందం 'అభివృద్ధి చెందినది." అయితే న్యాయం, సమానత్వం, భిన్న సంస్కృతుల కోణంనుంచి చూస్తే ఈ ఒప్పందం వెనుకబడినది.

1995 సంవత్సరంలో ఈ ఒప్పందం అమలులోకి వచ్చిన తరువాత, నిరవధికమైన ప్రజల వత్తిడి వలన జీవచౌర్యాన్ని నివారించేందుకుగాను 27.3(బి) అధికరణలో మార్పులకై మూడవ ప్రపంచదేశాలు తమ సూచనలను చేశాయి. ప్రపంచంలో ఎక్కడైనా జీవరీతులపై పేటెంట్లను ఇవ్వటాన్ని పునర్ పరిశీలించుకోవాల్సిన అవసరం తప్పనిసరిగా వుంది. అటువంటి వ్యవస్థలు ఏర్పడేవరకూ, ఈ క్రింది చర్యలు అవసరం:

1. అన్ని జీవరీతులను పేటెంట్లనుండి మినహాయించాలి. ఇది సాధ్యంకాని పక్షంలో,

2. సాంప్రదాయక/స్థానిక విజ్ఞానాన్ని, దానినుంచి పొందిన ఉత్పత్తులను, ప్రక్రియలను పేటెంట్ల నుంచి మినహాయించాలి; లేదా కనీసం-

3. జీవ వనరు తాలూకు పుట్టుక దేశం తాలూకు మూలాన్ని, తత్సంబంధిత విజ్ఞానాన్ని వెల్లడించే పరిస్థితి వుండాలి ఈ వనరును ఏ దేశం నుంచి పొందారో ఆ దేశం అనుమతిని తీసుకోవాలి. దీనివలన ప్రయోజనాల సమ పంపిణీ జరుగుతుంది.

అమెరికా తాను జీవచౌర్యం చేస్తున్నాననే గుర్తించే బదులుగా ఈ చౌర్యానికి అనుగుణంగా తన చట్టాలను మార్చుకుంటున్నది. స్వదేశీ పరిజ్ఞానాన్ని గుర్తించి కాపాడాలనే మూడవ ప్రపంచ దేశాల ప్రతిపాదనలు అన్నింటినీ తిరస్కరిస్తోంది. పేటెంట్లకు సంబంధించి చేసిన దరఖాస్తులో జన్యు పదార్థం లేదా సాంప్రదాయక విజ్ఞానం తనకు ఏ దేశం నుంచి లభించిందో తెలియజెప్పే అవసరాన్ని అమెరికా 'ఆచరణ యోగ్యం కానిదిగా' పేర్కొంటోంది. స్వదేశీ విజ్ఞానాన్ని గుర్తించి, వడపోసే క్రమం నూతన ఆవిష్కరణలకు, నవ్యతకుగాను ఏ పేటెంటు వ్యవస్థ క్రింద అయినా తప్పనిసరి అంశంగా ఉండాలి. అయితే, మూడవ ప్రపంచదేశాల సాంప్రదాయక విజ్ఞానం విషయంలో, ముందుగానే ఉనికిలోవున్న ఆవిష్కరణలను గుర్తించటం ఆచరణ సాధ్యం కానిదిగా చెప్పబడుతోంది. కాగా, తీవ్రమైన

నిరసనల మధ్య అన్ని దేశాలు తమ పేటెంటు చట్టాలను సవరించుకొనేలా ఒత్తిడి తేవటం మాత్రం అమెరికా దృష్టిలో ఆచరణాత్మకత. ప్రపంచ ఉత్తరార్ధ బాగ, దక్షిణార్ధ భాగ దేశాల ప్రజలు ఆమోదించనప్పటికీ జీవంపై పేటెంట్లు తీసుకొనే అనైతిక ఒత్తిడి మాత్రం ఆచరణాత్మకమైనదిగా అమెరికా భావిస్తోంది. ప్రపంచంలోని అన్ని సంస్కృతులను మార్చివేసి విత్తనంపై సంపత్తి హక్కును రుద్దటం కూడా ఆచరణాత్మకమే. మూడవ ప్రపంచ దేశాల పేద ప్రజల నుంచి పొందిన వనరులు, విజ్ఞానంపై, ఆ ప్రజల నుంచే రాయల్టీలు వసూలు చేసుకోవటం కూడా ఆచరణాత్మమే. అయితే అమెరికా చట్టంలోని ఒక దేశపు నింబంధనను సవరించే చిన్న మార్పు, అలాగే ట్రిప్స్ ఒప్పందంలోని ఒకే ఒక్కక్లాజును సవరించటం మాత్రం ఆచరణయోగ్యంగా భావించబడటం లేదు. దీనర్థం జీవ చౌర్యాన్ని నిరోధించేందుకుగాను అమెరికా ఎటువంటి చర్యలు తీసుకొనేందుకు సిద్ధంగా లేదు. పైగా అది జీవ చౌర్యాన్ని ప్రోత్సాహిస్తోంది.

స్వదేశీ విజ్ఞానాన్ని గుర్తించి, పరిరక్షించే ఎటువంటి వ్యవస్థ లేకపోవటం వలన, అలాగే ఆ విజ్ఞాన చౌర్యాన్ని నిరోధించేందుకు ఎటువంటి వ్యవస్థ లేకపోవటం వలన ట్రిప్స్ మరియు అమెరికా తరహా పేటెంట్ల చట్టాలు మూడవ ప్రపంచ దేశాల సమాజాల హక్కులను తుడిచిపెడుతున్నాయి.

జీవచౌర్య సమస్య పరిష్కారానికై స్థానిక విజ్ఞానాన్ని పేటెంటు చేస్తున్న కంపెనీలకు అందుబాటును కల్పించటం ద్వారా మూడవ ప్రపంచ దేశాలు కృషి చేయాలని అమెరికా ప్రతిపాదిస్తోంది. ట్రిప్స్‌లోనూ, అమెరికా తరహా పేటెంటు చట్టాలలోనూ వున్న లోటుపాట్లను సరిదిద్దుకునే బదులుగా, ప్రపంచ స్థాయిలో జీవ చౌర్యాన్ని ప్రోత్సాహించే నిర్మాణాలు, చట్టాలను కొనసాగించటమే అమెరికా ఉద్దేశ్యం. తస్కరించిన విజ్ఞానాన్ని, 'అవిష్కరణ'గా పరిగణించే అంతర్జాతీయ స్థాయి చట్టాలు అమెరికాలోని చట్టాలను మార్పు చేసుకొనే బదులుగా, మూడవ ప్రపంచ దేశాలు 'జీవ చోరుల'తో ఒప్పందాలు చేసుకోవాలని అమెరికా కోరుతోంది.

## సామూహిక హక్కులుగా రైతుల హక్కులు :

## ప్రత్యేక తరహా వ్యవస్థ

'జీవేతర', 'సూక్ష్మాతి సూక్ష్మ ప్రక్రియల' ద్వారా ఉత్పత్తి అయిన మొక్కలు, జంతువులపై పేటెంట్లను తీసుకోవడాన్ని అన్ని పక్షాలు ఆమోదించాలని ట్రిప్స్ ఒప్పందం 27.3(బి) అధికరణలోని మొదటి భాగం పేర్కొంటోంది. ఇది సుస్పష్టంగా జన్యు ఇంజనీరింగుకు సంబంధించిన నూతన జీవ సాంకేతిక రంగం గురించిన ప్రస్తావన. అయితే, జన్యు ఇంజనీరింగు పద్ధతుల ద్వారా జీవ జాతులను వాటి సరిహద్దులను దాటించి ఇతర జీవ జాతులుగా మార్చటానికి "జీవేతర" చర్యగా అభివర్ణించవచ్చు. ఎందుచేతనంటే, ఇటువంటి ప్రక్రియ ప్రకృతిలో జరగదు. ఇతర జీవ జాతుల నుంచి మొక్కలు, జంతువులలోకి జన్యువులను ప్రవేశపెట్టడం ద్వారా మౌలికంగా నూతన జాతులను "ఉత్పత్తి చేయటం" జీవ ప్రక్రియల తాలూకు పునరుత్పత్తి ద్వారానే జరుగుతుంది.

అమెరికా, బ్రిటన్‌లలో జంతువులు, మొక్కలపై పేటెంట్లు తీసుకోవటం పరిపాటి

అయిపోయింది. జంతువుల, మొక్కలపై పేటెంట్లకు సంబంధించిన ట్రిప్స్ ఒప్పందంలోని అధికరణ ప్రధాన సమస్యలను సృష్టిస్తోంది. దీనిని పున:సమీక్షించాలి. కాబట్టి తమ పేటెంట్ చట్టాలను సవరించుకునే ముందుగా అభివృద్ధి చెందుతున్న దేశాలు ట్రిప్స్ ఒప్పందపు సమీక్షకై వేచి వుండటం మరింత ఉపయోగకరం.

పేటెంట్లద్వారాగానీ లేదా మరే ఇతర సమర్ధవంతమైన ప్రత్యేక వ్యవస్థదారాగానీ లేదా ఈ రెండింటి ద్వారాగానీ వక్ష జాతులకు రక్షణ కల్పించాలని ట్రిప్స్ ఒప్పందం తాలూకు 27.53 (బి) అధికరణలోని రెండవ భాగం పేర్కొంటోంది. ఒప్పందం అమలులోకి వచ్చిన 4 సంవత్సరాల తరువాత ఈ నిబంధనను సమీక్షించాలి

ఆవిష్కర్తలుగాను, వృక్ష జాతుల పెంపకందారులుగాను రైతుల హక్కులను ఈ భాగం ప్రత్యేకంగా ప్రభావితం చేయగలదు అలాగే విత్తనం మొక్కల తాలూకు పదార్థాల సామూహిక యాజమాన్యాన్ని కూడా ఇది ప్రభావితం చేయగలదు. ట్రిప్స్ ఒప్పందం పాశ్చాత్య పారిశ్రామిక తరహా ఆవిష్కరణల నమూనాను మాత్రమే గుర్తిస్తుంది. మూడవ ప్రపంచ దేశాల రైతులు భిన్న పంట రకాల ఉత్పత్తి, ఎంపిక, అభివృద్ధి, పెంపకానికి వినియోగించే మరింత వ్యవస్థారహిత, సామూహిక పద్ధతిని గుర్తించటంలో ఇది విఫలం అవుతోంది. రైతుల విత్తనాలు వారి ప్రత్యేక బుద్ధికుశలత, ఆవిష్కరణలను ప్రతిబింబిస్తాయి. ఇది మన ప్రజల మేధస్సు. అయితే, ట్రిప్స్ ఒప్పందంలో మాత్రం మూడవ ప్రపంచ దేశాల రైతుల సామూహిక మేధోసంపత్తికి కనీస గుర్తింపు కూడా రాలేదు.

ప్రత్యేక వ్యవస్థ అనే మాటలు ప్రతి దేశానికి తన స్వంత మేధో సంపత్తి హక్కుల వ్యవస్థ సృష్టించుకునే స్వేచ్ఛ వుందనే అభిప్రాయాన్ని కల్గిస్తాయి. అయితే, ఇక్కడ ప్రధానమైన మాట "సమర్థవంతమైన" అనేది. ఈ మాట వలన అంతర్జాతీయ పేటెంట్లను తప్పనిసరిగా అమలుపరచవల్సి వస్తుంది

ఈ మాటను జీవవైవిధ్య సదస్సులోనూ, ట్రిప్స్ ఒప్పందంలోనూ అమెరికా చొప్పించింది. ఈ ముసాయిదాలోని మొదటి వాక్యం మేధోసంపత్తి హక్కులకు సమర్ధవంతమైన, తగినంత మేర రక్షణను "ప్రోత్సహించవలసిన" అవసరం గురించి ప్రస్తావిస్తుంది. 1988వ సంవత్సరపు వ్యాపారం మరియు పోటీ వాతావరణం చట్టంలో 301వ సెక్షనుగా వున్నది ఇదే వాక్యం వున్నది. దీనిని ఉపయోగించుకుని అమెరికా ప్రమాణాలతో పొసగని మేధోసంపత్తి హక్కుల చట్టాలు వున్న దేశాలపై ప్రతిదాడి చేసారు.

మేధోసంపత్తి హక్కుల వ్యవస్థ, జీవ వైవిధ్యం అనే వాటి సంబంధిత బేరసారాలు అన్నింటిలోనూ "సమర్థవంతమైన" అనే మాటను వాడడం, మేధోసంపత్తి హక్కులను ప్రపంచీకరించేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాలలో భాగం.

డంకెల్ ముసాయిదాలో వున్న "సమర్ధవంతమైన ప్రత్యేక వ్యవస్థ" అనే దాని అర్థం, అటువంటి వ్యవస్థను వివిధ దేశాలు కాక, గాట్ మాత్రమే నిర్ధారించడం మించి, అంతర్జాతీయ బేరసారాలతో

జరుగుతోన్న పరిణామాల తీరు దృష్ట్యా అంతర్జాతీయ స్థాయిలో సమర్థపంతంగా గుర్తించబడిన ఏకైక వ్యవస్థ యు.పి.జీ.వి.లో క్రోడీకరించిన విధంగా మొక్కల కృత్రిమతయారీదారుల హక్కుల వ్యవస్థ మాత్రమే. కాబట్టి, అది పేటెంట్లు అయినా లేదా "సమర్థవంతమైన' ప్రత్యేక వ్యవస్థ అయినా, ఈ రెండు వ్యవస్థలూ రైతుల హక్కులకు ముప్పును కలిగించగలవు కాబట్టి ప్రత్యేకవ్యవస్థ అనే దానిని సార్వభౌమాధికార వ్యవస్థగా గుర్తించి, యు.పి.జీ.వి.కి ప్రత్యామ్నాయమైన ప్రత్యేక వ్యవస్థలను నిర్మించుకోవాలి

ఒకే పంటను నిరంతరంగా వేసే విధానం పర్యావరణంగా సరైనదికాదు. అందుచేత వ్యవసాయిక వైవిధ్యాన్ని పరిరక్షించుకోవలసిన అవసరం పర్యావరణపరంగా తప్పనిసరి. జీవవైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారా జీవ ఉత్పత్తి తాలూకు పర్యావరణ పునాదిని పరిరక్షించుకునే దిశగా, జీవవైవిధ్య పరిరక్షణపై సదస్సు (సిబిడి) అనేది ప్రపంచ సమాజపు ఒక ప్రతిస్పందన మొక్కల వైవిధ్యంతో సహా జీవ వైవిధ్యాన్ని కాపాడుకునేందుకుగాను యు.పి.జీ.వి. పరిధిని దాటిపోయేందుకై అవసరమైన ప్రత్యేక వ్యవస్థను ఆవిష్కరించేందుకు తగినంత చట్టపర అవకాశం వున్నది. సిబిడి వెలుగులలో ఇది మరింత వాస్తవం. ఇది తప్పనిసరి కూడా. ఇది జరగని పక్షంలో మనం సమాజం తాలూకు మేధోహక్కులను కాపాడుకోలేము.

సిబిడి రెండు నూతన రాజకీయ పరిస్థితులకు ఆస్కారం కల్పించింది. మొదటిది, తమ జీవ సంపదపై వివిధ దేశాల జాతీయ సార్వభౌమాధికార హక్కును అది గుర్తించింది. రెండవది, జీవ వైవిధ్యాన్ని వినియోగించుకోడానికి సంబంధించిన విజ్ఞానానికి స్వదేశీ సమాజాల తోడ్పాటును అది గుర్తించింది.సార్వభౌమాధికారం, స్వదేశీ పరిజ్ఞానాలకు గుర్తింపు యాజమాన్యపు రాజకీయ నేపధ్యంలోనూ, జన్యువనరుల వినియోగం, అదుపులోనూ, ప్రధానంగా విత్తనాలు, మొక్కల జన్యువనరులతో సహా, వ్యవసాయ రంగంలోని జీవవైవిధ్యం విషయంలోను ప్రధానమార్పును తేగలదు. మూడవ ప్రపంచ దేశాల విత్తనాలను ఇక ఎంత మాత్రము "మానవాళి సాధారణ వారసత్వం"గా పరిగణించడం కుదరదు అంటే, పాశ్చాత్య విత్తనాల సంస్థలతో సహా అందరికీ స్వేచ్ఛగా అందుబాటులో వుండవు. బహుళజాతి విత్తన సంస్థలు అమ్మే విత్తనాలను మాత్రమే మేథో సంపత్తి ప్రోది చేసినవిగా భావించే అవకాశం ఇక ఎంత మాత్రము వుండదు. రైతులు దాచుకున్న విత్తనాలలో కూడా గణనీయమైన మేధోసంపత్తి ప్రోది అయివుంటుంది. ఇక విత్తనాన్ని 'మెరుగుపరచడం' అనేది సర్వస్వమూ, నేపధ్య రహితమూ కాదని గుర్తించడం కూడా ఈ మధ్య సంవత్సరాల కాలంలో వచ్చిన మూడవ ప్రధాన మార్పు. మెరుగుపరచడం అనేది ఆయా సందర్భాలకు సంబంధించిన అంశం. పంటలను 'మెరుగుపరచడం' అనేది రైతుల దృక్పధానికి సంబంధించినది కూడా. అంటే, వ్యవసాయక వ్యాపారం పంటలను పారిశ్రామిక ప్రాసెసింగుకై లేదా రసాయన ఉత్పాదకాల అధిక వినియోగానికై 'మెరుగు పరుస్తుంది' కాగా, రైతులకు కావలసింది తమ గృహంలోనే తేలికగా ప్రాసెసింగు చేసుకోఎలయ్యే పంటలు అలాగే, వారికి కావలసింది. వెలుపలి ఉత్పాదకాలపై తక్కువగా ఆధారపడే పంటలు.

సాంప్రదాయక సంపర్కం కేవలం పంట రాబడి శక్తిని మాత్రమే చూస్తుంది. పంటరాబడి శక్తి అంటే నీరు లేదా పోషకాలు, కీటకాలు, వ్యాధులు లేదా కలుపుల పరిమితి లేనప్పుడు లభించే

పంట. వాస్తవిక జీవితంలో, రైతులు ఎదుర్కొనే పరిమితులు ఇవే. వారి పంటలు పర్యావరణవత్తిడి, వారు వ్యవసాయాన్ని సాగించవలసిన పర్యావరణ భిన్నత్వం పరిమితులకు లోబడి వుంటాయి. కాబట్టి, కార్పొరేట్ సంస్థలు పంటలను పెంచే పద్ధతులనే పంటల పెంపకం, పరిశోధనలో ఏకైక ఆమోదయోగ్యమైనవిగా భావించరాదు ఇది మాత్రమే పరిణామక్రమపుఏకైక మార్గంకాదు. బహుళజాతి సంస్థల ప్రయోజనాల దృక్పధం నుంచి జరిగే "మెరుగుదల"ను మాత్రమే మొత్తం సామాజిక ప్రయోజనంగా చేయలేము కాబట్టి విత్తనం విషయంలో మేధో సంపత్తి హక్కుల వ్యవస్థ ద్వారా గుత్తాధిపత్యం అనేది అభిలషణీయంకాదు లేదా అది ప్రజాహితం దృష్ట్యా తప్పనిసరికాదు.

అందుచేత, అమెరికా విత్తన సంస్థలు 'భారతదేశ రైతులకు అత్యుత్తమ విత్తనాలను' అందించేందుకుగాను భారత ప్రభుత్వం ఆ సంస్థల రక్షణకై చట్టం చేయాలనే వాదనలను మనం ప్రశ్నించాలి. పెప్సీకి, కార్గిల్‌కి, మొన్‌శాంటోకి, పయనీర్‌కి ఉత్తమమైనది, తప్పనిసరిగా భారతీయ రైతులకు వినియోగదారులకు ఉత్తమమైనది కానవసరంలేదు. వెంటనే ఫ్రైడ్ చికెన్, పిజ్జా హట్‌ల వంటి తన ఫాస్ట్‌ఫుడ్ చైన్లకు అవసరమైన టమోటో కెచ్‌అప్, బంగాళదుంప చిప్స్‌ను తయారు చేసుకునేందుకు పెప్సీకి టమాటోలు, బంగాళదుంపలు అవసరం. తన పశు ఆహార పరిశ్రమకై కార్గిల్‌కు జొన్న, మొక్కజొన్న పంటలు కావాలి. తన కలుపు మొక్కల నాశనిని తట్టుకోగల ఆవ మొక్కల ద్వారా తన కలుపు నాశకాలను మరింతగా అమ్ముకునేందుకు మొన్‌శాంటో ఆసక్తి చూపుతోంది తమ పంటల పెంపకం పద్ధతులలో భారతీయ రైతులు ఎంపిక చేసుకునే విత్తనాల లక్షణాలు ఇవి కానేకావు. అలాగే, తమ విభిన్న ఆహార వ్యవస్థలలో వండుకోవీలయ్యే గుణాలకై భారతీయ వినియోగదారుడు ఎంపిక చేసుకునే ఆహారపు లక్షణాలు ఇవికావు.

సాంప్రదాయక పంటల పెంపకంలో రైతుల యాజమాన్యం, సృజనాత్మకతల సార్వభౌమాధికారాన్ని గుర్తించడం, వ్యవసాయ రంగపు జీవవైవిధ్య పునాదిని కాపాడేందుకు ప్రత్యామ్నాయ పంటల పెంపక పద్ధతులు రైతుల హక్కులకు చిహ్నం. రైతుల హక్కులు లేకుండా, మూడవ ప్రపంచ దేశాలు తమ వ్యవసాయక జీవవైవిధ్యం లేదా వ్యవసాయ విధానంలో సార్వభౌమాధికార హక్కులను ప్రకటించుకోలేవు. అంతేకాకుండా రైతాంగ యాజమాన్య హక్కులు లేకుండా, జీవ వైవిధ్యాన్ని కాపాడుకోలేము.

జీవవైవిధ్యాల నుంచి తమ జీవన భృతిని పొందే రైతుల, ఇతర ఉత్పత్తిదారుల సమూహాల ఈ హక్కులను గుర్తించే ఏ నమూనా కూడా ఇంత వరకూ లేదు. చిరకాలం నుంచీ తాము పదిలపరుచుకుంటూ, వినియోగించుకుంటోన్న జీవవైవిధ్యాన్ని పై రైతులు, గిరిజనులు, సంచార జీవులు, మత్స్యకారుల హక్కులను సమర్ధవంతంగా కాపాడేందుకు వారికి, వారి హక్కుల స్థితీ, జీవ వైవిధ్యపు స్థితీపై ప్రభావం చూపగల నిర్ణయాలు చేయడంలో చురుకుగా పాల్గొనే అవకాశం కల్పించాలి. ఈ వెలితిని పూడ్చేందుకే సామాజిక హక్కులలో ఉప-విభాగంగా రైతుల హక్కుల భావన మనకు అవసరం. ఒక ప్రక్క సామాజిక హక్కులు సృజనాత్మకతను గుర్తిస్తూ విభిన్న సమూహాల జీవనాధారాలను కాపాడుతాయి. మరో ప్రక్క మేథోసంపత్తి హక్కుల వ్యవస్థ రూపుదిద్దే గుత్తాధిపత్య రక్షణ పరిధిపై అవి పరిమితులు, సరిహద్దులను ఏర్పరుస్తాయి వ్యవసాయ సంబంధిత జీవవైవిధ్యం విషయంలో ఈ

సామాజిక హక్కులు అనేవి రైతుల హక్కులుగా వుంటాయి. అవి, రైతుల సృజనాత్మకతను గుర్తించాలి. రైతుల జీవనాధారాలను కాపాడాలి. మేథోసంపత్తి హక్కుల గుత్తాధిపత్యాలను ప్రతిఘటించాలి.

జన్యు సంపదలో సంపన్నవంతమైన ప్రపంచ దక్షిణార్ధభాగం నుంచి, పెట్టుబడుల దృష్ట్యా ధనవంతమైన ప్రపంచ ఉత్తరార్ధభాగానికి విజ్ఞానం, వనరులు స్వేచ్ఛగా, రక్షణ లేకుండా తరలిపోతున్నాయి. ఇక విజ్ఞానం, వనరులు బహురక్షితంగా ఉత్తరార్ధ భాగం నుంచి దక్షిణార్ధ భాగానికి వస్తున్నాయి. ఇది నిర్లజ్జగా జరుగుతున్న అన్యాయం. దీనిని కొనసాగింప వీలులేదు. దీనిని మార్చివేయాలి విజ్ఞానం, జన్యువనరుల వాస్తవిక అందజేతదారులను గుర్తించే, వారి విలువల వ్యవస్థను గౌరవించే రాజకీయ ప్రక్రియ ద్వారా మాత్రమే ఇది మారగలదు. అటువంటి రాజకీయ ప్రక్రియను నిర్మించడంతో, మేథోసంపత్తి హక్కుల వ్యవస్థకు, సామాజిక హక్కులనేవి సమతుల్యతను కల్పించే యంత్రాంగంగా వుండగలవు. మార్కెట్ విలువలే సర్వస్వంగా భావించబడే ప్రపంచంలో మనమందరమూ – ప్రకృతి, మూడవ ప్రపంచం, అంతర్జాతీయ సమాజం అన్నీ నష్టపోతాయి. విజ్ఞానానికి, జీవ వనరులకు హక్కులను ఏర్పరచడంతో, మార్కెట్‌యేతర, నైతిక విలువల వ్యవస్థలను, జీవవైవిధ్య వ్యవస్థలను, విజ్ఞానాన్ని సజీవంగా వుంచడంలో మార్కెట్ తర్కాన్ని ఈ ఉన్నత విలువలకు లోబర్చి ఉంచడం నిజమైన రాజకీయ కర్తవ్యం.

కాబట్టి మొక్కలకు సంబంధించి తగిన ప్రత్యేక వ్యవస్థను అభివృద్ధి చేసే ప్రజల సహకారం మూడు తప్పనిసరి అంశాలు అయిన విలువలు మరియు పరిసరాలు, సమాజాల సృజనాత్మకతకు గుర్తింపు, ఆర్థిక సమానత్వంపై దృష్టిని నిలపాలి.

1. అన్ని జీవజాతులలో అంతర్గతంగా వున్న విలువను గుర్తించే విధమైన తప్పనిసరి నైతిక మరియు పర్యావరణ అంశం – ప్రజా జీవితంలో నైతిక విలువల ప్రాతిపదికన జీవరీతులపై పేటెంట్లను మినహాయించే దృఢమైన చట్టాలు వివిధ దేశాలలో వుండాలి. వ్యాపార సంబంధిత మేథోసంపత్తి హక్కుల వ్యవస్థ (ట్రిప్స్) ఒప్పందంలోని 25వ అధికరణం దీనికి అవకాశం కల్పిస్తోంది పేటెంట్ల నుంచి మినహాయించబడిన విభాగాలు గుత్తయేతర పద్ధతుల ద్వారా అజమాయిషీ చేయబడాలి. ఈ పద్ధతులు సృజనాత్మకత, ఆవిష్కరణలకు సంబంధించి ప్రజలకు వున్న హక్కులను కాపాడగలవు.

2 భిన్న సంస్కృతులలో సృజనాత్మకతకు సరిసమాన గుర్తింపు ఆగత్యం భిన్న సంస్కృతులు, భిన్న రకాల విజ్ఞానం, ఆవిష్కరణల వారసత్వాన్ని అభివృద్ధి చేసాయి. వీటిని సమాన గౌరవం, గుర్తింపుతో చూడాలి. సాంస్కృతిక భిన్నత్వం పట్ల కూడా ఈ దృక్పధం అవసరం జీవ వైవిధ్యం విషయంలో రైతులు, గిరిజనుల స్వదేశీ పరిజ్ఞానం మొక్కల లక్షణాలకు సంబంధించిన విజ్ఞానానికి పునాది. కాబట్టి ఒక ప్రాంతపు ప్రత్యేక వ్యవస్థగా ఈ స్వదేశీ ఆవిష్కరణను గుర్తించాలి. పారిశ్రామిక వ్యవస్థలలోని ఆవిష్కరణల నుంచి ఇది నిర్మాణ రీత్యాను ప్రక్రియ రీత్యాను చోదక లక్ష్యాల రీత్యాను భిన్నంగా వున్నా ఇది తప్పనిసరి ఈ గుర్తింపు ద్వారా అది పొందుపరచబడి వున్న స్వదేశీ పరిజ్ఞానాన్ని, జీవ వైవిధ్యాన్ని చోరీ చేయడాన్ని ఆపివేయాలి. అందుచేత సామూహిక హక్కులు లేదా రైతుల హక్కులు అనేవి సమష్టి మేధోహక్కులుగా అభివృద్ధి చెందాలి

3. సమాజాలలోని అందరు సభ్యులకు ఆరోగ్యం, పౌష్టికాహారం అందించే ఆర్థిక అవసరం- మనుగడకు కీలకమైన అన్ని రంగాలలోనూ గుత్త సంస్థలను వివిధ పద్ధతుల ద్వారా నిరోధించాలి. ఆహారం, ఆరోగ్యం అనేవి మనుగడకు కేంద్ర బిందువులు. కాబట్టి ఈ రంగాలలో పేటెంట్ల గుత్తాధిపత్యాన్ని జాతీయ పేటెంటు చట్టాలు నిరోధించాలి. ఉదాహరణకు, భారతీయ పేటెంటు చట్టం జీవవనరులపై పేటెంట్లను ఆమోదించదు.

మేధో సంపత్తి హక్కులకు సంబంధించి ప్రస్తుతం వున్న చట్టం తాలూకు చట్రం ప్రపంచం ఉత్తరార్ధ భాగదేశాల ఆవిష్కరణల తాలూకు పారిశ్రామిక నమూనానే గుర్తిస్తోంది. అది, లాంఛన ప్రాయంకాని, సామూహిక ఆవిష్కరణల వ్యవస్థను గుర్తించడంలో విఫలం అయ్యింది అయితే, దక్షిణాది దేశాల రైతులు, స్వదేశీ సమాజాలు భిన్న రకాల పంటలను, పశుసంపత్తిని ఉత్పత్తి చేసి, ఎంపిక.చేసి, మెరుగుపరచే తీరు ఈ విధంగానే వుంటుంది. ఇది సుదీర్ఘ కాల ప్రక్రియ. కాబట్టి విజ్ఞాన వ్యవస్థల నిర్వచనంలో ఇది మౌలికంగా వైరుధ్యభరిత అంశం. అందుచేత ఇటువంటి గుర్తించడం "ఆవిష్కరణ"గా నిర్వచించాలని, ఆ సంపదను లోపరహితం చేసే మార్గంగా భావించాలని ప్రతిపాదించడం అయ్యింది. ఇటువంటి విజ్ఞానం లాంఛన ప్రాయంగాగాని లేదా తద్భిన్నంగాగాని (నోటి మాటగాను, పిట్టకథల రూపంలోను, ఇతరత్రా) ఏ విధంగా నమోదు అయి వున్నా దానిని ఈ నిర్వచనం గుర్తిస్తుంది మూడవ ప్రపంచ దేశాలలో లిపిలేని సాంప్రదాయాలు లేదా సంస్కృతులు వున్న మానవ సముదాయాలను పరిగణనలోకి తీసుకునేందుకు ఇది ఉద్దేశించినది.

"సంపత్తి" అనే మాట మానవ సమాజాల విజ్ఞాన వ్యవస్థలను మినహాయించేందుకు ఉద్దేశించినది. "మేధోసంపత్తి హక్కులు" అనే మాటలలోని సంపత్తి హక్కు అనే మాటలు, ప్రస్తుతం అర్థం చేసుకోబడుతోన్న తీరులో, ప్రధానంగా వాణిజ్య మార్పిడికై ప్రైవేటు చేతులలో సరుకుగా మార్చబడడాన్ని, యాజమాన్యాన్ని సూచిస్తున్నాయి. తన విజ్ఞానంతో, సమాజానికి వున్న సంబంధం అంతర్గతంగా సరుకుగా మార్చవీలులేనిది మరియు సామాజికపరంగా "యాజమాన్యంలో వుండేది" పంచుకోబడేది. సామాజిక యాజమాన్యం విలువగల మొత్తంలోని విజ్ఞానాన్ని (ఖరీదు కట్టకపోయినా) "సామాజిక మేధోహక్కులు"గా వర్ణించడం సరైనది.

జన్యువైవిధ్యపు యజమానులైన రైతాంగంతో కలిసి జన్యువైవిధ్యంపై సంయుక్తంగా ప్రభుత్వాలు సార్వభౌమాధికార హక్కులను వహించాలని కూడా సూచించబడుతోంది. జన్యు పదార్థాల చౌర్యాన్ని అరికట్టేందుకు, ప్రజల సార్వభౌమాధికారపు అండతో రాజ్యం సార్వభౌమాధికారం ద్వారా వివిధ దేశాల బేరసారాల శక్తిని దృఢపరిచేందుకు, జన్యువనరుల అందుబాటుకు వనరును కల్పించినందుకుగానూ న్యాయబద్ధమైన ప్రతిఫలాన్ని హామీ చేసేందుకై సంయుక్త పెత్తనం అవసరం, రైతుల హక్కులను కాపాడేందుకుగానూ జన్యు పదార్థాన్ని పొందేందుకు ఆసక్తి చూపుతున్న పక్షాలు, సంబంధిత సమాజాలు, వాటి ప్రభుత్వాల మధ్య చర్చలలో అటువంటి జన్యు పదార్థాల అందుబాటును తప్పనిసరి షరతుగా చేయాలి.

కృత్రిమంగా తయారయ్యే విత్తనాల ప్రయోజనం తాత్కాలికమైనదే. కాగా రైతులు ఉపయోగించే

వంగడాలు శాశ్వతమైనవి, నిరంతరమైనవి, సదా ఉపయోగకరమైనవి. అందుచేత రైతుల వంగడాలను రక్షించుకోవాలి ఈ హక్కు శాశ్వతంగా ఉండేటట్లు, నిర్మూలించబడకుండా ఉండేటట్లు హామీ చేసుకోవడం తప్పనిసరి. ప్రజాహిత విధానాన్ని ముందుకు తీసుకు వెళ్ళేందుకు ఇటువంటి నిషేధం దేశీయచట్టాలలో సాధారణమే. స్వేచ్ఛగా విత్తనాలను మార్చుకునే అవకాశం కొనసాగింపు రైతుల హక్కు. అలాగే తమతో సంబంధాలను నెరిపే సమాజాలతో ఇటువంటి విత్తన అందుబాటును కొనసాగించడం కూడా రైతుల హక్కే.

ఇది జన్యువనరులు, జీవ వైవిధ్యం విషయంలో సామాజిక విజ్ఞానాన్ని ఆవిష్కరణలను, స్వదేశీ, స్థానిక సమాజాల వ్యవసాయ పద్ధతులను, ఏ ఒక్కరి పెత్తనమూ లేకుండా రూఢిపరచుకోవడం, వంగడం లేదా ఆవిష్కరణను వాణిజ్యం ఉపయుక్తంగా చేస్తే అది స్వేచ్ఛా మార్పిడికి పొసగదు. తమ వనరులపై సమాజాలకు, అదుపు హామీ చేయబడాలి. దీనికై, సామాజిక ఆవిష్కరణాలపై ఎవ్వరి గుత్తపెత్తనం ఉండరాదు.

సమాజం అదుపులో ఉన్న ఆవిష్కరణకు సంబంధించిన ఒక వంగడం, విజ్ఞానం, వ్యవసాయ పద్ధతి లేదా సాంకేతిక పరిజ్ఞానం గురించి దీర్ఘకాలిక వివాదాన్ని నివారించగలగాలి. దీనికై ఈ వంగడాన్ని లేదా ఆవిష్కరణను తాము వినియోగిస్తున్నట్లు లేదా ఆ వంగడం లేదా ఆవిష్కరణకు బాధ్యులుగా ఉన్నట్లు సహేతుకమైన పద్ధతిలో సమాజం నుండి ఎంపిక చేయబడిన ప్రతినిధులు ప్రకటన సరిపోతుంది. కొన్ని సందర్భాలలో, ఒక జన్యువనరును, సాంకేతిక పరిజ్ఞానాలను లేదా ప్రోదిపడిన విజ్ఞానాన్ని ఒకటి కంటే ఎక్కువ సమాజాలు ఒకే మారు సృష్టించి ఉండవచ్చు. అటువంటి సందర్భాలలో, ఆ ఆవిష్కరణ ఆ సమాజంలో అన్నింటికీ ఉమ్మడిగా చెందుతుంది. వాటిలో ప్రతి ఒక్క సమాజము ఆ ఆవిష్కరణపై సంపూర్ణ హక్కులు విధులను కలిగి ఉంటుంది. దానికి సంబంధించిన చెల్లింపులన్నీ తగిన విధంగా పంచుకోబడతాయి. తరచుగా, తమ హక్కులను నెరవేర్చుకోవడంలో సమాజాలు బలహీనంగా ఉండవచ్చు. అటువంటి సందర్భాలలో విదేశీ/వాణిజ్య కంపెనీలతో చర్చలలో తమ ప్రయోజనాలను కాపాడుకునేందుకు ఈ సమాజాలు రాజ్యానికి అధికారాన్ని ఇవ్వవచ్చు. అంటే, రాజ్యం తాలూకు ఈ బాధ్యత సమాజాలతో ఉన్న సంయుక్త యాజమాన్యం నుంచి వస్తోంది. కాబట్టి రాజ్యం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోరాదు. కార్యాచరణకు ముందుగా రాజ్యం సమాజాలతో చర్చించాలి.

వివిధ వంగడాలను సృష్టించిన రైతాంగ సమాజాలను గుర్తించి, న్యాయబద్ధమైన పరిహారాన్ని హామీ చేసేందుకుగాను ఆ వంగడాల వారసత్వపు ఆచూకీ, తత్సంబంధిత వివరాలు, వంగడాల తయారీదారుల హక్కుల వివాదాలలోతప్పనిసరి. ఆయా వంగడాల చరిత్ర, పుట్టుపూర్వోత్తరాల గురించిన వివరాలు, వాటిని ఇతర నూత్న వంగడాలు, లేదా మెరుగైన వంగడాలను సృష్టించడంలో వినియోగించే ఇతరేతర పరిశోధకులకు కూడా ఉపయోగకరం.

## భారతదేశంలో మేథోసంపత్తి హక్కుల సంస్కరణ

ఆవిష్కరణలను, పేటెంట్ దరఖాస్తులకై నూతనత్వాన్ని పరిగణలోకి తీసుకోవడంలో మన స్వదేశీ పరిజ్ఞానాన్ని ముందుగానే ఉన్నదిగా గుర్తించకపోవడం, శతాబ్దాల ఆవిష్కరణను చౌర్యం

చేయడం నేడు భారతదేశం ఎదుర్కొంటున్న నిజమైన సమస్య. మనం పి.సి.టి.లో చేరినప్పటికి ఈ ముందస్తు హక్కులను తిరస్కరించడం, అనంతమైన స్థాయిలో జీవచౌర్యం కొనసాగుతూనే ఉంటాయి. మనం గనుక పి.సి.టి.లో చేరితే వేపపై గ్రేస్ పేటెంట్లను, బాసుమతి పై రైస్‌టెక్ పేటెంట్లను, టెర్మినేటర్ సాంకేతిక పరిజ్ఞానంపై మొన్‌శాంటో యు.ఎస్.డి.ఎ. పేటెంట్‌ను గుర్తించవలసిన ఉన్మాద పరిస్థితిలో పడిపోతాం. మనం ముందుగా స్వదేశీ చట్టాలను చక్కదిద్దుకోకుండా అలాగే భారతీయ గిరిజనులు, రైతులు, స్వదేశీ వైద్యులు, వినియోగదారుల హక్కులను మన చట్టాలలో పొందుపరచకుండా - అందులోనూ ప్రధానంగా జీవవైవిధ్య చట్టం, రైతుల హక్కుల చట్టాలను దృఢపరచుకోకుండా అంతర్జాతీయ పేటెంట్ల వినియోగ హక్కులను గుర్తించడంవలన ఈ పరిస్థితి దాపురిస్తుంది.

పేటెంట్లు తీసుకోవడంలోని ప్రస్తుత ధోరణి విత్తనాలపై పేటెంట్లనే కాక నేలలో సహజంగా ఉండే బ్యాక్టీరియా వంటి సూక్ష్మజీవులపై కూడా పేటెంట్ల అనుమతిస్తోంది. ఔషధాల సంస్థలు, పాశ్చాత్య ప్రభుత్వాలు మానవ జన్యువులు, ప్రోటీనులు, కణసముద్ధాయాలపై కూడా గుత్త అదుపును కోరుతున్నాయి. వాటిపై పేటెంట్లను తీసుకుంటున్నాయి. ఉదాహరణకు క్యాన్సర్ వ్యాధి రాకుండా తట్టుకోగల కణసముదాయాలు ఉన్న ఒక పనామాకు చెందిన రెడ్ ఇండియన్ గిరిజన యువతి కణసముదాయాలపై అమెరికా వాణిజ్య శాఖ పేటెంటును తీసుకుంది. ఇటువంటి చర్యలు నైతికతపై తీవ్ర ప్రభావాన్ని చూపగలవు మానవ జన్యువులతో ఇంజనీరింగు చేయబడి 'మానవపాలను' ఇవ్వగల ఆవులపై బహుళజాతి సంస్థలు పేటెంట్లకు దరఖాస్తు చేశాయి. అలాగే తమ పాలలో ఔషధాలను ఉత్పత్తి చేయగల విధంగా జన్యుపరంగా ఇంజనీరింగు చేయబడిన గొర్రెలపై కూడా ఆ సంస్థలు పేటెంట్లకై దరఖాస్తు చేశాయి. ఔషధాల ఉత్పత్తికై 'జీవరియాక్టర్‌లు'గా వినియోగించేందుకుగాను స్త్రీల స్తన్యగ్రంధులపై కూడా దరఖాస్తు చేసుకున్నారు. భిన్న సంస్కృతులు, మతవిశ్వాసాలు ఉన్న వైవిధ్యభరిత సమాజంలో మానవజాతితో సహా జంతువులపై కూడా పేటెంట్లు తీసుకోవడం నైతిక విలువలపై దాడే. ఈ రకమైన పేటెంట్ దరఖాస్తులు, గుత్తాధిపత్య మార్కెటింగు హక్కుల వలన జంతువులను పారిశ్రామికంగా తయారు చేయడానికి మార్గం ఏర్పడుతుంది. ఫ్యాక్టరీ తరహా జంతువుల పెంపకంలో నేడున్న క్రూరత్వం మరింతగా పెరుగుతుంది.

ఈ విధమైన భయాందోళనలవలననే. జీవరీతులపై పేటెంట్లను అనుమతించే పేటెంట్ మార్గదర్శక సూత్రాన్ని యూరోపియన్ పార్లమెంటు 1995వ సంవత్సరం మార్చి1వ తేదీన తిరస్కరించింది.

ప్రస్తుతం భారతదేశంలో అమలులో ఉన్న పేటెంటు (సవరించిన) చట్టం, ఔషధాలుగా వినియోగించే అన్ని పదార్థాలపై పేటెంట్ల దరఖాస్తులను ఆమోదిస్తోంది. అంటే, ఈ చట్టం మానవ జన్యువనరులపై కూడా పేటెంట్లను ఆమోదిస్తోంది. ఇటువంటి దరఖాస్తులను అనుమతించబోమని పేటెంట్ల (సవరించిన) చట్టం నూతన అనుసరణ స్పష్టంగా ప్రకటించాలి మానవ జన్యువులు, ప్రోటీనులు,కణసముదాయాలను పేటెంట్ల దరఖాస్తు పరిధి నుంచి నూతన పేటెంట్ల (సవరించిన) చట్టంను స్పష్టంగా మినహాయించి తీరాలి.

ఆయుర్వేద ఔషధాలపై బహుళజాతి ఔషధ సంస్థలు ఇప్పటికే పేటెంట్లు తీసుకున్నాయి. ఈ రంగంలో, ఆ సంస్థలకు గుత్తాధిపత్య మార్కెటింగ్ హక్కులను ఇస్తే గనుక భారతీయ ఆరోగ్య

పరిరక్షణకు తీవ్రంగా ముప్పువాటిల్లుతుంది. ఎందుచేతనంటే మనదేశంలోని 70% మంది ప్రజానీకం తమ ఆరోగ్య రక్షణకై ఇంకా స్వదేశీ వైద్య విధానాలపైనే ఆధారపడుతున్నారు. ఇటువంటి పేటెంట్ల వలన పదార్థాలకు, విజ్ఞానానికి మూలంగా ఉండడం ద్వారా మనదేశం జీవవైవిధ్య సదస్సు నుంచి పొందగల ఆర్థిక ప్రయోజనాలకు నష్టం వాటిల్లుతుంది. కాబట్టి, ఈ రంగంలో పేటెంట్ దరఖాస్తును, ఇ.ఎం ఆర్.లను స్పష్టంగా మినహాయించాలి. అలాగే, సామాజిక మేధోసంపత్తి హక్కుల రక్షణ తాలూకూ ప్రత్యేక వ్యవస్థను అభివృద్ధి చేయాలి ఈ వ్యవస్థ మన ఔషధ వ్యవస్థలకు పునాదిగా ఉన్న సామాజిక అవిష్కరణనుగుర్తించాలి. విత్తనాలపై పేటెంట్లు, జీవరీతులపై పేటెంట్లకు వ్యతిరేకంగా మనదేశంలో ఇప్పటికే ప్రధాన ఉద్యమాలు జరుగుతున్నాయి. ఈ ప్రజాతంత్ర పునాది ప్రాతిపదికగా ఇ.ఎం.ఆర్. దరఖాస్తులను ఇప్పుడు పరిగణనలోకి తీసుకోకుండా ఉండడం, అలాగే, భవిష్యత్తులో పేటెంట్ల దరఖాస్తులను కూడా మినహాయించడం మన ప్రభుత్వం చేయవచ్చు. జన్యుపరంగా మార్పిడి చేయబడిన విత్తనాలు మొక్కల పదార్థాలు, సహజంగా లభించే మరియు అలాగే జన్యుపరంగా మార్పిడి చేయబడిన సూక్ష్మజీవులతో సహా విత్తనాలు, మొక్కల పదార్థాలపై గుత్తాధిపత్య మార్కెటింగ్ హక్కులను ఇవ్వరాదు. అన్ని విత్తనాలు, మొక్కల పదార్థాలను కేవలం మొక్కల జాతుల పరిరక్షణ చట్టం అనే దాని పరిధిలోనే వుంచాలి. ఈ చట్టం అవిష్కరణలపరంగా రైతుల హక్కులను, నూతన వంగడాల తయారీదారుల హక్కులతో సమాన ప్రాతిపదికన చూడడం పునాదిపై ఆధారపడాలి.

వ్యాపార సంబంధిత మేధో సంపత్తి హక్కుల వ్యవస్థను (ట్రిప్స్) అమలు పరచేందుకై మార్పు చేసిన చట్టాలను ఆచరణలోని తెచ్చేందుకు భారత ప్రభుత్వం పడుతోన్న ఆత్రుత సరైనదికాదు. ట్రిప్స్ ఒప్పందం తాలూకు పలు కీలక అంశాలు సమీక్షలో వున్నాయి. కాబట్టి, జాతీయ ప్రయోజనాలు, ప్రజాప్రయోజనాలను పరిరక్షించేందుకై మన ప్రభుత్వం ట్రిప్స్ ఒప్పందం సమీక్ష పూర్తయ్యే వరకూ వేచి వుండాలి. జాతీయ చట్టాలను అమలు చేసే ముందుగా, మన ప్రభుత్వం ట్రిప్స్ ఒప్పందాన్ని పునర్నిర్వచించే విషయంలో నాయకత్వ పాత్ర వహించాలి. ట్రిప్స్ ఒప్పందంలో ఇంకా మార్పులు జరుగుతోన్న తరుణంలో దాని అమలును ఐదు సంవత్సరాలపాటు వాయిదా వేయాలని ఆఫ్రికా దేశాలు అన్నీ కోరుతున్నాయి. ఈ ఒప్పందాన్ని అమలు పరచేందుకు నిర్ణయించబడిన 2000వ సంవత్సరం జనవరి 1వ తేదీ పరిమితే ఇప్పటికీ స్థిరపడలేదు. కాబట్టి, ట్రిప్స్ ఒప్పందాన్ని అమలు పరచేందుకు భారతదేశం ఆతృత చూపవలసిన ఆగత్యంలేదు. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ)లో భాగస్వామిగా భారతదేశం ఆఫ్రికా దేశాలతో కలిసి ట్రిప్స్ అమలు కాలాన్ని మార్పు చేయించుకోవచ్చు.

సియాటెల్ రౌండు ప్రపంచ వాణిజ్య సంస్థ కుప్పకూలడాన్ని భారతదేశం తన జాతీయ సార్వభౌమాధికారపు విస్తృతినిపెంచుకునేందుకు, వినియోగించుకోవచ్చు తద్వారా తన జాతీయ చట్టాలను, జాతీయ ఆర్థిక విధానాలను రూపొందించుకోవడంలో ప్రయత్నాలను చేయవచ్చు.

ట్రిప్స్ ఒప్పందం అమలుకై అమెరికా సాధ్యమైనంత తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తోంది అలాగే, ఆదేశం భారతదేశానికి వ్యతిరేకంగా ట్రిప్స్ వివాదాన్ని ఆరంభించింది. అయితే, స్వయానా అమెరికాయే ప్రపంచ వాణిజ్య సంస్థలో వుండాలా లేదా అనే అంశంపై ఓటింగ్‌కు సిద్ధపడుతోంది. జెనీవాలో కేంద్ర కార్యాలయం వున్న ఈ సంస్థకు తాను చెల్లించవలసిన బకాయిలను చెల్లించడం

కొనసాగించాలా, లేదా అని కూడా తర్జన భర్జనలు పడుతోంది. కాబట్టి, అంతర్జాతీయంగానూ, మన దేశ వ్యవహారాలలోనూ కూడా ప్రపంచ వాణిజ్య సంస్థ పాత్ర, అధికారాలను మనం అతిశయించుకుని చూడడం సమర్థనీయంకాదు

ట్రిప్స్ ఒప్పందం నిరవధికంగా సమీక్షకు లోనవుతూ వుండడం, ప్రపంచ వాణిజ్య సంస్థ సియాటెల్ రౌండు సమావేశం నీరుకారిపోవడం, అమెరికా పేటెంటు చట్టాలకు ప్రపంచ వ్యాపితంగా ఎదురౌతోన్న సవాళ్ళు, మొదలైన వాటన్నింటి దృష్ట్యా భారత ప్రభుత్వం, అవసరంలేని మనకు చెరుపు చేసే చట్టాలను అమలు జరిపేందుకు, అది కూడా సరైన సమయం, సరైన సారంతో కానప్పుడు ఆతృత చూపడం. సమర్థనీయంకాదు. మన ప్రభుత్వం ద్వంద్వ నీతిని పాటిస్తోంది. ఒక ప్రక్క ట్రిప్స్ సమీక్షలో జీవంపై పేటెంట్ల మినహాయింపును అది కోరుతోంది. మరో ప్రక్క, కీలక రంగాలు అయిన ఆహారం, ఔషధాల విషయంలో, జీవం, మేధోసంపత్తి హక్కులపై గుత్తాధిపత్యాన్ని కల్పించే పేటెంట్లను ఆమోదించే చట్టాన్ని అది హడావిడిగా అమలు జరుపుతోంది.

ఆర్థిక వ్యవస్థ రూపురేఖలను నిర్ణయించడంలో పేటెంటు చట్టాలు సదా కీలక పాత్రనే వహించాయి. జీవరీతులతో సహా అన్ని అంశాలను కలగలిపిన విస్తృత రూపంలో పేటెంటు చట్టాలు భారతదేశపు మూడింట రెండొంతుల మంది ప్రజానీకానికి జీవన్మరణ సమస్య కాగలవు. ఈ ప్రజానీకం తమ జీవనోపాధిని, జీవవైవిధ్యం నుంచే పొందుతుండడం దీనికి కారణం. పేటెంట్ల ద్వారా మన మేథోసంపత్తిని, జీవవైవిధ్యాన్ని కొల్లగొట్టడం వలసవాదపు పరాకాష్ట. ఈ వలసవాదం మన మనుగడకు ముప్పుకలిగించగలదు.

# ముగింపు

మానవజాతి చరిత్రలోని భిన్న కాలాల తాలూకు రాజకీయ, ఆర్థిక ఏర్పాట్ల రూపమే పేటెంట్లు. వలసవాద యుగంలో అవి, వలసవాదాపు పనిముట్లు. అలాగే, వలసవాద ఆధారిత స్థితిని కొనసాగించేందుకు కూడా అవి వినియోగించబడ్డాయి. వలసవాద అనంతరకాలంలో పేటెంట్లు మన ఆర్థిక స్వేచ్ఛా, రాజకీయ సార్వభౌమాధికార ఆకాంక్షలకు ప్రతిబింబం అయ్యాయి.

మనం నూతన సహస్రాబ్దిలో అడుగిడుతోన్న ఈ తరుణంలో, మరో చారిత్రక యుగంలోకి కూడా అడుగిడతున్నాం. నేడు నిర్మించబడి, రూపుదిద్దుకుంటోన్న పేటెంట్ల వ్యవస్థ వలసవాదపు శకాన్ని తిరిగి ప్రవేశపెట్టగలదు. ఈ శకంలో ప్రజలుగా మనమే కాక, సమస్త జీవరీతులు వలసపాలన క్రిందకుపోయే ప్రమాదం వుంది.

లేదా, శతాబ్దాల కృషి తాలూకు ఆవిష్కరణలను, స్వదేశీ సృజనాత్మకతను చౌర్యం చేసే అవకాశం కల్పించేది అయిన, జీవరీతులను మానవ ఆవిష్కరణలుగానూ, కార్పొరేట్ సంస్థల సొత్తుగానూ పరిగణించే పేటెంటు వ్యవస్థ తీరును మనం సవాలు చేయవచ్చు. పేటెంట్లు మన కాలపు పట్టణాలవంటివి కాబట్టి, మన విధానాలను మనం రూపొందించుకునే తీరు, అంతిమ పరీక్షలో పేటెంటు చట్టాల రూపురేఖలను నిర్ణయించగలదు. మన రాజకీయ, ఆర్థిక వ్యవస్థలు, చౌర్యానికి, బలికావడానికి అనుకూలంగా తయారైతే, పేటెంటు చట్టాలు జీవచౌర్యాన్ని, మేధోచౌర్యాన్ని పెంచిపోషించగలవు. తద్వారా అవి జీవబానిసత్వం, మేధోబానిసత్వాలను వ్యవస్థీకరించగలవు. మనం మన రాజకీయ, ఆర్థిక వ్యవస్థలను ప్రజాస్వామ్యం, భిన్నత్వం ప్రాతిపదికలన నిర్మించుకోగలిగితే పేటెంటు చట్టాలు నిఖార్సయిన సృజనాత్మకతను గుర్తించే పరిమితులలో పనిచేస్తాయి అప్పుడు ఆ చట్టాలు ప్రకృతిలోనూ, సమాజంలోనూ వున్న జీవజాలానికి ముప్పుగా మారే విధంగా నైతిక, పర్యావరణ పరిమితులను దాటబోవు

ఈ రెండో తరహా మేధోస్వేచ్ఛను ప్రజలందరికీ కల్పించే, అన్ని జీవజాతులకు పర్యావరణ స్వేచ్ఛను కల్పించే పరిస్థితిని వాస్తవీకరించేందుకుగాను నా మేధో, రాజకీయ కృషి అంకితం అయ్యింది. ఈ పుస్తకాన్ని చదివిన తరువాత, ఇతరులు కూడా ఈ కృషిలో చేయి కలుపుతారని నేను విశ్వసిస్తున్నాను.

A C No. 41488

# PATENTLU

## VANDANA SHIVA



నేటి ప్రపంచంలో పేటెంట్లు ప్రతి ఒక్కరిని ప్రభావితం చేస్తున్నాయి. మీరు రైతులయితే విత్తనాన్ని నిల్వ చేసుకునే హక్కు ప్రమాదంలో పడుతుంది. మీరు వినియోగదారు అయితే ఆహారపు హక్కు, ఔషధ హక్కులకు ముప్పు వాటిల్లుతుంది. మీరు పరిశోధకులయితే విజ్ఞానాన్ని పంచుకునే హక్కు నిరోధించబడుతుంది. వాణిజ్య సంబంధింత మేథో హక్కుల ఒప్పందం (ట్రిప్స్) విశ్వజనీకరణం గురించిన కట్టుకథలను ఈ పుస్తకం బట్టబయలు చేస్తుంది. మేథోపరమైన ఆస్తి హక్కుల (ఐ.పి.ఆర్) పేరుతో బడుగు దేశాల సహజవనరులను పాశ్చాత్య కార్పొరేషన్లు ఎలా లూటీ చేస్తున్నయో వివరిస్తుంది. దేశీయ పరిజ్ఞానంపై ఆధారపడి ఉత్పత్తి చేసిన సరుకులకే వర్ధమానదేశాలు అధిక ధరలు ఎలా చెల్లించవలసి వస్తున్నదీ వెల్లడిస్తుంది. పేటెంట్ల చారిత్రిక పూర్వరంగాన్ని కూడా తెలియచేస్తుంది. ప్రత్యేకించి పర్యావరణ రంగంలో ప్రపంచీకరణ దుష్ఫలితాలను తెలుసుకోదలచిన ప్రతి ఒక్కరూ చదవాల్సింది ఈ పుస్తకం.

**వందన శివ** ప్రముఖ పర్యావరణ ఉద్యమ నాయకురాలు, కార్యకర్త. 1991లో ఆమె జీవవైవిధ్యాన్ని, సమగ్రతను ముఖ్యంగా విత్తనాలను పరిరక్షించడానికి కృషి సల్పే 'నవధాన్య' అనే సంస్థను స్థాపించారు. ప్రత్యామ్నాయ నోబుల్ శాంతి బహుమతిగా పేరుగాంచిన ' జీవన భృతి హక్కు అవార్డు' 1993లో ఆమెకు లభించింది. పర్యావరణం, ఆహారం, వ్యవసాయ మొదలైన అంశాలకు సంబంధించిన అనేక పుస్తకాలను ఆమె రచించారు. ఆమె 'ఎకాలజిస్ట్' అనే పత్రికకు అసోసియేట్ ఎడిటర్‌గా కూడా పని చేస్తున్నారు.

PRAJASAKTI BOOK HOUSE